కురుమ కుల చరిత్ర



కొమ్మ కైలాష్

కురుమ కుల చరిత్ర

కొమ్మ కైలాష్ (కొమ్ము)

kommakailash@gmail.com
+ 91 98115 73262

తథాగత్ పబ్లికేషన్స్
హైదరాబాద్

కురుమ కుల చరిత్ర

కొమ్మ కైలాష్ (కొమ్ము)

Kuruma Kula Charithra

by Komma Kailash

తొలి ప్రచురణ : మార్చి, **2024**

కాపీలు : **500**

వెల : **₹ 250/-**

ముఖచిత్రం, బొమ్మలు : శివప్రసాద్ కర్రి **9010554325**

డిటిపి : ఆర్టాన్ గ్రాఫిక్స్

పబ్లిషర్స్ : తథాగత్ పబ్లికేషన్స్, హైదరాబాద్

ప్రతులకు : kommakailash@gmail.com


+ 91 98115 73262

అంకితం!



అమ్మ రుక్కమ్మ
నాన్న క్రిష్టయ్య


vivo S1 Pro





మహా సాధ్వి కన్నగి

కన్నగి పుహార్‌కు చెందిన వ్యాపారి, ఓడ కెప్టెన్ మానాయకన్ కుమార్తె. ఆమె మాకట్టువన్ కొడుకు కోవలన్‌ని వివాహం చేసుకుంటుంది, తరువాత కోవలన్ ఒక నర్తకి మాధవిని కలుసుకున్నాడు మరియు ఆమెతో సంబంధాన్ని ఏర్పరచుకున్నాడు, అతని సంపద మొత్తాన్ని నర్తకి కోసం ఖర్చు చేయడంతో ఎట్టకేలకు డబ్బులేని స్థితికి చేరుకున్నాడు. కోవలన్ తన తప్పు తెలుసుకుని భార్య కన్నగి వద్దకు తిరిగి వచ్చాడు. కోవలన్ మధురైలో వ్యాపారం చేయడానికి కన్నగి విలువైన చేతి కంకణాన్ని విక్రయించడం ద్వారా తన సంపదను తిరిగి పొందాలని ఆశించాడు.

మధురైని పాండ్య రాజు నెడుంజ్ చెలియన్ 1 పరిపాలించాడు. కోవలన్ కంకణాన్ని విక్రయించడానికి ప్రయత్నించినప్పుడు, అది రాణిగారి దొంగిలించబడిన చేతి కంకణంగా తప్పుగా భావించబడింది. కోవలన్ కంకణాన్ని దొంగిలించాడని ఆరోపిస్తారు. విచారణ లేకుండా రాజు వెంటనే కోవలన్ తల నరికాడు. ఈ విషయం కన్నగికి తెలియడంతో ఆమె కోపోద్రిక్తులై తన భర్త నిర్దోషిత్వాన్ని రాజుకు నిరూపించడానికి బయలుదేరింది. కన్నగి రాజు ఆస్థానానికి వచ్చి, కోవలన్ నుండి స్వాధీనం చేసుకున్న కంకణాన్ని విప్పి, ముత్యాలు ఉన్న రాణి చీలమండల కంటే కెంపులు ఉన్నాయని చూపించింది. దోషాన్ని గ్రహించిన రాజు, ఇంత పెద్ద అన్యాయం జరగడంతో అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కోపంతో కన్నగి మదురై నగరమంతా కాలిపోతుందని శపిస్తుంది. పాండ్యుల రాజధాని నగరం అగ్నికి ఆహుతైంది, ఫలితంగా భారీ నష్టాలు సంభవించాయి. అయితే, మీనాక్షి దేవి అభ్యర్థన మేరకు, ఆమె శాంతించింది మరియు తరువాత, మోక్షాన్ని పొందింది. కవి ఇళంగో అడిగళ్ రచించిన సిలప్పటికారం కథాంశం.


(సిలప్పాదికారంలో పేజి 43 లో)

విషయ సూచిక !

		పేజి నెం.
1.	ఉపోద్ఘాతం	10
2.	పరిణామక్రమము	16
3.	కుల నిర్వచనం	17
4.	కురు వంశం-కౌర్ వర్గం	20
5.	ఆర్యులా ?	23
6.	కురుమలు గొల్లల పరిధిలోకి వస్తారా ?	24
7.	వేదకాలంలో...	28
8.	వ్రాత్యుల సంతతివారా ?	34
9.	ద్రావిడులా?	38
10.	సంగమ సాహిత్యంలో	38
11.	సిలప్పాదికారంలో	43
12.	నాయనార్లు	45
13.	జెండ్ అవెస్తా	47
14.	గౌడియవర్గం	53
15.	మల్లన్న దేవుడి సంతతి	55
16.	హాలుమాత తేజో పురాణం	57
17.	'టగర పవాడ' లేదా 'పొట్టేలు అద్భుతం' !	61
18.	సిద్దమంక చరిత్ర	63
19.	రేణుక కావ్య, రుద్ర భారత	68
20.	జిరగా చపగోడు	70
21.	మాలింగరాయ	71
22.	ఉన్ని, పత్తి విభజన.	82
23.	ఉపకులాల పుట్టుక	90
24.	మతము, దేవుడు- సభ్యత సంస్కృతి	98
25.	మురుగన్ జననము	101
26.	మల్లన్న కథ	103
27.	తెలంగాణలో మల్లన్న కథ	106
28.	బలిజ మెడాలమ్మతో పెళ్లి	110
29.	బండారు కోసం మక్కా ప్రయాణం	111

విషయ సూచిక !   పేజి నెం.

26.	గొల్ల కేతమ్మతో పెళ్లి	113
27.	కొమురవెల్లి మల్లన్న	114
28.	మహారాష్ట్రలో మల్లన్న	114
29.	ఖండోబా భార్యలు	115
30.	బీరప్ప కథ	125
31.	ఒగ్గు పూజారులు - ఒగ్గు కథ	157
32.	గొంగళ్ళ తయారి	162
33.	తమిళనాడులో కురుంబ, కురుమాన్	167
34.	ఉత్తరాదిలో కుర్మిస్, కుంబిస్, కున్బిస్	172
35.	దేవరగుడ్డలో దసరా పండుగ	175
36.	చంద్రవంశ క్షత్రియులు	179
37.	చంద్రగుప్త మౌర్యుడు	183
38.	కురుంబ సామ్రాజ్యం	185
39.	కలభ్రహ రాజులు	187
40.	కురుమలు పల్లవులా ?	191
41.	దేవగిరి యాదవరాజులు	194
42.	విజయనగర సామ్రాజ్యం	195
43.	శివాజీ మహారాజ్	206
44.	హొల్కర్ సామ్రాజ్యం	207
45.	కరోలి దేశం	209
46.	బెంగాల్ పాలా రాజకుటుంబం	210
47.	తిరుమల, తిరుపతి.	212
48.	లేపాక్షి	214
49.	సంగోలి రాయన్న 1798-1831	216
50.	భక్త కనకదాసు	221
51.	ముగింపు	226
52.	గ్రంథ పట్టిక	228



వేద వాక్కులు

శం నః కరత్యర్వతే సుగం మేషాయ మేష్యే నృభ్యో నారిభ్యో గవే

మా గుర్రములకు, మగ, ఆడ మేకలకు, నర, నారీ జనులకు, గోవులకు రుద్రుడు సులభ సుఖములు కలుగజేయవలెను.

ఉపహూతా ఇహ గావహ

ఇపహూతా అజాయవహ

అథో అన్నప్య కీలాల ఇపహూతో గృహేషు నహ

క్షేమాయ వఃశాంత్యై ప్రవధే శివ శగ్మ శంయోః శంమోః

ఈ ఇంట గోవులు తిరిగినవి. మేకలు, గొర్రెలు సంచరించినవి. ఈ ఇంటనే అన్నము రసవంతమైంది. నీరు మధురమైనది. అట్టి గృహమున సుఖము, శాంతి కలుగుటకు ప్రవేశించుచున్నాము. మాకు ఈ ఇంట సుఖములు, శుభములు కలుగవలెను. భయములు దూరము కావలెను.

గోమాన్ అగ్నే అవిమాన్ అశ్వీ యజ్ఞో వ్రవత్ సఖా సదమిత్ అప్రమృశ్యాహ

ఇడావాన్ ఎషో అసురా ప్రజావాన్ దీర్ఘో రయిః ప్రథుబుధనాః సభావాన్

అగ్నీ, ఈ యజ్ఞం గోమంతం, అజ (మేక) వంతం, అశ్వవంతం, రుత్విగ్వంతం అగును గాక.ఈ యజ్ఞము మరల, మరల జరుగు చుండును గాక.

ఇరేవ నోప దస్యతి సముద్ర ఇవ వయో మహత్

దేవౌ సవాసినావివ శితిపాన్నోప దస్యతి

యజ్ఞమున గొర్రెను దానము చేసిన ఫలము భూమి వలెను, సాగర జలము వలెను క్షీణించదు. విడివడని అశ్వినుల వలె క్షీణించదు.



ఉపోద్ఘాతం!

కురుమ, కురుబ, కురుంబార్, కురుమాన్, మదాసి కురువ, మదారి కురువ,ధనగర్, గడరియా, పాల్, భగేల్ తదితర పేర్లతో పిలువబడే గొర్రెల కాపర్ల కులం ఏంతో ప్రాచీనమైంది. వేద కాలంకంటే పూర్వం నుండి కొనసాగుతున్న కులం ఇది. హిందూ మతంలో శైవం, వైష్ణవం అనేవి రెండు ప్రధాన వర్గాలు. శైవం పరిధిలోకి వచ్చే ప్రధాన కులాల్లో కురుమ కులం అత్యంత ముఖ్యమైనది. ఎంతో పురాతనమైన ఈ కులం ఎప్పుడు, ఎలా పుట్టింది అనేది చెప్పటం చాలా కష్టం. కురుమ కులానికి లిఖితపూర్వక చరిత్ర లేదు. వేదాలు, పురాణాలు తదితర మత గ్రంథాలలో గొర్రెల కాపర్లకు సంబందించిన ప్రస్తావన ఉన్నా కులం పరంగా ఎలాంటి లిఖిత పూర్వక చరిత్ర లేకపోవటం దురదృష్టకరం. మల్లన్న, బీరప్ప, రేణుకా ఎల్లమ్మ తదితర ఒగ్గు కథలు కురుమ కులానికి సంబంధించిన కొన్ని వివరాలు, పూర్వపరాలను కొంతవరకు తెలుపుతున్నాయి. హాలుమత కురుబ పురాణం గొర్రెల కాపర్ల చరిత్రను వివరించినా అదంతా ఒక పురాణం పద్దతిలో ఉంటుంది తప్ప కచ్చితమైన వివరాలు ఈ పుస్తకంలో కూడా లేవనే చెప్పాలి. కన్నడ భాషలో రచించిన హాలుమతపురాణం (బసవనప్ప నీలప్ప, 1910) హాలుమతోత్తేజక పురాణం (రాస్తాపుర భీమకవి 1912), శ్రీ సిద్ధభీరేశ్వర అర్థతోకేశ్వరిసిద్దేశ్వర పురాణం (అన్నప్ప వాసుదేవరాయ1924), హాలుమతపురాణ (చెన్నబసవకవి 1959), జానపద హాలుమత మహాకావ్య (2000), సిద్దమంక చరిత్ర (2004), టగర పవాడ (2004) తదితర పుస్తకాలు కురుమ కులానికి సంబందించిన కొంత సమాచారాన్ని తెలియజేస్తున్నాయి. ఒగ్గు కథలు, హాలుమత కురుబ పురాణం తదితర పుస్తకాలలో తప్ప మరే ఇతర కథలు, రచనల్లో ఈ కులానికి సంబంధించిన ప్రస్తావన కనిపించటం లేదు. వేదాల్లో గొర్రెల పెంపకం, గొర్రెలకాపర్లు, వారి కుటుంబాల ప్రస్తావన ఉన్నది కాబట్టి వేదకాలం నుండి ఈ కులం ఉన్నదని భావించక తప్పదు. వేదాలతో పాటు మహాభారత, పురాణాలలో గొర్రెల కాపర్ల ప్రస్తావన ఉన్నది.

కురుమలు తమను తాము గిరిజన దేవుడు మల్లన్న సంతతివారిగా చెప్పుకోవటం తెలిసిందే. శివుడి మలి చెమట నుండి పుట్టిన మల్లన్న కాపు కులానికి చెందినవాడనే వాదన ఒకటి ఉన్నది. కొల్హాపూర్ పాలకుడైన ఆదిరెడ్డి, నీలమ్మ కుమారుడు మల్లన్న లేదా మల్లారెడ్డి అన్నది ఈ వాదన సారాంశం. ఈ వాదనతో చాలా మంది ఏకీభవించటం లేదు. కురుమల ప్రాదుర్భావం పై భిన్న కథనాలు ఉన్నాయి. కురుమ కులం మూల

పురుషుడు ఎలనాగిరెడ్డి అని హైదరాబాద్ లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం,ఎల్.కె.మూర్తి అభిప్రాయపడ్డారు. ఆదిరెడ్డి, ఆదేమ్మ కుమారుడైన ఎలనాగిరెడ్డి-బీరప్ప ఒకరేనన్నది ఈయన వాదన. థర్స్టన్, ప్రొఫెసర్ రంగాచారి అనే ఇద్దరు పండితుల వాదన మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది. వీరి వాదన ప్రకారం కురుమలు ఉడాల పద్మన్న సంతతి వారు. పశ్చిమ కనుమల్లో నివసించే మసిరెడ్డి, నీలమ్మ దంపతుల కుమారుడైన ఉడాలపద్మన్న నుండి కురుమలు ఉద్భవించారని వీరు ప్రతిపాదించారు. చండికాపురం రాజైన ఆదిరేడు, చొక్కమదేవి కుమారుడైన మల్లికార్జునుడు కురుమ కులం మూలపురుషుడనే వాదన కూడా ఉన్నది. ఈ మల్లిఖార్జునునికి, కదంబరాజుకు కర్నాటకలోని హుల్లునగురు ప్రదేశంలో బ్రహ్మపురి పేరుతో ఒక నగరాన్ని నిర్మించి రాజ్యమేలిన మల్లప్ప లేదా మల్లిదేవతో ఏదైనా సంబంధం ఉన్నదా? ఈ మల్లప్ప లేదా మల్లిదేవుడి భార్య పేరు పద్మాల దేవి. మల్లన్న కథలో మల్లన్న పద్మాల దేవిని వివాహమాడటం మనకు తెలిసిందే. కదంబ మల్లిదేవుడు మహారాష్ట్రలోని దేవగిరి (దౌలతాబాద్) రాజధానిగా రాజ్యమేలిన సుయేన యాదవ రాజు సింఘనకు మంచి మిత్రుడనేది గమనార్హం.

కురుమ కుల మూలపురుషుడు లేదా తండ్రి అయిన మల్లన్న, మల్లికార్జునుడు ఏ కాలం వారనేది నిర్ధారించటం చాలా కష్టం. మల్లన్న లేదా మల్లికార్జునుడు ప్రస్తుత మహారాష్ట్రలోని కొల్హాపూర్ కేంద్రంగా రాజ్యమేలినట్లు ఒగ్గు కథలు చెబుతున్నాయి. అయితే ఇది ఎప్పుడు జరిగిందనేది ఒగ్గు కథల్లో స్పష్టంగా లేదు.

హాలుమత కురుబపురాణం ప్రకారం కురుమ కులం మూలపురుషులైన శాంతముత్తయ్య, రేవణ సిద్దేశ్వరుడు ఏ కాలానికి చెందినవారై ఉంటారనేది ప్రశ్న. శాంతముత్తయ్య రేవనసిద్దేశ్వరుడి కుమారుడు లేదా శిష్యుడని కొందరు భావిస్తే మరికొందరు మాత్రం రేవనసిద్దేశ్వరుడే శాంతముత్తయ్య కొడుకు లేదా శిష్యుడని వాదించారు. శాంతముత్తయ్య, రేవనసిద్దేశ్వరుడి మధ్యగల సంబంధంపై కొంత గందరగోళం నెలకొన్నది. ఈ అంశంపై నెలకొన్న గందరగోళం తొలగిపోతే ఈ చిక్కుముడి విడిపోయి కురుమకులం పునాదులపై కొంత స్పష్టత ఏర్పడుతుంది. శివుడి తొలి చమట నుండి పుట్టిన బీరప్ప, మలి చమట నుండి పుట్టిన మల్లన్నదేవుడికి సంబంధించిన ఒగ్గు కథల్లో కొన్ని వివరాలు ఉన్నాయి. అయితే ఈ ఒగ్గు కథల్లో కూడా కురుమకులం వివరాలు సమగ్రంగా లేవనే చెప్పాలి. ఒగ్గు కథల్లో మల్లన్న కొల్హాపురం, బీరప్ప సూర్యనాగుల కొండ రాజ్యమేలినట్లున్నది కానీ ఈ రాజ్యాలు ఎక్కడ ఉన్నాయి? ఏ

కాలంలో వీరు రాజ్యమేలారు? అనేది వివరించటం జరగలేదు.

బీరప్ప దేవుడి మాతృమూర్తి సూరమ్మ సూర్య నాగులకొండ, బీరప్ప దేవుడి మేనమామ నారదుడు లేదా నరభూపతి నమ్మినాగులకొండ కేంద్రంగా రాజ్యమేలినట్లు ఒగ్గు కథలు చెబుతున్నాయి. వీటికి సంబందించిన చారిత్రాత్మిక సాక్ష్యాలు మాత్రం లభించటం లేదు. బీరప్ప దేవుడిని పెంచి, పోషించిన అక్క మహంకాళి ఉజ్జయిని కేంద్రంగా రాజ్యమేలినట్లు ఒగ్గుకథలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటె కర్నాటకలోని బెలగుట్టి రాజధానిగా పరిపాలించిన 'సింద' రాజ వంశంలో ఒక బీరదేవ్ ఉన్నాడు. హొయసిల రాజవంశానికి ఇతను బద్దశత్రువు. బీరదేవ్‌కు సుయేన యాదవులతో ఉన్న గొడవ మూలంగా సింఘన ఇతనిపై దాడి చేయించినట్లు చరిత్ర చెబుతోంది. సింఘన ఆదేశం మేరకు **1244**లో యాదవ సేనానాయకుడు లక్ష్మీపాలుడు బీరదేవ్ పై దాడి చేసినట్లు చరిత్రకారుడు ఏ.వి.నరసింహ మూర్తి తన 'దేవగిరి యాదవులు' అనే పుస్తకంలో రికార్డు చేశారు. భారతదేశం, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని తెలంగాణా, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో లక్షలసంఖ్యలో ఉన్న కురుమ, కురుబ, కురుంబార్, కురుమాన్,కురుంబ ప్రజల గురించి ఎలాంటి రాత పూర్వక సమాచారం లేకపోవటం ఆశ్చర్యం కలిగించక మానదు. మౌర్య సామ్రాజ్యం, కురుంబ సామ్రాజ్యం, పల్లవ, విజయనగర సామ్రాజ్యం, హొల్కార్, హొయసల, దేవగిరి యాదవ సామ్రాజ్యాలు, రాజస్థాన్ లోని కరోలి రాజ్యం మూల పురుషులు గొర్రెల కాపర్లు. అయితే ఈ రాజులకు సంబంధించిన స్పష్టమైన లిఖితపూర్వక చరిత్ర లేకపోవటం దురదృష్టకరం. ఇండోర్ కేంద్రంగా మధ్య భారతాన్ని పరిపాలించిన హొల్కర్ల చరిత్ర లభిస్తోంది. కేవలం ఐదు వందల సంవత్సరాల క్రితం హిందూమత సంరక్షణ కోసం రాజ్యస్థాపన చేసిన హరిహర, బుక్క రాయలుకు సంబంచించిన స్పష్టమైన చరిత్ర లేకపోవటం మన దురదృష్టం.

కురుమ, కురుబ పేర్లలోని కురు పదానికి కురువంశం లేదా మహా భారతయుద్ధం జరిగిన కురుక్షేత్రంతో సంబంధం ఉన్నదని ప్రొఫెసర్ ఎం.ఎల్.మూర్తి అభిప్రాయపడ్డారు. కురుంబ, కురుమ, కురుబ వర్గం ప్రజలు మహాభారతయుద్దంలో పాల్గొన్నారనీ, యుద్దానంతరం వీరు దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లి స్థిరపడ్డారని డాక్టర్ బి.ఏ. సలటోర్ తన ' విజయనగర సామ్రాజ్యంలో సామాజిక, రాజకీయ జీవన విధానం' రెండవ సంపుటిలో సూచించారు. కురుంబ వర్గం ప్రజలు పాండవుల తరపున మహాభారతయుద్దంలో పాల్గొన్నారన్నది ఆయన అభిప్రాయం. సాంప్రదాయవర్గాల

(Traditional Sources) ఆధారంగా తానీ విషయం చెబుతున్నానని ఆయన తన పుస్తకంలో పేర్కొన్నారు. కురుమ, కురుబ, కురుంబార్ వర్గం ప్రజలకు మహాభారతయుద్ధం జరిగిన కురుక్షేత్రంతో గల సంబంధంపై పరిశోధన జరగాలన్నది ప్రొఫెసర్ మూర్తి అభిప్రాయం.

కురుమ కులం ప్రజలు భారత వంశంలో భాగమనే ఒక ఆశ్చర్యకరమైన వాదనను ప్రొఫెసర్ గుస్టావ్ ఒపెర్ట్ తన 'భారతదేశం మూలనివాసులు' అనే పుస్తకంలో ప్రదిపాదించారు. భరత వంశం వారు పురాతన కాలంలోనే రెండు ముఖ్యమైన వర్గాలుగా చీలిపోయారు, మొదట వీరు కురు-పాంచాలులుగానూ, ఆ తరువాత కౌరవులు-పాండవులుగా చీలిపోయారు, అటు పిమ్మట గౌడియలు, ద్రవిడియులు, ఆ తరువాత కురువ లేదా కురుంబ మరియు మల్లలు లేదా మళయాలులుగా విడిపోయారని ప్రొఫెసర్ గుస్టావ్ ఒపెర్ట్ తన పుస్తకంలో ప్రకటించారు. మౌర్య సామ్రాజ్యం, కురుంబ సామ్రాజ్యం, యాదవ, విజయనగర సామ్రాజ్యం, ఇండోర్ లోని హొల్కర్ సామ్రాజ్యంతో పాటు పలు ఇతర సామ్రాజ్యాలను స్థాపించిన గొర్రెల కాపర్లు తమ చరిత్రను తమ కులచరిత్రను ఎందుకు రాసుకోలేదు, రాయించ లేదు అనే ప్రశ్నకు సమాధానం లేదు. ముస్లిం రాజుల ఇస్లామిక్ జిహాద్ నుండి హిందూ మతాన్ని రక్షించేందుకు విజయనగరాన్ని స్థాపించిన హరిహర, బుక్కరాయ సోదరులు వేదాలపై భాష్యాలు రాయించారు కానీ భావి తరాల కోసం తమ కులచరిత్రను పదిలపరచలేకపోయారు. శివుడి సంతతిగా చెప్పుకునే కురుమ కుల ప్రాధాత మల్లన్న, కుల దైవమైన బీరప్ప దేవాలయాలు తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలోనే దాదాపు నాలుగు వేల వరకు ఉండటం ఈ కులం ప్రాధాన్యత, విస్తారాన్ని తెలియజేస్తోంది. కురుమ, కురుబలకు స్వంత దేవాలయాలు (బీరప్ప, మల్లన్న, రేణుకా ఎల్లమ, ఖండోబా), స్వంత సంగీత వాయిద్యాలు (డోలు, డమురుకం, కొమ్ము తదితర), పట్నాలతో కూడిన స్వంత పూజా విధానం ఉన్నాయి. ఒగ్గు కథల రూపంలో స్వంత సాహిత్యం ఉన్నది. బ్రాహ్మణ పూజా విధానానికి సమాంతరంగా కురుమల పూజా విధానం,అర్చనావిధానంకొంసాగటంగమనార్హం.ఇదిలాఉంటేకురుమకులం యాదవ లేదా గొల్ల వర్గానికి సంబందించిన ఒక ఉపకులమనే వాదన కూడా ఉన్నది. కురుమ సంతతివారు వందలాది సంవత్సరాల క్రితమే యాదవ లేదా గొల్లవర్గం నుండి విడిపోయి స్వంత అస్తిత్వాన్ని ఏర్పాటు చేసుకుని ఉంటారనే వాదన ఉండటం గమనార్హం. కురుమకులం ప్రజలకు యాదవులు, గొల్లలతో కంచం పొత్తు తప్ప వియ్యం పొత్తు లేదంటారు. గొల్ల అనే పదం గోవు నుండి వచ్చిందా, గొర్రె నుండి వచ్చిందా అనేది కుడా

స్పష్టం కావలసి ఉన్నది.

దక్షిణాదిలోని తెలంగాణా, ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కురుమ, కురుబ, కురుంబ, కురుంబార్‌గా పిలవబడే గొర్రెల కాపర్లు ఉత్తరాదిలో గడరియ, ధనగర్, పాల్, బఘెల్, బర్వాడ్, మేష్పాల్, తదితర పలు పేర్లతో పిలుస్తారు. భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలో గొర్రెల కాపర్లు ఉన్నారు. దక్షిణ భారతదేశం మూల జనాభాలో కురుమ, కురుబ, కురుంబ వర్గం ప్రజలకు అత్యంత ముఖ్యమైన పాత్ర ఉన్నదనిసర్‌డబ్ల్యూఇల్లియట్ అభిప్రాయంపడటంగమనార్హం.తమిళనాడులో ప్రధానంగా కురుంబ,కురుంబాన్ అని పిలువబడే వీరిని కర్ణాటకలో కురుబ, మహారాష్ట్రలో ధనగర్ అని పిలుస్తారని ఇల్లియట్ 1901 సంవత్సరానికి పూర్వమే చెప్పారు. కురుబ వర్గం ప్రజలు తూర్పు కర్ణాటకలో 'ప్రజల సమాఖ్య'లతో కూడిన ఇరవై నాలుగు రాజ్యాలను ఏర్పాటు చేసారనీ, వీరు బౌద్ధమతం స్వీకరించి కళారంగంలో అద్భుతమైన నైపుణ్యం సాధించారు, ఐదు లేదా ఆరో శతాబ్దంలో తంజావూరును పరిపాలించిన చోళుల చేతిలో వీరు ఓటమి పాలయ్యారని ఇల్లియట్ తెలిపారు. కురుబల నిజాయితీ తిరుగులేనిదని ఇల్లియట్ ప్రకటించారు. కురుబలు పశ్చిమ బెంగాల్ లోని సంథాల్ వర్గం ప్రజలు, ఆహిర్ లేదా అభిర ఒకటేనన్నది ఆయన అభిప్రాయం. ఎరుపు రంగు రాతి సమాధుల్లో ఖననం చేయబడిన వారు వీరేనని కూడా ఇల్లియట్ ప్రకటించారు. తమను తాము యాదవులుగా ప్రకటించుకున్న దక్షినాదిలోని కొన్ని రాజ వంశాలు వాస్తవానికి బ్రాహ్మనత్వంలో కూడిన కురుబలేనని ప్రొఫెసర్ టేలర్ అభిప్రాయపడ్డారు. కురుబలు కనర (కర్ణాటక) ప్రాంతం పట్ల ఒక ప్రత్యేక ఆసక్తిని ప్రదర్శించారు, 'కదంబ' రాజవంశం పేరుతో క్రీస్తు శకం 300 నుండి 400 సంవత్సరం వరకు, 700 నుండి 1200 సంవత్సరం వరకు రాజ్యమేలిన రెండు బనవాసి రాజులు బ్రాహ్మణత్వాన్ని ఆపాదించుకున్న కురుబలేనని టేలర్ అభిప్రాయపడ్డారు.

కురుమ, కురుంబ, కురుంబార్ తదితర గొర్రెల కాపర్లు తమ పేరు చివర గౌడ, హేగ్గాడే, కౌడికిఅరు అని పెట్టుకునేవారు. ఐతే ఇప్పుడీ సంప్రదాయం ఆచరణలో లేదు. కర్ణాటక రాష్ట్రంలోని కొందరు కురుబలు తమ పేరుచివర నాయక్కన్, నాయక్కర్, గౌరవ అని పెట్టుకుంటున్నారని ఎడ్గర్ తర్స్టన్ రాయటం గమనార్హం. 1901 సంవత్సరం మద్రాస్ జనాభా లెక్కల నివేదిక ప్రకారం కురుంబ వర్గం ప్రజలు తమపేరు చివర కవడిగ, కుంపని, రాయర వంశం అని రాసుకున్నారు. రాయరవంశం అంటే రాజులవంశం అని చెప్పుకోవచ్చు లేదా విజయనగరాన్ని పాలించిన రాయలవంశం అని కూడా భావించవచ్చు.

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలో కురుమ,కురుబ, ధనగర్లకు మల్లన్న, బీరప్ప ఇష్టదైవాలు. ఈ మూడురాష్ట్రాల్లో మల్లన్న, బీరప్పకు సంబందించిన కథల్లో వ్యత్యాసాలున్నాయి. మహారాష్ట్రలో ఖండోబా లేదా మల్లన్న మొదటి భార్య బలిజల ఆడపడుచు కాగా రెండో భార్య ధనగర్ వర్గానికి చెందిన బనై. కర్ణాటకలో మల్లన్న రెండో భార్య కురుబ కులానికి చెందిన కురుబట్టయ్యవ్వ. తెలంగాణాలో మల్లన్న మొదటి భార్య లేదా పెద్ద భార్య బలిజ కులానికి చెందిన భ్రమరాంబ, రెండో భార్య గొల్లకులానికి చెందిన గొల్లకేతమ్మ. ఐతే గొల్ల కేతమ్మ కుడా కురుమల ఆడపడుచు అనే వాదన ఉన్నది. మహారాష్ట్ర, కర్ణాటకలో మల్లన్న రెండో భార్య బనై, కురుబట్టయ్యవ్వ కాగా తెలంగాణాలో ఆయన రెండో భార్య గొల్లకేతమ్మ. రాష్ట్రం మారగానే మల్లన్న దేవుడి రెండవ భార్య మారిపోవటం గమనార్హం. శివుడి అంశగా పుట్టినట్లు భావించే మల్లన్న దేవుడు, బీరప్ప దేవుడి కథల్లో ఎంతో సారుప్యత కనిపిస్తుంది. దీనికిగల కారణాలను అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నది. మహారాష్ట్ర ప్రజల ఇష్టదైవమైన విఠోభా లేదా పండర్పూర్ విఠలేశ్వరుడు, బీరప్ప దేవుడు జంట దేవుల్లనే వాదన ఒకటి ఉన్నది. బీరప్ప దేవుడే విఠలేశ్వరుడు లేదా విఠోభాగా మారాడనే మరో వాదన మహారాష్ట్రలో చాలా గట్టిగా ఉన్నది. తెలుగు ప్రజలతో పాటు యావత్ భారతదేశానికి ఆరాధ్య దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వీరభద్రుడుగా మారిన బీరప్ప దేవుడేనని మహారాష్ట్రకు చెందిన ప్రముఖ మత పరిశోధకుడు,చరిత్రకారుడు రామచంద్ర చింతామణి ధీరే తన 'ది రైస్ ఆఫ్ ఏ ఫోక్ గాడ్ వీఠల్ ఆఫ్ పండర్పూర్' అనే పుస్తకంలో గట్టిగా వాదించారు. పన్నెండవ శతాబ్దంలో వైష్ణవ మతాచార్యుడు రామానుజుడు తిరుమలను శైవ క్షేత్రం నుండి వైష్ణవ దేవాలయంగా మార్చివేశాడని పరిశోధకులు చెబుతున్నారు. తిరుమల క్షేత్రంపై ఉన్న ఇలాంటి పలు వాదనలపై లోతైన పరిశోధన జరిపితే శ్రీ వెంకటేశ్వరుడి పుట్టుపూర్వోత్తరాలు వెలుగులోకి వస్తాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న ఒగ్గు కథలు, హాలుమత కురుబ పురాణం, తదితర గ్రంథాలు, ఆంగ్ల, స్థానిక చరిత్రకారులు, మానవ శాస్త్రవేత్తలు, కొందరు కుల పెద్దలు వెల్లడించిన, వ్యక్తం చేసిన వివరాలు, అభిప్రాయాల ఆధారంగా కురుమ, కురుబ, కురుంబార్, కురుమాన్ వర్గం ప్రజల చరిత్ర రాసేందుకు ఈ చిన్న ప్రయత్నం చేశాను.

పరిణామక్రమం

పరమ శివుడి తొలి చెమట బిందువు బీరప్ప దేవుడు, మలి చెమట బిందువు మల్లన్నదేవుడన్నది కురుమ ప్రజల విశ్వాసం. భారతదేశంలో అచిర కాలం నుండి నివసిస్తున్న, అత్యంత పురాతన కులాల్లో కురుమ, కురుబ, కురువ, కురుంబార్, ధనగర్, పాల్, భగేల్, ,మేష్ పాలక్ తదితర గొర్రెల కాపర్ల కులం ఒకటి . సింధు నాగరికతలో గొర్రెలు, మేకలు, ఆవుల పెంపకం ప్రధాన వృత్తిగా ఉండేది. క్రీస్తుపూర్వం గొర్రెలు, మేకలు ఆవుల పెంపకం పోషణ ఒక వృత్తిగా ఉండేదని ప్రఖ్యాత చరిత్రకారుడు, సింధు నాగరికతను అత్యంత లోతుగా అధ్యయనం చేసిన ఆస్కో పర్పోలా ప్రకటించటం తెలిసిందే.

వేదకాలం, అంతకు పూర్వం నుండి కురుమ, గొల్ల తదితర పశువుల కాపర్లు భారత దేశంలో జీవిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో మేగాలితిక్ ప్రజలు జీవించేవారు. గుహలు,కొండలు, గుట్టల్లో జీవించిన వీరంతా పశువుల కాపర్లు. వీరు రాళ్ళు, లోహాలతో తయారు చేసిన ఆయుధాలను ఉపయోగించేవారు. వంట కొరకు మట్టి పాత్రలను కుడా ఉపయోగించినట్లు దాఖలాలు ఉన్నాయి. వీరు మరణించిన తమ పెద్దల కోసం పెద్ద, పెద్ద బండ రాళ్ళతో (దోల్మేన్స్, క్రోమ్లేచ్) సమాధులులు నిర్మించుకునే వారు. ఈ రాతి సమాధుల్లో శవంతో పాటు ఆహార ధాన్యాలు, పని ముట్లు, ఆయుధాలను ఖననం చేసేవారు. రాతి సమాధులను నిర్మించుకున్న ఈ కురుమ గొర్రెల కాపర్లను స్థానికంగా పాండవులని పిలిచేవారు. రిస్లే, హుట్టన్ అనే సామాజిక శాస్త్రవేత్తలు భారతదేశం ప్రజలను రెండు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గం నార్డిక్ లేదా ఇండో-ఆర్యన్, రెండో వర్గం ప్రోటో-ఆస్ట్రాలాయిడ్. వీరు భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసించే గొర్రెల కాపర్లను పై రెండు వర్గాల్లో చేర్చారు. మొదటి వర్గానికి చెందిన గొర్రెల కాపర్లు ఉత్తర భారతంలో స్థిరపడితే రెండో వర్గానికి చెందిన గొర్రెల కాపర్లు దక్షిణ భారత దేశంలో స్థిరపడ్డారని ఈ ఇద్దరు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఉత్తర, దక్షిణ భారతదేశంలో స్థిరపడిన ఈ రెండు వర్గాల గొర్రెల కాపర్లకు గొర్రెల పెంపకమే ప్రధాన వృత్తిగా

కొనసాగింది, దక్షిణాదిలోని రాష్ట్రాలలో స్థిరపడిన గొర్రెల కాపర్లు తమ వృత్తిని కొనసాగిస్తూనే ద్రావిడ సంస్కృతిలో కలిసి పోయారన్నది వీరి అభిప్రాయం. గొర్రెల కాపర్లు చరిత్రకు పూర్వం నుండి అడవుల్లో గొర్రెలు,మేకలను మేపుకుంటూ,పెంచుకుంటూ అక్కడే స్థిరపడి పోయారు. కురుబ,కురుమ, కురుంబ, కురుమాన్, కురుంబాన్ తదితరులు ఈ దేశంలోని అత్యంత పురాతన ప్రజలు అని ప్రొఫెసర్ ఒప్పర్ట్, ప్రొఫెసర్ ఇల్లియట్ అభిప్రాయపడితే భారతదేశం మూలనివాసుల్లో కురుబ, కురుమలు అత్యంత ప్రధాన భాగస్వాములు అని ప్రొఫెసర్ ఎంథోవెన్ ప్రకటించారు. కర్నూలులోని గుహలు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో రాగి యుగం, కొత్త రాతి యుగం, సున్నపు రాతియుగం ప్రజల కలయిక చిహ్నాలు ఉన్నాయి. దక్షిణ దక్కన్ ప్రాంతంలో గొర్రెలు, మేకల పెంపకం వృత్తి ఆనవాళ్ళు కనుగొనేందుకు ఇది తోడ్పడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లెబనాన్‌లోని దక్షిణ బెక్కలోయ ప్రాంతంలో లభించిన చెకుముకి పనిముట్లు కొత్త రాతియుగానికి చెందిన గొర్రెల పెంపకందారులవిగా గుర్తించారు. మెసపుటోమియాకి చెందిన ప్రజలు దాదాపు పదకొండు వేల సంవత్సరాల క్రితం మచ్చిక చేసుకున్న మొదటి జంతువు గొర్రె, తరువాతనే ఇతర జంతువులను మచ్చిక చేసుకోవటం జరిగిందని చరిత్ర చెబుతోంది.

కుల నిర్వచనం

కురుమ, కురుబ, కురుంబ,కురువ, కురుంబార్, కురుమాన్, పలు ఇతర పేర్లతో పిలవబడే ఈ కులం పేరు ఎలా వచ్చిందనే అంశంపై పలు వాదనలు ఉన్నాయి. కురువంశమే కురుమ, కురుబ కులంగా మారిందని కొందరంటే, మరి కొందరేమో మహాభారతయుద్ధం జరిగిన కురుక్షేత్రం నుండి కురుమ, కురుబ కులం పేరు వచ్చిందని వాదిస్తున్నారు. కురుబ అనే పదం 'కురు' అనే సంస్కృత పదం నుండి పుట్టిందని కొందరు నిపుణులు చెబుతున్నారు. కురు అంటే 'యోధులు' లేదా ' సత్య శోధకులు' అని వారు నిర్ధారించారు. కన్నడంలో కురి అంటే గొర్రె కాబట్టి గొర్రెలను పెంచేవారు కురుమ లేదా కురుబలు అనే నిర్వచనం ప్రధానంగా వాడుకలో ఉన్నది. తమిళనాడుకు చెందిన గొర్రెల కాపరులైన కురుంబార్ కులం వారు మాత్రం 'కురి' అనే పదం నుండి కురుబ లేదా కురుమ' పేరు వచ్చిందనే వాదనను గట్టిగా తిరస్కరిస్తున్నారు. తాము పూర్తిగా గొర్రెల కాపర్లముకాదు,తాముపెంచుకునేప్రత్యేకగొర్రెలమూలంగా'కురి'అనేపేరు వచ్చిందన్నది వారి వాదన. కురుంబార్ అనే పేరు గొర్రె నుండి కాలేదని వారు

ఘంటాపథంగా చెబుతున్నారు. ఐతే ఈ నిర్వచనాలు ఎంతవరకు నిజము? గుస్తవ్ ఒప్పెర్ట్ అనే సంస్కృత పండితుడు ఈ నిర్వచనాలతో ఏకీభవించటం లేదు. బ్రిటిష్ ప్రభుత్వానికి తెలుగు తర్జుమాకారుడు, మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీ లో సంస్కృతం, ఫిలోలోజీ ప్రొఫెసర్‌గా పనిచేసిన గుస్తవ్ ఒప్పెర్ట్ 1893 సంవత్సరంలో రాసిన 'భారతదేశం మూలనివాసులు (ది ఒరిజినల్ ఇన్హాబిటాంట్స్ ఆఫ్ ఇండియా) అనే పుస్తకంలో కురుమ, కురుబ అనే పదానికి భిన్నమైన నిర్వచనం ఇచ్చారు. కురుమ, కురుబ, కురుబ, కురుంబార్ తదితర పదాలు 'కు' లేదా 'కో' అనే పదం నుండి పుట్టాయి, వీరంతా కొండలు, గుట్టల్లో నివసించే ప్రజలని అతను చెప్పాడు. 'కో' లేదా 'కు' అంటే పర్వతం. పర్వతాలలో నివసించే వారు, పర్వతా రోహకులు అని గుస్తవ్ ఒప్పెర్ట్ అభిప్రాయపడ్డారు. 'కు' లేదా 'కో'తో వచ్చే కులాల పేర్లకు సంస్కృతంతో ఎలాంటి సంబంధం లేదంటూ 'కు' లేదా 'కో' తో వచ్చే కులాలన్నీ ద్రావిడ గౌడియ వర్గాలదన్నది అతని వాదన. వీరు భారతదేశంలో నివసిస్తున్న మూలనివాసులు లేదా అత్యంత పురాతన ప్రజలని గుస్తవ్ ఒప్పెర్ట్ తెలిపారు. కురుమ, కురుబ, కురుంబ, కురుమాన్ వర్గం ప్రజలు గొర్రెల పెంపకతో ఎంతగా మమేకంయ్యారంటే అది చివరకు వారి కులవృత్తిగా మారిపోయింది. గౌడ-ద్రావిడ భాషలో 'కురు' లేదా 'కోరి' అంటే గొర్రె అని అర్థం. దీని మూలంగా కూడా కురుబ, కురుంబ అనే పేరు వచ్చి ఉంటుందనే అభిప్రాయం కలిగిందని గుస్తవ్ ఒప్పెర్ట్ చెప్పారు. వాస్తవానికి కురుమ, కురుబ, కురుంబ, కురుంబార్ అనే పదం కొండ నుండి పుట్టిందన్నది అతని తుది అభిప్రాయం.

సంస్కృతంలో "కురు" అంటే చేయటం లేదా కోరుకునేది సాధించటం అనే అర్థం వస్తుందనే మరో అభిప్రాయం కుడా ఉన్నది. కన్నడ భాషలో కురి అంటే గొర్రె అని అర్థం. "కురుహు" అంటే కన్నడలో నమ్మకం, విశ్వాసం. కన్నడ భాషలోని కురు, తమిళ భాషలోని 'కోరి' (గొర్రె) అనే పదాల నుండి కురుమ, కురుబ, కురుంబ తదితర పేర్లు వచ్చాయని హెచ్.ఏ.స్టువర్ట్ చెప్పారు. కురుమలను వ్రిష్ని అని కుడా పిలుస్తారని ప్రొఫెసర్ ఎం.ఎల్.మూర్తి ఒక వ్యాసంలో తెలిపారు. సంస్కృతంలో వ్రిష్ని అంటే మేషం అని అర్థం అని మూర్తి వివరించారు.

మహాభారత యుద్ధం జరిగిన కురుక్షేత్ర పదంతో కురుమ, కురుబ పదాన్ని పోల్చి చూడవలసిన అవసరం ఉన్నదని ఎం.ఎల్.మూర్తి అభిప్రాయపడ్డారు. కురుక్షేత్ర యుద్దానంతరం దక్షిణాదికి వచ్చి స్థిరపడిన వారు లేదా దక్షిణాదిలో శరణు తీసుకున్న

కురువంశం వారే కురుమ, కురుబలు అని మూర్తి సూచించారు. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. కురుబ పదాన్ని తమిళ పదం కురైతో పోల్చి చూడవలసిన అవసరం ఉన్నదని కూడా మూర్తి చెప్పారు. తమిళంలో కురై అంటే చిన్న ద్వీపమ అని అర్థం. తమిళ నాడులోని కురుంబ ప్రజలు వేటాడి పొట్ట పోసుకునే స్థాయి నుండి ప్రస్తుత స్థాయికి ఎదిగారంటు వీరు జీవించిన ప్రాంతాన్ని కురుబల సమరసీమ అని కూడా పిలిచే వారని మూర్తి తెలిపారు. చిత్తూరు జిల్లాలోని కురుబలు తమిళనాడు నుండి వచ్చి స్థిరపడిన కురుంబ ప్రజలేనని చిత్తూర్ జిల్లా గజేటిర్ స్పష్టం చేసిందని మూర్తి ప్రకటించారు. కురుమ, కురుబ, కురుంబార్, కురుంబ, కురుమాన్ అనే పదం పుట్టుక పై మరింత లోతుగా పరిశోధన జరుగ వలసిన అవసరం చాలా ఉన్నది. మూల పరిశోధన జరిగితే తప్ప ఈ పదం పుట్టుకపై స్పష్టత రాదు. కురుబ , కురుమ అంటే నిజంగానే గొర్రె లేదా ఉన్ని అర్థం వస్తుందా? లేక దీనికి వేరే అర్థాలు ఏమైనా ఉన్నాయా? అనేది శోధించవలసిన ఆవశ్యకత చాలా ఉన్నది. ప్రొఫెసర్ గుస్టావ్ ఒప్పెర్ట్, ప్రొఫెసర్ మూర్తి అభిప్రాయపడినట్లు కురుమ, కురుబ పదానికి కురుక్షేత్రం, కురు వంశంతో సంబంధం ఉన్నదా అనేది పరిశోధించవలసిన అవసరం చాలా ఉన్నది.

సంప్రదాయం వనరులు (Traditional Sources) కురుబ, కురుంబార్ ప్రజల పుట్టుకకు సంబందించిన పలు వివరాలను వెల్లడిస్తున్నాయి, తాము యాదవ సంతతికి చెందినవారమని కురుబ, కురుంబార్ వర్గం ప్రజలు చెప్పుకునేవారని సంప్రదాయవనరులు తెలియజేస్తున్నాయని డాక్టర్ బి.ఏ.సలెతోర్ 1934లో రాసిన తన 'విజయనగర సామ్రాజ్యం (1346-1646)లో సామాజిక, రాజకీయ జీవన స్థితిగతులు అనే పుస్తకంలో పేర్కొనటం గమనార్హం. ఒక వర్గం కురుబలు గొర్రెలు, మేకలను మేపితే మరో వర్గం కురుబల ప్రధాన వృత్తి రాజ్యమేలటం, మూడో వర్గం కురుబలు సున్నం వ్యాపారం చేస్తే, నాలుగో వర్గం కురుబలు వేటాడటం ద్వారా తమ జీవితాన్నే గడిపే వారని సలెతోర్ తన పుస్తకంలో తెలిపారు. కురుంబార్ ప్రజలు దక్షిణ కేంద్రం పత్తిపులం లేదా ఇమ్ముడిపట్నం, ఇమ్మడిపట్నం కేంద్రంగా వారు రోమ్ పట్టణంతో వ్యాపారం చేసేవారు, ఇమ్ముడిపట్నంలోరోమన్నాణాలులబించటంఇందుకునిదర్శనంఅనిసలెతోర్ ప్రకటించారు. కురుబ, కురుంబార్ వర్గం ప్రజల పూర్వీకులు పాండవుల పక్షాన మహాభారత యుద్దంలో పాల్గొన్నారని సంప్రదాయవనరులు తెలియచేస్తున్నాయని' సలెతోర్ తన పుస్తకంలో తెలపటం గమనార్హం. జైన మతాన్ని అవలంబించిన కురుంబార్

వర్గం ప్రజలను ఆదొండ చోళుడు అణగద్రొక్కడం వల్లనే కురుంబ సామ్రాజ్యం పతనమైనదని సలెతోర్ తన పుస్తకంలో తెలిపారు.

కురు వంశం... కౌర్ వర్గం

చత్తీస్‌గడ్ లో నివసించే కౌర్ వర్గం వారు తమని తాము కురువంశానికి చెందిన ప్రజలమని సగర్వంగా ప్రకటించుకున్నారు. చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని జష్పూర్, ఉదయపూర్, సిర్గుజ, కోరేయా, చాంద్ భాకర్ మరియు కోర్బా ప్రాంతాల్లో కౌర్ కులానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారు. చత్తీస్‌గడ్ లోని వివిధ ప్రాంతాలలో నివసించే ఈ కౌర్ వర్గం ప్రజలు పూర్తి స్వతంత్రంతో వ్యవహరిస్తారు. రాష్ట్రంలోని పలుప్రాంతాలలో నివసించే వీరు తమ మధ్య ఎలాంటి సంబంధ, బాంధవ్యాలు పెట్టుకోరు, ఎప్పుడు కలుసుకోరు, పండుగలు, పబ్బాలను కలిసి జరుపుకోరు. వీరి మధ్య ఎలాంటి సంబంధ బాంధవ్యాలు లేకపోయినా తమది కురు వంశమని చెప్పుకోవటంలో మాత్రం అందరిది ఒకటే మాట, ఒకటే బాట. తాము కురు వంశానికి చెందిన వాళ్లము, కురుక్షేత్ర యుద్ధానంతరం ఇక్కడికి వచ్చి స్థిరపడిపోయామన్నది వారి వాదన. కురుక్షేత్ర యుద్ధంలో ఓడిపోవటంతో పాటు హస్తినాపురం నుండి తరిమివేయబడటం వలన తమ పూర్వీకులు చత్తీస్‌గడ్ కు వచ్చి స్థిరపడ్డారని వారు చెప్పుకుంటారు. కురు వంశానికి చెందిన కౌరవులు, పాండవులకు తాము వారసులమని కౌర్ కులం వారు చెబుతారు. కౌర్ కులం వారు నాలుగు వర్గాలుగా విభజింపబడినారు. 1. దుడ్ కౌర్, 2. పైకేర కౌర్, 3. రెట్టయ్య కౌర్, 4. చెర్వా కౌర్. కౌరవ వంశానికి చెందినట్లు చెప్పుకునే ఈ కౌర్ కులం ప్రజలు బ్రాహ్మణులను గౌరవించరు. గ్రామ మంగళిని తమ పూజారిగా భావించే కౌర్ వర్గం వారు పెళ్లి, తదితర ఇతర కార్యక్రమాలన్నింటిని అతని ద్వారా చేయిస్తారు. చత్తీస్‌గడ్ లో నివసించే కౌర్ వర్గం ప్రజలు కూడా కురుంబ ప్రజలేనని గుస్టావ్ ఒప్పెర్ట్ అభిప్రాయపడ్డారు. కురుంబ, కౌర్ కులం ప్రజల మధ్య ఉన్న ఒక సారూప్యం, సాధారణ అలవాటు ఆధారంగా ఒపెర్ట్ ఈ నిర్ణయానికి వచ్చారు. తమ కుటుంబలో ఎవరైనా మరణిస్తే కౌర్ కులం వారి మాదిరి గానే

యాదవ జాతికి చెందిన వారమని చెప్పుకునే ఇడైయా కురుంబలు వీరభద్ర స్వామిని పూజిస్తారు. శివుడి అవతారమైన వీరభద్రుడు శివుడి నోటి నుండి జన్మించాడని విష్ణు పురాణం చెబుతోంది.

కురుంబ కులం వారు కూడా తమతోపాటు సమీప బంధువులందరూ గుండు గీయించుకుంటారు. కౌర్ వర్గం ప్రజలు బ్రాహ్మణులను ఎందుకు ద్వేషిస్తారు ? మంగళి ద్వారా అన్ని పుణ్యకార్యక్రమాలు ఎందుకు చేయిస్తారు ? అనే ప్రశ్నలకు గుస్టావ్ ఒప్పర్ట్ పుస్తకంలో సమాధానాలు లేవు.

తమిళనాడులోని కురుంబార్ కులం ప్రజలు పెంచే గొర్రెలను కోరి అని పిలుస్తారు. ఈ రాష్ట్రానికి చెందిన శబ్దకోశ నిపుణుడు పింగలముని 'కురుంబాన్ అనే పదానికి కురునిల మన్నార్ లేదా చిరు సామంతులు' అనే నిర్వచనం ఇచ్చాడు. తమిళ కురుంబ, కురుంబు, కురుంబాన్ కురుమాన్ పదాలకు దుష్టులు అనే అర్థం, అభిప్రాయం తమిళనాడులో చెలామణిలో ఉండటం గమనార్హం. తమిళనాడులోని కళ్ళన్ కులం కురుంబ కులం ఒకటి కాకపోయినా రెండింటి మధ్య చాలా సారూప్యతలు ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు. బిషప్ కాడ్వెల్ ప్రకారం కురు అనేది కన్నడ పదమే తప్ప తమిళ పదం కాదు. కురుమలు దక్షిణాదికి చెందిన ఆహిరులు ఆని బ్రిటిష్ చరిత్రకారుడు ఎంతోవెన్ చెప్పాడు. వ్యవసాయం అనేది ఏర్పడక ముందు గొర్రెల పెంపకమే ప్రధాన వృత్తిగా ఉండేది, గొర్రెల పెంపకం ఆధారంగానే అప్పటి ఆర్థిక వ్యవస్థ కొనసాగేదని ఎంతోవెన్ అభిప్రాయపడ్డారు. యాదవ జాతికి చెందిన వారమని చెప్పుకునే ఇడైయా కురుంబలు వీరభద్రస్వామిని పూజిస్తారు. శివుడి అవతారమైన వీరభద్రుడు శివుడి నోటి నుండి జన్మించాడని విష్ణు పురాణం చెబుతోంది. దక్షుడి యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు జన్మించిన వీరభద్రుడికి వెయ్యి తలలు, వెయ్యి కాళ్ళు, చేతుల్లో వెయ్యి గదలు, వెయ్యి శూలాలు, వెయ్యి చక్రాలు, గొడ్డలి, విల్లు, బాణాలతో ఉంటాయని విష్ణు పురాణం చెబుతోంది. కురుంబలు తమిళ నెల 'తాయి' లేదా జనవరిలో పూర్ణిమ రోజు 'వీర లేదా వీరలు లేదా వీరభద్ర' గా పిలుచుకునే తమ దేవుడికి సంవత్సరానికి ఒక సారి పూజలు నిర్వహిస్తారు. సంవత్సరకాలమంతా ఒక పెట్టెలో భద్రపరిచే తమ దేవుడి విగ్రహాన్ని కురుంబలు జనవరి నెలలో బైటికి తీసి చింతపండుతో కడిగి శుభ్రం చేసి కొత్త బట్టలు తొడిగి పూలతో అలంకరిస్తారు. అగరవత్తులు వెలిగించి పాలతో వండిన అన్నాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పూజల సందర్భంగా అన్ని సంప్రదాయాలను ఖచ్చితంగా పాటించే వ్యక్తిని దేవుడి విగ్రహం ముందు కూర్చోబెట్టి అతని తలపై కొబ్బరి కాయలు పగల కొడతారు. కొబ్బరి కాయలు పగల కొట్టడం మూలంగా తల పగిలి రక్తం కారితే అతను ఏదో పాపం చేసినట్లు భావించి పూజారి పదవికి అనర్హుడని నిర్ధారిస్తారు. కొబ్బరి కాయలు కొట్టడం వలన తల పగిలి రక్తం కారని

వ్యక్తిని కురుంబలు తమ పూజారిగా నియమించుకుంటారు. పుదుకొట్టై మహారాజు ప్రతి సంవత్సరం తమ దర్బారులో స్థానిక కురుంబల దేవత వరలక్ష్మికి ఈ కొబ్బరి కాయలు కొట్టే పూజను నిర్వహిస్తారు..

భ్రుంగి నృత్యం

కైలాసంలో శివుడి సమక్షంలో ఆస్థాన నర్తకి మూడు కాళ్ళ భ్రుంగి నృత్యం నచ్చక నవ్విన దేవతలే గొర్రెలుగా పుట్టారనే అనే ఒక కథ మహారాష్ట్రలో ప్రాచుర్యంలో ఉన్నది. తన నృత్యం నచ్చక నవ్విన దేవతలను భ్రుంగి శపిస్తుంది. భ్రుంగి ఇచ్చిన శాపంమేరకు కైలాసంలోని దేవతలందరు గొర్రెలుగా మారిపోతారు. భ్రుంగి శాపం మేరకు గొర్రెలుగా మారిన దేవతలందరూ భూలోకంలో ఒక గుహలోకి వెళ్ళిపోతారు. మహాభారత యుద్ధం జరిగిన కురుక్షేత్రానికి కొంత దూరంలోని పంచక కాలువ వద్ద ఉన్న 'కురువీరేశ్వర్' దేవాలయం సమీపంలో ఈ గుహ ఉన్నదన్నది మహారాష్ట్ర ధనగర్ల విశ్వాసం.

మరో కథనం ప్రకారం భ్రుంగి అనే ఋషి సురులు, కిన్నెరలు ఉన్న సభకి వస్తాడు. సభలో ఉన్న ఇద్దరు గంధర్వులు అతన్ని చూసి నవ్వుతూ అపహాస్యం చేస్తారు. తనకు జరిగిన అవమానానికి ఆగ్రహించిన ఋషి భ్రుంగి వారిని శపిస్తాడు. భ్రుంగి శాపం మేరకు ముద్దయ్య, సుగ్గలి అనే ఇద్దరు గంధర్వులు భూలోకంలో దంపతులుగా జన్మిస్తారు. మిగతా గంధర్వులు గొర్రెలుగా పుడతారు. భ్రుంగి శాపానికి సంబంధించిన వివరణ ప్రస్తుత మహారాష్ట్రలోని షోలాపూర్ లో ఉన్న ఒక శివాలయంలో ఉన్నది. ఇదిలా ఉంటె అదిగొండ సంతతి వారినే కురుబ, కురుమ అని పిలుస్తారని శాంత విజయ పురాణం చెబుతోంది. పాల నుండి ఉద్భవించిన వారు కాబట్టి వీనిని హాలుమాత కురుబలు అని పిలుస్తారని కూడా శాంత విజయపురాణం చెబుతోంది. కన్నడ భాషలో హాలు అంటే పాలు అని అర్థం. కురుమ, కురుంబ, కురుబలు క్షత్రియులు, వీరు యుద్దాలలో ఓడిపోయిన తరువాత కొండలు, గుట్టలలోకి పారిపోయి తమ ప్రాణాలను కాపాడుకున్నారు, జీవనోపాది కోసం వీరిలో ఎక్కువ మంది గొర్రెలను పోషించటం ద్వారా గొర్రెల కాపర్లు అయ్యారన్నది గుస్టావ్ ఒప్పెర్ట్ వాదన. తమిళనాడులోని కురుంబ కులంలో ఇరవై మూడు ఉపకులాలు ఉన్నట్లు గుస్టావ్ ఒప్పర్ట్ తన పుస్తకంలో తెలిపారు. అడవి కురుంబ, ముళ్ళు కురుంబ, ఏనుగు కురుంబ తదితర ఉప కులాల్లో గొర్రె కురుంబ ఒకటని ఆయన పేర్కొన్నారు. ఈ ఇరవైమూడు రకాల కురుంబలను ఒకే వర్గంగా భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో గొర్రెలను మేపే వారు

కురుంబ, కురుబ అని అనలేమన్నది గుస్టావ్ ఒప్పెర్ట్ వాదన. తమిళనాడులో అదొండ చోళుడితో జరిగిన యుద్ధంలో కురుంబ సామ్రాజ్యం పతనమైన అనంతరం కురుంబవర్గం ప్రజలంతా నిలగిరి అడవులలోకి పారిపోవటం దీనికి ఉదాహరణ అని గుస్తవ్ ఒప్పెర్ట్ వాదించారు.

కురుమ, కురుంబ, కురుంబ, కురుమాన్ వర్గం ప్రజలు యాదవుల్లో భాగమా? లేక పూర్తిగా వేరే కులమా? అనేది కూడా చర్చనీయ అంశంగా మారింది. విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన హరిహర రాయలు, బుక్కరాయలు, వారి ముగ్గురు సోదరులు వరంగల్లు ప్రాంతానికి చెందిన కురుమ కులం వారైనప్పటికీ వారు తమను తాము యాదవులుగా ప్రకటించుకున్నారు. తాము యదువంశానికి చెందిన చంద్రవంశ క్షత్రియ రాజులమని చెప్పుకోవటం ద్వారా క్షాత్రాన్ని, క్షత్రియత్వాన్ని తమకు తాము అపాదించుకున్నారని చరిత్రకారులు చెబుతున్నారు. డాక్టర్ బి.ఏ.సలేతోర్ వ్రాసిన 'విజయనగర సామ్రాజ్యంలో సామాజిక, రాజకీయ జీవితం' అనే పుస్తకం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది.

ఆర్యులా?

కురుమ, కురుబ, కురుంబ, పాల్ తదితర గొర్రెల కాపర్లు ఆర్యులా లేక ద్రవిడులా ? అనే అంశంపై పెద్ద చర్చ జరిగింది. గొర్రెల కాపర్లు ఆర్య సంతతికి చెందిన వారని కొందరు మేధావులు చెబుతుంటే మరి కొందరేమో వీరు ద్రావిడులని వాదిస్తున్నారు. ఐతే మూడో వర్గం మేధావులు మాత్రం కురుమ, కురుబలు ద్రావిడులకు పూర్వం వారని అభిప్రాయపడుతున్నారు. గొర్రెల కాపర్లు ఆర్యుల సంతతికి చెందిన వారేనని సామాజిక శాస్త్రవేత్త వీ.ఆర్.హనుమంతయ్య తన 'భారతదేశంలోని కురుబల చరిత్ర' అనే కన్నడ పుస్తకంలో వాదించారు. వేదాల్లో పలుచోట్ల గొర్రెల కాపర్లకు సంబందించిన ప్రస్తావన ఉన్నందున వీరు ఆర్యులని ఆయన వాదించారు. ఆర్యుల ప్రధాన వృత్తి పశువులను మేపటం, ఉన్ని కంబళ్ళు నేయటం మరియు వ్యవసాయం చేయటం కాబట్టి గొర్రెల కాపర్లు, పశువుల కాపర్లు ఆర్యులన్నది అతని వాదన. వేద కాలంలో గొర్రెల కాపర్లను అవిపాల్, అజపాల్, మేష్ పాల్, గోపాల్ అని పిలిచే వారు. 'కర్ణాటక వీర క్షత్రియులు' అనే పుస్తకంలో ఎస్.బి.జోషి కుడా ఇలాంటి వాదనే చేయటం గమనార్హం. కురుమ, కురుబ, పాల్ తదితర గొర్రెల కాపర్లు ఇప్పటికి నేస్తున్న కంబళ్ళు లేదా గొంగళ్ళ గురించి వేదాల్లో

పలు చోట్ల ప్రస్తావన ఉన్నది. దీనిని దృష్టిలో పెట్టుకుంటే కంబళ్ళు నేసే కురుబ తదితర గొర్రెల కాపర్లు అందరు కూడా ఆర్య సంతతికి చెందిన వారేనని జోషి తన పుస్తకంలో స్పష్టం చేశారు. వేదాలలోని పూష దేవుడిని స్తుతిస్తూ చేసిన ప్రార్థనలను పరిశీలించినా గొర్రెల కాపర్లు అర్యులనేది అర్థమవుతుందని జోషి వాదించారు. ఇరవైయవ శతాబ్దం ప్రారంభంలో పలువురు పాశ్చాత్య పండితులు కురుమ, కురుబల చరిత్ర గురించి అధ్యయనం చేశారు. బెకమాన్,సేర్రింగ్, థర్ స్టన్, ఇయ్యర్, జోషి కురుబల గురించి అధ్యయనం చేశారు. జోషి కురుబ, కురుమ వర్గం వారి గురించి ప్రత్యేక అధ్యయనం చేశారు. ఆధునిక కాలంలో జర్మని దేశానికి చెందిన గుంత్తర్ సొంతేమర్, రామచంద్ర చింతామణి దిగే, ఎం.వి.కె.మూర్తి తదితరులు ఈ అధ్యయనాన్ని కొనసాగించారు. గొర్రెలను మచ్చిక చేసుకోవటం ప్రారంభమైనప్పటి నుండి గొర్రెల పెంపక, వృత్తి, కులానికి అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు. గోర్డన్ పండితుడి అభిప్రాయం ప్రకారం గొర్రెల పెంపకందారులు దక్షిణాదికి చెందిన అసలైన మూలనివాసులు. ప్రారంభంలో అడవులు, కొండలు, గుట్టలలో మాత్రమే నివసించిన వీరు తరువాత కాలంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవటంతో పాటు వ్యవసాయం ప్రారంభించిన సూచనలు కనిపిస్తున్నాయి. గొర్రెల పెంపకం అత్యంత పురాతన వృత్తి అనేది అందరికి తెలిసిందే.

కురుమలు గొల్లల పరిధిలోకి వస్తారా ?

కురుమలు గొల్ల వర్గం పరిధిలోకి వస్తారా? లేదా? అనేది ఇటీవలి కాలంలో చర్చనీయాంశంగా మారింది. కురుమలు గొల్లల పరిధిలోకి వస్తారని కొందరు వాదిస్తే మరి కొందరు మాత్రం గొల్లలు వేరు, కురుమలు వేరు అని వాదిస్తున్నారు. కొందరు కురుమలు తమను తాము గొల్ల కురుమలు లేదా కురుమ గొల్లలుగా పిలుచుకుంటున్నారు. మరి కొందరు కురుమలు తమను తాము యాదవులుగా ప్రకటించుకుంటున్నారు. కురుమలు 'గొల్ల' వర్గం పరిధిలోకి వస్తారా? లేదా? అనే అంశంపై ఏకాభిప్రాయం కుదరటం లేదు.

వేదవ్యాస మహర్షి తండ్రి పరాశరుని ప్రకారం క్షత్రియునికి శూద్ర స్త్రీ యందు పుట్టిన వారు గోపాలురు. పరాశరుడు తన పరాశర స్మృతిలో ఈ విషయం స్పష్టం చేశారు. పరాశర స్మృతి పదకొండవ అధ్యాయంలోని ఇరవై నాల్గవ శ్లోకం..

"క్షత్రియాచ్ఛూద్ర కన్యాయాం సముత్పన్నస్తుయః సుతః

‘గొల్ల’ శబ్దం వృత్తి వాచకమైతే యాదవ శబ్దం కుల వాచకమని రాజవంశ ప్రదీపిక చెబుతోంది. చంద్రవంశ క్షత్రియులైన యాదవులకు ‘గొల్లవారు’ అనే మరోపేరు కూడా ఉండటం విదితమే. వేదం కాలం, మహాభారత కాలం నుండి గోపాలకులు, అజ పాలకులు అనేది స్పష్టంగా కనిపిస్తోంది.

స గోపాల ఇతి ఖ్యాతో భోజ్యో విప్రైర్న సంశయః”

క్షత్రియునికి శుద్ర స్త్రీ యందు పుట్టిన వాడిని గోపాలుడని పిలుస్తారు, వాని అన్నమును బ్రాహ్మణులు నిస్సందేహముగా తినవచ్చును. అని పరాశరుడు తన స్మృతిలో తెలిపారు.

‘గొల్ల’ అనేది సంస్కృత పదం, ఇది గోపాల నుండి వచ్చిందనే వాదన ఉండటం అందరికి తెలిసిందే. ఐతే ఇందులో నిజం లేదని గుస్టావ్ ఒప్పర్ట్ తన ‘భారతదేశం మూల నివాసులు’ అనే పుస్తకంలో స్పష్టం చేశారు. గొల్ల అనేది గొర్రె పదం నుండి పుట్టిందని ఆయన వాదించారు. గోవులను పోషించేవారు గొల్లలు అని సి.పి. బ్రౌన్ వాదించటం విదితమే. మొదటి తెలుగు నిఘంటువును రూపొందించిన బ్రౌన్ ‘గొల్ల’ పదం పుట్టుకపై చేసిన వాదనను గుస్టావ్ ఒప్పర్ట్ తోసిపుచ్చారు. బ్రౌన్ తన తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువులో గొల్ల అనే పదం సంస్కృత పదం గౌవ్ అంటే గోవు నుండి పుట్టిందని వాదించారు. ఐతే ఈ వాదనలో నిజం లేదని ఒప్పర్ట్ చెప్పారు. గొల్ల విషయంలో బ్రౌన్ చేసిన తప్పును ఆ తరువాతి భాషాపండితులు కొనసాగించారని ఒప్పర్ట్ వాదించారు. గొర్రె, గొర్రెలు అనే పదం కాల క్రమంలో గొల్ల, గొల్లలుగా మారిందని ఆయన వాదించారు. గోవులను పాలించువారు ‘గోపాలురు’ ఈ గోపాల శబ్దమే గొల్లగా మారి ఉంటుంది, గోపాల.. గో అల.. గోల.. ‘ గొల్ల ’ గా మారిందనేది ఒక వాదన. వీరికి గొర్రెలు కూడా ఉంటాయి కాబట్టి గొర్రెలవారు కాలక్రమంలో గొర్లవారు ... గొల్లవారుగా మారి ఉంటుందనే వాదన కూడా ఉండటం గమనార్హం

కురుబలు, గొల్లలు కూడా గొర్రెలు, మేకలు, ఆవులను పెంచి, పోషించటంతో పాటు పాల విక్రయం కూడా చేసేవారు, ఇప్పటికి చేస్తున్నారనేది అందరికి తెలిసిందే.

‘గొల్ల’ శబ్దం వృత్తి వాచకమైతే యాదవ శబ్దం కుల వాచకమని రాజ వంశ ప్రదీపిక చెబుతోంది. చంద్ర వంశ క్షత్రియులైన యాదవులకు ‘గొల్లవారు’ అనే మరో పేరు కూడా ఉండటం విదితమే. వేదం కాలం, మహా భారత కాలం నుండి గోపాలకులు , అజ పాలకులు అనేది స్పష్టంగా కనిపిస్తోంది. మహా భారతం కాలం నాటి కురు వంశం, యదవ

వంశం వారి వద్ద గోవులతో పాటు గొర్రెలు కూడా ఉండేవి. ఆధునిక కాలంలో వీరికి గోవులు పోయి గొర్రెలు, మేకలు మిగిలాయి. అందుకే యాదవులకు 'యాదవ' అనేది కుల వాచకమైతే గొల్ల శబ్దం వృత్తి వాచకమనే వాదన కూడా ఉన్నది. గొల్ల అనేది అప్పట్లో వృత్తి వాచకమైన కాలక్రమంలో ఇది కుల వాచకంగా మారిందనే వారు కూడా ఉన్నారు. జానపద వ్యవహారం ప్రకారం పన్నెండు రకాల మంది గొల్లలు ఉండటం వల్లనే 'గొల్ల' అనేది కుల వాచకమని వీరు వాదిస్తున్నారు. పూజ గొల్ల, ఎర్ర గొల్ల, పునాటి గొల్ల, గుజరాజు గొల్ల, వెయ్య గొల్ల, పెయ్య గొల్ల, కురవ గొల్ల, ముష్టి గొల్ల, సజ్జనపు గొల్ల, పెద్దిటి గొల్ల, కర్ణ గొల్ల, రాచ గొల్ల అనే పన్నెండు రకాల గొల్లలు ఉన్నారని జానపదం చెబుతోంది. ఐతే రాజవంశ ప్రదీపిక మాత్రం పూరి గొల్ల, పూజ గొల్ల, ఎర్ర గొల్ల, పూనాటి గొల్ల, వృష్టి గొల్ల, కర్ణ గొల్ల, మంద గొల్ల, కురువ గొల్ల అనే ఎనిమిది రకాల గొల్లలు ఉన్నట్లు పేర్కొన్నది. ఇదిలా ఉంటే 'గొల్ల సూక్తులు' లేదా 'గొల్ల సుద్దులు' చెప్పే 'గొల్ల సుద్దులవారు' అనే గొల్లలు కూడా ఉన్నారు. సుద్దులను పాడే గొల్లలు కాబట్టి వీరికి గొల్ల సుద్దుల వారు అనే పేరు వచ్చి ఉంటుందనే అభిప్రాయం ఉన్నది. కేవలం యాదవుల వద్ద మాత్రమె యాచన చేసే వీరిని రాయల సీమలో 'సుద్దులన్నలు' అని పిలిస్తే నెల్లూరు, ప్రకాశం జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో వీరిని యాచకులు లేదా తెర చీర భక్తులు అని కూడా పిలవటం గమనార్హం. గొల్ల సుద్దుల వారు మేకలను పెంచుతారు.

బ్రిటీష్ పాలకులు **1890**కి పూర్వం జరిపిన జనాబా లెక్కల సేకరణ నివేదికలో గొల్లలను ఎర్ర, గౌడ, కాడు. కన్నడి, కురుబ, కర్ణ, ముష్టి, పూజ, పూరి, పెద్దేటి, ఊరు, కురుంబ, యాదవులుగా విభజించటం గమనార్హం. అప్పట్లో పన్నెండు లక్షల యాభై ఎనిమిదివేల జనాభా ఉన్న ఈ గొల్లలను బ్రిటీష్ పాలకులు ద్రావిడ జాతీయులుగా పరిగణించారు. **1923** కు పూర్వం దేశంలో యాదవ పదం వాడకం పెద్దగా ఉండేది కాదు. ఉత్తరాదికి చెందిన ఆహిర్లు, మహారాష్ట్రలోని గావలి వర్గం వారు అఖిల భారత యాదవ మహా సభను ఏర్పాటు చేసుకున్నప్పటి నుండి యాదవ పదం వాడకం బాగా పెరిగింది. తాము పురాణాల్లో ప్రస్తావించిన 'యదు' వంశానికి చెందినందున తాము యాదవులమని మహా సభ ప్రకటించుకున్నది. పురాణాలలో ప్రస్తావించిన అభిరులు తామేనన్నది వారి వాదన. తాము యదు వంశానికి చెందినందున తమను ఇకమీదట యాదవులనే పిలవాలి తప్ప గొల్లలుగా పరిగణించకూడదని యాదవ మహా సభ అప్పట్లో ఒక ప్రకటన జారీ చేసింది. మహా భరతం ప్రకారం గోవులను పెంచి పోషించే వారు గోపాలురు, గొర్రెలు, మేకలను పెంచి పోషించే వారు అజ పాలకులు. మహా భారతంలోని

ఉద్యోగ పర్వంలో గోవులను పెంచే వారిని గోపాలకులనీ, గొర్రెలను పెంచే వారిని అజ పాలకులని తెలిపింది. పాండవులు అరణ్యావాసం, అజ్ఞాతవాసం ముగించుకున్న తరువాత తమ రాజ్యం కోసం కౌరవులతో యుద్దానికి దిగినప్పుడు పలు రాజ వంశాలతో పాటు గోపాలకులు, అజపాలకులు కూడా ధర్మరాజుకు మద్దతు ప్రకటించినట్లు ఉద్యోగ పర్వంలో స్పష్టంగా ఉన్నది.

పద్నాలుగు పీఠాలు

వరంగల్ రాజధానిగా పరిపాలన కొనసాగించిన కాకతీయ ప్రతాపరుద్రుడు గొల్లలు, కురుమల కోసం **1425** శక సంవత్సరంలో పద్నాలుగు పీఠాలు ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. ప్రతాపరుద్రుడి ఆదేశం మేరకు కొండయ్య గురువు నాయకవత్వంలో ఈ పద్నాలుగు పీఠాలను ఏర్పాటు చేసారు. గొల్లలలోని పన్నెండు ఉపకులాలు, కురుమలలోని రెండు ఉపకులాల వారి కోసం పద్నాలుగు పీఠాలను ఏర్పాటు చేసినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. వరంగల్ సామ్రాజ్యంలో గొల్లలు, కురుమలు జాగీర్దారులుగా వ్యవరించేవారు. పలువురు గొల్లలు, కురుమలు కొన్ని ప్రాంతాలకు అధినాయకులుగా కూడా వ్యవహరించేవారు. **1560** సంవత్సరంలో భాగ్యనగరును స్థాపించిన మొహమ్మద్ కూలి కుతుబ్షా కూడా గొల్లలు, కురుమల మత పరమైన ఆచారాలు, వ్యవహారాలను గౌరవించారు. ప్రతాపరుద్రుడు గొల్లలు, కురుమల కోసం ఏర్పాటు చేసిన పద్నాలుగు పీఠాలను కులీ కుతుబ్ షా కొనసాగించారు.

గొల్లలు, కురుమ కులం ప్రజలు గొల్లకొండ కోట నిర్మాణంలో ప్రముఖ పాత్ర నిర్వహించినట్లు తెలుస్తోంది. కొండయ్య నాయకత్వంలో గొల్లకొండ కోట నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది. కొండయ్య గొల్లకొండ కోటను నిర్మించినందుకు ప్రతిగా కూలి కుతుబ్షాఆయననుపద్నాలుగుపీఠాలఅధిపతిగాకొనసాగిస్తూ1071హిజ్రిలో ఆదేశాలు జారి చేశారు. దీనితో పాటు అంత వరకు మానుగల్ గా పిలువబడిన కోటకు గొల్లకొండ అని కుతుబ్ షా నామకరణం చేసినట్లు చరిత్ర చెబుతోంది. ఐతే ఇప్పుడీ పీఠాలు ఎక్కడ ఉన్నాయనేది ఎవ్వరికీ తెలియదు. కులపరమైన పద్నాలుగు పీఠాల చరిత్ర ఉన్న కురుమలు, గొల్లలు ఇప్పుడు ఎందుకిలా ప్రాధాన్యతను కోల్పోయి రాజకీయపరంగా ఇతరుల అడుగులకు మడుగులు వత్తుతున్నారు?. ఈ పద్నాలుగు పీఠాలు ఎక్కడ ఉండేవి? వారి నిర్వహణ ఎలా సాగేది? రాజకీయంగా వాటికి ఉండిన ప్రాధాన్యత ఏమిటనేది అనే అంశంపై పరిశోధన జరపవలసిన అవసరం ఉన్నది.

వేదం కాలంలో...

'శం నః కరత్యర్వతే సుగం మేషాయ మేష్యే నృభ్యోనారిభ్యో గావే'

'మా గుర్రములకు, మగ, ఆడా మేకలకు, నర, నారీ జనులకు,గోవులకు రుద్రుడు సులభ సుఖములు కలుగ చేయవలెను'. (ఋగ్వేడంలోని 43 సూక్తం, మొదటి మంత్రం)

'ఉపహూతా ఇహ గావః

ఉపహూతా అజావయః

అథో అన్యస్య కీలాల ఉపహూతో గృహేషు నః


క్షేమాయ వఃశాంత్యై ప్రపధే శివ శగ్మ శంయో: శంయో:"

"ఈ ఇంట గోవులు తిరిగినవి, మేకలు, గొర్రెలు సంచరించినవి. ఈ ఇంటనే అన్నము రసవంతమైంది. నీరు మధురమైనది. అట్టి గృహమున సుఖము, శాంతి కలుగుటకు ప్రవేశించుచున్నాము. మాకు ఈ ఇంట సుఖమ్ములు, శుభములు కలుగవలెను. భయములు దూరము కావలెను." (ఋగ్వేదం 43 సూక్తం, రెండవ మంత్రం)

వేద కాలంలో గొర్రెల కాపర్లు ఉండే వారని చెప్పేందుకు ఈ రెండు మంత్రాలు చాలు.నాలుగువేదాలలోనిదాదాపునాలుగువందలమంత్రాలుగొర్రెలకాపర్లు, గొర్రెలు, మేకల, గొర్రెలకాపర్ల స్తితిగతుల గురించి ప్రస్తావించాయి. గొర్రెలు, మేకలను ఇచ్చి వాటికి బదులుగా ఇతర వస్తువులు తీసుకోవటం అంటే వస్తు మార్పిడి విధానం, యజ్ఞాలలో గొర్రెలు, మేకలు, ఉన్ని వినియోగం తదితర అంశాల వివరణ ఈ వేదం మంత్రాలలో ఉన్నది. యదు సంతతి వారు పశుమంతులు అని వేదం బల్ల గుద్ది చెప్పటం గమనార్హం. పశువుల దేవుడు పూషకు సంబందించిన పలు మంత్రాలు నాలుగు వేదాల్లో ఉన్నాయి. పశు పాలకులు, వారితో ముడిపడి ఉన్న జీవన వ్యవస్థకు సంబందించిన పలు అంశాలను వేద మంత్రాలు వివరించాయి. వేద కాలమంతా పశు పాలక వ్యవస్థ అనేది అందరికి తెలిసిందే. వేట ద్వారా ఆహార సేకరణ కష్టమైపోతున్న తరుణంలో జంతువులను మచ్చిక చేసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియలో భాగంగానే గొర్రెలు,మేకలు.ఆవులు,గుర్రాలు, ఒంటెలు తదితర జంతువులను పెంచుకునేందుకు వేదకాలం ప్రజలు శ్రీకారం చుట్టారు. జంతువుల పెంపకం వలన

ఆకలి తీర్చుకునేందుకు అవసరమైన మాంసంతో పా టు ఆచ్ఛాదన కోసం చర్మం కూడా లభించేది. పెంపుడు జంతువుల వలన ఆహారం,తోలుతో పాటు పాలు, ఉన్ని, గిట్టలు లభించేవి. ఈ లభ్యత కాల క్రమంలో ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెంది ఉంటుంది. వేదం కాలంలో ఆవులు, గొర్రెలు, మేకలను కలిపి లేదా విడి, విడిగా మేపే పద్దతులు ఉండేవి. ఆవులు, గొర్రెలు, మేకలను కలిపి మేపటం కుడా ఒక సంప్రదాయం.

ఆవులు, గొర్రెలు, మేకలను కలిపి మేపితే పశువుల కాపర్లు అనే వారు. కేవలం ఆవులను మేపితే గోపాలకులు, గొర్రెలను పోషించే వారిని అజ పాలకులు అని పిలిచే వారు. నాలుగు వేదాలలోని పలు మంత్రాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.



నాలుగు వేదాలైన ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం మరియు అథర్వవేదంలో వందలాది ఋక్కులు, మంత్రాలు, శ్లోకాల్లో అజపాలకులు, గొర్రెలు, మేకల ప్రస్తావన ఉన్నది. మహాభారతం,హరి వంశం ,రామాయణం తో పాటు పురాణాలు, ఇతర ప్రాచీన గ్రంథాలలో కుడా గొర్రెలకాపర్లు, గొల్లల ప్రస్తావన ఉండటం గమనార్హం. 'వేదాలలో పశువుల కాపర్లు'అనే నా పుస్తకంలో ఇందుకు సంబంధించిన వివరాలను పొందుపరిచాను. యదు, తుర్వషులు పశుమంతులు అనేది వేదం స్పష్టంగా చెప్పింది. ఋగ్వేదంలోని ఎనిమిదవ మండలంలో రుషి మేధాతిధి - మేధ్యాతిథి రాసిన మొదటి సూక్తం, ముప్పై ఒకటవ మంత్రంలో యదు,తుర్వషులు పశు మంతులు అని ప్రకటించారు.

'ఆ యదశ్వాన వనన్యత శ్రధ్ధాయః రథే రహం
ఉత వామస్య వసన చికేతతి యో ఆస్తి యదుః పశుః

మహా భారతంలో....

మహా భారతంలో గొర్రెల కాపర్ల ప్రస్తావన ఉన్నది. అరణ్య పర్వంలో ద్రౌపది-

సత్యభామ మధ్య జరిగిన సంవాదంలో గొల్లల ప్రస్తావన ఉన్నది. పంచ పాండవులను ఏ విధంగా కొంగున కట్టి పెట్టికున్నావు, ఏం మంత్రం వేశావు? ఏ మందు,మాకు పెట్టావు? ఆ రహస్యమేదో చెబితే గోపాల కృష్ణుడిని కూడా కొంగుకు కట్టి వేసుకుంటానని అభ్యర్ధించిన సత్యభామకు ద్రౌపది సమానధానం ఇస్తూ పంచ పాండవులను ప్రేమానురాగాలతో చూసుకోవటంతో పాటు ప్రభుత్వ ఆదాయం, కుటుంబం ఖర్చులు, సేవకుల జీతభత్యాల చెల్లింపులు కుడా తానే చూసుకుంటానంటూ చివరకు గోపాలకులు, ఆ గోపాలకుల బాగోగులు కూడా తానే చూసుకుంటానని ద్రౌపది వివరిస్తుంది. మహా భారతంలో నాలుగైదు చోట్ల గొర్రెలు, గొర్రెల కాపర్ల విషం ప్రస్తావన వచ్చింది. మొదట రాక్షస విద్వాంసుడు మయుడు నిర్మించిన మయ సభ ప్రారంభోత్సవం సందర్భంగా గొర్రెలు, గొల్లల ప్రస్తావనకు వచ్చింది. పట్టాభిషేకం జరుగుతున్న మయసభలోకి ప్రవేశించి ధర్మ రాజుకు భాహుకరించేందుకు పలువురు సామంత రాజులు వేలాది గొర్రెలతో వచ్చి మయ సభ ప్రధాన ద్వారం వద్ద వేచి ఉన్నట్లు వేదవ్యాసుడు రచించిన మహా భారతం చెబుతోంది. సామంత రాజులకు మయ సభలోకి ప్రవేశం లభించనందున వారు తాము తెచ్చిన గొర్రెలను ధర్మ రాజుకు బహుకరించలేకపోతారు. చక్రవర్తి అయిన ధర్మరాజుకు బహుకరించేందుకు పలువురు సామంత రాజులు వేలాది గొర్రెలను తీసుకు రావటంలో అర్థం ఏమిటంటే అప్పట్లో గొర్రెల పెంపకం ఒక ప్రధాన వృత్తి కావటంతో పాటు గొర్రెలకు అత్యధిక ప్రాధాన్యత ఉండి ఉండాలి.



హస్తినాపురంలో గొర్రెల ప్రస్తావన

హస్తినాపురంలో కౌరవులు, పాండవుల మధ్య పాచికల జూద రాజకీయం జరిగినప్పుడు కూడా గొర్రెల ప్రస్తావన వచ్చింది. దుర్యోధనుడి తరపున పాచికల ఆట ఆడిన శకుని చేతిలో ధర్మ రాజు సర్వస్వం కోల్పోవటం అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో దుర్యోధనుడి ఆదేశం మేరకు దుశ్శాసనుడు ఋతుస్రావం మూలంగా ఒంటి

చీరతో ఉన్న ద్రౌపదిని నిండు సభలోకి ఇడ్చుకు వస్తాడు. నిండు సభలో ద్రౌపదిని వివస్త్రను చేసేందుకు దుశ్శాసనుడు చేసిన ప్రయత్నం శ్రీ కృష్ణుడి మూలంగా విఫలం అవుతుంది. ఆగ్రహంలో ఉన్న ద్రౌపదిని బుజ్జగించేందుకు దృతరాష్ట్రుడు ఆమె కోరిక మేరకు పాచికల జూదంలో సర్వస్వం కోల్పోయిన పాండవులుకు వారి రాజ్యం తిరిగి ఇచ్చి వేస్తాడు. పాండవుల రాజ్యాన్ని స్వాధీనం చేసుకునేందుకు తాము చేసిన కుట్ర విఫలం కావటంలో శకుని దుర్యోధనుడి ద్వారా ధ్రుతరాష్ట్రుదిపై వత్తిడి తెచ్చి తమ దేశానికి వెళ్ళిపోతున్న పాండవులను మరోసారి జూదానికి రప్పిస్తారు. శకుని రెండో సారి జూదానికి షరతులు విధించే సందర్భంగా గొర్రెల విషయం ప్రస్తావనకు వచ్చింది. మన వద్ద రాజ్యం, వజ్రాలు, వైడుర్యాలు, బంగారు నగలు, ఇతర విలువైన వస్తువులతో పాటు వేలు, లక్షలాది ఆవులు, గుర్రాలు, ఏనుగులు, గొర్రెలు ఉన్నాయి, జూదంలో వీటిని ఫణంగా పెట్టటం వృధా అని అంటాడు. జూదంలో ఓటమి పాలయ్యేవారు పనేండు సంవత్సరాలు అరణ్య వాసం ఒక సంవత్సరం పాటు అజ్ఞాత వాసంలో ఉండాలని శకుని షరతు విధిస్తాడు. అజ్ఞాత వాసం సందర్భంగా వారి ఆనవాలు వెల్లడైతే మళ్లీ పన్నెండు సంవత్సరాల అరణ్యావాసం ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయవలసి ఉంటుందని శకుని షరతు పెట్టటం తెలిసిందే. మహా భారతం సమయంలో గొర్రెల పెంపకం ప్రధాన వృత్తి అనేది స్పష్టం కావటంతో పాటు రాజులు సైతం గొర్రెల పెంపకం చేయించే వారనేది సుస్పష్టం అవుతోంది. పాండవులు అరణ్యావాసంలో ఉన్నప్పుడు ద్రోపది కోరిన సుగంధం వెదజల్లె పూలను తెచ్చేందుకు భీముడు అడవిలో తిరుగుతున్న సమయంలో హనుమంతుడు ఎదురు పడ్డప్పుడు కూడా గొర్రెలు, గొర్రెల పెంపకానికి సంబంధించిన ప్రస్తావన ఉన్నది. హనుమంతుడు తన సోదర సమానుడైన భీముడికి వైదిక నియమాల గురించి వివరిస్తూ 'ఆచారం నుండి ధర్మం జన్మిస్తుంది, ధర్మం వలన వేదం పాదుకుంటుంది, వేదాల వలన యజ్ఞాలు జరుగుతాయి, యజ్ఞాలు జరగటం వలన దేవతలు తృప్తి చెందుతారు. బృహస్పతి, శుక్రాచార్యుడు సూచించిన నియమాలు మానవ జీవితాల నిర్వహణకు ఆధారము' అని చెబుతాడు. వేతనానికి పనిచేయటం, పన్నులు వసూలు తీసుకోవటం, వ్యాపారం, వ్యవసాయం, గోవుల పోషణ, గొర్రెలు, మేకల పెంపకం చదవటం, చదివించటం వంటి ధర్మానుకుల వృత్తుల ద్వారా రెండుసార్లు జన్మించే బ్రాహ్మణులు సంపూర్ణ జగత్తును రక్షిస్తారని హనుమంతుడు భీముడికి వివరిస్తాడు. క్షత్రియులు ప్రజాపాలన, బ్రాహ్మణులు వేదాధ్యయనం, వైశ్యులు పశుపాలన చేయటం వైదిక ధర్మమని హనుమంతుడు వివరించటం గమనార్హం.

క్షత్రియులలతో పాటు మిగతా వర్గాల వారు పశు పాలన చేసేవారనేది దీని వలన స్పష్టం అవుతోంది. క్షత్రియులుపశుపాలనచేయకున్నామిగతావారితోచేయించేవారు.
పాండవుల వద్ద వేల సంఖ్యలో గొర్రెల మందలు ఉండేవనేది దీని వలన స్పష్టం అవుతోంది. మహా భారతం సమయంలో పశుపాలన అంటే ఆవులు, గొర్రెలు, మేకలను పెంచటం అనేది ఒక ప్రధాన వృత్తిగా కనిపిస్తోంది. పాండవులు అరణ్యావాసం ముగించుకుని అజ్ఞాతవాసంలోకి వెళ్ళే సమయంలో కూడా అవ్వులు, గొర్రెలకాపర్ల ప్రస్తావన వచ్చింది. మత్స్య దేశం రాజధాని విరాటనగరంలో అజ్ఞాతవాసం ప్రారంభించే ముందు పాండవులు తమ ఆయుధాలను నగరానికి కొంత దూరంలో ఒన్న అడవిలోని ఒక శమివృక్షంపై దాచివేయటం అందరికి తెలిసిందే. పాండవులు అర్జునుడి గాండీవం తదితర ఆయుధాలను ఒక మూటగా కట్టి శమివృక్షం పై భాగంలో కొమ్మల గుబుర్ల మధ్య అన్యులకు ఎవ్వరికీ కనిపించకుండా పెట్టిన అనంతరం ఆయుధాల మూట కింద ఒక కొమ్మకు సమీపంలోని స్మశానం నుండి ఒక వృద్దురాలి శవం తెచ్చి వేలాడ తీస్తారు. వేలాడుతున్న శవం నుండి వచ్చే దుర్గంధం మూలంగా ఇతరులేవ్వరు కూడా చెట్టు వైపు రావటం లేదా, చెట్టుపై ఉన్న ఆయుధాల మూట గురించి కాని పట్టించుకోరన్నది పాండవుల అభిప్రాయం. పాండవులు తమ ఆయుధాల మూట కింది కొమ్మకు వృద్ధ మహిళ శవాన్ని వేలాడ దీస్తున్నప్పుడు అక్కడికి కొందరు ఆవుల కాపర్లు, గొర్రెల కాపర్లు వస్తారు. 'ఇది నూటా ఎనభై సంవత్సరాల వయస్సు ఉన్న మా తల్లి శవం,మరణించిన వారి శవాలను చెట్టు కొమ్మలకు వెలాడదీయటం తమ సంప్రదాయము, తమ పూర్వికులు కూడా ఇలా చేశేవారు' అని పాండవులు ఆవుల కాపర్లు, గొర్రెల కాపర్లతో చెప్పిన అనంతరం విరాటనగరం వైపు తరలి పోతారు.

ఉద్యోగపర్వం అంతర్గతంగా ఉన్న ప్రజాగర్ పర్వంలో విదురుడు, దృతరాష్ట్రుడి మధ్య జరిగిన సంభానకు సంబందించిన నలభయవ అధ్యాయంలో మేకల ప్రస్తావన ఉన్నది.

'మేకలు, వెండి, తేనె, ధనస్సు, పక్షి, వేదవేత్తలైన బ్రాహ్మణుడు, కుటుంబంలోని వయోవృద్దుడు, విపత్తులపాలైన కులీనుడు ఎల్లప్పుడు ఇంట్లో ఉండాలి '

'ఓ భరతుడా దేవతలు, బ్రాహ్మణులు, అతిథుల పూజ కోసం మేకలు, ఎద్దులు, గంధము, వీణ. అద్దము, తేనే, నెయ్యి, జలము, రాగితో చేసిన వంట సామాగ్రి, శంఖము,



'మేకలు, వెండి, తేనె, ధనస్సు, పక్షి, వేదవేత్తలైన బ్రాహ్మణులు, కుటుంబంలోని వయోవృద్ధులు, విపత్తులపాలైన కులీనుడు ఎల్లప్పుడు ఇంట్లో ఉండాలి..!

సాలగ్రామము, గోరోచనము ఈ వస్తువులన్నింటిని ఇంట్లో ఉంచాలని మునులు చెబుతున్నారు'.

'గొల్లలు, అజ పాలకుల (గొర్రెల కాపర్లు) నుండి పాంచాల, కేకయ మరియు మత్స్య దేశం రాజ వంశాల వారందరు కూడా పాండు పుత్రుడు యుదిష్టరుడు (ధర్మరాజు) ను గౌరవిస్తారు, ఆయన ఆదేశం కొరకు ఎదురుచూస్తున్నారు' అని సంజయుడు దృతరాష్ట్రుడికి వివరించటం గమనార్హం. అరణ్యావాసం, అజ్ఞాతవాసం ముగిసిన తరువాత పాండవ, కౌరవ పక్షాల మధ్య శాంతి చర్చలు జరపటం తెలిసిందే. దృతరాష్ట్రుడి ఆదేశం మేరకు ఆయనకు అత్యంత సన్నిహితుడైన సంజయుడు పాండవుల వద్దకు మధ్యవర్తిగా వెళ్లి చర్చలు జరుపుతాడు. తదనంతరం సంజయుడు హస్తినాపురానికి తిరిగి వచ్చి పాండవులతో జరిపిన చర్చల వివరాలను నిండు సభలో దృతరాష్ట్ర మహారాజుకు వివరిస్తాడు. ఈ సందర్భంగా దృతరాష్ట్రుడు సంజయుడితో 'అక్కడ ఎవరెవరు? ఏ ఏ రాజవశం వారు యుదిష్టురుడి ఆదేశం కోసం ఎదురుచుస్తున్నారు' అని అడుగుతాడు. దీనికి సంజయుడు సమాధానం ఇస్తూ...

'ఆగోపలావిపాలాశ్వ నందమానా యుధిష్టరం

పాంచాలః, కేకయా, మత్స్యః ప్రతినందంతి పాండవం'

అని బదులిస్తాడు. పాంచాల, కేకయ, మత్స్య దేశాల రాజ వంశాలతో పాటు గొల్లలు, అజపాలకులు (గొర్రెల కాపర్లు) యుధిష్టరుడిని గౌరవిస్తారని చెప్పటం చూస్తుంటే పాంచాల, కేకయ, మత్స్య దేశాల రాజ వంశాల స్థాయిలో గొల్లలు, అజ పాలకులు ఉన్నట్లే కదా. గొల్ల, అజ పాలకులు గౌరవిస్తారని చెప్పటం చూస్తుంటే మహా భరతం సమయంలో గొల్ల, అజ పాలకులకు సమాజంలో ఉన్న ఉన్నత స్థానం వెల్లడవుతోంది.

వ్రాత్యుల సంతతివారా ?

కురుబ, కురుమ, కురుంబార్ ప్రజలు ప్రాచీన వ్రాత్యుల ప్రతినిధులా? వేద క్రతువులను వ్యతిరేకించి స్వంత ఆలోచన, పద్ధతుల ప్రకారం జీవించిన వారే వ్రాత్యులు. వేదకాలానికి పూర్వీకులైన వ్రాత్యులు స్వేచ్ఛాయుత ప్రపంచంలో జీవించేందుకు ఇష్టపడే వారు. వైదిక క్రతువులు, విధానాలను ఆచరించేవారు కాదు. అథర్వ వేద కాలం సమయానికి వైదిక ధర్మంలో కలిసిపోయిన వ్రాత్యులకు సంబంచిన కొన్ని వర్గాల వారు ఈ నాటికి కూడా తమ ఉనికి,అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారని ప్రముఖ ఇండాలజిస్ట్ ఆస్కో పర్పోలా వాదిస్తున్నారు. అథర్వ వేదంలోని శతరుద్రీయంలో శివుడిని ఏక వ్రాత్యుడు, వ్రాత్యుల నాయకుడు అని సంభోదించటం గమనార్హం. మహారాష్ట్రలోని మల్లారి, ఖండోబా ఆరాధకులు, కర్ణాటకలోని మైలార్ ఆరాధకులు, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో మల్లన్నను పూజించే వారిలో వ్రాత్య మతారాధన ఇంకా బతికే ఉన్నదని ప్రముఖ జర్మన్ ఇండాలజిస్ట్ జి,డి.సొంతమిర్ చెప్పారు. ఈ రాష్ట్రాలలోని మైలార్, ఖండోబా, మల్లారి, మల్లన్న ఆరాధకులు దైత్యులైన మణి, మల్ల పై శివుడు లేదా మార్తాండ భైరవుడి విజయాన్ని పండుగగా జరుపుకోవటం కూడా వ్రాత్య సంప్రదాయమేనని అభిప్రాయం ఉన్నది.

వ్రాత్యులు ఎవరు? అనే అంశంపై బిన్నాభిపాయాలు ఉన్నాయి. పాశ్యాత్య



పండితులు ఇచ్చిన నిర్వచనం ప్రకారం వైదిక క్రతువులు, విధానాలు, వేదాలను వ్యతిరేకించటంతోపాటు వాటికి భిన్నంగా జీవించిన వారే వ్రాత్యులు. మగధులు వీరికి ఆశ్రయం ఇచ్చారన్నది ఇండాలజిస్టుల అభిప్రాయం. కొందరు వేద పండితులు మాత్రం వీరి అభిప్రాయంతో ఏకీభవించటం లేదు. అథర్వ వేదంలో ని పదిహేనవ కాండం వ్రాత్యుల గురించి తెలియజేస్తోంది. ఈ కాండంలో పద్దెనిమిది సూక్తులు రెండు వందలకు పైగా మంత్రాలు ఉన్నాయి. పది హేనవ కాండం వ్రాత్యుల గురించి రెండు రకాల అభిప్రాయాలను వ్యక్తం చేస్తోంది. మొదటి ఏడు సూక్తులు, (పద్నాలుగు నుండి పద్దెనిమిది వరకు ఉన్న సూక్తులు) వ్రాత్యను దేవతలకు దేవుడుగా, సృష్టికర్తగా వర్ణిస్తే ఎనిమిది నుండి పదమూడు వరకు ఉన్న సూక్తులు వ్రాత్యులను ఇల్లు, ముంగిలి లేకండా తమ ఇష్టానుసారం సంచరించే అత్యున్నత ఆధ్యాత్మిక మహానుభావులుగా అభివర్ణించాయి. వ్రాత్య ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచిపెట్టే ఉన్నత వ్యక్తి అని ప్రశంసించింది. అథర్వ ఋషి రచించిన ఈ కాండంలో ఎక్కడ కుడా వ్రాత్యులు వేదాలను పాటించే వారు అని చెప్పలేదు. వ్రాత్యులు జ్ఞానాన్ని పంచుతారని ఉన్నది తప్ప వేద జ్ఞానం అని చెప్పలేదు. దేవేంద్రుడైన ఇంద్రుడికి వ్రాత్యులకు మధ్య పలు యుద్ధాలు జరిగాయి. వ్రాత్యులు నదీ జలాలను బందించి పెడితే ఇంద్రుడు వ్రాత్యులను ఓడించటం ద్వారా జలాలకు బంధ విముక్తి కల్పించినట్లు వేదం చెబుతోంది.

అథర్వ వేదమలోని పదిహేనవ కాండములోని మొదటి మంత్రం వ్రాత్యులు ఎవరు అనేది స్పష్టం చేసింది.

'వ్రాత్య ఆసీదీయమాన ఏవ స ప్రజాపతిం సమైరయత్'

డాక్టర్ దాశరథి రంగాచార్య పై మంత్రానికి చేసిన తెలుగు అనువాదం.

'వ్రాత్యుడు ఉపనయనము మున్నగు సంస్కారములు లేనివాడు'.

ఇదిలా ఉంటే మొదటి వ్రాత్యుడు పశుపతి శివుడు అని పది హేనవ కాండం చెబుతోంది. ఈ కాండంలోని నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిదో మంత్రాలు మొదటి వ్రాత్యుడు ఎవరు, అతడు ఎం చేశాడు అనేది వెల్లడిస్తోంది.

<u>నాలుగో మంత్రం</u>

'సః అవర్ధత సః మహాన్ అ అభవత్ సః మహా-దేవః అభవత్'

అతడు పెరిగినాడు, మహానుడు అయినాడు, మహా దేవుడు అయినాడు.

<u>ఐదో మంత్రం:</u>

'స దేవానామ్ ఈశాం పరి ఐత్ స ఈశానః అభవత్'

అతడు దేవతలకు ఈశానుడు, - ఈశానుడు అయినాడు.

<u>ఆరో మంత్రం:</u>

'ఏక-వ్రాత్యః అభవత్ సః ధనుః ఆ అదత్త తత్ ఏవ ఇంద్ర-ధనుః

అతడు ఏకవ్రాతుడు అయినాడు. ధనుస్సు అందుకున్నాడు. అదే ఇంద్ర ధనుస్సు అయినది.

<u>ఏడవ మంత్రము:</u>

'నిలం అస్య ఉదరమ్ లోహితమ పృష్టమ్'

అతని ఉదరము నీలము, పృష్టము లోహితము .

<u>ఎనిమిదవ మంత్రము :</u>

'నీలేన వా ప్రియం భ్రాతృత్వం ప్రోర్ణోతి లోహితేన

ద్విషంతం విధ్యతి ఇతి బ్రహ్మవాదిన్నః వదన్తి'

ఇతడు నీలిమచే అప్రియ శత్రువును మూయుచున్నాడు. ద్వేషించువారిని లోహితమున అణచుచున్నాడనిబ్రహ్మవాదులు అనుచున్నారు.

ఈ మంత్రాలన్నీ వ్రాత్యులు శైవులు అనేది స్పష్టం చేస్తున్నాయి. ఏకవ్రాత్యుడైన శివుడు వీరికి నాయకుడు. వ్రాత్యులు పశుపతులు అనేది పదిహేనవ కాండం రెండవ పర్యాయ సుక్తంలోని పదవ మంత్రం, ఐదవ పర్యాయ సూక్తంలోని రెండు, మూడో తదితర మంత్రాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ మంత్రాలలో...

'తమ్ యజ్ఞా-యజ్ఞయమ్ చ వామ - దేవ్యం చ యజ్ఞః

చ యజమానః చ పశవః చ అను వ్యచలన్ '

అతనిని అనుసరించి యజ్ఞా యజ్ఞియము, వామ దేవ్యము, యజ్ఞము, యజమాని, పశువులు సాగినవి.

ఐదవ సూక్తంలోని

'భావః ఏనమ్ ఇషు-ఆసః ప్రాచ్యః దిశః అన్తః-దేశాత్ అను-స్థాతా అను తిష్టతి న ఏనమ్ శర్వః న భావః న ఈషానః'

బాణం విడుచు భవుడు ప్రాగ్దిశ యొక్క అంతర్దిశ అనుష్టాత అయినాడు. అతనిని శర్వుడు, భవుడు, ఈశానుడు బాధించరు.

'నాస్య పశూన్ న సమానన్ హినస్తి యః ఏవమ్ వేద'

ఇది తెలిసిన వాని పశువులను, సమానులను సంహరించరు.

<u>పద మూడవ మంత్రం :</u>

'మహా-దేవహః ఏనమ్ ఇషు-ఆసః ఊర్ధ్వాయః దిశః అన్తః-దేశాత్ అను స్థాతా

అను తిష్టతి న్ ఏనమ్ శర్వః న భవః న ఈశానః న అస్య పశూన్ న సమానన్

హినస్తి యః ఏవమ్ వేద '

ఇది తెలిసిన వానికి ఊర్ధ్వదిశ యొక్క అంతర్దిశ యందు అనుస్తాతమైన బాణము వేయు మహాదేవుడు అనుకూలుడై ఉండును. అతనిని అతని పశువులను, అతని సమానులను సంహరించకున్నాడు.

ఈ మంత్రాలలో పశువులు, పశు పాలకులు స్పష్టంగా కనిపిస్తున్నారు.

వ్రాత్య అంటే సమూహము, సంఘము, వర్గము, మనిషి, ప్రజలు అని అథర్వ వేదం చెబుతోందని అథర్వ వేదం భాష్యాకారులు అంటున్నారు. సంఘము, సమూహములో జన్మించిన వాడు వ్రాత్యుడు, ఈ సమూహాన్ని రక్షించేవాడు వ్రాత్యుడు, వ్రతాలకు కట్టుబడి ఉండేవాడు, వాటిని తుచ తప్పకుండా పాటించేవాడు వ్రాత్యుడు, వ్రతాల గురించి బోధించేందుకు ప్రయాణాలు చేసేవాడు వ్రాత్యుడు అని అథర్వ వేదం భాష్యాకారులు చెబుతున్నారు. పాశ్చ్యాత్య పండితులు వ్రాత్యులకు ప్రతికూల అర్థం

అపాదించారన్నది వీరి ఆరోపణ. 'వ్రత' అంటే నియమం, వ్రతం, అని అర్థం. దీనిని పాటించేవారు వ్రాత్యులు, ఐతే ఈ వ్రతాలు ఏమిటి? వీటిని ఎవరు రూపొందించారు ? ఈ వ్రతాలతో ఇతరులెవరికైనా అభ్యంతరం ఉండేదా ? ఇతరులు ఎవరైనా ఈ వ్రతాలను వ్యతిరేకించారా? ప్రతిఘటించారా? అనే ప్రశ్నలకు సమాధానాలు లేవు.

ద్రవిడులా?

భారతదేశంలో అత్యంత పురాతన కాలం నుండి నివసిస్తున్నవారు గొర్రెల కాపర్లు అని ఒపెర్ట్ గుస్తావ్ తన ' భారతదేశం మూలనివాసులు' పుస్తకంలో తెలిపారనేది ఇదివరకే చదివాము. భారతదేశంలో ఆర్యులకు ముందునుండే గొర్రెల కాపర్లు ఇక్కడ నివసిస్తున్నందున వీరు ద్రావిడులన్నది అతని వాదన. ఒపెర్ట్ గుస్టావ్ 1893 లో రాసిన 'భారత దేశం మూలనివాసులు' అనే పుస్తకం ముందు మాటలో భరతులు చాలాకాలం ముందే రెండు గొప్ప వర్గాలు లేదా విభాగాలుగా విడిపోయారు. వీరు తరువాతి కాలంలో కురు- పాంచాలులు, కౌరవులు- పాండవులు, ఆ తరువాత కాలంలో గౌడియన్లు-, అటుపిమ్మట కురువ లేదా కురుంబ మరియు మల్ల లేదా మళయా తదితర వర్గాలుగా గుర్తింపు పొందారన్నది ఒపెర్ట్ వాదన. పై పేర్లన్ని కూడా పర్వతాలను సూచించే ఉకారాల నుండే పుట్టుకు వచ్చాయి. వీరు ఎంత దగ్గరివారైనప్పటికి ఎప్పుడు కూడా కలిసిమెలిసి, స్నేహంతో నివసించలేదు. వీరెప్పుడు యుద్దానికి దిగకపోయినా పరస్పర అవిశ్వాసం నుండి బైట పడలేదు, ఒకరిపట్ల మరొకరికి ఉన్న అయిష్టతను తొలగించుకోలేకపోయారు. కురుబ, కురుంబ వర్గాల వారు భారతదేశ చరిత్రలో అత్యంత కీలక, ప్రభావవంతమైన పాత్రను నిర్వహించారు. భారత దేశంలోని ప్రతి ప్రాంతంలో కురుబ, కురుంబ వర్గాలకు చెందిన ప్రజలు ఇప్పటికి జీవిస్తున్నారు, ఆర్యుల రాక ముందు నుండి జీవిస్తున్నారు కాబట్టే వీరు ద్రవిడులు' అని గుస్టావ్ ఒప్పెర్ట్ ప్రకటించారు.

సంగమ సాహిత్యంలో...!

తమిళ, ద్రవిడ సంస్కృతిని ప్రతిబింబించే సంగమ సాహిత్యంలో పశువుల కాపర్లు, ముఖ్యంగా గొర్రెల కాపరులైన కురవర్, కానవార్ అనే గిరిజన తెగల గురించి ప్రధాన ప్రస్తావన ఉన్నది. క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం నుండి క్రీస్తు శకం మూడు లేదా నాల్గవ శతాబ్దానికి సంబంధించిన సంగమ సాహిత్యంలో ప్రస్తావించిన 'కురించి', 'ముల్లై' పర్వత ప్రాంతం తమిళనాడు, కర్నాటక సరిహద్దులలోని పలని, నిలగిరి, పశ్చిమ కనుమల్లో

ఉన్నది. ఈ ప్రాంతంలో ఇప్పుడు కూడా కురవర్, కానవార్ తెగల వారు జీవిస్తున్నారు. వీరి ప్రధాన వృత్తి గొర్రెల పెంపకం, తేనె సేకరణ. పశ్చిమ కనుమలలోని ఎత్తైన 'పలని' పర్వత ప్రాంతాల్లో కురించి అనే పుష్పం ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి మాత్రమె పుష్పిస్తుంది, అందుకే ఈ ప్రాంతాన్ని కురించి అని పిలుస్తారు. ఒగ్గు తదితర కథనాల ప్రకారం బీరప్ప దేవుడు, ఆయన తల్లి సూరమ్మ, తండ్రి బరమదేవుడు పశ్చిమ కనుమల్లో జీవించే వారనేది మనందరికి తెలిసిందే. పశ్చిమ కనుమల్లోని మైదాన ప్రాంతంలో (ముల్లై) జీవించే పశువుల కాపర్ల ప్రధాన వృత్తి గొర్రెల పెంపకం అయితే వీరిలో కొందరు అడవినుండి తేనె సేకరించటం ద్వారా తమ పొట్ట పోసుకుంటున్నారు. ముల్లై అంటే మల్లె పువ్వు అని అర్థం. పశ్చిమ కనుమలలోని మైదాన ప్రాంతంలో మల్లెలు విపరీతంగా పూస్తాయి అందుకే దీనికీ పేరు వచ్చింది. సంగమ సాహిత్యంలో ప్రస్తావించిన కురువ వర్గమే నేటి కురుమ, కురుబ, కురుంబార్ కులం ప్రజలు. పశ్చిమ కనుమలలోని మైదాన ప్రాతంలో మూడు రకాల పశువుల కాపర్లు జీవించే వారని సంగమ సాహిత్యం చెబుతోంది. వారు ఆవులను పోషించే వారు, గేదెలు (బర్రెలు) పోషించే వారు, గొర్రెలను పోషించే వారు.

సంగమ సాహిత్యంలోని ఒక 'అకం'లో గొర్రెల కాపరి (ఇతయియాన్) వివరణ ఉన్నది. గొర్రెల కాపరి తన తలలో మల్లెలు ధరిస్తాడు, అవి చుక్కల మాదిరిగా మెరుస్తుంటాయి. అర్ధ రాత్రి అవుతోంది, అతను ధీర్గమైన పెద్ద, పెద్ద అరుపులతో తన గొర్రెలు, పోటేల్లను నక్కలు, తోడేళ్ళబారి నుండి కాపాడుతుంటాడు. అతను గొంగలిని కొప్పెరగా చేసుకుని తలపై పెట్టుకుని తన చేతులను మంటతో కాచుకుంటున్నాడు'ని ఈ ఆకం చెబుతోంది. సంగమ సాహిత్యంలోని 'నర్రినై' లోని గేయాలు పశువుల కాపర్లు తమ గొర్రెలు, మేకలు, ఆవులను అడవి నుండి గ్రామానికి తోలుకువస్తున్నప్పటి వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించాయి. ఒక గేయంలో 'ఆవుల మెడలకు కట్టిన గంటల మృదు మధుర శబ్దం గ్రామమంతా వ్యాపిస్తోంది, గ్రామ మధ్యలో నుండి వేణు నాదం వినిపిస్తోంది' అని వర్ణించడం గమనార్హం. అడవులలోనే తమ ఆవులు, గొర్రెలు, మేకలను మేపుకుని జీవించే పశువుల కాపర్లను కల్లాకోవలర్ అని పిలుస్తారాని నర్రినై చెబుతోంది. గ్రామాల్లో ఉంటూ ఆవులు, గొర్రెలు, మేకలను మేపుకుని జీవించే పశువుల కాపర్ల గురించి 'పెరున్పానార్రుప్పాతై'లో మంచి వివరణ ఉన్నది. పశువుల కాపర్లు నివసించే గ్రామాలను వరియప్పు అని పిలిచేవారు. వరియప్పులో ఆవులు, గొర్రెలను ముళ్ళ పొదలతో చేసిన దొడ్డిలో నిలిపే వారు. ముళ్ళు ఆవులు, గొర్రెలకు గుచ్చుకోకుండా

వాటికి పేడ రాసేవారు. పశువుల కాపర్లు ఆవులు, గొర్రెల పెంపకంతో పాటు వ్యవసాయం కూడా చేసేవారు. ఆవులు, గొర్రెల తదితర పశువుల పెంపకం ప్రధాన వృత్తి అయినప్పటికీ వారు ఈ పనితో పాటు చిరు ధాన్యాలను పండించేవారని పెరున్పానార్రిప్పుత్తై చెబుతోంది. ముల్లై ప్రాంతానికి చెందిన పురుషులను ఆయర్, ఇత్తైయార్ అని పిలిస్తే మహిళలను ఆయిచ్చియర్, ఇత్తైఇచ్చియర్ అని అంటారు. ఆయర్ వర్గానికి చెందినవారు రాజ్యాలు ఏలినా తరువాత వారు ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలయ్యారు. ఆయర్ వర్గానికి అభిర వర్గానికి సంబంధం ఉన్నదని 'అభిరుల చరిత్ర, సంస్కృతి' అనే పుస్తకం రచయిత సూర్యవంశి అభిప్రాయపడ్డారు. అభిరుల మాదిరిగానే ఆయర్ వర్గం కూడా యక్షులను పూజించటంతో పాటు ఎద్దుల పందాలు నిర్వహించేవారు. ఎద్దుల పందాలు ముగిసిన అనంతరం యువతీ యువకులు, కరువై నృత్యం చేసేవారు. ఆయర్ పశు పాలకుల గురించి టోలేమి (గ్రీకు దేశానికి చెందిన ఈజిప్ట్ గణిత శాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త, తత్వవేత్త మరియు భూగోళ శాస్త్రవేత్త Claudius Ptolemy) తన పుస్తకంలో 'అరిఒరి' అని పేర్కొనటం గమనార్హం. ముల్లై లోని ఇత్తైయర్ అనే మరో వర్గం వారు కూడా పశుపాలకులే. ముల్లై, కురుంచి ప్రాంతాలకు చెందిన పశు పాలకులు ఇచ్చి, పుచ్చుకునే ధోరణితో వ్యవహరించేవారు. ఎద్దుల పోటీ సమయలో ముల్లై ప్రాంతానికి చెందిన్ కోవలర్, కురుంచి ప్రాంతానికి చెందిన కురవర్ వర్గం ప్రజలు సమిష్టిగా ఉత్సవాలు నిర్వహించుకుని ఆనందించే వారు. ఎద్దుల పోటిలో ఏ వర్గం గెలిచినా ఇరు పక్షాలు కలిసి నృత్యంతో కూడిన విజయోత్సవం జరుపుకునేవారు. ముల్లై, కురుంచి ప్రాంతాల పశుపాలకుల విడిది గురించి 'మలైపతుకతాం' అనే తమిళ పుస్తకంలో మంచి వర్ణన ఉన్నది. 'పశుపాలకుల వద్ద గొర్రె తోలుతో చేసిన దుప్పట్లు ఉన్నాయి. వీటిని ధరించిన పశుపాలకులు అడవి జంతువులను దూరంగా ఉంచేందుకు పెట్టిన మంట చుట్టు చేరారు' అని మలైపతుకతాం వివరించింది. ముల్లై, కురుంచి ప్రాంతంలో నివసించే పశుపాలకులు ఇతరుల పశువులను అపహరించటం ద్వారా తమ ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నించేవారు. పశువుల అపహరణ మూలంగా ఇరు వర్గాల మధ్య తరచు ఘర్షణ, కొట్లాటలు జరిగేవి. బీరప్ప దేవుడు కూడా తన పశు సంపదను కాపాడుకునేందుకు పోరాడటం తెలిసిందే. గొర్రెల మందను కాపాడుకునేందుకు బీరప్ప పెళ్లి పీటలపై నుండి లేచి వెళ్ళటం విదితమే. మేనమామ జరిపించిన దాడి నుండి గొర్రెల మందను కాపాడుకునేందుకు బీరప్ప తన కత్తికి కామరతికి పెళ్లి చేయాలని ఆదేశించటం మనందరకూ తెలిసిందే.

కురించి ప్రాంతానికి చెందిన పశుపాలకులు సియోన్, మురుకన్ (ఎరుపు, యువ) దేవుడిని పూజిస్తే ముల్లై ప్రాంతం పశుపాలకులు మాయెన్ అనే దేవుడిని పూజించే వారు. సియోన్ లేదా మురుకన్ పర్వతాల దేవుడు లేదా పర్వతాలపై నివసించే దేవుడు. నృత్యం అంటే ఏంతో ఇష్టపడే మురుకన్ కదంబ చెట్టుతో సమానం లేదా అతను కదంబ చెట్టులో నివసిస్తాడన్నది వీరి విశ్వాసం. ప్రజలను ఆదుకునేందుకు మురుకన్ స్వర్గం నుండి దిగివచ్చి కదంబ చెట్టులో నివసిస్తాడు. కదంబ పుష్పాలతో చేసిన పూలదండను ధరించే మురుకన్ అడవిలోని ప్రతి చెట్టు, పుట్ట, ఫలము, పుష్పము, కాలువ, నది, సరస్సు, పొదల్లో ఉంటాడన్నది స్థానిక ప్రజల విశ్వాసం. కురించి ప్రాంతానికి చెందిన నాయకుడు ధరించే ఈటెను కలిగి ఉండే మురుకన్ ప్రజలు నివసించే గ్రామాలలో సైతం ఉంటాడన్నది ప్రజల ప్రగాడ విశ్వాసం. కురించి ప్రాంతం ప్రజలు మురుకన్ కు ప్రధానంగా చిరుధాన్యాలు, పువ్వులు, పొటేలు మాంసం సమర్పించుకుంటారు. మురుకన్ పతాకంపై కోడి పుంజు లేదా నెమలి బొమ్మ ఉంటుంది. మురుకన్‌కు ఇద్దరు భార్యలు, మొదటి భార్య పేరు తేయ్వయాని (దేవయాని), రెండో భార్య పేరు వల్లి. మురుకన్‌కు వల్లి అంటే అమితమైన ప్రేమ. దేవయాని ఉన్నత వర్గానికి చెందిన మహిళ, వల్లి పర్వత ప్రాంతానికి చెందిన కురవ మహిళ. దక్షినాదిలోని ప్రజలు పూజించే మల్లన్న, మల్లికార్జునుడు తదితర దేవుళ్ళకు ఇద్దరు భార్యలు ఉండటం విదితమే. మొదటి భార్య ఉన్నత వర్గం, రెండో భార్య బడుగు వర్గాల మహిళ కావటం గమనార్హం. మల్లన్నకు కూడా ఇద్దరు భార్యలు, ఒకరు వ్యాపారి కూతురు బలిజ మేడాలమ్మ, రెండో భార్య గొల్ల కేతమ్మ. మహారాష్ట్ర, కర్ణాటకలో పూజించే ఖండోబా లేదా మైలార్ మల్లన్న మొదటి భార్య బలిజ వ్యాపారి కుతురైతే రెండో భార్య కురుబ, కురుమ, ధనగర్ వర్గానికి చెందిన బనై లేదా కురుబాటవ్వ. సియోన్ లేదా మురుకన్ కాలక్రమంలో ఈటె, డోలుతో పలువురు రాక్షసులపై విజయం సాధిస్తాడు. ఈ పరిణామ క్రమంలో మురుకన్ పరమ శివుడి పుత్రుడైన స్కందుడిగా రూపాంతరం చెందటంతో పాటు ఆరుగురు కృత్తికల కుమారుడవుతాడు. అంతేగాక అతడిపై పర్వత రాజు కూతురు పార్వతి కుమారుడిగా కూడా ముద్ర పడుతుంది.

ముల్లై ప్రాంతానికి చెందిన పశువుల కాపర్ల దేవుడి పేరు మాయోన్. మాయోన్ పదానికి నల్లని, ముదురు ఆకుపచ్చ లేదా ముదురు నీలం రంగువాడు అని అర్థం. కొండలు, గుట్టల్లో నివసించే 'కాన' వర్గం పశువుల కాపర్లు తమ నృత్యాన్ని మురుకన్, వల్లికి అంకితం చేస్తే అయిచ్చియార్ వర్గం పశువుల కాపర్ల మహిళలు మాయోన్, అతని భార్య నప్పిన్నై గౌరవార్థం 'కురవై' నృత్యం చేస్తారు. గొర్రెల కాపరి అయిన మాయోన్‌కు

నెతుమాల్, తిరుమాల్ అనే మరో రెండు పేర్లు కుడా ఉన్నాయి. గొర్రెల కాపరి అయిన మాయోన్ వేణు గానం వినిపిస్తూ గొర్రెల కాపర్ల మహిళలతో క్రీడిస్తాడు, నృత్యం చేస్తాడు. ముల్లై ప్రాంతానికి చెందిన మాయోన్ కురించి ప్రాంతంలో సియూన్ లేదా మురుకన్‌గా మారి ఉంటాడు. మురుకన్, మాయోన్ ఇద్దరు కూడా పశువుల కాపర్ల దేవుళ్ళు. ఇద్దరి మధ్య ఎన్నో పోలికలు ఉన్నాయి. లోతుగా అధ్యయనం చేస్తే ఈ ఇద్దరు దేవుళ్ళు ఒకరేనని అభిప్రాయం కలుగుతుంది. ముల్లై ప్రాంతానికి చెందిన మాయోన్ కురించి ప్రాంతంలో మురుకన్ లేదా సియూన్‌గా మారి ఉంటాడు, కురించి ప్రాంతానికి చెందిన మురుకన్ ముల్లై ప్రాంతానికి చెందిన సియూన్‌గా రూపాంతరం చెంది ఉంటాడు. గిరిజనులైన ఈ పశువుల కాపర్లు, గొర్రెల కాపర్ల ఇద్దరు దేవుళ్ళు మురుకన్, మాయోన్ తరువాత కాలంలో స్కందుడు, కార్తికేయుడు, కృష్ణుడిగా రూపాంతరం చెందటం లేదా గుర్తింపు పొంది ఉంటారు లేదా గుర్తించబడ్డారు. పశువుల కాపర్ల దేవుడు మొదట కృష్ణుడుగా మారటం, ఆ తరువాత కృష్ణున్ని విష్ణు అవతారం చేయటం, అందులో నుండి వైష్ణవం పుట్టుకు రావటం తరువాత జరిగిన పరిణామక్రమం అయి ఉంటుంది. మురుకన్, మాయోన్ మధ్య ఎన్నో సారుప్యాలు, సంబంధాలు కనిపిస్తాయి. ఈ రోజుకి కూడా ప్రసిద్ధ ప్రాంతీయ సంప్రదాయాలు, గిరిజన, వెనుక బడిన తదితర నిమ్న లేదా కింది కులాల నమ్మకాలు, భావనలు, మౌఖిక సంప్రదాయాలు మురుకన్, సుబ్రమణ్యాన్, స్కంద, కార్తికేయ మరియు మాయోన్, కృష్ణ, వాసుదేవ, తిరుమాల్, నేతియూన్ ప్రారంభ దశలను ప్రతిబింబించటం గమనార్హం.

పాలై ప్రాంతానికి చెందిన దేవత పేరు కొర్రవై. ఈ దేవత నివాసం వేప చెట్టు. మలవార్ వర్గం వారు ఆవుల కోసం ప్రత్యర్థులపై దాడులు జరిపిన అనంతరం ఈ దేవతకు ఆవును బహుకరించటం లేదా బలి ఇవ్వటం జరిగేది. మగ జింకపై సవారి చేసే కొర్రవై దేవత వేటకత్తే. పరస్పరం దాడులు జరుపుకునే తెగల దేవతైన కొర్రవై మురుకన్‌కు తల్లిగా వ్యవరిస్తుంది. కొర్రవై దేవతకు దక్కన్ పీఠ భూమితో పాటు దక్షిణ భారత దేశానికి చెందిన పలువురు దేవతలతో సారూప్యతలు ఉన్నాయి. ముఖ్యంగా బీరప్ప దేవుడిని పెంచి పోషించే అక్క మహంకాళి, మాయవ్వకు కొర్రవై దేవతతో అత్యంత సమీపసారుప్యత ఉన్నది. కొర్రవై దేవత కూడా మురుకన్‌ను పెంచి పోషిస్తుంది. అక్క మహంకాళి లేదా మాయవ్వ వేటకు వెళ్ళినప్పుడు బీరప్ప ను అడవిలో చూసి పెంచుకోవటం తెలిసిందే. ఈ అత్యంత సమీప సారుప్యాన్ని చూస్తుంటే కొర్రవై, అక్క మహంకాళి లేదా మాయవ్వ ఒక్కరేననే అనుమానం కలుగక మానదు. కొర్రవై దేవత

తెలుగు, కర్ణాటక, మహారాష్ట్రలోని అక్క మహంకాళి, మాయవ్వ గా రూపాంతరం చెందిందా? ఈ లెక్కన మురుకన్ మల్లన్న దేవుడు ఒకరేనా? మురుకన్ తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్రల్లో మల్లన్నగా రూపాంతరం చెందారా? సంగమ సాహిత్యంలోని కురవ ప్రజలు మురుకన్, అతని కురవ భార్య వల్లిని పూజిస్తే, కురుబ వర్గం ప్రజలు మైలార్ మల్లన్న అతని కురుబ భార్య కురుబట్టయ్యవ్వను పూజించటం గమనార్హం.

సిలప్పధికారంలో

తమిళ ప్రాంతానికి చెందిన ఐదు మహా కావ్యాల్లో సిలప్పాధికారం ఒకటి. క్రీస్తు శకం **200-500** సంవత్సరాల మధ్య కాలంలో ఇలంగో అడిగల్ అనే జైన సన్యాసి రచించిన ఈ గొప్ప కావ్యంలో కురువలు, గొల్లల పాత్ర కూడా ఏంతో ప్రధానమైంది. కోవలన్, కన్నగి కథ కొండ కురువల ప్రస్తావనతో ప్రారంభం అవుతుంది. కరికాలై చోళ మహారాజు రాజధాని పుహార్ అనే సముద్ర తీర నగరం. ఈ నగరానికి చెందిన కన్నగి,కోవలన్ పెళ్లిచేసుకుంటారు. వీరు వైశ్య వర్గానికి చెందిన వారు. కోవలన్ కొంత కాలం తరువాత మాధవి అనే వేశ్య మహిళా వ్యామోహంలో పడిపోయి తన ఆస్తిపాస్తుల్లను పోగొట్టుకుంటాడు. కోవలన్ సర్వస్వం కోల్పోయిన అనంతరం భార్య కన్నగి వద్దకు వెళతాడు. మాధవితో ఉండటం అనైతికమని గ్రహించిన కోవలన్ పుహార్ నగరాన్ని వదిలివేసి కన్నగితో మదురై నగరానికి వెళ్లి పోతాడు. కన్నగి ఇచ్చిన కాలి కడియాన్ని విక్రయించి ఆసొమ్ముతో వ్యాపారం చేసి తిరిగి ఆస్తిపాస్తులను సంపాదించుకోవాలన్నది కోవలన్ ఆలోచన. ఇలంగో అడిగల్ ఈ కథలో దేశకాల పరిస్తితులకు అద్దం పట్టాడు. కన్నగి, కోవలన్ పుహార్ నగరం నుండి బైటికి వచ్చినప్పుడు అక్కడ మేకలు, జడల బర్రెలు, హంసలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయని రచయిత ఎలాంగో వివరించాడు. పుహార్ లో గొర్రెల కాపర్లు నివసించే వారనేందుకు ఇది నిదర్శనం. కోవలన్ మదురైలో కన్నగి ఇచ్చిన కడియం విక్రయించేందుకు ప్రయత్నిస్తాడు. స్తానిక రాజు భార్య కాలి కడియం కూడా కన్నగి కడియం మాదిరిగానే ఉంటుంది. మదురై ఆస్థాన కంసాలి దీనిని అపహరించి ఆ నేరాన్ని కోవలన్‌పై వేస్తాడు. కంసాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాణి కాలి కడియం అపహరించారనే ఆరోపణతో కోవలన్ కు స్థానిక రాజు పాండ్యన్ మరణ శిక్ష విధిస్తాడు. తన భర్తను అన్యాయంగా చంపినందుకు ఆగ్రహించిన కన్నగి మదురై నగరం మంటల్లో భస్మీపటలమైపోవాలని శపిస్తుంది. మదురై నగరం భస్మీపటలం కావాలని

శపించిన తరువాత కన్నగి మలైనాడు అటవీ ప్రాంతానికి వెళ్లి వెంగై చెట్టు కింద నిలబడుతుంది. ఇంద్రుడు అక్కడికి పుష్పక విమానలో కోవలన్ తో వచ్చి కన్నగిని తీసుకొని వెళతాడు. ఇదంతా చుసిన కురవలు రాజ్యాన్ని త్యజించి ఋషిగా జీవిస్తున్న కుధక్కోచేరల్ వద్దకు వచ్చి ఒక పతివ్రతా స్త్రీ అరణ్యంలోని వెంగై చెట్టు వద్దకు వచ్చి దేవతల రాజు ఇంద్రుడు తెచ్చిన పుష్పక విమానంలో తన భర్తను కలుసుకుని వెళ్ళిపోయిందని చెప్పటంతో సిల్పాదికారం కావ్యం ఊపిరి పోసుకుంటుంది. అప్పుడు అక్కడే ఉన్న ప్రముఖ తమిళ కవి సాత్తన్ 'ఇది ఎలా జరిగిందో తనకు తెలుసు' అని చెబుతాడు. సాత్తన్ సలహా మేరకు కోవలన్, కన్నగి కావ్యం రాసేందుకు 'ఎలాంగో' సిద్దపడతాడు.

కోవలన్, కన్నగి మధురై నగర పొలిమేరలలో తల దాచుకునేందుకు ఒక గొల్ల మహిళ 'మాదారి' ముందుకు వస్తుంది. మాదారి తన కూతురు ఐయయ్ ను కన్నగి కి సేవ చేసేందుకు నియమిస్తుంది. రచయత చేసిన మాదారి ఇంటి వర్ణనలో గొల్ల వారి ఇల్లు ఎలా ఉంటుందనేది అద్దం పట్టినట్లు చూపించారు. మదురై రాజు పాండ్యన్ తప్పుడు ఆరోపణతో కోవలన్ శిరచ్చేధం చేయించారనే సమాచారాన్ని కూడా మాదారి మోసుకు వస్తుంది. కోవలన్ శిరచ్చేధనం, కన్నగి శాపం మూలంగా మదురై నగరం భస్మీపటలం కావటం తదితర పరిణామాలతో ఆందోళన చెందిన మాదారి ఆత్మహత్య చేసుకుంటుంది. సిలప్పదికారంలో 'కుదం కుండ'నృత్యం, కురవై అనేవి రెండు ప్రధాన నృత్యాలు. కుదంకుండ నృత్యం పశు పాలకులది. కురవై నృత్యం కురువలది. విష్ణు



గోపాలకృష్ణుడి అవతారంలో చేసే మూడు నృత్యాలలో కురవై నృత్యం ఒకటి అని సిలప్పధికారం విశ్లేషకులు చెబుతున్నారు

సిలప్పాధికారంలో కురవల నృత్యంపై 'కునరక్కు్రవై' పేరుతొ ప్రత్యేక విభాగం ఉన్నది. కునరక్కు్రవైలో కురవ యువతులు పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. వెంగై చెట్టు వద్ద నిలబడిన కన్నగి తమ ఇష్ట దైవమైన కుమరన్ ప్రేమించి పెళ్లి చేసుకున్న వల్లి లా ఉన్నదంటూ పాటలు పాడుతారు. కన్నగి తాము చూస్తుండగానే పుష్పక విమానంలో ఇంద్రుడితో కలిసి వచ్చిన తన భర్త కోవలంన్‌తో స్వర్గానికి వెళ్లి పోయిందనేదివారు తమ పాటల ద్వారా తెలపటం గమనార్హం. మరో పాటలో వల్లి కురవల కూతురు అని చెబుతూ మురుగన్ ఆమెను వెంటనే పెళ్లి చేసుకోవాలని వారు కోరుతారు. వల్లి కురవ వనిత, కురవ కులానికి చెందిన వల్లి ద్వారా తాము మీ రెండు పాదాలు, ఆరు ముఖాలను పూజిస్తున్నామని కురవలు పాటలో చెబుతారు.

నయనార్లు



తమిళనాడులో వైష్ణవ శైవ భక్తి ఉద్యమం ప్రారంభం కావటానికి అలవార్లు, నయనర్లు ప్రధాన కారణం. అలవార్లు విష్ణు భక్తిని ప్రచారం చేస్తే నాయనార్లు శివభక్తిని పంచి పెట్టారు. ఆరవ శతాబ్దం నుండి ఎనిమిదవ శతాబ్దం వరకు అంటే దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు అరవై మూడు మంది నయనార్లు శివుడి పై కవితలు రాయటంతో పాటు వాటిని పాడడం ద్వారా శివ భక్తిని ప్రచారం చేశారు. మొదట సుందరార్ అనే నయనార్ అందరు నయనార్ల పేర్లను, వారు రాసిన భక్తి పాటలను సంకలనం చేశారు.

అరవై మూడు మంది నయనార్ లలో కురుంబ నయనార్ ఇరవై రెండవ వాడు. నయనార్లుగా ప్రాముఖ్యత పొందిన వారిలో అన్ని కులాలకు చెందిన వారున్నారు. గొర్రెల కాపర్ల కులానికి చెందిన పెరుమిజలై కురుంబ నయనార్ తమిళనాడులోని పుదుకోట్టై జిల్లాలోని పెరుమనల్లుర్ లేదా దేవమలై అని పిలిచే పెరుమిజాలై గ్రామలో జన్మించారు.

కురుంబ అంటే గొర్రెల కాపర్లు అని అర్థం. కురుంబ నయనార్ స్వగ్రామంలో నేటికి అతను పుట్టిన రోజు అంటే తమిళ నెల అది - చితిరై నక్షత్రం రోజు గురు పూజా కార్యక్రమం నిర్వహిస్తారు. సుందరార్ నయనార్‌కు సమకాలికుడైన కురుంబ నయనార్ శివ భక్తికి మారుపేరు. సుందరార్ ను గురువుగా భావించే కురుంబ నయనార్ పంచాక్షరి, తిరుతొండపతికం పఠనంలో సిద్ధహస్తుడు. తిరుతొండ పతికం సుందరార్ రచించిన తిరుతొండ తొగ్గైలో భాగం. సుందరార్ తిరువారూర్ దేవాలయంలోని అరవై మూడు మంది నయనార్ లను ప్రశంసిస్తూ రాసిందే తిరుతొండ తోగై. కాలక్రమంలో అష్ట సిద్ధులను (ఎనిమిది రకాల యోగ సంబంధ శక్తులు) సాధించిన కురుంబ నయనార్ తన గురువు సుందరార్ పవిత్ర తిరువంచికులం కు వెళ్లి శివ సమాధి పొందనున్నట్లు యోగ శక్తి ద్వారా ముందే తెలుసుకుంటాడు. గురువు సుందరర్ పరమపదించిన అనంతరం తాను బతకలేనని భావించిన కురుంబ నయనార్ సుందరార్ మరణానికి ముందే శివ సమాధి పొందుతాడు.

మేకల బెంచి, రాతి పై చెక్కిన చిత్రాలు (Rock Cut Paintings)

రాయలసీమ, కర్నూలు జిల్లాలోని కుందు నది లోయ ప్రాంతంలో భోగేశ్వరం దేవాలయాలకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతంలో రాతిపై చెక్కిన అనేక చిత్రాలు, రాతి రాతలు ఉన్నాయి. కొత్త రాతి యుగం (నియోలితిక్) , సున్నపురాతి యుగానికి (చాకోలితిక్) చెందిన ప్రజలు ఇక్కడికి చేరుకునే సమయానికే ఈ ప్రాంతంలో రాతి యుగానికి (మెసోలితిక్) చెందిన ప్రజలు అంటే వేట ద్వారా ఆహార పదార్థాలను పోగు చేసుకుని జీవించే ప్రజలు ఉన్నట్లు దాఖలాలు లభించాయి. కర్నూలు-బళ్లారి దారిలో ఆస్పరి పట్టణం సమీపంలోని 'మేకల బెంచి' వద్ద రెండు వందల రాతి రాతలు ఉన్నాయి. మేకలను మేపుకుని జీవించే వారు ఆ ప్రాణంలో అధికంగా ఉండటం వల్లనే దీనికి ఈ పేరు వచ్చిందని అంటారు. దక్షిణ భారత దేశంలో ఈ రెండు యుగాలకు చెందిన ప్రజల సాంస్కృతిక సంబందాలు క్రీస్తు పూర్వం 1800 సంవత్సరంలో ఏర్పడినట్లు పరిశోధకులు భావిస్తున్నారు. దక్కను పీఠభూమి ప్రాంతంలో గొర్రెలు, మేకల పెంపకందారుల గురించి తెలుసుకునేందుకు ఇది ఏంతోఉపయోగపడుతుంది.

తమిళనాడు నిలగిరి జిల్లాలోని వేల్లెరి కొంబైలో క్రీస్తు పూర్వం వెయ్యి నుండి ఐదు వందల సంవత్సరాల పూర్వం నాటి రాతి చిత్రాలు ఉన్నాయి. ఇవి కనీసం మూడువేల సంవత్సరాలు పాతవి అంటే నియోలిథిక్ కాలానికి చెందినవని భారతీయ చరిత్ర,

సంస్కృతి పత్రిక 2018 సెప్టెంబర్ లో విడుదల చేసిన తమ 29వ సంచికలో పేర్కొనటం గమనార్హం. అమెరికాకు చెందిన ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ అల్లెన్ జాకెరేల్ 1984లో ఈ రాతి చిత్రాలు కురుంబ జాతి వారు వేసినవని ప్రకటించారు. ఇవి తమ పూర్వీకులు వేసిన చిత్రాలని స్థానిక కురుంబ వర్గం ప్రజలు చెబుతుంటారు. నియోలిథిక్ కాలంలో కర్నాటకకు చెందిన పశువుల కాపర్లు పశువులను మేపెందుకు ఇటువైపు వచ్చినప్పుడు ఈ రాతి చిత్రాలను వేసి ఉంటారని తమిళనాడుకు చెందిన పురావస్తు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఈ రాతి చిత్రాలు తమ పూర్వీకులవని 'ఎలుతుపరై' అని పిలిచే స్థానిక కురుంబ వర్గం ప్రజలు భావిస్తారు. కురుంబ ప్రజలు పండుగల సమయంలో తమ ఇళ్ళకు సున్నం వేసిన అనంతరం గోడలపై గీచే చిత్రాలకు 'ఎలుతు' చిత్రాలకు ఏంతో సారుప్యత ఉండటం గమనార్హం. కురుంబ ప్రజలు అనారోగ్యానికి గురైన వారి ఒంటిపై కుడా ఇలాంటి చిత్రాలు వేస్తారు. ఈ చిత్రాలు వేయటం వలన రోగాలు త్వరగా నాయమవుతాయన్నది వారి విశ్వాసం.

జెండ్ అవెస్తా

క్రైస్తవ మతం పుట్టుకకు చాలా కాలం ముందే పార్సీలు తమ వాయు దేవుడిని మంచి గొర్రెల కాపరి' అని పిలుచుకునే వారు. క్రైస్తవులు తమ దేవుడి బిడ్డ జీసస్ ను మంచి గొర్రెల కాపరి అని పిలుచుకోవటం తెలిసిందే. పార్సీల మత గ్రంతమైన జెండ్ అవేస్తాలో పలు చోట్ల గొర్రెలు, గొర్రెల కాపర్ల ప్రస్తావన ఉన్నది. గొర్రెలు, ఆవులు, ఎద్దుల కొనుగోలు ఒప్పందాలకు సంబందించిన చర్చ ఉన్నది. గొర్రెల కాపరి కుక్క మరణించటం వలన ఎంత మందికి మైల తగులుతుందని స్పితమ్ జరతుస్త్ర అడిగితే పార్సీల దేవుడైన ఆహుర మజ్దా సమాధానం ఇస్తూ ఏడుగురికి మురికి తగులుతుందని జెండ్ అవెస్తా లోని వెండిదాద్ లో తెలిపారు. పార్సీలు వాయు దేవుడిని రామ హ్వాస్త్ర అని కుడా పిలుస్తారు. రామ అవేస్త్ర అంటే మంచి పచ్చిక బైల్లు ఉండే విశ్రాంతి స్థలాల దేవుడి అని అర్థం. మేఘాలను అవులుగా భావించే పార్సీలు వాయు దేవుడిని 'మంచి గొర్రెల కాపరి' అని పిలుచుకుంటారు. పార్సీల మరో దేవుడు 'మిత్ర' విశాల పచ్చిక బైళ్ళ దేవుడు. అందుకే విశాల పచ్చిక బైళ్ళ దేవుడైన మిత్ర కు మంచి గొర్రెల కాపరైన వాయువు స్నేహితులన్నది వారి విశ్వాసం.

మంత్ర విద్యతో రోగాలను నయం చేసే వ్యక్తికి గొర్రెను ఇవ్వటం ద్వారా చెల్లింపులు చేయవచ్చునని జెండ్ అవెస్తా చెప్పింది. పార్సీలు ఆవు పాలతో పాటు గొర్రె, మేక పాలను

పార్సీలు ఆవు పాలతో పాటు గొర్రె, మేక పాలను కూడా పితికే వారు. బాలింతలకు గొర్రె , మేక పాలు తాగించేవారు. పాడెను మోసిన వారు గొర్రె లేదా ఎద్దు మూత్రంతో స్నానం చేయటం ద్వారా తమను తాము పరిశుద్ధం, పవిత్రం చేసుకోవాలని ఆహుర మజ్దా పార్సీలను ఆదేశించటం గమనార్హం.

కూడా పితికే వారు. బాలింతలకు గొర్రె , మేక పాలు తాగించేవారు. పాడెను మోసిన వారు గొర్రె లేదా ఎద్దు మూత్రంతో స్నానం చేయటం ద్వారా తమను తాము పరిశుద్ధం , పవిత్రం చేసుకోవాలని ఆహుర మజ్దా పార్సీలను ఆదేశించటం గమనార్హం. శవ యాత్ర జరిగిన ప్రాంతాన్ని శుద్ధి చేసిన తరువాతనే అక్కడి నుండి గొర్రెలు, మేకలను తీసుకుపోవాలని జెండ్ అవెస్తా పార్సీలను ఆదేశించింది. గొర్రెలకు కాపలాగా ఉండే జాగిలాన్ని చంపటాన్ని నేరంగా పరిఘణించిన జెండ్ అవెస్తా ఈ చర్యకు పాల్పడిన వారికి కఠిన శిక్షను విధించింది. గొర్రెలు, మేకలను కాపలా కాచే కుక్క లేదా జాగిలాన్ని నిరర్ధకం చేయటం మూలంగా అది సకాలంలో మొరగకపోవటం వలన నక్కల ద్వారా గొర్రెలు, మేకలకు జరిగే నష్టాన్ని పూడ్చే ఏర్పాటు కూడా జెండ్ అవేస్తాలో పొందుపరిచారు. జాగిలాన్ని నిరర్ధకం చేసిన వ్యక్తి ఈ నష్టాన్ని భరించవలసి ఉంటుందని ఆహుర మజ్ద స్పష్టం చేశారు. గొర్రెలను కరిచే జాగిలాలకు కూడా జెండ్ అవేస్త శిక్ష ఏర్పాటు చేసింది. గొర్రెలను చంపే వారికి, గాయ పరిచే వారికి కూడా అవెస్తాలో శిక్షలు విధించారు. జెండ్ అవెస్తా ప్రకారం ఒక మనిషిని హత్య చేస్తే తొంబై కొరడా దెబ్బల శిక్ష విధిస్తారు, ఐతే గొర్రెల కాపరి జాగిలానికి పాచిపోయిన లేదా చెడు ఆహారం పెట్టే వారికి రెండు వందల కొరడా దెబ్బల శిక్ష విధించారు. గొర్రెల కాపరి జాగిలాన్ని చంపిన వారికి ఎనిమిది వందల కొరడా దెబ్బల శిక్ష విధించాలని జెండ్ అవెస్తా దేవుడు ఆహుర మజ్దా ఆదేశించారు.

హిందూ మతంలోని యముడి లాంటి దేవుడు పార్సీ మతంలో కూడా ఉన్నాడు. పార్సీలు అతన్ని 'యిమ' అని పిలుస్తారు. జెండ్ అవెస్తా ప్రాకారం యిమ ఒక పెద్ద గొర్రెలకాపరి. పార్సీల జోరాస్ట్రియన్ మతం ప్రకారం వారి దేవుడైన ఆహుర మజ్దా సృష్టించిన మొదటి మానవుడు జరతుస్త్ర. జరతుస్త్ర తన దైవమైన ఆహుర మజ్దతో మాట్లాడుతూ 'మీరు నా కంటే ముందు సృష్టించిన మొదటి వ్యక్తి ఎవరు అని ప్రశ్నిస్తాడు. దీనికి ఆహుర మజ్దా సమాధానం ఇస్తూ ' మొదటి గొర్రెల కాపరి అయిన యిమను

సృష్టించాను' అని చెబుతాడు. పార్సీల మత గురువుగా ఉండేందుకు యిమ అయిష్టత తెలిపిన తరువాతనే నిన్ను సృష్టించాను అని ఆహుర మజ్దా జరతుస్త్రతో చెప్పాడు. యిమ పార్సీ మతస్తుల సృష్టి కార్యక్రమం బాధ్యత నిర్వహించే దేవుడు. యిమి సృష్టించిన గొర్రెలు, ఎద్దులు నూటా యాభై సంవత్సరాలు జీవిస్తాయని జెండ్ అవెస్తా చెబుతోంది. గొర్రెలను చోరులు, నక్కల నుండి కాపాడే లక్షణాలు ఉండేది గొర్రెలకాపరి జాగిలము అని ఆహుర మజ్దా నిర్వచించాడు. గొర్రెల ఒప్పందాన్ని ఉల్లంగిస్తే ఏడువందల వంతుల ప్రాయశ్చిత్తం చేయవలసి ఉంటుంది. దీనితో పాటు గొర్రెల ఒప్పందాన్ని ఉల్లంగించిన వారికి 'అసపహే అస్త్ర, శ్రఓషోకరనతో మొత్తం పద్నాలుగు వందల దెబ్బలు తినవలసి ఉంటుంది. అంతక్రియల అనంతరం ఇంటిని పరిశుభ్రం చేసిన తరువాతనే గొర్రెలు, ఎద్దులు, మగ, ఆడ మనుషులు,, అగ్నిని లోపలి తీసుకు రావలసి ఉంటుంది.



గొర్రెల కాపర్లు ఎవరు అనే ఆంశంపై పార్సీమతస్తుల పవిత్ర మత గ్రంథమైన "జంద్ అవెస్తా అత్యంత ఆసక్తికరమైన విషయం చెప్పింది. అవిభాజిత ఆర్యుల ప్రఖ్యాత పూర్వీకుడైన "యఇమ" తెల్ల చర్మం కలిగిన గొర్రెలకాపరుడని జెంద్ అవెస్తా తెలుపుతోంది. గొర్రెల కాపరుడైన "యఇమ" భూమిని గొర్రెలు, మేకలు, ఆవులు తదితర పశువుల మందలు, మనుషులతో నింపివేశారు,వీరే తరువాత రెండు ప్రధాన వర్గాలుగా విడిపోయి కురు, పాంచాలురు లేదా కౌరవులు,పాండవులుగా ప్రసిద్ధి చెందినట్లు జెంద్ అవెస్తా చెబుతోందని "దలాల్" తన పుస్తకంలో తెలిపారు. కౌరవులు, పాండవులే తరువాత కాలంలో కౌడియన్లు, ద్రవీడియన్లుగాను, తరువాత, తరువాత కురువలు, కురుబలు, మల్లలుగా మారారని "ఒప్పర్ట్" చెప్పటం గమనార్హం. పైన ప్రస్తావించిన పేర్లు అన్నీ "కె" పదం నుండి వచ్చినవే. కె లేదా కు అంటే పర్వతం అని అర్థం అనేది విస్మరించరాదు.

హనుమంతప్ప వాదన

కౌరవుల సంతతి వారు పాలించిన కురుదేశానికి కురుబలకు సంబంధం ఉన్నదని

చరిత్రకారుడు హనుమంతప్ప వాదించారు. కౌరవ పదం తరువాత కురువ లేదా తురువగా మారిందని హనుమంతప్ప చెప్పారు. తురువ అనే తరువాత కురుబ గా రూపాంతరం చెందిందని హనుమంతప్ప అభిప్రాయపడ్డారు. కురుదేశంలోని కొన్ని ప్రాంతాల్లో "కురు" పదానికి "పా" చేరుస్తారని ఆయన చెప్పారు. ద్రావిడ భాషల్లో "పా" అంటే పాలకుడు, యజమాని, ప్రేమికుడు,గొర్రెల కాపరి లేదా గోపాలకుడు అని అర్థం. "కురుప" పదం నుండి "కురుబ" పదం వచ్చిందని హనుమంతప్ప తెలిపారు.

కరువు, కాటకాల మూలంగా నెలకొన్న గడ్డు పరిస్తితుల నుండి తమ మందలను కాపాడుకునేందుకు కురుబలు పలు ప్రాంతాలకు వలస పోయారని జోషి అభిప్రాయపడ్డారు. "కురు" అంటే కొండ పై భాగం, కొండలపై తమ జీవాలతో నివసించే కురుబలను 'తురుకరారు' అని కుడా అంటారని జోషి చెప్పారు. ఈ తురకరారు అనే పదము తరువాత తురకార,కురుకార,కురికార,కురువారు మరియు కురికయువావారుగా మారిందని జోషి తెలిపారు. కురుబ వర్గం వారిని కురుప్,ధనగర,హలబరు, హత్తి-కరారు అని కూడా పిలుస్తారని జోషి చెబుతున్నారు. హిందూ మత గ్రంథాల ప్రకారము తురుకరారు ప్రజల అసలు నివాస ప్రాంతము కాంధార్ (గాంధార్), వింద్యారణ్య, దండకారాణ్య అని జోషి అభిప్రాయపడ్డారు. ఇక్కడి

జెండ్ అవెస్తా దేవుడు ఆహుర మజా



నుండి ఇతర ప్రాంతాలకు వలస పోయిన వీరిని హాట్కారారు,కంద మేలారు అని పిలిచేవారని ఆయన చెప్పారు. గాంధార్ ప్రాంతం నుండి వలస వచ్చిన హత్కారారు ప్రజలు మరహట్టా (మహారాష్ట్ర)లో స్తిరపడితే వింద్యారణ్య,దండకారాణ్య నుండి బయలు దేరిన మరవరారు తెగ దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్ళిందని జోషి రాశారు. వ్యవసాయంతో పాటు తమ సంప్రదాయ వృత్తి గొర్రెల పెంపకాన్ని కొనసాగించిన వీరు శైవులు. వీరిని తరువాతి కాలంలో శైవ వీరారు, ఆదిశక్తి , మరవరారు మరియు కలవారు అని గుర్తింపు పొందారు. వీరే తరువాతి కాలంలో వేరగరారు వర్గంగా స్థిరపడిపోయారు. కురుమ,కురుబలు తదితర గొర్రెల కాపర్లు మొదట నర్మద, గోదావరి నది పరీవాహక ప్రాంతంలో స్థిరపడ్డారని అయ్యర్ రాశారు. కలవరు కులంలోని కొన్ని ఉప కులాలను విదర్భ, ఝాడిమండల, మహారాష్ట్ర కు చెందిన మరహట్టా, ఝాడిమండల కురుబలను జాడి కురుబ, జెడి కురుబ అని పిలుస్తున్నారు. వీరు గోదావరి ప్రాంతం నుండి వలస వచ్చారని అంటారు. సామాజికంగా ఎంతో అభివృద్ధి చెందిన వీరు పశువుల పెంపకం, వ్యవసాయం కోసం గోదావరి ప్రాంతంలో విస్తరించారని అయ్యార్ తెలిపారు.

ఆర్యుల కాలానికి ముందు గొర్రెల కాపర్లను ఆయగ్నేయారు, అరెమత్తినవారు, కందమేలరు మరియు నెరారు అని పిలిచే వారని ఎల్మోర్ రాశారు. ఆయగ్నేయారు భూమి, కనంద్ ప్రాంతానికి చెందిన మూల నివాసులు కాబట్టే వారికీ పేరు వచ్చిందన్నది ఎల్మోర్ వాదన. గొర్రెల కాపర్లలోని వివిధ కులాలు, ఉపకులాల వారందరి చరిత్ర ఒకటేనని ఎల్మోర్ చెప్పారు. గొర్రెల కాపర్లు కోయినాడు, కొనడ్-కనడ్, కనడే,కన్నడనాడు (కర్నాటక) కు చెందిన వారని ఓపర్ట్ ,జోషి అభిప్రాయపడ్డారు. “కో “ వర్గంగా ప్రఖ్యాతి గాంచిన వీరు గోవల, అండెర్, పొడవర్, ఎడయిర్, కురుంబార్, కెలవర్, గొల్లవాడు, ధనగర్, కుర్ప్, కురుబ, యాదవులు, కుర్మ, కురుమవారు, కుర్భ, ఒరయన్, గడ్రి, గడ్రియ,పలరు, భర్వడరు, రాజపలి, పాలక్షత్రియ, గొర్రెలు, గొర్లు, గొల్లు, కురుంబ, గొల్లలు, నెరగరరు పేర్లతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారని ఒపర్ట్, జోషి రాశారు. కురుబలు ప్రారంభ కాలంలో సామంతులు (పాలేగార్స్)గా పని చేయటంతో పాటు ప్రస్తుత కర్ణాటక, మహారాష్ట్రలలోని పలు ప్రాంతాలను పాలించారని జోషి తెలిపారు.

కన్నడ గౌలిగలు గొర్రెల కాపర్లకు సంబందించిన ఒక ఉప కులమని థర్ స్టన్ చెప్పారు. ఈ కన్నడ గౌలిగలు నర్మదా నదికి ఉత్తరంలో ఉన్న నాసిక్,కురుక్షేత్రలో స్థిరపడ్డారు. నాగపూర్ ప్రాంతంలో స్థిరపడిన కన్నడ గౌలిగలు వ్యవసాయాన్ని తమ ప్రధాన వృత్తిగా మార్చుకున్నారని థర్టన్ చెప్పారు. కన్నడ గౌలిగ వర్గమే తరువాత దక్షిణ

భారతంలోని మలబార్, గోవాలో స్థిరపడ్డారని ఆయన అభిప్రాయపడ్డారు. మలబార్‌లో స్థిరపడిన కురుబలు కాడుకురుబ, ముళ్ళుకురుబ, జేనుకురుబ పేరుతో పలు సామంత రాజ్యాలను ఏర్పాటు చేశారనీ, వీరు పురాతన కురుంబ, పల్లవులకు ప్రతినిధులని అయ్యర్ తెలిపారు. కురుంబ, పల్లవులు దక్షిణాదిని పాలించిన ప్రఖ్యాత పాలకులని అయ్యర్ చెప్పారు. కురుంబ, పల్లవుల పాలనకు సంబంధించిన ఆనవాళ్లు లభించక పోవటం వలన వీరి వివరాలు తెలియటం లేదని అయ్యర్ వాపోయారు. ఏడవ శతాబ్దంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన పల్లవ రాజులు కొంగు,చోళ,చాళుక్య రాజుల ఎదుగుదలతో కనుమరుగై పోయారని అయ్యర్ అభిప్రాయపడ్డారు. చోళ రాజులు అదొండై,కొత్తవల,అదొంగ్యత్లు జరిపిన దాడుల మూలంగా కురుంబ సామ్రాజ్యం పూర్తిగా పతనమై పోయింది. తమ సామ్రాజ్యం పతనం కావటంతో కురుంబ ప్రజలు మలబార్, నీలగిరి,కూర్గ్, వైనాడ్, మైసూర్ అడవుల్లోకి పారిపోయారని అయ్యర్ చెప్పారు. దశాబ్దాల తరబడి అడవుల్లో నివసించటం వలన కురుంబలు గతాన్ని పూర్తిగా మరిచి పోయారని అయ్యర్ అభిప్రాయపడ్డారు.

దక్షిణ మలబార్ లోని కురుంబనాడు పేరు కురుంబ, కురుబ, కురుమ వర్గం ప్రజల గత వైభావానికి ప్రతీకగా నిలుస్తోందని అయ్యర్ చేప్పారు. కురుమ, కురుబలు తొండమండలం,కురుంబ భూమి, కురుంబనాడు, పైనాడు.కొల్ఫోట్, పాయుమల్, త్రికుపురం, వరక్కపురం, పోర్రై, కొలుతనాడ్, కోటైపుట్టి, నరవనూర్, సోలపటం, పులల్ కొట్టై, అమురొ కొట్టై, కొలత్తుర్ కొట్టై, పోలియర్ కొట్టై, చెంపూర్ కొట్టై, ఉరు కొట్టై, వేనున కొట్టై, మనొ కొట్టై, తమర్ కొట్టై, పల్కుగ్రన కొట్టై, కటికై, కలియుర్ కంతిరికై, వేలుర్ కొట్టై, సతపకం, నిరంపుర్ కొట్టై తదితర ప్రాంతాల్లో కోటలు నిర్మించారని మద్రాస్ ప్రెసిడెన్సీ లేదా మాన్యులల్ అఫ్ అడ్మినిస్ట్రేషన్ పత్రాలు తెలియజేస్తున్నాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ గంగా, శోనా, బద్రి ప్రాంతాలలో కురుబలు చిన్న రాజ్యాలు, ప్రాంతాలు, సంస్థానాలకు ఆధిపత్యం, నాయకత్వం వహించారాని అయ్యర్ చెప్పారు. వీరిని మర్హట్టా, వరహట్టా,హతయారా,ధనగర, వట్టనపాటిల్ మరియు దేహముఖ్ అని పిలిచేవారని అయ్యర్ అంటున్నారు. మధ్య ప్రదేశ్ కు చెందిన హొల్కార్ రాజ కుటుంభం ధనగర్ వర్గానికి చెందినదనేది అందరికి తెలిసిందే. ప్రఖ్యాతి గాంచిన ఇండోర్ రాజ్యాన్ని ధనగర్,కురుబ రాజులు చాల కాలం పాలించటం విదితమే. పురాతన కాలంలో ఇండోర్ రాజ్యాన్ని ఇంద్రపురం అని పిలిచేవారు. కొరాబు, హలబారు, కొల్కరారు, ఆరెమథినవారు, ఆరేకురుబరు అని పిలవబడిన కురుబ ఉప కులాల ప్రజలు ఈ ప్రాంతంలో "కుడి" అంటే కుటీరాలు, గుడులు నిర్మిచారని అయ్యర్ చెప్పారు. ఈ

గొర్రెల కాపర్లను కుడిమక్కలు అని కూడా పిలిచేవారు. వీరు కూడా తరువాతి కాలంలో రైత ఆలు, బడవా తదితర వర్గాలుగా విడిపోయారని జోషీ తెలిపారు.

మహారాష్ట్ర లో మైలారు వర్గం సంతతి వారు కురిగరారు,ధనగరారు, వీరారు, పురపటిగాలు, ఆరే గౌలిగారు, ఆరే కురుబారు, చెట్నేరుగా ప్రసిద్ధి చెందారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా లో గొల్లవాడు, కురుపు, యాదవులు, కురుమ వారు, గోపాలరు, గొల్లడు, గొల్లరు, ఇడియారు, కురుపవారుగా ప్రసిద్ధి చెందారు. పశువుల పెంపకం మూలంగా వీరిని గొర్రెలు, గొర్లు, గార్లు అని కూడా పిలుస్తారని జోషి చెప్పారు. తమిళనాడులో కురుంబార్ వర్గం ప్రజలు అరౌ పేరుతొ గుర్తింపు పొందారు.

గౌడియ వర్గం

కురుమ, కురుబ, కురుంబార్ తదితర గొర్రెల కాపర్లు గౌడియ వర్గం కిందికి వస్తారని గుస్టావ్ ఒపెర్ట్ తన 'భారతదేశం మూల నివాసులు' అనే పుస్తకంలో చెప్పినట్లు మనము ఇదివరకే చదువుకున్నాము. 'కో' కొండ అనే మూల పదం నుండి గౌడియ అనే పదము పుట్టిందని అతను తెలిపారు. 'కో' లేదా 'కు' అనే పదం 'పాత తురానియన్' పద వర్గానికి చెందినదని గుస్టావ్ సూచించారు. గొల్ల అనే పదం గొర్రె అనే పదం నుండి పుట్టింది తప్ప గోవు అనే పదం నుండి పుట్ట లేదని గుస్టావ్ ఒపెర్ట్ స్పష్టం చేశారు. కొండలు, గుట్టల్లో పుట్టి, పెరిగిన వారు కాబట్టే వీరిని కురుమ, కురుబ, కురుంబార్ అని పిలుస్తారని ఒపెర్ట్ అభిప్రాయపడ్డారు. ప్రాచీన ప్రజలు కొండలు, గుట్టల్లో నివసించేందుకు ఇష్టపడే వారు. దీనికి ప్రధాన కారణం కొండలు, గుట్టలు మూడు రకాల భద్రత కల్పించటమే. ప్రత్యర్థుల నుండి రక్షణ కల్పించటంతో పాటు క్రూర మృగాలు, భారీవర్షాలు, ముంపు తదితర ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ కల్పించేవి. భారతీయులు మొదట్లో రెండు వర్గాలుగా విడిపోయారని గుస్టావ్ ఒపెర్ట్ అభిప్రాయపడ్డారు. వారు కురు-పాంచాల, కౌరవులు, పాండవులు గాను ఆ తరువాత గౌడియలు-ద్రవిడులుగా విడిపోయారు. తదనంతరం వారు కురువ లేదా కురుంబ-మల్ల లేదా మలయాలుగా విడిపోయారన్నది అతని వాదన. మల్ల, మాల, మాలవారు, మలయ పదాలతో వచ్చే కులాల వారంతా ద్రావిడులు, కోయ, కోడులు, కొండ, గొండ, గౌడార్, కురువ పదాలతో వచ్చే కులాల వారంతా గౌడీయులని ఒపెర్ట్ నిర్ణయించారు. గౌడ, ద్రావిడులు కొండలు, గుట్టలను సూచించేందుకు రెండు రకాల పదాలు వాడేవారు, అవి... మాల, మలై, పార్, పారై మరియు కోకొండ, కురు, కున్రు, కొర అని

ఒపెర్ట్ తెలిపారు. కోయి (కుయి, కోయిటల్, కోయు, కోయి), కోడు మరియు గోండు లేదా కొండ (ఖోండ, కుండ, కవుండ, గౌడ, గౌండ మరియు గౌండ) లేదా కండ (ఖండ, కండర, కాందార, చండా, చండాల), తోడ, కోట కొడగు, కురుయియార్, గుర్చారి) కొరవ, (కొరమ), కురువ, (కురు,ఎరుకల, కురుమ, కురుంబ, కూర్మి), కున్నువ తదితరులు.



గొల్ల అనే పదం గొర్రె అనే పదం నుండి పుట్టింది తప్ప గోవు అనే పదం నుండి పుట్ట లేదని గుస్టావ్ ఒపెర్ట్ స్పష్టం చేశారు. కొండలు, గుట్టల్లో పుట్టి, పెరిగిన వారు కాబట్టే వీరిని కురుమ, కురుబ, కురుంబార్ అని పిలుస్తారని అభిప్రాయపడ్డారు. ప్రాచీన ప్రజలు కొండలు, గుట్టల్లో నివసించేందుకు ఇష్టపడే వారు. దీనికి ప్రధాన కారణం కొండలు, గుట్టలు మూడు రకాల భద్రత కల్పించటమే.

కులం పుట్టుకపై పలు కథనాలు!

మల్లన్న దేవుడి సంతతి



కురుబ, కురుమ, కురుంబ, పాల్, గడరియ తదితర గొర్రెల కాపర్లు మల్లన్న దేవుడి సంతానం. మల్లన్న, మల్లికార్జునుడు, మైలార్, మాలింగ రాయ తదితర పేర్లున్న దేవుడు ఈ కులానికి తండ్రి అయితే బీరప్ప, బీరలింగేశ్వరుడు, ఎల నాగిరెడ్డి తదితర పేర్లున్న దేవుడు ఈ కులం గురువు. అయితే ఈకులం పుట్టుకపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఒక కథనం ప్రకారం కురుమ తదితర గొర్రెల కాపర్లు కాపు కులం నుండి పుట్టారని ఎడ్గర్ థర్స్టన్ తన 'కులాలు, తెగలు' అనే పుస్తకంలో వాదించారు. ప్రసిద్ధ సంప్రదాయం ప్రకారం మసిరెడ్డి, నీలమ్మ వారి పూర్వికులని ఎడ్గర్ తన పుస్తకంలో పేర్కొన్నాడు. (మసిరెడ్డి అంటే ప్రస్తుత రెడ్డి కులం కాదు. రెడ్డి అనేది ఒక పదవి, గ్రామ పెద్దగా వ్యవహరించే వారిని రెడ్డి అని పిలుస్తారు. రాయలసీమ ప్రాంతంలో గ్రామ పెద్ద పదవి నిర్వహించే ఇతర కులాలకు చెందిన వ్యక్తులు కూడా తమ పేరు చివరన రెడ్డి అని పెట్టుకోవటం తెలిసిందే). మసిరెడ్డి, నీలమ్మలు తూర్పు కనుమల్లో నివసించే వారు. వీరికి ఆరుగురు కొడుకులు. వీరి బీదరికం చుసి జాలి పడిన శివుడు జంగమ రూపంలో ప్రత్యక్షమై నీలమ్మకు పవిత్ర భస్మం భాహుకరించి నీకు కలిగే ఏడో సంతానంతో అదృష్టం కలిసి వస్తుందని వరం ఇస్తాడు. నీలమ్మకు శివుని అంశతో ఏడో సంతానంగా ఉండాల పద్మన్న జన్మిస్తాడు. అతను పుట్టిన తరువాత వ్యవసాయం బాగా కలిసిరావటంతో మసిరెడ్డి, నీలమ్మ ధనవంతులైపోతారు.

మసిరెడ్డి కుటుంబంలోని వారంతా వ్యవసాయం పని చేస్తుంటే పద్మన్న మాత్రం ఎ పని చేయకుండా దినం గడిపేవాడు. శివుడి అంశతో పుట్టిన వాడు కావటంతో తల్లి దండ్రులు కుడా అతనికి పని చెప్పేవారు కాదు. పద్మన్న ఎప్పుడు కూడా పొలానికివెళ్లి పని చేసేవాడు కాదు. తాము కష్టపడి పనిచేస్తుంటే పద్మన్న ఏమి చేయకుండా ఇంట్లో

కూర్చోవటం, బైట తిరిగిరావటం మిగతా ఆరుగురు సోదరులకు నచ్చలేదు. తాము కష్టపడి పని చేస్తుంటే ఇతను కూర్చొని తినటం ఏమిటనేది మిగతా ఆరుగురు సోదరుల ప్రశ్న. అందుకే వారు పద్మన్నను ఏవిధంగానైనా వదిలించుకోవాలని నిర్ణయించుకుంటారు. ఈ నిర్ణయం మేరకు వారు తమ పొలంలో ఉన్న పాము పుట్టను తొలగించాలని పద్మన్నను అదేశిస్తారు. పుట్టను తొలగించే సమయంలో లోపల ఉండే పాము పద్మన్నను కాటు వేస్తుందని ఆరుగురు సోదరులు అంచనా వేస్తారు. పద్మన్న పాము పుట్టను తొలగించేందుకు ప్రయత్నించ గానే అందులో నుండి వందలు, వేల సంఖ్యలో గొర్రెలు బైటికి వస్తాయి . పాముల పుట్ట నుండి పెద్ద సంఖ్యలో బైటికీ వస్తున్న గొర్రెలను చూసి భయపడిన పద్మన్న అక్కడి నుండి పారి పోయేందుకు ప్రయత్నిస్తాడు.

పాముల పుట్ట నుండి పెద్ద సంఖ్యలో బైటికీ వస్తున్న గొర్రెలను చూసి భయపడిన పద్మన్న పారి పోయేందుకు ప్రయత్నిస్తాడు. ఇదంతా గమనిస్తున్న శివుడు ప్రత్యక్షమై పద్మన్నకు ధైర్యం చెబుతాడు. అతని జీవనోపాదికే గొర్రెలను పుట్టించినట్లు చెప్పి గొర్రె పాలతో జీవనోపాధి కొనసాగించాలని పద్మన్నకు శివుడు సూచిస్తాడు.

ఇదంతా గమనిస్తున్న శివుడు ప్రత్యక్షమై పద్మన్నకు ధైర్యం చెబుతాడు. అతని జీవనోపాదికే గొర్రెలను పుట్టించినట్లు చెప్పటంతో పాటు వాటిని పోషించుకోవాలని హితవు చెబుతాడు. గొర్రె పాలతో జీవనోపాధి కొనసాగించాలని పద్మన్నకు శివుడు సూచిస్తాడు. శివుడు అతనికి పాలు పితకటం, కాచటం కుడా నేర్పించి అగ్గిని తెచ్చేందుకు దూర దేశాలకు పంపిస్తాడు. పద్మన్న వెళ్ళిన ప్రాంతంలో రాక్షసులు నివసిస్తుంటారు . ఈ రాక్షసుల వద్ద ఒక బ్రాహ్మణ యవతి బందీగా ఉంటుంది. రాక్షసులు తమ వద్ద ఉన్న ఈ బ్రాహ్మణ యువతితో అన్ని పనులు చేయించుకునేవారు. రాక్షసుల వద్ద బందీగా ఉన్న బ్రాహ్మణ యువతి పద్మన్నను ప్రేమిస్తుంది. రాక్షసుల కంటపడకుండా చూసేందుకు పద్మన్నను ఆమె బల్లిగా మార్చివేస్తుంది. ఆతరువాత పద్మన్న, బ్రాహ్మణ యువతి రాక్షసుల నుండి తప్పించుకుని పారిపోతారు. తరువాత పద్మన్న అడవిలో బ్రాహ్మణ యువతిని పెళ్లి చేసుకుంటాడు. పెళ్లి సమయంలో బ్రాహ్మణ యువతి మెడలో ఉన్నితో చేసిన దారంతో మంగళ సూత్రం కడతాడు. అడవిలో పత్తి దారం లభించకపోవటంతో గొర్రె నుండి తీసిన ఉన్నితో చేసిన దారం కట్టవలసి వస్తుంది. పెళ్ళి తరువాత పద్మన్న తన స్వస్థలానికి వెళతాడు. పద్మన్న అక్కడ తన కులం యువతిని కుడా పెళ్లి చేసుకుంటాడు. పద్మన్న తన కులం యువతికి పత్తి దారంతో చేసిన మంగళ

సూత్రం కడతాడు. అందుకే బ్రాహ్మణ యువతి పిల్లలందరు ఉన్ని కంకణందారులు, రెండో భార్య సంతానం పత్తి కంకణదారులు అయ్యారు. అండేకురుబలు అనే మూడో ఉప కులం కూడా ఉన్నదని ఎడ్గర్ తన పుస్తకంలో పేర్కొన్నాడు. మేకల నుండి పాలు పితికేందుకు చిన్న అండె (కుండ)ను ఉపయోగించినందుకే వారికీ పేరు వచ్చిందని ఎడ్గర్ వివరించారు. కురుబ, కురుమలను హాలుమాత వారు అని కూడా పిలుస్తారు. రేవన సిద్దేశ్వరుడు వీరిని పాలనుండి పుట్టించినందుకే వీరిని పాలకులం లేదా హాలుమాత వారు అని పిలుస్తారని ఎడ్గర్ వివరించాడు.. కన్నడ భాషలో హాలు అంటే పాలు అని అర్థం. కురుబ, కురుమ కులంలో పలు ఉప - కులాలు, ఉప వర్గాలు ఉన్నాయి. ప్రధాన కులంతో పాటు ఉపకులాలలో గోత్రాల పేరుతో కూడిన విభజన చోటు చేసుకున్నది . ఈ విభజనలన్నీ టోటేమిస్టిక్ ఆధారంగా జరిగాయి . కురుమ, కురుబ కులం పెద్దలను గౌడ, హేగ్గాడే, నాయకన్, నాయకర్ అని పిలుస్తారు. కొందరిని గోరవ వాండ్లు, ఒగ్గు వారు అని కూడా పిలుస్తారు. ప్రతి గ్రామంలో నివసించే కురుమ వర్గానికి ఒక కుల పెద్ద ఉంటారు. అతన్ని గౌడ్ అని పిలిచే ఆచారం ఉన్నది. పలు సందర్భాల్లో కుల పెద్ద కుల దేవాలయం పూజారిగా కుడా వ్యవహరిస్తాడు.

హాలుమతోతేజక పురాణం

కన్నడ రచయిత భీమకవి పదహారవ శతాబ్దంలో రాసిన ‘ హాలుమతోతేజక పురాణం’లో కౌరబ అనే ఋషి తపస్సు ద్వారా లభించిన తపోఫలం నుండి కురుబలు జన్మించారని పేర్కొన్నారు.

‘కురరే మ్రిగవస్త్రాని క్రుత్వావై కౌరభ ఋషి
తన్నమ సక్తకుం చక్ర దేవనమ్ హితక్వ్య’

హాలుమత పురాణం (కన్నడ భాషలో లిఖించబడిన పుస్తకం) కురుమ, కురుబ కులం పుట్టుక గురించి వివరించే పురాణం. భీమకవి రచించిన హాలుమత పురాణం కురుమ కులం ప్రజల మూలాల గురించి వివరించే జానపద మౌకిక కావ్యం. ఆగ్నేయ పురాణం నుండి కురుబల వివరాలు సేకరించినట్లు భీమకవి తన పుస్తకంలో చెప్పుకున్నారు. హాలుమత కురుబ పురాణంలో మొత్తం పద్నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. కర్నాటకలోని కలబుర్గి జిల్లా శకపుర తాలుకాలోని సైదాపూర్ అనే చిన్న గ్రామానికి చెందిన సిద్దప్ప మేతి అనే గాయకుడు హాలుమత కురుబ పురాణాన్ని సేకరించారు. కన్నడ పుస్తక ప్రాధికార సంస్థ 2000 సంవత్సరంలో మౌకిక రూపంలో ఉన్న హాలుమత కురుబ పురాణానికి పుస్తక రూపం ఇచ్చింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సిద్దప్పమేతి



గొర్రె ఉన్నితో గొంగళి తయారు చేసేందుకు దొల్లాసురుడు అనే రాక్షసుడి తల నరికి అతని అంగాలతో గొంగళి నేసేందుకు అవసరమైన పని ముట్లను తయారు చేసినట్లు హాలుమత కురుబ పురాణం తెలిపింది.

పొట్టకూటి కోసం మహారాష్ట్రలోని సోలాపూర్‌కు వలస వచ్చి ఒక మిల్లులో పనికి కుదిరిన అనంతరం అక్కడ పనిచేసే తోటి కార్మికుడు కళ్ళప్ప వాగమోడి నుండి ఈ పురాణాన్ని నేర్చుకున్నాడు. కళ్ళప్ప వాగమోడి మిల్లులో ప్రతిరోజు హాలుమత పురాణం పాడేవాడు. సిద్దప్పమేతి అతని పాటను శ్రద్దగా వినటం ద్వారా ఈ పురాణాన్ని కంఠస్థం చేసుకుని భావి తరాలకు అందించగలిగాడు.

హాలుమత కురుబ పురాణ కావ్యంలో బీరప్ప దేవుడి మహత్యాలు, లీలలు, శివుని పట్ల బీరప్ప తండ్రి భరమ దేవుడి భక్తి. బీరప్ప పట్ల ఆయన శిష్యుడు మాళింగరాయుడికి ఉన్న భక్తి శ్రద్దలు, రేవణసిద్దేశ్వరుడు, మాయవ్వ, పార్వతి,కమలాదేవి, సూరమ్మదేవి, అక్కవ్వ, కన్నికామవ్వ తదితరులకు సంబంధించిన కథనాలు ఇందులో ఉన్నాయి. శివ స్వరూపుడైన బీరప్ప దేవుడి అద్భుత లీలల గురించి ఈ పురాణంలో వివరించారు. మొదటి అంకంలో బ్రహ్మాండ స్వరూపం వర్ణన ఉన్నది. మొదట భూమండలమంతా జలమయంగా ఉండేది. ఈ జలంపై అఖండేశ్వరుడి సృష్టి జరిగింది. ఈ అఖండేశ్వరుడు తన ప్రక్క ఎముక నుండి ఆదిశక్తిని రూపొందించినట్లు ఈ పురాణం చెబుతోంది. ఆదిశక్తి గర్భం నుండి రాక్షసులు, బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, మహాదేవ, శాంతముత్తయ్య జన్మించారని హాలుమత కురుబ పురాణం ప్రకటించింది. శాంత ముత్తయ్య ఐదుగురు రాక్షసులను గొర్రెలుగా మార్చాడని ఈ పురాణం తెలుపుతోంది. శాంతముత్తయ్య మరో రాక్షసుడిని పొట్టేలు చేశాడు.

గొర్రె ఉన్నితో గొంగళి తయారు చేసేందుకు దొల్లాసురుడు అనే రాక్షసుడి తల నరికి అతని అంగాలతో గొంగళి నేసేందుకు అవసరమైన పని ముట్లను తయారు చేసినట్లు హాలుమత కురుబ పురాణం తెలిపింది. కురుమలకు సంబంధించిన గొర్రెలు,

డోలు, గొంగళి సృష్టికర్త శాంతముత్తయ్య అని హాలుమత కురుబ పురాణం ప్రకటించింది. శాంతముత్తయ్యకు గొర్రెలను కాయటంలో విసుగు వస్తే అతని స్థానంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు గొర్రెలను కాచే బాధ్యత నిర్వహించినట్లు ఈ పురాణంలో ఉన్నది. శివునికి విసుగు వచ్చే పక్షంలో గొర్రెలను కాచే బాధ్యతను పార్వతి చేపట్టేదని ఈ పురాణం చెబుతోంది. గొర్రెలను కాయటంతో విసుగు చెందిన పార్వతి వాటిని స్వర్గం నుండి భూలోకానికి తెచ్చిందని హాలుమత కురుబ పురాణం తెలిపింది. సృష్టి కార్యం కోసం భూలోకానికి వచ్చిన పార్వతి మట్టి, మంచి పాలతో ఆడ, మగ బొమ్మలను తయారు చేయగా శివుడు వాటిలో జీవం నింపాడన్నది ఈ పురాణం వాదన. శివ, పార్వతులు తాము తయారు చేసి జీవం పోసిన బొమ్మలకు ముద్దవ్వ, ముద్దుగొండ అని నామకరణం చేశారని హాలుమత కురుబ పురాణం ప్రకటించింది. ముద్దవ్వ, ముద్దుగొండ హాలుమత వర్గం ప్రజల మూల పురుషులనేది అందరికి తెలిసిందే. కురుమల గురువైన బీరప్ప దేవుడు శివుడి వరప్రసాదమే కాకుండా శివుని అవతారమని ఈ పురాణం చెబుతోంది. బరమదేవ-సూరమ్మ దేవి పుత్రుడైన బీరప్ప పుట్టినప్పుటి నుండి మహిమలు గలవాడని హాలుమత కురుబ పురాణం తెలుపుతోంది. శివుడి వరప్రసాదంగానే బీరప్ప జన్మించాడని చెప్పటంతో పాటు బీరప్ప శివుడి అవతారమని హాలుమత కురుబ పురాణం చెబుతోంది. మేనమామ కళినారాయణ దుర్బుద్ధితో తెచ్చిన విష పూరిత చీర తదితర బట్టలను ధరించవద్దని బీరప్ప గర్భం నుండే తల్లి సూరమ్మ దేవిని హెచ్చరిస్తాడు. సూరమ్మదేవి ప్రసవ సమయంలో మంత్రసాని బీరప్పను పురిటిలోనే చంపేందుకు ప్రయత్నిస్తుంది. ఇది గమనించిన బీరప్ప తల్లి గర్భం చీల్చుకుని బైటికి వచ్చాడని హలుమత కురుబ పురాణం చెబుతోంది. తన గండాన పుట్టిన బీరప్పను హతమార్చేందుకు కాళినారాయణ చేసిన పలు ప్రయత్నాలను హాలుమత కురుబ పురాణం వివరించింది. కాళినారాయణ ఎన్ని కుతంత్రాలు చేసినా బీరప్ప దేవుడికి ఎలాంటి హాని జరగదు. తన మేనమామ కాళినారాయణ కూతురు కన్నికామవ్వ (తెలంగాణలో ఈమె పేరు 'కామరతి') ని తప్ప

సృష్టి కార్యం కోసం భూలోకానికి వచ్చిన పార్వతి మట్టి, మంచి పాలతో ఆడ, మగ బొమ్మలను తయారు చేయగా శివ, పార్వతులు తాము తయారు చేసి జీవం పోసిన బొమ్మలకు ముద్దవ్వ, ముద్దుగొండ అని నామకరణం చేశారని హాలుమత కురుబ పురాణం ప్రకటించింది.

వేరొకరిని పెళ్లి చేసుకోనని స్పష్టంగా చెప్పటంతో పాటు తన లక్ష్య సాధనలో బీరప్ప విజయం సాధిస్తాడు. కాళినారాయణ కుట్రల మూలంగా బీరప్ప కత్తితో కన్నికామవ్వకు వివాహం జరిపించవలసి వస్తుంది. బీరప్ప ఒగ్గు కథల్లో కాళినారాయణ పేరు నారదుడు, అదే విధంగా కన్నికామవ్వ పేరు కామారతి అని ఉండటం గమనార్హం. బీరప్ప భార్యకు ఉన్న రెండు పేర్లను పరిశీలిస్తే అవి అసలైన పేర్లు కాదనే అభిప్రాయం కలుగుతుంది. అసలు పేరు వేరేదేదో ఉండగా కాలక్రమంలో అది హాలుమత కురుబ పురాణంలో కన్నికామవ్వగా మారితే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ఒగ్గు కథల్లో అది కామరతిగా మారి ఉండవచ్చు. బీరప్ప పేరు కూడా ఇలాంటి పరిణామక్రమానికి గురై ఉంటుంది. బీరప్ప వివాహానంతరం హేడింబ అనే గ్రామంలో హేడింబ అనే రాక్షసుడిని సంహరిస్తాడు. బీరప్ప సంహరించిన రాక్షసుడి మూలంగానే ఈ గ్రామానికి హేడింబ అనే పేరు వచ్చింది. బీరప్ప ఆ తరువాత బగనాథ అనే మరో రాక్షసుడిని సంహరించి స్థానిక ప్రజల

> శివుడు, బీరప్ప ఒకరేనని , జాబాల ముని రక్తం నుండి పలు రకాల గొర్రెలు ఉద్భవించాయని ఈ పురాణం చెబుతోంది. ఆదిగొండ కుమారుల్లో ఒకడైన శివపద్మ అడవిలో గొర్రెలు కాచే సమయంలో ఒక రాక్షసి పెంచుతున్న చుమలదేవిని రక్షించి వివాహం చేసుకుంటాడు. అతనికి అంతకు ముందే జింకాదేవితో వివాహం జరుగుతుంది. జింకా దేవికి పుట్టినవారు పత్తికంకణం వారు,

పూజలందుకుంటాడు. బీరప్ప ముంగి అనే పట్టణంలో జబ్బు పడిన స్థానిక రాజ కుమారిని నయం చేస్తాడు. ఆ తరువాత వారు కాయికొంకణనాడి ప్రాంతానికి వెళతారు. అక్కడ బాగనాథు అనే రాక్షసుడిని బీరప్ప సంహరిస్తాడు. బీరప్ప, కన్నికామవ్వలు మాయవ్వ క్యానగ అనే ఊరుకు వెళతారు. అక్కడ క్యానేసురుడు అనే రాక్షసుడు ఆరు నెలలు నిద్రపోతే, ఆరు నెలల పాటు మేల్కొని ప్రజలను చిత్రహింసలకు గురి చేస్తుంటాడు. బీరప్ప క్యానాసురున్ని హతమార్చి స్థానిక ప్రజలను ఆదుకుంటాడు. వారక్కడి నుండి చంచలసూర అనే అటవీ ప్రాంతానికి చేరుకుంటారు. బీరప్ప తదితరులు అక్కడ ఉండేందుకు వన దేవత అనుమతి ఇవ్వదు. ఆగ్రహించిన బీరప్ప అడవి దేవతను సంహరించి ఆమె మహిమలన్నింటిని తనలో విలీనం చేసుకుంటాడని హాలుమత పురాణం చెబుతోంది. బీరప్పఅక్క మాయవ్వ ఆ అడవిలోనే స్థిరపడిపోతుందని హాలుమత కురుబ పురాణం చెబుతోంది. బీరప్ప అక్కడి నుండి తిరుగు ప్రయాణమై బెల్లిగిరికి వెళతాడు. ఒగ్గు కథల ప్రకారమైతే మాయవ్వ తన అవతారాన్ని చాలించుకుని శిలగా మారిపోతుంది. బీరప్ప అక్క మాయవ్వ గొర్రెలను బెల్లిగిరికి తెస్తాడు. బీరప్ప అ

తరువాత ఘోరమైన తపస్సు చేసి శివుడిని ప్రత్యక్షం చేసుకుంటాడు. బీరప్ప కోరిక మేరకు శివుడు అతనికి మాళింగరాయ అనే శిష్యుడిని ప్రసాదిస్తాడు. బీరప్ప, మాళింగరాయ కలిసి ధర్మ ప్రచారం చేస్తారు. మాళింగరాయ బీరప్పను పూజించే విధానంలో పలు మార్పులు తీసుకురావటంతోపాటు పలు కొత్తవిధానాలను ప్రవేశపెడతాడు. హాలుమత కురుబ పురాణంలో ఇలాంటి పలు అంశాలు ఉన్నాయి. శివుడు, బీరప్ప ఒకరేనని ఈ పురాణం చెబుతోంది. జాబాల ముని రక్తం నుండి పలు రకాల గొర్రెలు ఉద్భవించాయని ఈ పురాణం చెబుతోంది. ఆదిగొండ కుమారుల్లో ఒకడైన శివపద్మ అడవిలో గొర్రెలు కాచే సమయంలో ఒక రాక్షసి పెంచుతున్న చుమలదేవిని రక్షించి వివాహం చేసుకుంటాడు. అతనికి అంతకు ముందే జింకాదేవితో వివాహం జరుగుతుంది. జింకా దేవికి పుట్టినవారు పత్తికంకణం వారు, చుమలాదేవికి పుట్టిన వారు ఉన్ని కంకణం కురుమలని భీమకవి తన పురాణంలో వివరించారు. శివపద్మ, చుమలా దేవి పుత్రుడే శివ సిద్ద బీరప్ప అని ఈ పురాణం చెబుతోంది. ఐతే ఇదే పురాణంలో మరో చోట బర్మదేవ, సురావతి కుమారుడు శివసిద్ధ బీరప్ప అని చెప్పటం గమనార్హం. శివపద్మ కైలసానికి వెళ్ళిన అనంతరం శివుడే బర్మదేవుడు, సురవతికి శివసిద్ధ బీరప్పగా జన్మిస్తాడని భీమకవి హలుమత కురుబ పురాణంలో తెలిపారు. శివసిద్ధ బీరప్ప శిష్యుడు మాలింగరాయ.

హాలుమత లేదా హాలుమతోత్తేజక పురాణం రచించిన భీమకవి జన్మస్థలం రాస్తాపుర. ఇది గుల్బర్గా జిల్లాలోని శహాపుర తాలుకాలో ఉన్నది. అతని తండ్రి పేరు జంబన్న, తల్లి పేరు భీమవ్వ. భీమ కవి సురపుర రాజుల వద్ద పని చేసేవారు. ఇతని రచనలకు సంబంధించిన వివరాలు పెద్దగా లభించటం లేదు. భీమకవి హాలుమాతోత్తేజక పురాణంతో పాటు శంభులింగేశ్వర పురాణం, మంతేశ్వర పురాణం, చార బసవేశ్వర పురాణం, శంకర కైవల్య ద్రుమ తదితర పుస్తకాలు కూడా రచించినట్లు తెలుస్తోంది. ఇతను విహార యాత్రలకు సంబంధించిన రచనలతో పాటు పది వరకు నాటకాలు కూడా రచించారని అంటున్నారు. ఇతనికి కర్ణాటక కవి భూషణ అనే బిరుదు ఉన్నది.

‘టగర పవాడ’ లేదా ‘పొట్టేలు అద్భుతం’ !

టగర పవాడ లేదా పొట్టేలు అద్భుతం, సిద్దమంక చరిత్ర అనేవి కన్నడ పుస్తకాలు. ఈ పుస్తకాలు ఎప్పటివి, ఎవరు రాశారనేది చెప్పటం కష్టం. టగర పవాడ, సిద్దమంక చరిత్ర పుస్తకాలలో కురుబ కులానికి సంబందించిన పూర్వపరాలు స్పష్టంగా లేవు. బీరప్ప

దేవుడికి సంబందించిన వివరాలు పెద్దగా లేవు. ఐతే వీటిలో కురుబ కులస్తుల ఆచార వ్యవహారాలకు సంబందించిన వివరాలు ఉన్నాయి. ముఖ్యంగా కురుబ కులం పుజారులైన ఒడెయర్ల (ఒగ్గు పూజారులు) ఆచార, వ్యవహారాలకు సంబందించిన అంశాలు చాల ఉన్నాయి. కన్నడ విశ్వ విద్యాలయంలో పాటు, కొందరు కన్నడ విద్యావంతుల వద్ద టగర పవాడ, సిద్దమంక చరిత్ర ప్రతులు (కాపీలు) ఉన్నాయి. టగర పవాడ పురాణం ప్రకారం పరమ శివుడు, పార్వతి తమ భక్తుల స్థితిగతులు తెలుసుకునేందుకు భూలోకానికి దిగి వస్తారు. పరమ శివుడు, పార్వతి కొంత సేపు విహరించిన అనంతరం ఒక సుందర ప్రదేశంలో విశ్రాంతి తీసుకునేందుకు సిద్దమవుతుంటారు ఈ సమయంలో జమరిషి అనే సన్యాసి అక్కడికి వస్తాడు. జమరిషిని చూడగానే పార్వతికి ఎంతో సంతోషం వేయటంతో పాటు మాతృత్వంతో కూడిన ప్రేమ, వాత్సల్యం పుట్టుకు వస్తాయి. ఆమె వక్షోజాలు ఉబికి పాలు పొంగి వస్తాయి. పార్వతి అ పాలను తన చేతుల్లోకి తీసుకుని వాటితో రెండు బొమ్మలను చేస్తుంది. శివుడు ఆ బొమ్మలకు ప్రాణం పోసి ముద్దుగొండ, ముద్దమ్మ అని నామకరణం చేస్తాడు. భార్య, భర్తలుగా జీవించాలని శివుడు వారిని ఆదేశిస్తాడు. కాల క్రమంలో వారికి ఏడుమంది సంతానం కలుగుతారు. ఈ ఏడుగురిలో చిన్నవాడు పద్మన్న పనీ,పాటా లేకుండ తిరుగుతున్న పద్మన్నను దారిలోకి తెచ్చేందుకు ఆదిగొండ అతన్ని పొలం పనులకు పురమాయిస్తాడు. అడవిలో ఉన్న భుమిని చదను చేసి పంట పండించేందుకు అనువుగా చేయాలని ఆదిగొండ అతన్ని ఆదేశిస్తాడు. ఆదిగొండ అడవిలోని పొలం వద్దకు పంపించే ముందే పద్మన్నకు పెళ్లి చేస్తాడు. పద్మన్న పొలాన్ని చదును చేసే సమయంలో శివుడు అక్కడ భిలంలో దాచిన గొర్రెలు బైటికి వస్తాయి. శివుడు ఇచ్చిన ఈ ఏడు లక్షల గొర్రెలను మేపటం పద్మన్నకు కష్టమవుతుంది. పద్మన్న పడుతున్న కష్టాలు చూసి కరిగిపోయిన శివుడు అతనికి తోడుగా ఉండేందుకు వీరబీరయ్యను సృష్టిస్తాడు. ఇద్దరు కలిసి గొర్రెలను మేపుకోవాలని సూచించిన అనంతరం శివుడు కైలసానికి వెళ్ళిపోతాడు. వీరబీరయ్య, పద్మన్న గొర్రెలను మేపుకుంటూ ముందుకు సాగుతున్న సమయంలో ఒక రాక్షసి వారిని ఎదుర్కొంటుంది. వీరబీరయ్య ఆ రాక్షసిని తన దండంతో సంహరిస్తాడు. వీరబీరయ్య చేతిలో రాక్షసి హతం కాగానే ఆమె కూతురు బోరున విలపిస్తూ వీరబీరయ్య పాదాలపై పడిపోతుంది. హృదయవిదారకంగా రోదిస్తున్న రాక్షసి కూతురు సిరివంతి పట్ల వీరబీరయ్యకు సానుభూతి కలుగుతుంది. వీరబీరయ్య రాక్షసి కూతురు సిరివంతికి పద్మన్నతో పెళ్ళిచేసి కలకాలం సుఖంగా ఉండాలని దీవిస్తాడు. 'టగర పవాడ పుస్తకంలో బీరప్ప గురించి పైన వివరించిన చిన్న ప్రస్తావన మాత్రమే ఉన్నది. బీరయ్య లేదా బీరప్ప దేవుడికి సంబంధిన

మరే ఇతర ప్రస్తావన ఈ పుస్తకంలో కనిపించలేదు.

పద్మన్న మొదటి భార్య పేరు లింగమ్మ, రెండో భార్య పేరు సిరివంతి. లింగమ్మ ద్వారా కలిగిన సంతానం పత్తి కంకణం కురుమలు, సిరివంతి ద్వారా కలిగిన పిల్లలు ఉన్ని కంకణదారులైన కురుమలవుతారని పద్మన్నకు శివుడు సూచించినట్లు టగర పవాడ చెబుతోంది. కురుబల కుల దైవం వీరబీరయ్య, కుల గురువు శాంతిముత్తయ్య అని ఈ పుస్తకం తెలుపుతోంది. పద్మన్న మొదటి భార్య లింగమ్మ కుమారుడు శాంత ముత్తయ్య. ఈ పుస్తకంలో కురుమ కులస్తుల పొట్టేలు కళ్యానపురంలో సాధించిన ఘన కార్యాలను వివరించింది. కుల గురువైన శాంత ముత్తయ్య కురుమలకు కళ్యానపురంలో స్థానం సంపాదించేందుకు పొట్టేలు ద్వారా చేసిన ప్రయత్నాలను ఇందులో తెలిపారు. కళ్యాణ పురంలో స్థానం సంపాదించేందుకు బీరప్ప దేవుడు ప్రయత్నించి విజయం సాధించినట్లు కర్నాటకకు చెందిన పలు పుస్తకాలు తెలియజేయటం విధితమే. ఐతే టగర పవాడ పుస్తకంలో మాత్రం ఈ కార్యాన్ని శాంత ముత్తయ్య సాధించినట్లు తెలపటం గమనార్హం. కురుబలు కళ్యాణపురంలో నివసించేందుకు రాజు అనుమతి కోసం బీరప్ప చేసిన ప్రయత్నంలో పొట్టేలు ముఖ్య పాత్ర నిర్వహించటం తెలిసిందే. బీరప్ప దేవుడికి తోడ్పడినట్లే శాంత ముత్తయ్యకు కూడా శివుడు సహాయ, సహకారాలు అందజేసినట్లు ఈ పుస్తకం చెబుతోంది. రేవన సిద్దేశ్వరుడు కురుబల ప్రధాన గురువు అని కూడా టగర పవాడ చెబుతోంది. ఈ పుస్తకంలో ఉన్న శాంత ముత్తయ్య, సిద్దమంక చరిత్రలో ఉన్న మరులమంక, ఇరువురు కూడా కురుబ కులంలో పుట్టి కురుబ సమాజం అభివృద్ధి, పురోగతికి కృషి చేసి గురు స్థానానికి ఎదిగిన మహా పురుషులు.

సిద్దమంక చరిత్ర లేదా సిద్దరామ సాంగత్య

సిద్దమంక చరిత్ర కూడా కురుమ, కురుబ తదితర గొర్రెలకాపర్ల కుల చరిత్రను వివరించే కన్నడ పుస్తకం. సిద్దమంక చరిత్ర ప్రధానంగా పత్తి కంకణందారులకు సంబందించినది. కురుబలకు కళ్యాణ పట్టనంలోకి ప్రవేశం సంపాదించేందుకు మంక సిద్ద చేసిన తపస్సు, స్థానిక రాజు బిజ్జలుడు అతని తపస్సుకు మెచ్చి కురుబ కులం ప్రజలు కళ్యాణ పట్టణంలోకి ప్రవేశించేందుకు అనుమతించటం గురించి ఇందులో వివరించారు. కళ్యాణ పట్టణంలోని లింగాధారుల ఫిర్యాదు మేరకే బిజ్జలుడు కురుబ వర్గం ప్రజలు పన్నెండు సంవత్సరాల పాటు పట్టణంలో ప్రవేశించకుండా నిషేధం విధించటం తెలిసిందే. కురుబలకు సంబంధించిన ఇతర పుస్తకాలలో బీరప్ప దేవుడు చేసిన కృషి మేరకు వారికి కళ్యాణ పట్టణంలో అడుగు పెట్టేందుకు అనుమతి లభిస్తుంది. ఐతే

సిద్దమంక చరిత్రలో పత్తి కంకణం కురుబ, కురుమ కులం ప్రజల మత సంబంధ విధి, విధానాలు, సంప్రదాయాల వివరాలు ఉన్నాయి. ఇదేవిధంగా కంబళి లేదా గొంగడి చరిత్ర, గొంగడిని నేసేందుకు అవసరమైన వస్తువులు, ఏర్పాట్లు, గొంగడి నేసేందుకు ఉన్నిని కత్తిరించే పద్దతి, ఉన్ని దారాలను ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలనేది ఈ పుస్తకంలో వివరించారు. సిద్దమంక చరిత్ర కురుబ సంసృతికి అద్దం పడుతోందని పలువురు కురుబ చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కురుబ కులం వారిని కళ్యాణ పట్టణంలోకి అనుమతించాలంటూ మంకమరుళ లేదా మంకసిద్ద చేసిన తపస్సుకు భయపడి మహారాజు బిజ్జాలుడు అక్కడికి వచ్చి ప్రవేశ అనుమతి మంజూరు చేస్తాడు.




సిద్దమంకచరిత్రలోఇందుకువిరుద్దంగామంకసిద్దచేసినతపస్సుమూలంగానే కురుబలకు కళ్యాణ పట్టణంలో నివసించే అధికారం బిజ్జల మహారాజు నుండి లభించినట్లు తెలుపటం గమనార్హం. సిద్దమంక చరిత్రలో పత్తి కంకణం కురుబ, కురుమ కులం ప్రజల మత సంబంధ విధి, విధానాలు, సంప్రదాయాల వివరాలు ఉన్నాయి. ఇదేవిధంగా కంబళి లేదా గొంగడి చరిత్ర, గొంగడిని నేసేందుకు అవసరమైన వస్తువులు, ఏర్పాట్లు, గొంగడి నేసేందుకు ఉన్నిని కత్తిరించే పద్దతి, ఉన్ని దారాలను ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలనేది ఈ పుస్తకంలో వివరించారు. సిద్దమంక చరిత్ర కురుబ సంస్కృతికి అద్దం పడుతోందని పలువురు కురుబ చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కురుబ కులం వారిని కళ్యాణ పట్టణంలోకి అనుమతించాలంటూ మంకమరుళ లేదా మంకసిద్ద చేసిన తపస్సుకు భయపడి మహారాజు బిజ్జాలుడు అక్కడికి వచ్చి ప్రవేశ అనుమతి మంజూరు చేస్తాడు. మహారాజు బిజ్జలుడితో పాటు ఆయన ప్రధాన మంత్రి బసవన్న, మహా శివుడు, కురుబ కులం ప్రధాన గురువులు అల్లమ ప్రభు, రేవన సిద్దేశ్వరుడు, సిద్దరాముడు అక్కడికి వస్తారు. మరులమంక ప్రారంభించిన తపస్సును పరీక్షించేందుకు పరమ శివుడు అక్కడికి వస్తే, మరులమంకకు మద్దతుగా నిలిచేందుకు అల్లమ ప్రభు, రేవన సిద్దేశ్వరుడు అక్కడికి చేరుకున్నట్లు మరులమంక చరిత్ర చెబుతోంది. తపస్సు చేస్తున్న మరులమంకకు రక్షణగా నిలబడిన హేగ్గే గౌడ కురుబల నగర ప్రవేశం కోసం తన తలను నరుకు కోవటం, అతని భక్తికి మెచ్చిన శివుడు అతన్ని తిరిగి బతికిస్తాడు. ఈ హేగ్గే గౌడ మొదటి భార్య సంతానమే పత్తి కంకణం కురుబలు అని సిద్దమంక చరిత్ర చెబుతోంది.


సిద్దమంక చరిత్రలో 'ఒడెయర సంప్రదాయం' గురించి విపులంగా చర్చించారు. ఒడేయర సంప్రదాయం అంటే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ లోని ఒగ్గు పూజారుల సంప్రదాయమే. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లోని ఒగ్గు పుజారులు కురుమ కులం ప్రజలకు సంబంధించిన పెళ్ళిళ్ళు, గృహప్రవేశాలు, నామకరణం, శవ సంస్కారం, దహన సంస్కారం తదితర బాధ్యతలన్నీ నిర్వహించవలసి ఉంటుందనేది అందరికి తెలిసిందే. కర్ణాటకలోని ఒడెయర్లు కూడా కురుబ కులానికి సంబంచిన్న అన్ని సామాజిక బాధ్యతలు నిర్వహిస్తారని సిద్దమంక, టగర పవాడ చెబుతున్నాయి. ఒకానొక కాలంలో ఒగ్గు లేదా ఒడేయరు సంప్రదాయం బ్రాహ్మణ పూజా సంప్రదాయంతో సమాన స్థాయికి ఎదిగినట్లు ఈ పుస్తకాలు చెబుతున్నాయి. బ్రాహ్మణ పూజా విధానంతో సమానమైన పూజా విధానం కురుబ కులంలో ఉండేదనేందుకు ఈ రెండు పుస్తకాలు ప్రబల నిదర్శనం. కురుమ,

కురుబ తదితర గొర్రెలకాపర్లు ప్రస్తుతం తమ కుల సంప్రదాయం కంటే బ్రాహ్మణ సంప్రదాయానికి అధిక ప్రాధ్యాన్యత ఇవ్వటం వలన తెలంగాణలో ఒగ్గు పూజారుల ప్రాధాన్యత తగ్గుముఖం పట్టటం విచారకరం.

కళ్యాణపట్టణం నుండి బహిష్కరణకు గురైన గొర్రెల కాపర్లకు ఆ పట్టణంలో తిరిగి స్థానం, సముచిత ప్రాధాన్యత కల్పించేందుకు శాంత ముత్తయ్య, మరులమంక చిత్తశుద్ధితో కృషి చేసినట్లు టగర పవాడ, సిద్దమంక చరిత్ర ప్రకటించాయి. కర్ణాటకలో కురుబ కులస్తులు ఉన్న ప్రతి గ్రామంలో ఒడేయర్ల వ్యవస్త అమలులో ఉండేదని ఈ పుస్తకాలు తెలిపాయి. ఏదైనా ఒక గ్రామంలో పూజ జరిపించవలసిన సమయానికి ఆ గ్రామానికి చెందిన ఒడేయరు లేదా అతని భార్య ఒడేయరమ్మ అక్కడ లేని పక్షంలో వారి గృహంలోని విభూతిని తెచ్చి తమ గృహంలోని పూజా మందిరంలో పరిచి పెట్టిన నల్ల గొంగళిపై ప్రతిష్ఠించి దానిని ఒడేరయ్య ప్రతినిధిగా భావించి భక్తితో పూజించటం ద్వారా తాము చేయదలచుకున్న పూజను నిర్వహించేవారని ఈ పుస్తకాలు తెలిపాయి. అంటే కురుబ వర్గం ప్రజలు అప్పట్లో ఒడేయరు పాత్ర లేకుండా ఎలాంటి పూజ ఇతర క్రతువులను నిర్వహించేవారు కాదనేది సుస్పష్టం.

నరసింహాచారి ఎడిట్ చేసిన సిద్దమంక చరిత్ర మరో పేరు 'సిద్ధరామ సాంగత్య'. మంకయ్య ఆధునిక కురుమ, కురుబ కులం వారి మూల పురుషుడని ఈ గ్రంథం చెబుతోంది. వీరశైవ కులానికి చెందిన మంకయ్య ధ్యానంలో ఉన్నప్పుడు పరమ శివుడు ప్రత్యక్షమై హాలుమాత ప్రజలను చైతన్య పరచాలని హితవు చెప్పారనీ, శివుడి ఆదేశం మేరకు మంకయ్య కురుబ , కురుమ కులం ప్రజల్లో సంస్కరణలను అమలు చేసి ఖ్యాతి గడించాడని అంటారు. కురుబ, కురుమ కులం వర్గంలో సంస్కరణలను అమలు చేసిన మంకయ్య సంఘ సంస్కర్త అవుతాడు తప్ప కురుబల మూలపురుషుడు ఎలా అవుతాడు? ఇప్పుడు మంకయ్య చరిత్రగా పిలువబడుతున్న సిద్దరామ సాంగత్య ను విశ్వసించలేము. మూల పురుషుడు అంటే అతని నుండి ఆ కులం లేదా వర్గం ప్రారంభం కావాలి. అప్పటికే ఉన్న కులం వారిని సంస్కరించటం వలన సంస్కర్త అవుతాడు తప్ప మూల పురుషుడు కాలేడన్నది నా అభిప్రాయం. ఇదిలా ఉంటే తాను ఘోరమైన తపస్సు చేసి సాధించిన ఫలం నుండి కురుబ కులం ఉద్భవించిందని కౌరభ అనే కవి చెప్పుకున్నారు. ఈ కౌరభ ఋషికి సంబంధించిన వివరాలు అందుబాటులో లేవు. ఒకటి, రెండు కన్నడ పుస్తకాలలో కౌరభ ఋషి ప్రస్తావన ఉన్నది.





రేణుక కావ్య, రుద్ర భారత

కురుమ, కురుబలకు సంబంధించిన ఈ గ్రంథంలో కులం పుట్టుకకు సంబంధించిన కొంత సమాచారం ఉన్నది. ఈ గ్రంథం ప్రకారం కైలాసంలో పరమ శివుడి సమక్షంలో ఆస్థాన నర్తకి భ్రుంగి చేస్తున్న మూడు కాళ్ళ నృత్యాన్ని ఒక దేవ కన్య, పలువురు గంధర్వులు పరిహసిస్తారు. తనను పరిహసించిన వారిని భ్రుంగి శపిస్తాడు. భ్రుంగి శాపం మూలంగా దేవ కన్య, ఆమెకు సంబంధించిన గంధర్వులు మరు జన్మలో గొర్రెలుగా పుట్టవలసి ఉంటుంది. దేవ కన్య, ఇతర గంధర్వులు శాప భయంతో సమీపంలోని గుహలోకి వెళ్ళిపోతారు. వారు గుహలోకి వెళ్ళిన అనంతరం దానిని మూసివేస్తారు. ఈ గుహ కురుక్షేత్రంలోని కురువేరేశ్వర దేవాలయం, గండకీ నదికి సమీపంలో ఉన్నదని అంటారు. గతంలో ఈ ప్రాంతాన్ని కురుపటిపు అని పిలిచే వారు. మరో కథనం ప్రకారం ఆదిగౌండ అనే రైతుకు పద్మన్న లేదా పద్మక్య అనే కుమారుడు ఉండే వాడు. పని, పాటా లేకుండా తిరుగుతున్న అతన్ని అందరు తిండిపోతు అని పిలిచేవారు. పద్మక్య సోమరితనంతో విసిగిపోయిన అతని తండ్రి అతన్ని ఇంటి నుండి గెంటివేసి పక్కన ఉన్న పొలాన్ని దున్నుకుని బతకాలని ఆదేశిస్తాడు. అయితే పొలంలోని పలాస చెట్టును ఎటువంటి పరిస్థితిలో కూడా కొట్టివేయ కూడదు, పుట్టను కదిలించ కూడదని షరతు విధిస్తాడు. పద్మన్న తండ్రి ఆదేశాలకు విరుద్దంగా పొలంలోని పుట్టను తవ్వగానే అందులోనుండి ఆరు రకాల గొర్రెలు బైటికి వచ్చి తమకు ఆహారం పెట్టాలని అడుగుతాయి. గొర్రెలను మేపటంతో పాటు వాటికి ఆహారం ఎక్కడి నుండి తెవాలనేది అర్థం కాని పద్మన్న సహాయం కోసం శివున్ని ప్రార్థిస్తాడు. శివుడు ప్రత్యక్షమై గొర్రెలను ఎలా పోషించాలనేది నేర్పించటంతో పాటు గొర్రెల పెంపకాన్ని వృత్తిగా స్వీకరించాలని సూచిస్తాడు. గొర్రెల పెంపకంలో అనుభవం లేని పద్మన్నకు సహాయం చేసేందుకు శివుడు తన సహాయకుడు బీరదేవరు లేదా విరేశను ఇచ్చి వెళతాడనేది మరో కథనం. పద్మన్న సంతతి వారు గొర్రెల పెంపకాన్ని తమ కుల వృత్తిగా చేసుకోవటంతో పాటు బీరన్న, బీరలింగేశ్వర, బీరప్పను తమ గురువుగా స్వీకరించారు..

కాడు కురుబ ఉప కులం పుట్టుక విషయంలో కుడా ఒక కథ ప్రచారంలో ఉన్నది. పంచ పాండవులలో ఒకడైన భీముడు, హిడింబి కి పుట్టిన రాక్షస కూతురు, పద్మన్న సంతానమే కాడు కురుబ ఉప కులము వారని ఈ కథ చెబుతోంది. పద్మన్న మరో భార్య పేరు సుమాలిని. ఈమె సునందుడి కూతురు. పద్మన్న,సుమాలిని సంతతి వారే కాల

క్రమంలో ఉరు కురుబలుగా పేరుగాంచారు. ఈ ఉరుకురుబ వారే తరువాత హాలు కురుబ, హ్యాండే కురుబ మరియు కంబలి కురుబలుగా విడిపోయారన్నది ఈ పుస్తకం వాదన.

థర్ స్టన్ సిద్ధాంతం

థర్ స్టన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం కురుమ, కురుబ కులం కాపు వర్గం నుండి పుట్టిన కులం. తూర్పు కనుమల్లో నివసించే మసి రెడ్డి నీలమ్మ కురుబల పూర్వికులు. మసిరెడ్డి, నీలమ్మకు ఆరుగురు కుమారులు. అత్యంత బీదవారైన మసిరెడ్డి, నీలమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని పరమ శివుడు భావిస్తాడు. శివుడు జంగమ రూపంలో వారి ఇంటి ముందు ప్రత్యక్షం అవుతాదు. మసిరెడ్డి కుటుంభం చేసిన సేవతో సంతృప్తి చెందిన శివుడు నీలమ్మకు విభూతిని బహుకరించి ఏడో సంతానం కలిగిన తరువాత కష్టాలు తీరుతాయని అభయమిచ్చి వెళతాడు.

నీలమ్మ తన ఏడవ సంతానానికి ఉండాల పద్మన్న అని పేరు పెడుతుంది. పద్మన్న జన్మించిన తరువాత మసిరెడ్డి కుటుంభం బాగా అభివృద్ధి చెందుతుంది. పరమ శివుడి అనుగ్రహం మేరకు మసిరెడ్డి కుటుంభం వారంతా ధనవంతులవుతారు. ఉండాల పద్మన్న ఎలాంటి పని చేయకుండా సోమరిపోతు జీవితం గడుపుతుంటాడు. పెళ్లై ఒక కొడుకుపుట్టినాపద్మన్నలోమార్పురాదు. పని,పాటాలేకుండఇంట్లోకూర్చొని తింటున్న పద్మన్న పట్ల ఇతర సోదరులు కోపంతో ఉంటారు. పద్మన్నను వదిలించుకునేందుకు వారు ఒక పథకం వేస్తారు. తమ పొలంలోని పాముల పుట్టవద్ద ఉన్న ఒక పొదను కాల్చి శుభ్రం చేయాలని పద్మన్నను వారు ఆదేశిస్తారు. పొదకు మంట పెడితే దాని మధ్యలో ఉన్న పుట్టలోని పాము కరిచి పద్మన్న మరణించాలన్నది వారి దురాలోచన. పద్మన్న పొదను తొలగించే ప్రయత్నంలో పుట్టను తవ్వితే అందులో నుండి పాములకు బదులు పెద్ద సంఖ్యలో గొర్రెలు బైటకి వస్తాయి. బైటికి వచ్చిన గొర్రెలు పద్మన్న చుట్టు చేరి తమకు ఆహారం పెట్టాలని అరుస్తాయి. గొర్రెల అరుపులతో భయపడిపోయిన పద్మన్న అక్కడి నుండి పారిపోతారు. పాముల పుట్ట నుండి బైటికి వచ్చిన గొర్రెలను ఏం చేయాలో చెప్పాలంటూ పరమ శివున్ని ప్రార్థిస్తాడు. గొర్రెలను మేపటం తనకు రాదని పద్మన్న చెప్పటంతో అతనికి సహాయం చేసేందుకు పరమ శివుడు భూలోకంలోనే ఉండిపోతాడు. పరమ శివుడు ఒక రోజు రాక్షసుల అదుపులో ఉన్న నిప్పు తిసుకురావాలంటూ

పద్మన్నను దూర ప్రాంతానికి పంపిస్తాడు. అగ్నిని తన అదుపులో పెట్టుకున్న రాక్షసి వద్ద ఒక యువతి బందీగా ఉంటుంది. నిప్పు కోసం వచ్చిన పద్మన్నను ఆ యువతి ప్రేమిస్తుంది. వీరి ప్రేమ వ్యవహారం కాల క్రమంలో రాక్షసికి తెలిసిపోతుంది. రాక్షసితో భయపడిన అ యువతి తన ప్రియుడు పద్మన్నను బల్లిగా మర్చి గోడ మీద పెడుతుంది. ఆ తరువాత పద్మన్న ఆ యువతి రాక్షసిబారి నుండి తప్పించుకుంటారు. పద్మన్న రాక్షసి నుండి తెచ్చిన నిప్పుతో పొయ్యి వెలిగించి పాలను మరిగించటంతో పాటు అన్నం వండేందుకు కూడా ఉపయోగిస్తాడు. పద్మన్న ఆ యువతిని తన రెండో భార్య గా పెళ్లి చేసుకుంటాడు. ఆమెకు కలిగిన సంతానమే గొర్రెల కాపర్లని థర్స్టన్ తెలిపారు

జిరగా చపగోడు

కర్ణాటక రాష్ట్రానికి చెందిన కురుబ కులం ప్రజలు 'జిరగా చపగోడు' అనే ఒక ప్రత్యేక పుస్తకాన్ని అనుసరిస్తారని మెకెంజీ దాదాపు నూటా పది సంవత్సరాల క్రితం రాసిన పత్రాలలో పేర్కొన్నాడు. కన్నడ భాషలో లిఖించబడిన ఈ పుస్తకం ప్రకారం కురుబ వర్గం ప్రజలు నడుచుకుంటారని మకెంజీ తెలిపారు. కురుబలు 'బీరప్ప' లేదా 'బిరయ్' అనే దేవుడిని పూజిస్తారనీ, ఈ కులం వారే పూజారులుగా వ్యవహరిస్తారని మకెంజీ తన పత్రాలలో పేర్కొన్నారు. కురుబ ప్రజలు కొన్ని ప్రాంతాలలో 'బట్టి దేవరు' అనే దేవతను పుజిస్తారు. శక్తి దేవతకు బలులు అర్పించే కురుబలు పంచ పాండవులలో పెద్ద వాడైన ధర్మ రాజును మాత్రం పూజించరని మెకెంజీ తెలపటం గమనార్హం. కురుమ, కురుబ వర్గం ప్రజలు ఏ కారణం చేత ధర్మరాజును పుజించరనేది మాత్రం ఆయన తన పత్రాల్లో వెల్లడించలేదు. కళ్యాణపట్టణం సమీపంలోని సరుర్ లో నివసించే రేవన సిద్దేశ్వరుడిని కురుబలు తమ గురువుగా భావిస్తారని మెకేంజీ పేర్కొన్నారు. తుమ్కూర్ లోఉన్న కురుబ దేవాలయంలో మెడలో లింగం, చేతిలో ఖడ్గంతో గుర్రంపై సవారీ చేసున్న విగ్రహాన్ని కురుబ ప్రజలు పూజిస్తారని మెకెంజి తెలిపారు.

మాలింగరాయ



ముద్దవ్వ, ముద్దుగౌండ పార్వతీపరమేశ్వరుల మానస పుత్రులు. ముద్దవ్వ, ముద్దుగౌండ మూలంగానే హాలుమత లేదా కురుమ, కురుబ ప్రజలేర్పడ్డారు. ఆదిగౌండ, అనంతగౌండ, సిద్దగౌండ, పడుమగౌండ అనే నలుగురు వీరి సంతానం. పదమగౌండను పద్మగౌండ అని కూడా పిలుస్తారు. పద్మగౌండ ఆ తరువాత మహాలింగారాయగా అవతారం ఎత్తారు. ఈ మహాలింగరాయుడే మధ్యభారతదేశంలోని గోండు తెగకు చెందిన పశుపతి, శంభు మహాదేవ్. దక్షిణ భారతదేశంలోని హాలుమతస్తులు ఇతనిని మహాలింగ, మాలింగరాయన అనే పేర్లతో పిలుస్తారు. మాలింగరాయడు హాలుమత, కురుబ, కురుమ వర్గం ప్రజల సాంస్కృతిక వీరుడు అని వివిధ పురాణాలు సూచిస్తున్నాయని డాక్టర్ కే.ఎం. మైత్రి తన 'మాలింగరాయ కావ్యం' అనే వ్యాసంలో తెలిపారు. డా. వీరన్నదండె సంపాదకత్వంలో వెలువడిన 'జానపద హాలుమత మహాకావ్యం' అనే పుస్తకంలో మాలింగరాయ తన జీవితంలో సాధించిన విజయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. సిద్దప్పమేటికీ హాలుమత కురుబ పురాణం కంఠస్తమనేది అందరికి తెలిసిందే. బీరప్ప గొర్రెలు కాచే వర్గానికి చెందినవాడైతే మాలింగారాయ ఆవులు కాచే వర్గానికి చెందినవాడు. పోరాడే ప్రవృత్తితో పాటు స్వాభిమానం, గురుభక్తి ఉన్న మాలింగ రాయుడు శివుడి అవతారంగా భావించే బీరప్ప శిష్యుడు. బీరప్ప స్వామి గౌడగిరిపై తపస్సు చేసినప్పుడు మాలింగరాయ అతనికి పూర్తి భక్తితో సేవచేశాడు. మాలింగరాయ తన గురువైన బీరప్ప దేవుడికి గుడి కట్టించి పూజలు చేసినట్లు మాలింగారాయ కావ్యం చెబుతోంది. సూరమ్మదేవి, ఆమె భర్త బరమదేవ, అన్న కలినారాయన, శివుడికి పూజలు చేయటం, భూలోకంలో బీరప్ప దేవుడికి, మాలింగరాయను పూజించే ప్రజలకు సంబంధించిన వివరణ ఈ కావ్యంలో ఉన్నది.

కోయ వంశానికి చెందిన గోండు వర్గం ప్రజలు కాలక్రమంలో ముప్పై ఒక్క ఉప కులాలుగా విడి పోయారు. గోండు వర్గం ప్రజల మూల పురుషుడైన పారికుపాకలింగు మరియు కురుబ వర్గం గురువైన రేవణసిద్దేశ్వరుడు ఒక్కరేనని, కోయ, కురుబ వర్గం ప్రజలు ఒకరేనని అభిప్రాయం ఉంది.

గోండు గిరిజన జాతి దేవుడు 'బారాదేవుడు' హాలుమత పురాణంలోని బీరదేవ మహాలింగ ఒకరేనని కే.ఎం. మేత్రి అభిప్రాయపడ్డారు. శంభు, మహాదేవ, మహాలింగ తదితర పేర్లతో పిలువబడే శివుడు ఆర్యుల కంటే దాదాపు పది నుండి పన్నెండు వేల సంవత్సరాలకు పూర్వం వాడని ఆయన తెలిపారు. శివునికి అత్యంత ప్రియమైన సంగీత వాయిద్యాలు డమరు లేదా డోలు. శివుడిని వేల సంవత్సరాల నుండి ఆరాధిస్తున్న ఆదివాసి గోండు వర్గం వారు కూడా డమరుకం లేదా డోలును ఉపయోగిస్తారు. గోండు ప్రజల మూల మానస పుత్రుడు కుపార లింగు. అతను శివుని డమరుకం లేదా డోలు ధ్వని నుండి వచ్చే శబ్దార్థం 'గోండవాణి' అని గ్రహించి కోయల సత్యధర్మాన్ని తన వేలాదిమంది శిష్యుల ద్వారా ప్రచారం చేశారని డాక్టర్ మేత్రి తమ వ్యాసంలో తెలిపారు. కోయ వంశానికి చెందిన గోండు వర్గం ప్రజలు కాలక్రమంలో ముప్పై ఒక్క ఉప కులాలుగా విడి పోయారు. గోండు వర్గం ప్రజల మూల పురుషుడైన పారికుపాకలింగు మరియు కురుబ వర్గం గురువైన రేవణసిద్దేశ్వరుడు ఒకరేననే అభిప్రాయం ఉన్నదని డాక్టర్ మేత్రి చెప్పారు. కోయ, కురుబ వర్గం ప్రజలు ఒకరేనని డాక్టర్ మేత్రి వాదించారు. గొర్రెల కాపర్లకు సంబంధించిన 'అజప వేదం' మరియు కోయ వర్గం ప్రజల 'పునేమా' దాదాపు పది నుండి పన్నెండు వేల సంవత్సరాల క్రితమే రూపొంది ఏడువేల సంవత్సరాల క్రితం బాగా పలుకుబడిలోకి వచ్చాయని ఆయన తెలిపారు. హాలుమత వర్గం మధ్య భారత దేశంలోని గోండు వర్గ ప్రజలు ఒకరే అనే అభిప్రాయం కలుగుతోంది. దీని గురించి తెలుసుకునేందుకు కర్నాటక రాష్ట్రంలోని గుల్బర్గా విశ్వవిద్యాలయంలో ఉన్న కుశనూరు మహాలింగ దేవస్థానాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నది. గుల్బర్గా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయక ముందు ఆ భూమి అంతా కుశనూరు గ్రామలోని గొర్రెలకాపర్లది. కుశనూరు గ్రామంలో ఉన్న కొండను మహాలింగన కొండ అని పిలుస్తారు. ఈ గుట్ట పరిధిలోని చాలా భూమిని గుల్బర్గా విశ్వవిద్యాలయం అతిథి గృహం మరియు వసతి గృహం నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించింది. ఎన్నో తరాల నుండి ఇక్కడ

నివసిస్తున్న గొర్రెలకాపర్లు ఇక్కడ మహాలింగ దేవాలయాని గతంలో ఎప్పుడో నిర్మించుకున్నారు. గుల్బర్గా విశ్వవిద్యాలయం అతిథి గృహం ప్రాంగణంలో ఏడుగురు పిల్లల తల్లి ప్రాచీన దేవాలయం ఉన్నది. దీనితో పాటు ఎగువన రాతిగంట మహాలింగన మూల ప్రాచీన దేవాలయం ఉన్నది. మహాలింగ దేవుడి పరివారంలోని భరమలింగ,బీరలింగ, మైలారలింగ ఇత్యాది దేవతలు కూడా ఇక్కడ పుజలందుకుంటున్నారు. బీరలింగేశ్వరుడి పరివారంలో మహాలింగ రాయ ఒక సభుడుగా కనిపించటం గమనార్హం. కర్ణాటక, అవిభాజిత ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలలోని అడవులు, కొండలు, గుట్టలు, లోయలు, నదిపరివాహక ప్రాంతాలలో బీరలింగ స్థావరాలుకనిపిస్తాయని డాక్టర్ మైత్రి తమ వ్యాసంలో పేర్కొన్నారు. మధ్య భారత దేశంలోని గోండు గిరిజన బారాదేవుడు, కర్ణాటకలోని హాలుమత కురుబ వర్గం దేవుడు బీరదేవడు-బీరలింగ-మహాలింగ దేవుడు ఒకరే. అందుకే హాలుమత కావ్యము ఒక చారిత్రాత్మిక సంఘటన అని ఆయన అభిప్రాయపడ్డారు. పశుపతి రూపంలో ఉన్న మహాలింగ దేవుడు సింధు, హరప్పా తవ్వకాలలో కూడా కనిపించటం గమనార్హమని

చెన్నబసవకవి విరచిత 'హాలుమత పురాణం' !

కురుబ, కురుమ వర్గానికి సంబంధించి ఇంతవరకు అందుబాటులో ఉన్న వివిధ గ్రంథాలు, కావ్యాలు, ఇతర పుస్తకాలను లోతుగా అధ్యయనం చేసి వాటిలోని సారాన్ని గ్రహించి హాలుమత పురాణాన్ని రచించినట్లు ఈ పుస్తక రచయిత చెన్నబసవకవి చెప్పుకున్నారు. గొర్రెలకాపర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసమే తానీ కావ్య పురాణాన్ని రచించినట్లు అయన ఈ పుస్తకం పీఠికలో పేర్కొనటం గమనార్హం. చెన్నబసవ కవి రచించిన హాలుమత పురాణంలో పదిహేను అధ్యాయాలున్నాయి. గొర్రెలకాపర్ల గురువులు అల్లమప్రభు, చెన్నబసవన్న, బసవన్న,రేవనసిద్ద తదితరుల ప్రార్థనతో మొదటి అధ్యాయం ప్రారంభమవుతుంది. గొర్రెల కాపర్ల ముఖ్య లక్షణాలు, కర్తవ్యాలను వివరించటంతో పాటు గుడదయ్య దేవుని స్మరణ మొదటి అధ్యాయంలో ఉన్నది. భూమి మీద జరిగే అన్ని కార్యక్రమాలను వివరించటంతో పాటు కొల్లిపాకంలోని సోమేశ్వర లింగం నుండి రేణుక ఉద్భవించటం గురించి ఈ అధ్యాయంలో వివరించారు. కైలాసంలో శివపార్వతి, భ్రుంగికి సంబంచించిన వివరణ కూడా ఈ పుస్తకంలో ఉన్నది.

రెండవ అధ్యాయం:

శాంతముత్తయ్యకు లింగ ప్రధానం, ఉపదేశం ఇవ్వటం గురించి వివరించారు. శాంతముత్తయ్య సంతానం సుప్వి ముత్తయ్య, జగ ముత్తయ్య, లలిత ముత్తయ్య గురించి ప్రస్తావించటంతో పాటు ప్రపంచంలోని లోపాలను సరిదిద్దే సమాజ సంస్కరణ కార్యం కోసం శాంతముత్తయ్యకు రేవణసిద్ద లింగ దీక్ష ఇవ్వటం, హాలుమతస్తులకు జీవన విధానాన్ని బోధించే బాధ్యతలను శాంత ముత్తయ్యకు అప్పగించటానికి సంబంధించిన వివరాలు ఇందులో ఉన్నాయి. రేవణసిద్దేశ్వరుడు ఆదేశించిన విధంగా శాంతముత్తయ్య కొల్హాపురంలోని కుటిల సిద్దుల దుష్కర్మలను అరికట్టి వస్తుండగా ఎదురువచ్చిన ముండాసుర రాక్షసున్ని మూడు ముక్కలుగా వధించి 'మురుడిన కంథె అనే బిరుదు పొందినట్లు ఈ పురాణం చెబుతోంది. శాంత ముత్తయ్య 'కురుబ రట్ట మత శాస్త్ర' అనే పుస్తకం రాసినట్లు రెండో అధ్యాయం తెలుపుతోంది.

మూడవ అధ్యాయం:

కైలాసంలో ముని ఇచ్చిన శాపం మూలంగా భూలోకంలో ఆదిగొండ జన్మించడం గురించి మూడో అధ్యయనంలో వివరించారు. రేవణసిద్దేశ్వరుడి ఆశీర్వాదం మూలంగా ఆదిగొండకు ఆరవ మగ సంతానంగా శివపద్మ జనించటం, హాలుమతవర్గం ప్రారంభం గురించి ఇందులో వివరించారు.

నాల్గవ అధ్యాయంలో శివపద్మ బాల్యం, తల్లిదండ్రులు అతనికి నామకరణం చేయించడం, శివ పద్మను అల్లారు ముద్దుగా పెంచటం, జోల పాటలు పాడుతూ ఉయ్యాల ఊపటం తదితర అంశాలున్నాయి.

ఐదవ అధ్యాయం:

శివపద్మ బాల్యంలో చేసిన లీలలు వర్ణించబడ్డాయి. బాల్యాన్ని తుంటరితనంతో గడిపిన శివపద్మ యవ్వనంలో అడుగు పెట్టగానే తల్లిదండ్రులు అతనికి జింకా దేవితో వివాహం చేస్తారు. మహిళల గౌరీ పూజ, పంచకలశ పూజతో శివపద్మ, జింకాదేవి వివాహం శాస్త్రోక్తంగా జరుగుతుంది. శివపద్మ, జింకాదేవి వివాహానికి హాజరైన రేవణసిద్దేశ్వరుడు నవ దంపతులు ఆదర్శ జీవితం ప్రారంభ గానే జాగ్రతిపురానికి వెళ్ళిపోతారు. ఆయన జాగ్రతిపురంలో బడవిగంగమ్మ ఇంటికి వెళ్లి ఆమె నిష్ఠ, భక్తికి మెచ్చి ఐశ్వర్యాన్ని అనుగ్రహిస్తాడు. ఆదిగొండ నివాసానికి వెళ్లి అక్కడ ఆదర, సత్కారాలు

పొందుతాడు. ఈ సందర్భంగా రేవణ సిద్దేశ్వరుడు అక్కడున్న వారికి ధర్మం,నీతిని భోదిస్తాడు. రేవనసిద్దేశ్వరుడు శివపద్మకు పెళ్లి వేడుకల సందర్భంగా మెడలో లింగం వేసి ఆశిర్వదించిన అనంతరం గొర్రెలను కాచుకుంటూ జీవితాన్ని గడపాలని ఆదేశిస్తాడు.

ఆరవ అధ్యాయం:

ఇందులో గొర్రెల ఉద్భవానికి సంబంధించన మారో కథనం ఉండటం గమనార్హం. పరమశివుడి ఆదేశం మేరకు జాబాలముని భూలోకంలో ఘోరమైన తపస్సు చేస్తూ మౌన ముద్ర కొనసాగిస్తుంటాడు. గంగాధర్ అనే వ్యక్తి కొన్ని కారణాల మూలంగా మౌనం పాటిస్తున్న జాబాలమునిని హత్య చేస్తాడు. హత్యకు గురైన జాబాలముని రక్తం నుండి అసంఖ్యాక గొర్రెలు ఉద్భవించి అందరినిని ఆశ్చర్యంలో పడవేస్తాయి. జాబాలముని రక్తం నుండి పుట్టిన అసంఖ్యాక గొర్రెలను కాయటం ఎవ్వరితరం కాదు. బ్రహ్మ కూడా ఈ గొర్రెలను కాయవలసివచ్చినట్లు ఈ పుస్తకం చెబుతోంది. అందరు విసుగు చెందటంతో చివరకు పార్వతి గొర్రెలను కాచే బాధ్యతను తన కొడుకు గణపతికి అప్పగించిందని బసవకవి హాలుమత పురాణం చెబుతోంది. నిలకడ లేకుండా తిరిగుతున్న గొర్రెలను పార్వతి ఒక బిలంలో పెట్టి ఆ బిలాన్ని గుర్తించేందు కోసం అక్కడ తన ముక్కెరను నాటి కాపలా కోసం వీరభద్రుణ్ణి నియమించినట్లు ఈ పురాణం చెబుతోంది. శివపద్మనికి రేవన్న అనే కుమారుడు కలగటం, సోదరుల అసూయతో కూడిన వ్యవహారాలతో విసిగిపోయిన శివపద్మ వ్యవసాయం చేసుకునేందుకు వెళ్ళిపోవటం గురించి ఈ అధ్యాయంలో వివరించారు.

శివపద్మ తనకు కేటాయించిన భూమిని దున్నేందుకు నాగలిని ముందుకు నడిపించగానే భూమిలో నుండి పలు రంగుల గొర్రెలు బైటికి వచ్చినట్లు ఏడవ అధ్యాయం వెల్లడించింది. శివపద్మ గొర్రెలను మేపేందుకు వాటిని అడవికి తోలుకుపోతాడు, అడవిలో గొర్రెలు కాచేందుకు తనకు తోడు కావాలంటూ శివపద్మ చేసిన ప్రార్థనకు కరిగిన శివుడు ప్రత్యక్షమై అతనికి తోడు కోసం వీరేశ్వరున్ని నియమిస్తాడు.

ఎనిమిదవ అధ్యాయం:

శాపగ్రస్తులైన ముగ్గురు గంధర్వులు కాకి, కాంచాల మర్రిచెట్టు, రాక్షసిగా భూలోకంలో జన్మించారని ఈ అధ్యాయంలో వివరించబడింది. రాక్షసిగా జన్మించిన గంధర్వుడు జాగ్రతిపురం రాకుమారి చుమలాదేవిని కరుణతో పెంపకానికి తీసుకున్నట్లు

ఈ అధ్యాయం చెబుతోంది. అయితే తెలంగాణాలో ప్రచారంలో ఉన్న ఒగ్గు కథలు, ఇతర కథల్లో ఈ రాక్షసి బ్రాహ్మణ యువతి రత్నంగిని బలవంతంగా ఎత్తుకు వచ్చి తన వద్ద బంధీగా పెట్టుకున్నట్లు చెప్పటం తెలిసిందే. అడవిలో గొర్రెలు కాస్తున్న మల్లన్న ఒకరోజురాక్షసిచెరలోఉన్నరత్నంగినిచూడటం,ఆతరువాతరాక్షసినివధించి రత్నంగిని పెళ్లి చేసుకోవటం తెలిసిందే. మల్లన్నకు రత్నంగికి పుట్టిన వారే ఉన్ని కురుమలనే వాదన జగద్విధితం.

తొమ్మిదవ అధ్యాయం:

శివపద్మ తెలివిగా వ్యవహరించటం ద్వారా రాక్షసి ప్రాణాలు కాంచాలమర్రి చెట్టుపై ఉన్న కాకిలో ఉన్నాయనేది తెలుసుకుంటాడు. కంచాల మార్రి చెట్టుపై ఉన్న కాకిని చంపటం ద్వారా రాక్షసిని హతమారుస్తాడు. రాక్షసి మరణంతో ముగ్గురు గంధర్వులకు శాపవిమోచన జరుగుతుంది. శాపం నుండి విముక్తి లభించగానే ముగ్గురు గంధర్వులు కైలాసానికి వెళ్ళిపోతారు. శివపద్మ మరణించిన రాక్షసి అవయవాల నుండి కంకణాలు తయారుచేసి వాటిని బంకాపురంలో పెట్టారు.శివుడి ఆజ్ఞ మేరకు బంకన్న అనే వ్యక్తిని కంకణాల పరిరక్షణ కోసం కాపలా పెడతాడు. గురువు రేవణసిద్దేశ్వరుడి సమక్షంలో శివపద్మ, చుమలాదేవి వివాహం చేసుకుంటారు.

పదవ అధ్యాయం:

ఇందులో తొంబై తొమ్మిది పద్యాలున్నాయి. శివపద్మ తన భార్య చుమలాదేవిని తీసుకుని తన మొదటి ఊరు జాగ్రతిపురానికి వస్తాడు. చాలా కాలం తరువాత వచ్చిన శివపద్మను అతని తల్లి,దండ్రులు గుర్తించలేకపోతారు. జంగమ రూపంలో ఉన్న శివుడు శివపద్మను వారికి పరిచయం చేస్తాడు. అప్పుడు శివపద్మ తన తల్లి, తండ్రి, సోదరులకు నమస్కారం చేసిన అనంతరం తన మొదటి భార్య జింకాదేవి, కుమారుడు రేవన్న, రెండో భార్య చుమలదేవితో కలిసి సుఖ జీవితం గడుపుతాడు. శివపద్మ,చుమలాదేవిలకు రేణుక మరియు రేవనాంబ అనే ఇద్దరు పిల్లలు కలుగుతారు. తదనంతరం కథ పూర్తిగా మారిపోతుంది. గంగాజలం తన కాల్లకు తగిలేంత వరకు శివపూజ చేయాలని హరిహర దేవ చంద్రగిరికి చెందిన బరమభుపాలున్ని ఆదేశిస్తాడు. బరమభుపాలుడు సూరమ్మ లేదా సూరవంతి భర్త, బీరప్ప లేదా బీరలింగేశ్వరుడి తండ్రి అనేది తెలిసిందే. హరిహరదేవుడు అంటే బీరప్ప ఒగ్గు కథలలోని నారదుడు లేదా నరభుపాలుడు. అతను తన సోదరి సూరవతిని భరమభుపాలునికి ఇచ్చి పెళ్లి చేస్తాడు. శివుడి ఆశీర్వాదం మేరకు

వారికి శివసిద్ధ బీరప్ప అనే ఒగ్గు పూజారి జన్మిస్తాడు. ఆదిగొండ శాప విమోచనం, శివపద్మకు కైలాస ప్రాప్తి, వీరేశ్వరుడు బీరేశ్వరుడుగా వచ్చి హాలుమత ప్రజలకు దేవుడుగా మారటం, తుక్కప్ప కుమారుడు మాలింగరాయ బీరప్ప లేదా బీరేశ్వరునికి శిష్యుడుగా మారటం గురించి ఇందులో వివరించారు.

పదకొండవ అధ్యాయం:

సురకన్నెకు జన్మించి అనాథలుగా మారిన ఐదుగురు ఆడబిడ్డలు అక్కమ్మ, మాయమ్మ, లక్ష్మమ్మ, మాకాళి లేదా మహంకాళి, మంకమ్మలను చామరాయ అనే అతను తన భార్య శాంభవికి ఇవ్వగా ఆమె వారిని ప్రేమతో స్వీకరిస్తుంది. తన మేనమామ ఐన హరిహర దేవ లేదా నరభుపాలుడి కుతంత్రాల మూలంగా బీరప్ప లేదా బీరేశ్వరుడు పుట్టిన వెంటనే అడవుల పాలై అక్కమ్మ, లేదా అక్క మహాంకాలి ఒడిలోకి చేరుతాడు. అక్కమ్మకు బీరప్ప పూర్వ వృత్తాంతం తెలిసి ఉంటుంది.

పన్నెండవ అధ్యాయం:

శివుడి ఆశీర్వాదం ఉన్న అక్కమ్మ శిశువు విరేశ్వరుడు లేదా బీరేశ్వరుడిని ప్రేమతో పెంచుతుంది. ఆ విధంగా ఆమె గురువు రేవణసిద్దేశ్వరుడి ఆశీర్వాదం పొందుతుంది.అడవిలో అనాథగా పడిఉన్న బీరప్ప ఇప్పుడు గొర్రెల మందల్లో జీవిస్తున్నాడు. మహిళ నెత్తిన ఉన్న నీటి కుండకు రంధ్రం చేసి ఆమె తిట్లు తిన్న బీరప్ప అక్కమ్మ ద్వారా తన పూర్వ వృత్తాంతం తెలుసుకుంటాడు. బీరేశ్వరుడు తన మేనమామ హరిహర దేవ లేదా నరభుపాలుడి కూతురు కన్నికామవ్వను ధైర్యంతో గెలుచుకుని వెంట తెచ్చుకుంటాడు. బీరప్ప ఆ తరువాత తనకు ఒక మంచి శిష్యుడిని ప్రసాదించాలని మహేశ్వరుణ్ణి కోరుతాడు.

పదమూడవ అధ్యాయం:

తనకు ఒక మంచి శిష్యుడిని ప్రసాదించాలంటూ మొరపెట్టుకుంటూ బీరప్ప చేస్తున్న ప్రార్థనను ఆమోదించిన శివుడు ప్రత్యక్షమై బ్రహ్మిదేవి వద్దకు వెళ్లాలని అతనికి సూచిస్తాడు. శివుడి ఆజ్ఞ మేరకు బీరప్ప బ్రహ్మిదేవిని ప్రార్థిస్తాడు. బీరప్ప ప్రార్థనను మెచ్చిన బ్రహ్మిదేవి అతనికి మాలింగరాయ పూర్వ వృత్తాంతం తెలియజేస్తుంది. బీరప్ప బిల్వాడ నగరానికి వచ్చిన తరువాత జలమాయి సరస్సు దగ్గర మాలింగరాయుడిని శిష్యుడిగా పొందుతాడు. గురు, శిష్యులిద్దరు శివుడి ఆశీర్వాదం తీసుకుంటారు.

పద్నాల్గవ అధ్యాయం:

బీరేశ్వరుడు చేసిన ప్రార్థనను మెచ్చిన గురువు రేవణసిద్దేశ్వరుడు ప్రత్యక్షమై ఆశీర్వదించి అతని కోరిక మేరకు హాలుమత పూర్వ వృత్తాంతాన్ని తెలియజేస్తాడు. వీరగొల్లల కథను చెప్పి తాను భూమిపైకి వచ్చి పద్నాలుగువందల సంవత్సరాలు పూర్తి అయినందున తనికి శివ సన్నిధిలోకి వెళ్ళిపోవలసిన సమయం ఆసన్నమైందని రేవణసిద్దేశ్వరుడు బీరప్పతో చెబుతాడు. రేవణసిద్దేశ్వరుడు ఆతరువాత రంభాపురి మఠంలో రుద్రమునికి పట్టాభిషేకం చేసి శివలింగంలో ఐక్యమైపోతాడు.

పదిహేనవ అధ్యాయం:

శివసిద్ద బీరేశ్వరుడు పలు సుక్షేత్రాలను సందర్శించిన అనంతరం బంకాపురానికి వచ్చి పద్మావతారంలో సృష్టికార్యం చేపట్టి బిరుదులు పొందుతాడు. ఆక్కడే బంకన్నకు కైలాస ప్రాప్తి కలుగుతుంది. మాలింగరాయడు కప్పలు తాకని నీటిలోని పువ్వులతో తన గురువైన బీరేశ్వరున్ని పూజిస్తాడు. శివసిద్దబిరేశ్వరుడు పలు అద్భుతాలు చేసిన అనంతరం ఆయనతో పాటు అక్కమ్మ, కన్నికామవ్వ, మాలింగరాయ తదితరులందరు కైలాసానికి వెళ్లిపోయారంటూ చెన్న బసవ కవి విరచిత హాలుమత పురాణం ముగుస్తుంది.

పన్నెండు సంవత్సరాల వనవాసం

కళ్యాణ పట్టణంలో నివసించే హక్కు సాధించేందుకు కుల గురువు బీరప్ప నాయకత్వంలో దాదాపు పన్నెండు సంవత్సరాల పాటు కురుబ వర్గం ప్రజలు ఎడతెగని పోరాటం చేయటం కురుమ, కురుబ చరిత్రలో ఒక మైలు రాయి. కురుబలు కళ్యాణ పట్టణంలో నివసించటంతో పాటు పాలు, పెరుగు, మాంసం విక్రయించే వ్యాపారం చేయాలనుకుంటారు. ఐతే కురుబలు కళ్యాణ పట్టణంలో నివసించేందుకు స్థానిక లింగాయత్ వర్గం వారు ససేమిరా అంగీకరించరు. దీనితో ఇరువర్గాల మధ్య పోరాటం జరుగుతుంది. కళ్యాణ పట్టణంలో తమ కులం వారికి స్థానం సంపాదించేందుకు ముగ్గురు కుల నాయకులు బీరప్ప, శాంత ముత్తయ్య, సిద్దమంక దాదాపు పన్నెండు సంవత్సరాల పాటు పోరాటం చేసినట్లు ఒగ్గు కథలు, సిద్దమంక చరిత్ర, తగర పవాడ తదితర కథలు, ఇతర గ్రంథాలు చెబుతున్నాయి. కళ్యాణ పట్టణంలో కురుబలకు స్థానం సంపాదించేందుకు ముగ్గురు పోరాడినట్లు చెప్పే మూడు కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. కళ్యాణ పట్టణంలో కురుబ వర్గం ప్రజలకు స్థానం సంపాదించేందుకు బీరప్ప, సిద్దమంక,



శాంతముత్తయ్య ఏక కాలంలో కృషి చేశారా? లేక విడి, విడిగా కృషి చేశారా? వీరి పోరాటం ఎలా జరిగింది ? అనే అంశంపై స్పష్టత లేదు. బీరప్ప, సిద్దమంక, శాంత ముత్తయ్య, ఈ ముగ్గురు కూడా ఒకరే అయి ఉండాలి. కాలక్రమంలో ఒకే సంఘటనపై మూడు రకాల కథలు ప్రాచుర్యంలోకి వచ్చి ఉండవచ్చు. కళ్యాణ పట్టణంలో తన వర్గానికి ప్రవేశం సంపాదించేందుకు బీరప్ప తన కుటుంబంతో కళ్యాణపట్టణానికి ఎదురుగానున్న అడవిలో దాదాపు పన్నెండు సంవత్సరాల పాటు గొర్రెలతో మకాం వేసినట్లు ఒగ్గు కథలు చెబుతున్నాయి. బీరప్ప పరమ శివుడి ఆశీర్వాదం, రేవణ సిద్దేశ్వరుడి సహాయంతో మరణించిన గొర్రెను బతికించటం ద్వారా లింగాయత్ లకు తన మహిమలను ప్రదర్శించి తద్వారా కళ్యాణపట్నం రాజు బిజ్జాలుడు , స్థానిక ప్రజల మెప్పు పొందుతాడు. సిద్దమంక చరిత్రలో సిద్దమంక, టగరపవాడలో శాంత ముత్తయ్యలు మరణించిన గొర్రెకు ప్రాణం పోయటం ద్వారా తమ మహిమలను ప్రదర్శించి కళ్యాణ పట్టణంలో కురుబలకు స్థానం కల్పించే లక్ష్యాన్ని సాధించినట్లు ఆయా పుస్తకాలలో తెలిపారు. కురుబలు కళ్యాణ పట్టణంలో స్థానం సంపాదించిన అనంతరం బీరప్ప పలువురు లింగాయత్ లను కులాంతికరణం చేసినట్లి చరిత్ర చెబుతోంది. తమ కులాన్ని మార్చుకునేందుకు ఇష్టపడని లింగాయత్ లు శ్రీశైలానికి వలసపోయారని ఈ గ్రంథాలు చెబుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే బీరప్ప పన్నెండు సంవత్సరాల అడవి జీవితం కళ్యాణ పట్టణంపై ఆధిపత్యం కోసం జరిగిన పోరాటమే తప్ప మరోటి కాదు. కురుబలు కళ్యాణ పట్టణంపై ఆధిపత్యం సంపాదించేందుకు లింగాయత్ లతో పోరాటం చేశారనేది నిజం. ఈ పోరాటంలో ఓడిపోయిన కొందరు లింగాయత్ లు శ్రీశైలానికి పారిపోతే మరికొందరేమో కురుబ కులంలోకి మారటం ద్వారా తమ ప్రాణాలు దక్కించుకున్నారని భావించవలసి ఉంటుంది.

కృష్ణ, భీమా నది మధ్యప్రాంతం వారు.

మల్లన్న, బీరప్ప దాదాపు మూడు వేల ఐదు వందల సంవత్సరాల క్రితం కృష్ణా నదీ, భీమా నది మధ్య ప్రాంతంలో జన్మించిన చారిత్రాత్మిక పురుషులని డాక్టర్ బీనవేణి రామ్ షపర్డ్ చెబుతున్నారు. అమెరికాలోని టెక్సాస్ విశ్వవిద్యాలంలో పోస్ట్ డాక్టోరల్ స్కాలర్ గా పని చేస్తున్న రామ్ షెపర్డ్ వాదన ప్రకారం మల్లన్న, బీరన్నలు మానవాతీత మహిమలు కలిగిన దేవతలు కాదు, 'దక్కన్ జాతి గొర్రెల సంతతిని తయారు చేయటంతో పాటు అడవుల్లో 'మన్నెం వలస దారులు' కనిపెట్టి గొర్రెల మందలకు రక్షకులుగా నిలిచిన మల్లయోధులు, చారిత్రాత్మిక పురుషులు'. 'మల్లన్న ఆయన సోదరుడు (కజిన్) బీరన్న క్రీస్తు పూర్వం **3500** సంవత్సరంలో కృష్ణ భీమానదుల పరీవాహక ప్రాంతంలో జన్మించారు' అని ఆయన చెబుతున్నారు. సింధు నాగరికతలోని పశు పాలకులైన అభిర, ధనగర్ వర్గంలోని హట్కర్ తెగకు చెందిన వీరు ఆర్యుల దండయాత్రల మూలంగా పశు సంపదను, పచ్చిక బైల్లను కోల్పోయి మిగిలిన పశు పంపదతో జీవనం కొనసాగించారు, కొంత కాలం తరువాత వారు ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్హాపూర్ కేంద్రంగా సంచార జీవితం గడిపారు' అన్నది రామ్ షెపర్డ్ వాదన. మల్లన్న గొర్రెలు, మేకల పెంపకం కొనసాగిస్తూ కొల్హాపూర్ నుండి శ్రీశైలం, చెరువుగట్టు, గొల్లగట్టు (సూర్యాపేట), కొలనుపాక,కొమరవెల్లి, ఐనవోలు, కట్ట, ఒదేలమీదుగా కత్తెరశాల ప్రాంతానికి చేరుకున్నారు. ఆయన తిరుగు ప్రయాణంలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం, అక్కడినుండి ఆర్మూరు, పెద్దాపురం, యెల్లారెడ్డి, జహీరాబాద్ కోస్గి, కోడంగల్ మీదుగా కొల్హాపూర్ చేరుకున్నారు. ఈ తూర్పు వలసలకు మల్లన్న నాయకత్వం వహించగా బీరన్న పడమటి వలసలకు ప్రాతినిధ్యం వహించి మందలను పెద్దయేరు (పెబ్బేరు), కర్నూలు, బెంగళూరు మీదుగా ఊటి కొండలకు తీసుకువెళ్ళి కర్ణాటక రాష్ట్రం మధ్య ప్రాంతం నుండి కొల్హాపూర్ కు తన జీవాలను మళ్ళించారు' అని రామ్ షెపర్డ్ ఒక తెలుగు పత్రికకు రాసిన వ్యాసంలో తెలిపారు. 'అడవులు,నదులు వలస మార్గాలను తోటి కాపర్లకు తెలియజేసేందుకు ప్రత్యేకమైన రంగులతో భౌగోళిక చిత్రపటాలను (టోపోషీట్స్) రూపొందించిన మేధావులు వారు' అని ఆయన ప్రకటించారు. ఆనాటి వలస చిత్రపటాలే నేటి పెద్దపట్నం, చిన్నపట్నం, చెల్కపట్నంగా రూపాంతరం చెందాయి, ఈ పట్నాలకు ఒగ్గు సంప్రదాయంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని రామ్ షెపర్డ్ తెలిపారు. 'జానపద, పౌరాణిక సాహిత్యంలో మల్లన్న జీవిత చరిత్రపై బంగారు గొర్రె కథ, పందెం కథ, బండారి

గడ్డ కథ, కాపుల ఘట్టం కథ, గొల్ల కేతమ్మ కథ, శ్రీశైల మల్లన్న కథ, కుంటి మల్లా రెడ్డి కథ అనే ఏడు రకాల కథలున్నాయి, మౌఖిక సంప్రదాయంలో ఉన్న అసలు కథకు సంస్కృతికీకరణం, క్షత్రీయకరణంలో భాగంగా ఈ ఏడు రకాల కథలు పుట్టుకొచ్చాయి'అని రామ్ షెపర్డ్ వాదిస్తున్నారు. దీనికి ఉదాహరణ మల్లన్న మక్కాకు వెళ్లి తురకలను బంగారి గడ్డను తిరిగి సంపాదించాడనే బండారి గడ్డ కథను చెప్పవచ్చు. బ్రాహ్మణ భ్రమరాంబిక, బ్రాహ్మణ రత్నాంగి, బలిజ మేడాలమ్మ, గొల్ల కేతమ్మ, కాపు కులస్తురాలైన పడిగికల్ల పద్మావతిలను మల్లన్న భార్యలుగా వివరిస్తుండగా గొల్ల కేతమ్మ మాత్రమె మల్లన్న అసలు భార్య' అని ప్రొఫెసర్ రామ్ షెపర్డ్ ఘంటా పథంగా చెబుతున్నారు. శ్రీశైలం దేవాలయాన్ని ఆక్రమించుకునేందుకు భ్రమరాంబికను, ముస్లిం వ్యతిరేకతను నింపే ప్రయత్నంలో రత్నంగి పాత్రలను బ్రాహ్మణీయ సాహిత్యం సృష్టించిందని ఆయన వాదిస్తున్నారు. భక్తిపారవశ్యంతో వెంకటేశ్వర స్వామిని బీబీ నాంచారి వివాహమాడినట్లుగా బలిజ మేడాలమ్మ మల్లన్నకు అంకితమైందని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఇక పద్మావతి వరరచ్చ మల్లారెడ్డి భార్య విషయానికి వస్తే క్రీస్తుశకం **982** లో రాష్ట్రకూట రాజ్య పతనాంతరం 'రెట్ట' గ్రామాధికారులు, వతన్దారులుగా తిరిగి తమ ఆధిపత్యాన్ని పొందేందుకు వరరచ్చ మల్లారెడ్డి నే మల్లన్నగా చిత్రీకరించారని రామ్ షెపర్డ్ వాదిస్తున్నారు. మల్లన్నకు ఐదుగురు భార్యలు ఉన్నట్లు చెబుతున్న సాహిత్యంలో కేవలం గొల్ల కేతమ్మ మాత్రమె గొర్రెల కాపరికం, వెన్న తీయటం , చల్ల చేయడం, ఉన్ని ఏకడం వంటి పశు సంవర్ధక పనులను నిర్వహించేది, మిగతా వారికి పశు పోషణకు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కల్పిత గాథలే మల్లన్న రత్నంగి సంతానమును కురుమలుగా, కృష్ణుడి కజిన్ అయిన సాత్యకి వంశస్తులైన పశుపాలకులను రెడ్లుగా, గొర్రెల కాపరికం నుండి వ్యవసాయంలోకి వెళ్ళిన వారిని కాపులుగా, తెలుగు ప్రాంతంలో గొర్రెలు కాసే వారిని గొల్లలుగా విడగొట్టారని రామ్ షెపర్డ్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా చేయటం ద్వారా అసలు చరిత్ర ఎవ్వరికీ తెలియకుండా, అర్థం కాకుండా జాగ్రత్త పడ్డారని ఆయన తన వ్యాసంలో వాదించారు.

'నిజానికి చరిత్రలో కొంచెం ముందుకు వెళ్లి చుస్తే సింధు నాగజాతి ప్రజల నుండే పశుపాలకులైన అభీరులు, వారి నుండి ధనఘర్లు, వీరి నుండి ఆహీర్లు, గుజ్జర్లు, హట్కర్లు (గొల్ల, కురుమలు) కుటేకర్లు, కటికవారు, కాపులు ఆవిర్భవించారు, గొర్రెలపెంపకం నిర్వహించే హట్కర్లు తెలుగు, కన్నడ భాషల మూలంగా గొల్ల, కురుమలుగా మారిపోగా, ఆహిరులు ఆధునిక యాదవులుగా పరిణామం చెందారు,

కాపుల నుండి బలిజ, ఒంటరి, తెలగ, మున్నూరు కాపులు ఉద్భవించారు, మూలం ఒక్కటేనని తెలియని ఈ కులాల వారు గొప్పల కోసం చారిత్రాత్మిక పురుషులను ఎవరికి వారే స్వంతం చేసుకోవటానికి పోటిపడుతున్నారు, అందుకే మల్లన్నను కొందరు రెడ్డి అని, మరికొందరు కాపు అని, గొల్ల అని కురుమ అని విభిన్న వ్యాఖ్యానాలను తెరమీదికి తెస్తున్నారు, అట్లే శ్రీకృష్ణ దేవరాయల కోసం కాపులు, యాదవులు, కురుమలు పోటీ పడుతున్నారు' అని రామ్ షెఫర్డ్ తెలిపారు. కొమురవెల్లిలో మల్లన్న మేలుకొలుపు ప్రార్థన ఒగ్గు డోలు, నపిరే వాద్యాలతో హాలె కన్నడ మిలిత తెలుగు భాషలో ఒగ్గు పూజారులు పూజ చేస్తారు, దీనినే కురుమ భాషగా పిలుస్తారని ఆయన తెలిపారు. బీరప్ప దేవుడిని బ్రాహ్మణుడుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని రామ్ షెఫర్డ్ అంటున్నారు. మహారాష్ట్రలోని విటోబా హంపిలోని విరూపాక్షుడుగా మారిన తీరు, ఆవులతో పాటు బర్రెలు, గొర్రెలను కాసిన శ్రీకృష్ణుడు కురువయ్యగా గురువాయుర్ లో ఉన్న పరిస్థితిని, కృష్ణుడికి పుట్టుగొంగడికి గల సంబంధాన్ని పరిశీలించవలసిన అవసరం ఉన్నదని ఆయన చెబుతున్నారు.

ఉన్ని, పత్తి విభజన

కురుమ, కురుబ, కురుంబార్,పాల్ భఘెల్ తదితర పేర్లున్న గొర్రెల కాపర్ల ప్రజలు ఉన్ని, పత్తి అనే రెండు ఉప కులాలుగా విభజనకు గురి కావటంపై పలు రకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కురుమ ప్రజలు ఉన్ని కంకణందారులు, పత్తి కంకణందారులుగా విడిపోవటంపై ఆరేడు రకాల కథనాలు ప్రచారంలో ఉండటం గమనార్హం.

మొదటి కథనం:

కొల్హాపూర్ (ఇది తెలంగాణాలోని మహబూబ్ నగర్ జిల్లాలోని కొల్హాపూర్ పట్టణమా? లేదా మహారాష్ట్రలోని కొల్హాపూర్ పట్టణమా) సమీపంలో పద్మన్న ఆయన సోదరుడు నివసించే వారు. పద్మన్న సంతానం ఉన్ని కంకణం కురుబలుగా పిలవబడితే పద్మన్నసోదరుడి సంతానం పత్తి కంకణం వారుగా గుర్తింపు పొందారు. కొల్హాపూర్ పట్టణంలో రేవన సిద్దేశ్వరుడు తొంబైవేలమంది లింగాయాత్ సిద్దులను చెరలో పెట్టిన 'మాయి' అనే దేవతను చంపి వారిని విడిపిస్తాడు. మాయీ చేరనుడి విముక్తి కల్పించిన తొంబై వేలమంది సిద్దులలో సగం మంది సిద్దులను తన పేరిట బిక్షాటన చేసి బతకాలని రేవణ సిద్దేశ్వరుడు ఆదేశిస్తాడు. మిగతా సగం మందిని ఏం చేయాలనేది అర్థం కాక

వారందరినీ గొర్రెలుగా మార్చివేసి ఒక పొలంలోని బిలంలోకి పంపించి బండ రాయితో మూసివేస్తాడు. రేవన సిద్దేశ్వరుడు గొర్రెలను మూసివేసిన బిలం పద్మన్న పొలంలోనిది. ఒక రోజు పద్మన్న పొలాన్ని దున్నుతుంటే నాగలి బిలాన్ని మూసివేసిన రాయికి తట్టుకుని ఆగిపోతుంది. పద్మన్న బండ రాయిని తొలగించగానే లోపల ఉన్న గొర్రెలు బిల, బిల మంటూ బైటికి వచ్చి అతన్ని చుట్టుముడతాయి. పద్మన్న వాటిని తీసుకుపోయి మేపటం ప్రారంబిస్తాడు. పద్మన్న ఇలా అడవిలో గొర్రెలను మేపుతున్న సమయంలో ఒక రోజు ఒక యువతిని చూస్తాడు. బేతాళుడు ఆ యువతిని అడవిలో దాచి ఉంచుతాడు. బేతాళుడు అడవిలో దాచిపెట్టిన యువతి పద్మన్నను చుసిన వెంటానే ప్రేమించి తనను పెళ్లి చేసుకోవాలని కోరుతుంది. యువతి ఆ వెంటనే ఒక పూల దండను అతని మేడలో వేస్తుంది. అప్పుడు పరమ శివుడు అక్కడ ప్రత్యక్షమై వారిద్దరి పెళ్లి జరిపిస్తాడు. అడవిలో పత్తి దారం లభించక పోవటంతో గొర్రె ఉన్నితో చేసిన కంకణాన్నిపద్మన్న ఆ యువతి చేయికి కడతాడు. ఈ విధంగా పద్మన్న సంతానం ఉన్ని కంకణందారులైతే అతని సోదరుడి పిల్లలు పత్తి కంకణందారులు అవుతారు. పద్మన్న సోదరుడు గ్రామంలో ఉండటం మూలంగా తన పెళ్లి సమయంలో పత్తితో చేసిన కంకణాన్ని తన భార్య చేతికి కడతాడు.

రెండవ కథనం:

వక్కలిగ వర్గం నాయకుడు (హెగ్గాడే) కుమారుడు పద్మ లేదా పద్మాఖ్య. పని చేసేందుకు ఎంతమాత్రం ఇష్టపడని పద్మాఖ్యను అతని తండ్రి ఇంటి నుండి వెళ్ళగొట్టి పొలం పని చేసుకుని పొట్టపోసుకోవాలని ఆదేశిస్తాడు. అతనికి కేటాయించిన భూమిలోని పాము పుట్టను మాత్రం ముట్టుకోవద్దని హెగ్గాడే ఆదేశిస్తాడు. అదే విధంగా పాము పుట్టను ఆనుకుని ఉన్న పలాస చెట్టును కుడా ఎటువంటి పరిస్థితిలో కొట్టివేయవద్దని స్పష్టం చేస్తాడు. అయితే తండ్రి మాటను లెక్క చేయని పద్మాఖ్య పలాస చెట్టును కొట్టి వేసి పాము పుట్టాను తవ్వుతాడు. పద్మాఖ్య పలాస చెట్టును కొట్టి వేసి పాము పుట్టాను తవ్వగానే అందులో నుండి ఆరు రకాల గొర్రెలు బిల,బిల మంటూ బైటికి వస్తాయి. పాము పుట్టలో నుండి బైటికి వచ్చిన గొర్రెలను ఏం చేయాలనేది అర్థం కాని పద్మాఖ్య శివుడిని ప్రార్థిస్తాడు. పద్మాఖ్య ప్రార్థన విన్న శివుడు అతని వద్దకు బీర దేవుడిని పంపిస్తాడు. బీర దేవుడు అతనికి గొర్రెల పెంపకం నేర్పిస్తాడు. ఆనాటి నుండి బీర దేవుడు పద్మాఖ్య, అతని సంతతి వారికి కుల దైవం అవుతాడు. పద్మాఖ్య ఆనాటి నుండి వ్యవసాయం మాని వేసి గొర్రెల పెంపకాన్ని తన వృత్తిగా చేసుకుంటాడు.

మూడవ కథనం:

మొదట కురుబలు కాపు వర్గం వారు. తూర్పు కనుమల్లో వంట కట్టెలు అమ్ముకుని బతికే మసిరెడ్డి , నీలమ్మ వీరి పూర్వీకులు. ఆరుగురు సంతానంతో అష్ట కష్టాలు పడుతున్న మసిరెడ్డి, నీలమ్మల పట్ల దయ కలిగిన శివుడు జంగమ రూపంలో వచ్చి నీలమ్మకు భస్మం ఇచ్చి ఏడో కొడుకు పుట్టిన తరువాత వ్యవసాయం ద్వారా సిరి సంపదలు ఒనగూరుతాయని అభయమిస్తాడు. మసిరెడ్డి, నీలమ్మ తమ ఏడో సంతానానికి ఉండాల పద్మన్న అని నామకరణం చేస్తారు. పద్మన్న జన్మించిన అనంతరం మసిరెడ్డి కుటుంబం వ్యవసాయం బాగా కలిసి రావటంతో ధనవంతులవుతారు. పద్మన్నకు తన ఆరుగురు అన్నలతో కలిసి పొలానికి వెళ్లి కష్టపడి పని చేయటం ఇష్టం ఉండదు. పద్మన్న సోమరితనంతో విసిగిపోయిన ఆరుగురు అన్నలు అతన్ని ఏదోవిధంగా వదిలించుకోవాలని ఆలోచిస్తారు. వారు తమ పొలంలోని పాములపుట్ట చుట్టు ఉన్న ముళ్ళ పొదలను కాల్చివేసే పనికి పద్మన్నను పురమాయిస్తారు. ముళ్ళ పొదలను కాల్చి తొలగించే సమయంలో పాముల పుట్టలోని పాము పద్మనను కాటు వేస్తే తమ లక్ష్యాన్ని సాధించినట్లు అవుతుందని వారు ఆలోచిస్తారు. పద్మన్నను ఏదోఒక విధంగా చంపాలన్నది ఆరుగురు అన్నల దురుద్దేశ్యం. ఆరుగురు అన్నల ఆదేశం మేరకు పద్మన్న పొలంలోని ముళ్ళ పొదలను కాల్చివేయగానే పాముల పుట్ట నుండి లెక్కలేనన్ని గొర్రెలు బైటికి వస్తాయి. పాము పుట్టలో నుండి బైటికి వస్తున్న గొర్రెల మందను చూసి భయపడిపోయిన పద్మన్న అక్కడి నుండి పారిపోతాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై 'ఈ గొర్రెలను నీ కోసమే పుట్టించాను, వీటిని మేపటం ద్వారా జీవనోపాది కల్పించుకోవాలి' అని సూచిస్తాడు. గొర్రెల పాలు పిండి కాచటం కూడా నేర్పించి నిప్పు సంపాదించేందుకు కొంత దూరంలో ఉన్న అడవికి పంపిస్తాడు. ఆ ఆడవి ఒక రాక్షసి ఆదీనంలో ఉంటుంది. అడవిలో ఒక బ్రహ్మ రాక్షసి ఒక బ్రాహ్మణ యువతిని తన వద్ద బందించి పెట్టుకుంటుంది. అడవిలోని బ్రహ్మ రాక్షసి చెరలో ఉన్న బ్రాహ్మణ యువతి నిప్పు కోసం వచ్చిన పద్మన్నను ప్రేమిస్తుంది. పద్మన్న కుడా బ్రాహ్మణ యువతిని ఇష్టపడతాడు. తన నివాసంలోకి వచ్చిన పద్మన్న బ్రహ్మ రాక్షసి బారిన పడకుండా చూసేందుకు బ్రాహ్మణ యువతి రత్నంగి అతన్ని బల్లిగా మార్చి గోడపై పెడుతుంది. బ్రహ్మ రాక్షసి బైటికి వెళ్ళిపోయిన తరువాత పద్మన్న,రత్నంగి గొర్రెల మంద ఉన్న చోటికి వెళ్ళిపోతారు. పద్మన్న గొర్రెల మంద మధ్య రాత్నంగిని పెళ్లి చేసుకుంటాడు. పద్మన్న పెళ్లి సమయంలో రత్నంగి చేతికి ఉన్ని దారంతో చేసిన కంకణం కడతాడు. పద్మన్న తన మొదటి భార్యకు

పెళ్లి సమయంలో పత్తి కంకణం కడతాడు. అందుకే ఆమెకు పుట్టిన వారు పత్తి కంకణం వారైతే రత్నంగి పిల్లలు ఉన్ని కంకణం వారయ్యారు.

నాలుగో కథనం:

ఈ కథనం తెలంగాణా ప్రాంతంలో బహుళ ప్రచారంలో ఉన్నది. 'నిజాం దేశంలో కుల వ్యవస్థ' అనే పుస్తకంలో సయ్యద్ ఉల్ హసన్ అనే చరిత్రకారుడు కురుమ కులం పూర్వాపరాలు వివరిస్తూ ఈ కథనం గురించి ప్రస్తావించారు. తెలంగాణలోని మల్లన్నను మహారాష్ట్రలో ఖండోబా, కర్ణాటకలో మైలార్ అని పిలుస్తారు. మల్లన్నకి ఇద్దరు భార్యలు. మల్లన్న మొదటి భార్య పద్మాక్షి. మల్లన్న మొదటి వివాహం సంప్రదాయ పద్ధతిలో జరుగుతుంది కాబట్టి వివాహ సమయంలో పద్మాక్షికి పత్తి కంకణం కడతాడు. మల్లన్న రెండో భార్య రత్నంగి. రత్నంగి ఒక బ్రహ్మ రాక్షసి పెంపకంలో అడవిలో ఉంటుంది. మల్లన్న అడవిలో గొర్రెలు మేపే సమయంలో ఆమెను చూస్తాడు. రత్నంగి అందానికి ముగ్దుడైన మల్లన్న ఆమెను ప్రేమిస్తాడు. మల్లన్న బ్రహ్మ రాక్షసిని చంపి రత్నంగిని పెళ్లి చేసుకుంటాడు. పెళ్లి అడవిలో జరుగుతుంది కాబట్టి మల్లన్న గొర్రె ఉన్నితో చేసిన ఉన్ని కంకణాన్ని ఆమె చేయికి కడతాడు. ఈ విధంగా పద్మాక్షి సంతానం పత్తి కంకణదారులు కాగా రత్నంగికి పుట్టిన వారు ఉన్ని కంకణందారులు అయ్యారు. మల్లన్నకు బ్రాహ్మణ యువతి ద్వారా పుట్టిన తాము పత్తి కంకణందారుల కంటే ఉన్నతులమని ఉన్ని కంకణదారులు భావిస్తారు. ఐతే మల్లన్న రత్నంగి వివాహం ప్రతిలోమ పద్ధతిలో జరిగింది కాబట్టి తామే ఉన్నతులమని పత్తి కంకణందారులు వాదిస్తారు.

ఐదవ కథనం:

కర్ణాటకలో బహుళ ప్రచారంలో ఉన్న హాలుమాత చరిత్ర లేదా హాలుమాత కురుబ పురాణంలో ఈ కథనం వివరించబడింది. పార్వతి దేవి తన కుడి చనుబాలును మట్టితో కలిపి ఒక పురుషున్ని, ఎడమ చనుబాలను మట్టితో కలిపి ఒక ఆడ మనిషిని తయారు చేస్తుంది. పరమ శివుడు ఈ బొమ్మలకు ప్రాణం పోసి ముద్దప్ప, ముద్దవ్వ అని నామకరణంచేస్తాడు.పార్వతి,పరమేశ్వరుడువీరిద్దరికిపెళ్లిచేసితమసంతతిని పెంచుకోవాలని సూచిస్తారు. ముద్దప్ప, ముద్దవ్వలు పాలతో చేయబడినందున వీరి సంతానాన్ని హాలుమాత వారు అని పిలుస్తారు. ముద్దప్ప, ముద్దవ్వలకు కాలక్రమంలో ఒక బాలుడు పుడతాడు. వారతనికి ఆదిగౌండ అనే పేరు పెడతారు. ఆదిగౌండకు ఆరుగురు కొడుకులు పుడతారు. ఈ ఆరుగురిలో ఆఖరు వాడు పద్మగౌండ. ఈ పద్మగౌండ మొదటి భార్య సంతానం పత్తి కంకణం వారైతే రెండో భార్య సంతానం ఉన్ని కంకణం

> ఒక రోజు పాలు కాచేందుకు నిప్పు ఉండదు. పద్మగౌండ అడవిలో నిప్పు కోసం వెతుకుతూ ఒక ఇంటికి వెళతాడు. అది ఒక రాక్షసి ఇల్లు. పద్మగౌండ వెళ్ళినప్పుడు ఇంట్లో రాక్షసి కూతురు కన్నవ్వ ఉంటుంది. పద్మగౌండను కన్నవ్వ ప్రేమిస్తుంది. కన్నవ్వను పెళ్లి చేసుకునేందుకు పద్మగౌండ రాక్షసిని చంపుతాడు. రాక్షసి మరణించే ముందు తోడేళ్ళను సృష్టించి పద్మగౌండ పైకి ఉసిగొల్పుతుంది.

దారులు. ధనగర్, లింగాయత్ కులాల మధ్య ఉన్న పలు సమాంతరాలను హాలుమాత చరిత్ర ఎత్తి చూపించింది. కర్నాటక కురుబ వర్గంలోని ఉపకులం హాలుమాత కురుబ వర్గానికి ఈ పురాణం ఏంతో ముఖ్యమైంది.

శివుడు ఒకసారి పార్వతి కోరిక మేరకు ఒక గొర్రెను, మేకను సృష్టించి ఆమెకు బహూకరిస్తాడు. కాలక్రమంలో విపరీతంగా పెరిగిపోయిన గొర్రెలు, మేకలను దొడ్డిలో పెట్టాలనుకుంటారు. గొర్రెలు, మేకల దొడ్డికి అవసరమైన భూమి కోసం మరమేశ్వరుడు రేవణ సిద్దేశ్వరుడి రూపంలో తమ్మాపుర్ లో నివసిస్తున్న ఆదిగౌండ వద్దకు వెళతాడు. ఆదిగౌండ ఇచ్చిన 'ఐదు మొలల'' భూమిలో రేవన సిద్దేశ్వరుడు ఒక భిలం తవ్వి దానిలోకి గొర్రెలు, మెకలను పంపించి బిళం ద్వారాన్ని పార్వతి ముక్కు పోగుతో మూసివేస్తాడు. పార్వతి ముక్కు పోగు కాలక్రమంలో ముత్యాల తీగగా మారుతుంది. ఇతర కథనాలలో ఉన్నట్లే ఈ కథలో కూడా ఆఖరు వాడైన పద్మగౌండ ఏ పని చేయకుండా గాలికి తిరుగుతుంటాడు. తాము కష్టపడి పని చేస్తుంటే పద్మగౌండ పని, పాట లేకుండా తిరగటం అతని అన్నలకు, వారి భార్యలకు ఎంత మాత్రం నచ్చదు. ఐదుగురు అన్నలు పద్మగౌండకు ముత్యాల తీగ ఉన్న భూమిని చూపించి దానిని వ్యవసాయ యోగ్యం చేయాలని ఆదేశిస్తారు. మద్మగౌండ భూమిని చదును చేసే సమయంలో ముత్యాల తీగను తొలగిస్తాడు. దీనితో లోపల ఉన్న గొర్రెలు, మేకలు బిలబిల మంటూ బైటికి వస్తాయి. ఉహించనిది జరగటంతో మద్మగౌండ గొర్రెలు, మేలను భిలంలోకి తోసి గడ్డి, గాదంతో ముసివేసి నిప్పంటిస్తాడు. పద్మగౌండ పెట్టిన మంట నుండి తప్పించుకునేందుకు ప్రయత్నించిన గొర్రెలు పొగ మూలంగా నల్లబడి నల్ల రంగు గొర్రెలు అవుతాయి. బిలంలోనే ఉండిపోయిన గొర్రెలకు గోధుమ వర్ణం వస్తుంది. పద్మగౌండ పెట్టిన మంట ఆరిపోయిన తరువాత భిలంలోని గొర్రెలన్ని బైటికి వచ్చి చెల్లచెదరవుతాయి. భిలం నుండి బైటికి వచ్చి చెల్లాచెదరై తిరుగుతున్న గొర్రెలను చూసి పద్మగౌండ ఆందోళన చెందుతాడు. ఈ పరిస్తితిలో అక్కడికి వచ్చిన ఒక జంగము సన్యాసి

గొర్రెలనుమేపుకొనిహాయిగాజీవించాలనిపద్మగొండకుసలహాఇస్తాడు.జంగమ సన్యాసి ఇచ్చిన సలహా మేరకు పద్మగొండ గొర్రెలను మేపుతుంటాడు. ప్రతి రోజు గొర్రెలు,మేకల పాలను కాచి తానూ తాగటంతో పాటు పది పందికి తాగిస్తుంటాడు. ఒక రోజు పాలు కాచేందుకు నిప్పు ఉండదు. పద్మగొండ అడవిలో నిప్పు కోసం వెతుకుతూ ఒక ఇంటికి వెళతాడు. అది ఒక రాక్షసి ఇల్లు. పద్మగొండ వెళ్ళినప్పుడు ఇంట్లో రాక్షసి కూతురు కన్నవ్వ ఉంటుంది. ఇతర నాలుగు కథనాలలో ఉన్నట్లే ఈ కథనంలో కుడా పద్మగొండను కన్నవ్వ ప్రేమిస్తుంది. కన్నవ్వను పెళ్లి చేసుకునేందుకు పద్మగొండ రాక్షసిని చంపుతాడు. రాక్షసి మరణించే ముందు తోడేళ్ళను సృష్టించి పద్మగొండ పైకి ఉసిగొల్పుతుంది. పద్మగొండ వాటిని హతమార్చి కన్నవ్వను అడవిలోనే పెళ్లి చేసుకుని తమ్మాపురా కు తిరిగి వస్తాడు. పద్మగొండ తమ్మాపురాలో మొదటి భార్య సిద్దవ్వ, రెండో భార్య కన్నవ్వతో ప్రాశాంత జీవితం గడుపుతాడు. పద్మగొండ ఒక్కొక్క భార్యకు ఇరవై మంది కొడుకులు, ఇరవై మంది కూతుళ్ళు పుడతారు. పద్మగొండ తన మొత్తం ఆస్తిని ఇద్దరు భార్యలకు సమానంగా పంచి ఇస్తాడు. పద్మగొండ తన మొదటి భార్య సిద్దవ్వ పిల్లలకు పెళ్లి సమయంలో పత్తి కంకణం కట్టిస్తే కన్నవ్వ పిల్లలకు ఉన్ని కంకణంతో పెళ్లి చేస్తాడు. అందుకే మొదటి భార్య పిల్లలు పత్తి కంకణం వారైతే రెండో భార్య సంతానం ఉన్ని కంకణం వారయ్యారని అంటారు.

ఆరవ కథనం :

ఆంధ్ర ప్రదేశ్ లోని కర్నూల్ జిల్లా కు దక్షిణాన ఉన్న బలపాల పల్లెకు చెందిన కథనం ఇది. కాపు వర్గానికి చెందిన ఆదిరెడ్డి, ఆదెమ్మ లకు ఏడుగురు కొడుకులు ఉంటారు. దైవాంశ సంభూతుడైన ఆఖరు కొడుకు ఎలనాగిరెడ్డి మూలంగా తమకు సిరిసంపదలు కలుగుతాయన్నది ఆదిరెడ్డి, ఆదెమ్మ విశ్వాసం. ఏడు గ్రామాలకు నాయకుడైన ఆదిరెడ్డి ఏడుగురు కొడుకులకు ఒక్కొక్క గ్రామం చొప్పున ఇవ్వాలనుకుంటాడు. ఐతే పనీపాటా లేకుండ తిరుగుతున్న ఎలనాగిరెడ్డికి ఆస్తి పంచి ఇవ్వటం ఇష్టంలేని ఆరుగురు సోదరులు అతన్ని ఇంటినుండి పంపించి వేసేందుకు కుట్ర పన్నుతారు. బలపాలపల్లికి ఉత్తరాన శ్రీశైలం అడవుల్లో ఉన్న మునిమొదకమాను పుట్ట భూమిలో వ్యవసాయం చేసుకుని బతకాలంటూ వారు ఎలనాగిరెడ్డిని పంపించి వేస్తారు. మునిమొదకమాను చెట్టు ఉన్నందుకే ఈ భూమికి మునిమోదకమాను పుట్ట అనే పేరు వస్తుంది. మునిమోదకమాను చెట్టుపై ఒక బ్రహ్మ రాక్షసి నివసిస్తుంటుంది. పరమ శివుడి ఆజ్ఞ మేరకు ఈ బ్రహ్మ రాక్షసి మునిమోదకమాను చెట్టు, దాని చుట్టు పక్కల ఉన్న

భూమికి కాపలాగా ఉంటుంది. ఎలనాగిరెడ్డి మునిమోదకమాను కొండ పుట్ట భూమిని చదను చేసే సమయంలో మునిమోదకమాను చెట్టును కొట్టి వేస్తాడు అప్పుడు దానిపై ఉన్న బ్రహ్మ రాక్షసి అతని పై దాడి చేసి చంపివేస్తుందని ఆరుగురు అన్నలు భావిస్తారు. సోదరుల కుట్ర గురించి ఏ మాత్రం తెలియని ఎలనాగిరెడ్డి తన వంద కిలోల గొడ్డలితో మునిమోదకమాను చెట్టును నరికేందుకు సిద్దమవుతాడు. అతను గొద్దలితో చెట్టుపై వేటు వేయగానే దానిపై ఉన్న బ్రహ్మ రాక్షసి ఆరుగురు పిల్లలు అతనిపై దాడి చేస్తారు. ఎలనాగిరెడ్డి ఆరుగురు రాక్షసులను చంపివేస్తాడు. బ్రహం రాక్షసి పరమ శివుడి వద్దకు వెళ్లి ఎలనాగిరెడ్డి తన పిల్లలను చంపివేయటంపై ఫిర్యాదు చేస్తుంది. శివుడు బదులిస్తూ ఎలనాగిరెడ్డి తన వరపుత్రుడు, ఇక మీదట అతను అక్కడే ఉంటాడు, మునిమోదకమానుకొండ భూమి కుడా అతనికే చెందుతుందని బ్రహ్మ రాక్షసికి చెబుతాడు.

ఆరో కథనంలో కూడా పార్వతి కోరిక మేరకు శివుడు గొర్రెలు సృష్టించి ఇవ్వటం, పార్వతి పెంపకంలో అవి ఇబ్బడి,ముబ్బడిగా పెరగటం, బాగా పెరిగిపోయిన గొర్రెలు కైలాసాన్ని అపరిశుభ్రం చేయటంతో శివుడు మునిమోదకమానుకొండ చెట్టు వద్ద నాగలోకం వరకు సొరంగాన్ని తవ్వి వాటినక్కడ ఉంచి పెద్ద బండ రాయితో దానిని మూసివేస్తాడు. ఎలనాగిరెడ్డి భూమిని దున్నేటప్పుడు శివుడు పెట్టిన బండ రాయికి నాగలి తట్టుకుంటుంది. ఎలనాగిరెడ్డి బండ రాయిని తొలగించగానే అందులో ఉన్న గొర్రెల శబ్దం వినిపిస్తుడి. అప్పుడు శివుడు ప్రత్యక్షమై గొర్రెలను మేపుకుని బతకాలని ఎలనాగిరెడ్డికి సూచిస్తాడు. వెనకకు చూడకుండా గొర్రెలతో కళ్యాణపట్టణం వెళ్లాలని పరమ శివుడు ఆదేశిస్తాడు. బంగారు పొట్టేలు, వెండి గొర్రె బైటికి వచ్చేంత వరకు వెనకకు చూడకుండా ముందుకే వెళ్ళాలనీ, వెనుకకు చూసిన మరు క్షణం భిలం నుండి గొర్రెలు బైటికి రావటం ఆగిపోతుందని శివుడు హెచ్చరిస్తాడు. ఎలనాగిరెడ్డి బాగా ముందుకు నడిచిన తరువాత ఆఖరున వెనకకు తిరిగి చూస్తాడు, దీనితో బైటికి వస్తున్న పైడి(బంగారు) తగరు (మగ గొర్రె), వెండి గొర్రె లోపలి వెళ్లి పోతాయి. శివుడు ఆదేశం మేరకు అతను మిగతా గొర్రెలను తీసుకుని కళ్యాణపట్టణం వెళతాడు. ఎలనాగిరెడ్డి కళ్యాణపట్టణం పొలిమేరల్లో ఉండగానే పట్టణంలోకి ప్రవేశించేందుకు అనుమతి లేదని రాజు వర్తమానం పంపిస్తాడు. అపరిశుభ్రంగా ఉన్న గొర్రెలను కళ్యాణపట్టణంలోకి అనుమతించే ప్రసక్తే లేదని రాజు స్పష్టం చేస్తాడు. దీనితో ఎలనాగిరెడ్డి తన కుటుంబం, గొర్రెలతో పన్నెండు సంవత్సరాల పాటు స్థానిక అడవిలో సంచార జీవితం గడుపుతాడు. ఈ సమయంలో ఎలనాగిరెడ్డి ఇద్దరు భార్యలకు పుట్టిన పెల్లలే పత్తి కంకణం, ఉన్ని కంకణం దారులయ్యారన్నది ఈ

కథనం వాదన. ఈ కథనాల ప్రకారం గొర్రెల కాపర్ల మూల పురుషుడు పద్మన్న లేదా మల్లన్న కావచ్చు , ఆయన ఇద్దరు భార్యల పిల్లలే ఉన్ని, పత్తి కంకణదారులు. ఇక మూల పురుషుడి విషయానికి వస్తే మూడు కథనాల్లో అతని పేరు పద్మన్నగా ఉంటే ఆ తరువాత కథనాల్లో మల్లన్న, ఎలనాగిరెడ్డి అనే పేరు ఉండటం గమనార్హం.

ఈ కథనాలలోని ఆరుగురు వ్యక్తులు ఒకరేనా లేక వేరు, వేరా? ఒకే వ్యక్తిని వేరు,వేరు పేర్లతో పిలిచే వారా? మూడు కథనాల్లో ఒకే పేరు ఉండటం గమనార్హం. ఇద్దరు భార్యలను కలిగి ఉండటం, గొర్రెల పెంపకమే ప్రధానం వృత్తి కావటం చూస్తుంటే ఈ ఆరుగురు ఒకరేననే అభిప్రాయం కలుగక మానదు. స్థానిక పరిస్థితుల ఆధారంగా భిన్నమైన పేర్లతో గుర్తింపు లభించి ఉండవచ్చు.

కురుమ కులంలో ఉన్ని, పత్తి అనే విభజనతో పాటు తెగల ఆధారంగా కూడా విభజన ఉండేది. ప్రతి తెగ లేదా గుంపుకు ఒక కులం పెద్ద లేదా గురువు ఉండే వాడు. అతన్ని గౌడు, మహిళ ఐతే గౌడసాని అని పిలిచే వారు. తెగలలో కుడా విభజన ఉండేది. తెగలను గోత్రం ప్రకారం విభజించేవారు. తెగలు లేదా సమూహాల చిహ్నం ఆధారంగా గోత్రం పేరు ఏర్పడేదని హెచ్.ఏ.స్టుఆర్ట్ తెలిపారు.

దక్షిణాదిలో ఉన్నట్లే ఉత్తరాదిలోని పాల్, భగేల్ తగితర గొర్రెల కాపర్లలో కూడా ఉన్ని, పత్తి విభజన ఉండటం గమనార్హం. ఈ విభజన ఉన్ని, పత్తి అనే పదజాలంతో స్పష్టంగా లేదు కాని నిఖర్ మరియు ధనగర్ అనే పేర్లతో ఈ విభజన కొనసాగుతోంది. ఉత్తరాదిలోని పాల్ వర్గం తమను తాము "నిఖర్" పవిత్రులము అని చెప్పుకుంటారు. ధనగర్ లు తమ కంటే కొంత స్థాయి తక్కువ వారన్నది వీరి అభిప్రాయం. దక్షినాదిలోని కర్ణాటక, ఆంధ్రా,తెలంగాణా,తమిళనాడు,కేరళ రాష్ట్రాలలో ఉన్ని కంకణం , పత్తి కంకణం వారు ఉన్నారు. వీరితో పాటు మాదారి కురుమ, మదాసి కురుమ,హాలుమాత కురుబ,హొస కురుబ, హాలె కురుబ, అగ్నేయారు, ఆరెమత్తినవారు, కందమేలారు, నేరారు అనేవి మరికొన్ని ఉపకులాలు. ఉత్తరాదిలోని అహిరులు దక్షినాదిలోని కురుమలు ఒకరేనని బ్రిటిష్ చరిత్రకారుడు ఎంథోవెన్ చెప్పారు

మల్లన్న అడవిలో ప్రేమించిన రత్నంగిని పెళ్లి చేసుకునేందుకు ఆమెను పెంచి పోషించిన రాక్షసిని చంపుతాడనేది అందరికి తెలిసిందే. మల్లన్న అక్కమ కోటకు వెళ్లి రాక్షసి ప్రాణం దాగి ఉన్న వస్తువును ధ్వంసం చేస్తాడు. మల్లన్న, రత్నంగి పెళ్ళికి అంగీకరించిన రాక్షసి తన ఎముకలు, నరాలతో చేసిన రాట్నంతో వడికే ఉన్ని దారంతో

చేసే ఉన్ని కంకణం కట్టుకోవాలని షరతు పెడుతుంది. మల్లన్న ఇందుకు అంగీకరించి రత్నంగిని పెళ్లి చేసుకుంటాడు. అందుకే మల్లన్న ద్వారా రత్నంగికి పుట్టిన వారంతా పెళ్ళిళ్ళలో ఉన్ని దారంతో చేసిన కంకణాన్ని కట్టుకుంటాడనేదిమరో కథనం

పద్మన్న ఎవరు?

ఈ పద్మన్న ఎవరు? ఎప్పటి వాడు? ఎక్కడి వాడు? ఇలాంటి పలు ప్రశ్నలకు సమాధానాలను తెలుసుకోవటం ఏంతో అవసరం. గుస్తవ్ ఒప్పెర్ట్ తన 'భారత దేశం మూల నివాసులు ' అనే పుస్తకంలో పద్మన్న కురుంబ నాయకుడని పేర్కొన్నాడు. ఐతే పద్మన్న కాపు వర్గానికి చెందిన వాడని ఎం.ఎల్.కే. మూర్తి తదితరులందరు తమ, తమ కథనాలు, విశ్లేషణల్లో తెలిపారు. జైన మతం వైపు ఆకర్షితులైన కురుబలను హిందూ మతం ముఖ్యంగా శైవ మతం వైపు తిరిగి ఆకర్షించేందుకు రేవణ సిద్దేశ్వరుడు లేదా రేణుకారాధ్యుడు శ్రీ శైలంలో ఉన్న పద్మన్న సేవలను ఉపయోగించుకున్నట్లు గుస్తవ్ ఒప్పెర్ట్ తెలిప్పారు. పద్మారస పద్మ అరసు, అరసు అంటే రాజు అని అర్థం. అంటే శ్రీశైలంలో ఉన్న పద్మన్న అనే రాజు సేవలను ఉపయోగించుకున్నారు. రేవణ సిద్దేశ్వరుడు మొదట పద్మరసు అనే కురుంబ రాజును తన శిష్యుడుగా చేసుకుని. అతను, అతని శిష్యులను జైన మతం నుండి శైవ మతంలోకి మార్చాడన్నది వాదన. పద్మరస శైవ మతం పుచ్చుకున్న అనంతరం రేవన సిద్దేశ్వరుడు ఇతర కురుబ లేదా కురుంబలను శైవంలోకి తెచ్చాడని గుస్తవ్ ఒప్పెర్ట్ తెలిపారు.

ఉప కులాల పుట్టుక

కురుమ, కురుబ, కురుంబ, కురుంబార్, కురుమాన్ తదితర పేర్లతో పిలిచే ఈ కులంలో ఉప కులాలు పెద్ద ఎత్తున పుట్టుకు వచ్చాయి. కురుమ కులంలో ఉన్ని, పత్తి అనే రెండు ప్రధాన విభాగాలు ఉండటం తెలిసిందే. ఈ రెండు ప్రధానం విభజనతో పాటు దాదాపు ఇరవై ఐదు ఉప కులాలు ఉన్నాయి. ఉన్ని కంకణం, పత్తి కంకణం ఆధారంగా ఒక ప్రధాన విభజన ఏర్పడినట్లే పని, వృత్తి , నివసిస్తున్న ప్రదేశం ఆధారంగా ఉప కులాలు ఏర్పడ్డాయి. మల్లన్న దేవుడు మొదట తన కులానికి చెందిన మహిళను పెళ్లి చేసుకునే సమయలో ఆమె చేతికి పత్తితో చేసిన కంకణం కడతాడు. మల్లన్న దేవుడి రెండో పెళ్లి విషయంలో రక,రకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. రాష్ట్రాలు, ప్రాంతాల వారిగా మల్లన్న రెండో పెళ్లి విషయంలో పలు మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. తెలంగాణాలో ప్రాచుర్యంలో ఉన్న కథనాల ప్రకారం మల్లన్న రాక్షసి వద్ద బందీగా ఉన్న

రత్నంగిని పెళ్లి చేసుకుంటాడు. మల్లన్న రత్నంగి సంతానమే ఉన్ని కంకణం వారు. ఐతే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రంలో ప్రాచుర్యంలో ఉన్న కథనాల ప్రకారం మల్లన్న మహారాష్ట్రలో 'బనై' కర్ణాటకలో కుర్బట్టవ్వను పెళ్లి చేసుకుంటాడు. మల్లన్న, బనై లేదా కురుబట్టవ్వ సంతానమే కురుమ, లేదా కురుబ వర్గం ప్రజలు. మల్లన్న అడవిలో రాక్షసి బారి నుండి రక్షించిన బ్రాహ్మణ యువతి రత్నంగిని పెళ్లి చేసుకునే సమయంలో ఆమె చేతికి ఉన్ని కంకణం కడతాడు. అడవిలో పత్తి కంకణం లభించనందున గొర్రె నుండి ఉన్ని తీసి దానితో కంకణం చేసే రత్నంగి చేతికి కడతాడు. పత్తి కంకణం కట్టి పెళ్లి చేసుకున్న మొదటి భార్య సంతానం పత్తి కంకణం వారు. గొర్రెల కాపర్లలో ఉన్న ప్రధాన విభజనకు ఇది ప్రాతిపదిక. ఈ రెండు ప్రధాన విభజనతో పాటు కాల క్రమంలో పలు ఇతర ఉప కులాలు పుట్టుకు వచ్చాయి.హలుమాత కురుబలు తాము పార్వతి చనుపాల నుండి పుట్టినట్లు చెప్పుకుంటారు. పెద్ద కుండలో మేక పాలు మరిగించటం, వంట చేయటం వలన హండి కురుబలు అనే ఉప కులం పుట్టుకు వచ్చింది. కర్నాటకకు చెందిన మహా భక్తి కవి కనకదాసు ను గురువుగా భావించే కురుబవారు తమను తాము కనకదాసులము అని చెప్పుకుంటారు. అడవుల్లో తేనెను సేకరించటంలో పట్టు సంపాదించిన వారు జేను కురుబలు. అడవులకే పరిమితమై పోయినవారు కాడు కురుబలు. ఏనుగులను మచ్చిక చేసుకోవటంలో నైపుణ్యం సాధించిన వారు అనేకురుబలుగా మారారు. కన్నడంలో కాడు అంటే అడవి, ఆనే అంటే ఏనుగు అని అర్థం. తిరుపతి ప్రాంతంలో నివసించే కురువ, కురుమ లేదా కురుబలు ఏనుగులను మచ్చిక చేసుకోవటంలో సిద్ద హస్తులని చరిత్ర చెబుతోంది.

కర్ణాటక రాష్ట్రంలోని కురుబల్లో పలు ఉప కులాలు ఉన్నాయి. హలుమాత, ఒక్కలిగ కురుబ, కురికేయువ కురుబ, గొండారు, గొండ కురుబారు, ఉన్ని కంకణదారులు,హత్తి కంకణదారులు, కాడుకురుబారు, వొగ్గారు, కడుసిద్దయ్యారు, కిలారిస్, కరడి,మకడివలేస్, జోగయ్యగలు, కురిగరారు, హనబరారు, హంకార, పెద్దరు, సుడుగదుషిద్దరు, గవలిగలు, సందారు, ఒడేయారు, కంబలికురుబారు, కనకయ్య జాతియవారు, ప్రథమసుద్రారు, ఇంద్రసుద్రారు, వరద కురుబరు, దస్యగలు, సొల్ల, గొరవ, జేను కురుబారు, ఉరు కురుబారు, హొస కురుబారు, హొలె కురుబారు, సద కురుబారు, కంచి కురుబారు, ముళ్ళు కురుబారు, బెట్ట కురుబారు. ఇదిలా ఉంటే కర్ణాటకలో ప్రాంతాల వారిగా కురుబ కులం పేర్లు కొద్దిగా మారుతుంటాయి. మైసూరు ప్రాంతంలోని వారిని కురుబ, కురుంబ, హాలుమాత అని పిలుస్తారు. కూర్గ్ ప్రాంతంలోని వారిని గొల్ల, కురుబ అని పిలుస్తే మంగళూరు , కొల్లెగల్ ప్రాంతం వారిని కురుబ్, ధనగర్,

భార్వాడ్, హాలుమాతా, గొరవ అని పిలుస్తారు. గుల్బర్గ ప్రాంతంలో వీరిని ధనగర్ అని పిలుస్తారు. కురుమవారిలో తిరుమందారులు (మూడు నామాలు) విభూతిదారులు కుడా ఉన్నారు. విష్ణు, శ్రీ కృష్ణుడు, రాముడు తదితర వైష్ణవ దేవతలను ఆరాధించేవారు తిరుమందారులు కాగా శివున్ని ఆరాధించే వారు విభూతిదారులు.దేశంలోనిదాదాపుఅన్నిప్రాంతాలలోనిగొర్రెలకాపర్లలో ఈ విధమైన విభ్కజన ఉండటం గమనార్హం. గుజరాత్ లో గొర్రెల కాపర్లను 'భర్వాడ్' అని పిలుస్తారు. ఈ భర్వాడ్ లలో కూడా ఉన్ని, పత్తి మాదిరిగానే 'మోటాభాయ్, నానాభాయ్' అనే విభజన ఉన్నది. భర్వాడ్ అనే పదం బడ అంటే గొర్రెలు, వాడ అంటే కొట్టం అని అర్థం. బడ వాడ అనే పదం కాల క్రమంలో భర్వాడ గా మారిందని అంటారు. భర్వాడ ప్రకారం గుజరాత్ గొర్రెలకాపర్లు అంటే భర్వాడ వర్గం వారి తమను తాము నంద వంశీకులమని చెప్పుకుంటారు. శ్రీకృష్ణుడి పెంపుడు తండ్రి నందుడు అనేది అందరికి తెలిసిందే. తమ గొర్రెల మందలను మేపెందుకు ఇద్దరు గొర్రెల కాపర్లను రెండు వైపులకు వెళ్లవలసినదిగా శ్రీకృష్ణుడు ఆదేశిస్తాడనీ, గొర్రెల మందలను మేపే సమయంలో మొదటివాడు ఒక భర్వాడ్ మహిళను పెళ్లి చేసుకుంటే రెండవ గొర్రెలకాపరి ఒక కోలి మహిళను పెళ్లి చేసుకుంటాడు. భర్వాద్ మహిలకు పుట్టినవారు మోటాభాయ్ వర్గం గాను, కోలి మహిళకు పుట్టిన సంతానం నానా భాయ్ వర్గంగా ఏర్పడ్డారని భర్వాడ్ చరిత్ర చెబుతోంది. ఉత్తర ప్రదేశ్ లోని గొర్రెల కాపర్లలో కూడా రెండు వర్గాలు ఉన్నాయి. మొదటి వర్గం వారు తమను తాము 'నిఖర్' (స్వచ్ఛమైనవారు) అని చెప్పుకుంటే రెండో వర్గం వారిని 'పాల్' అని పిలుస్తారు.

కర్ణాటకలో లింగాయత్ కురుబ వర్గం అనేది ఒకటి ఉన్నది. కురుబ కులం నుండి లింగాయత్ వర్గంలోకి మారిన వారే ఈ లింగాయత్ కురుబలు. మల్లన్న దేవుడు ఒకసారి లింగాయత్ వర్గం సృష్టికర్తైన బసవన్నను కలుస్తాడు. బసవన్న తన వాక్చాతుర్యంతో మల్లన్న దేవుడిని లింగాయత్ గా మార్చివేస్తాడని తద్వారా వచ్చిన వారే లింగాయత్ కురుబ వర్గమని చెబుతారు. మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో నివసించే ధనగర్ వర్గంలో నాలుగైదు ఉప కులాలు ఉన్నాయి. అసల్ ధనగర్, హత్కర్ ధనగర్, బర్గి ధనగర్, బలైత్ ధనగర్, అహిర్ ధనగర్,ఖిలకరి ధనగర్ అనేవి ప్రధాన ఉప కులాలు. అయితే మహారాష్ట్రకు చెందిన ప్రముఖ విద్యావేత్త శంకర్ బాబురావు లాండే ప్రకారం ధనగర్ వర్గంలో దాదాపు ముప్పై ఐదు ఉప కులాలు ఉన్నాయి. అవి అహిర్, అసల్, వనుజి, బర్గేబంద్ (బర్గె) లేదా మేద్కరి, దంగే లేదా దుంగే, గడ్గే, గావలి,ఘోగ్తునియ, హత్కర్ లేదా ఝెందేవలె,

హోల్కర్, కంగర్, ఖేల్లరి లేదా థిల్లారి, ఖిల్కారి, ఖుటేకర్ లేదా ఖుటే, కులేత్కార్, లాడ్, మెండె, మహోస్కే, మహ్స్కార్, సంగేర్ లేదా సంగార్, శేగర్, శికోత్యా, ఉతేగాన్, కుచే, తిరములే, వరది లేదా బోరాడె, కనోరే లేదా కండె, జాడే, లాండ్సే, గద్రా, తెలంగే,మరాఠా,మహురై,బర్గె, లంగోటే, వైద్దు ధనగర్.

గోత్రాలు

కురుమ కులంతోనే గోత్ర వ్యవస్త అమలులోకి వచ్చిందని అల్లమ ప్రభు ప్రకటించారు.'కురుబ హుతవమున్న కులవిల్ల,గోత్ర విల్లం కురుబన్ ఫల్కాని బసవన్న' అని అల్లమ ప్రభు దాదాపు ఆరేడు వందల సంవత్సరాల క్రితం కర్ణాటకలో ప్రకటించారు. కురుబలకు ముందు గోత్రాలు లేవు, ఓ బసవన్నా కురుబలతోనే గోత్రాలు వచ్చాయి, మనమంతా కురుబ సంతతి వారము అన్నది దీని అర్థం. ఐతే ఇది ఎంతవరకు నిజమనేది చెప్పటం కష్టం. ప్రతి కులంలో గోత్రం వ్యవస్థ ఉండటం తెలిసిందే. అల్లమ ప్రభు దేనిని దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా చెప్పారనేది తెలియదు. హిందు మతంలో ప్రధానంగా ఎనిమిది గోత్రాలు ఉన్నాయి. అవి... శాండిల్య, గౌతమ మహర్షి, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ట, కాశ్యప, అత్రి. ఈ ఎనిమిది గోత్రాల జాబితాకు అగస్త్య పేరు కూడా జత చేస్తుంటారు. మొదటి ఎనిమిది మంది ఋషులను గోత్రకరనిలు అని పిలుస్తారు. ఈ గోత్రకరని ఋషుల నుండే మొత్తం 49 గోత్రాలు ఏర్పడ్డాయి. గోత్రం అంటే ఆ సంతతి వారని అర్థం. తెలంగాణా ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్, దాని చుట్టూ పక్కల ఉన్న చాలా మంది కురుమలది చండీశ్వర గోత్రం.

దేశంలోని ఇతర ప్రాంతాల్లో...

భారతదేశంలోని దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ గొర్రెల కాపర్లు ఉన్నారు. వీరిని రక,రకాల పేర్లతో పిలుస్తున్నారు. దక్షినాదిలోని తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్నాట, కేరళలో గొర్రెల కాపర్లను కురుమ, కురుబ, కురువ, మదాసి కురువ, మాదారి కురువ,కురుంబ, కురుంబార్, కురుమాన్, అత్తుతిదియాన్, అత్తియాన్ అని పిలుస్తారు. ఉత్తర ప్రదేశ్, హర్యానా, పంజాబ్, ఢిల్లీ, బిహార్ లో ధనగర్, పాల్, పాల్ క్షత్రియ, బగేల్, బఘేల, గడరియ, గ్వాలా, మరాఠా, రాజపాల్భేడ్వర్, గంగాజలి,భగత్ అని పిలుస్తారు. జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ లో గొర్రెల కాపర్లలను గద్ది, బకర్ వాలా ,పోహెూల్ ని పిలుస్తారు. సింద్ ప్రాంతంలో రేధార్ అని పిలిస్తే మహారాష్ట్రలో ధనగర్,ఖుటేకర్,

హత్కర్, హత్గర్, బంజారా, వాఘ్లె, గ్వాలా, మరాఠా, మధ్యప్రదేశ్ లో ధనగర్, బఘెల్, గడరియా, ఘోసి, నిఖర్, పాల్, బఘేలా, అహిర్, యాదవ్ అని అంటారు. గుజరాత్ లో రబరి, భర్వాడ్, పశ్చిమ బెంగాల్ లో మేశాశ్వాక్, రఖాలు,గోనేరి, గడేరి,పాల్, హర్ధర్, రాజస్తాన్ లో రాబారి, మాల్దార్, భార్వాడ్, త్రిపురలో గ్వాలా అని పిలుస్తారు. అస్సాంలో భేరారోకియ, ఒరిస్సాలో ఒరవాన్, ఒరాన్, కుర్ఫ్, సైలె, అగ్రయ్య, మేష్పాలక్, మెషాపాలక్, సంస్కృతంలో గొర్రెలకాపర్లను అజపాలకులు, మేష పాలకులు అని అంటారు. ఉత్తరప్రదేశ్ లోని సహరాన్పూర్ నుండి వారణాసి మధ్య ఉన్న ప్రాంతాల్లో ఈ వర్గం వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. గొర్రెల కాపర్లు ఆగ్రా నగరంలో అత్యధిక సంఖ్యలో ఉండటం గమనార్హం. ధనగర్ కులానికి చెందిన అహల్య భాయి హొల్కర్ పాలించిన మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ లో ధనగర్ లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. చోట నాగపూర్ ప్రాంతంలో కూడా ధనగర్, కురుబ వర్గం ప్రజలు ఉన్నారు. వీరంతా ఒకప్పుడు కర్నాటకలోని కొంకన్, గుజరాత్ నుండి అక్కడికి వెళ్లి స్థిరపడిన వారని అంటారు. హిమాచల్ ప్రదేశ్ లోని చంబా, కాంగ్రా లోయలో గొర్రెల కాపర్ల సంఖ్యా అత్యధికం. హిమాచల్ ప్రదేశ్ లోని చంబా, కాంగ్రా ప్రాంతానికి చెందిన గొర్రెల కాపర్లు 'గద్దీలు'ఎత్తైన హిమాలయాలలోని మంచు పర్వత ప్రాంతంలో తమ గొర్రెలు, మేకలను మేపుతూ జీవిస్తారు. తమని తాము పరమ శివుడి సంతానంగా చెప్పుకునే గద్దీల జానపద గేయాలు ఎంతో ప్రాముఖ్యత సంపాదించాయి. మధురమైన వీరి ప్రేమ పాటలు హిమాయల పర్వతాలు, లోయల్లో ప్రతిధ్వనిస్తుంటాయి. గొర్రెల కాపర్ల కులం పుట్టుకపై దేశంలోని ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకమైన కథ ఉన్నది. విష్ణువు ఏడవ అవతారమైన శ్రీ రాముడి కాలంలో వీరిని అడవులకు పంపించటం వలన గొర్రెల కాపర్లుగా మారారని హర్యానాలో ప్రాచారంలో ఉన్న ఒక కథ చెబుతోంది. హర్యానా గొర్రెల కాపర్లల్లో నాలుగు ఉపకులాలు ఉన్నాయి. నిబ్బార్, ధింగర్, కంచనే, శైల అనేవి ఈ ఉపకులాలు. గొర్రెల కాపర్లు అత్యధికంగా ఉన్న ఉత్తర ప్రదేశ్ లో మరో రకమైన కథ ప్రచారంలో ఉన్నది. ఉత్తర ప్రదేశ్ లో ప్రవహించే బఘేల నది ఒడ్డున నివచించే వారు కాబటి వీరిని బఘేల అని పిలుస్తారు. తాము బఘేల రాజ వంశానికి చెందినవారిమని వీరు చెప్పుకుంటారు. తామంతా బాఘేల రాజు సంతానం , అందుకే తమకు బఘేల అనే పేరు వచ్చిందన్నది వీరి వాదన. ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రలోని గొర్రెల కాపర్లలో ధనగర్, నిఖర్ అనే రెండు ఉపకులాలు ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్ లో ఓక్రే అనే మరో ఉపకులం కుడా ఉన్నది. మధ్య ప్రదేశ్ లోని గడరియ గొర్రెల కాపర్లలో కూడా దిసోరి, లర్సియా అనే రెండు ఉప కులాలు ఉండటం

గమనార్హం.

తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలో ఉన్నట్లే ఇతర రాష్ట్రాలలో కూడా ఉన్ని, పత్తి లాంటి విభజన ఉన్నది. తాము ఒక తండ్రి, ఇద్దరు తల్లులకు చెందిన పిల్లలమని చెప్పుకునే కథ ఉత్తరాది రాష్ట్రాలలో ప్రచారంలో ఉన్నది. అయితే తల్లులు, తండ్రి ఎవరనేది మాత్రం వీరికి తెలియదు. మల్లన్న, బలిజ మేడాలమ్మ, గొల్ల కేతమ్మ, బీరప్ప, కామారతి, అక్క మహంకాళి తదితర కథలేవి ఉత్తరాదికి చెందిన గొర్రెల కాపర్లకు తెలియదు. ఒక తండ్రి, ఇద్దరు తల్లులు, వారి సంతానం అనేది మాత్రం వీరికి సూచాయగా తెలుసు. ఉత్తరాదిలో ఉన్న విభజన ప్రకారం మొదటి భార్య సంతానం 'నిఖర్' లని, రెండవ భార్య సంతానాన్ని పాల్ లేదా ధనగర్ అని పిలుస్తారు. గతంలో వీరి మధ్య కంచం పొత్తు మాత్రమె ఉండి వియ్యం పొత్తు ఉండేది కాదు. అయితే ఇప్పుడు కొందరు కంచం పొత్తు తో పాటు వియ్యం పొత్తును కూడా అంగీకరిస్తున్నారు. నిఖర్ లు తమను తాము ఉన్నతులుగా భావిస్తారు.



శ్రీవీర బసవన్న,
లింగాయత్ వ్యవస్థాపకులు

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గొర్రెల కాపర్లకు ఉన్న పేర్లు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. ఆంధ్ర ప్రదేశ్:	కురుమ గొల్ల, కురుమ, గొల్ల, పాలవాడు, మదాసి మదాసి కురువ, మాదారి కురువ.
2. తెలంగాణ :	కురుమ, కురుమ గొల్ల
3. అస్సాం :	ఒర్వాన్, భీరరోఖియ.
4. బిహార్ :	ఒర్వాన్, భీరరోఖియ. పాల్,గద్దర్, రాజ్ పాల్, గడరియ, భేద్వార్ గంగాజలి.
5. గుజరాత్ :	రబరి, భర్వాడ్.
6. హర్యానా :	పాల్, రాజపాల్, మర్వాట్ట, గడరియ.
7. హిమాచల్ ప్రదేశ్:	గద్ది, పాల్.
8. జమ్మూ, కాశ్మీర్ :	పోహెూల్, బకర్వాల్.
9. కర్ణాటక :	కురుబ, ధనగర్.
10. కేరళ :	కురుంబ, అత్తియన్.
11. మధ్య ప్రదేశ్:	ధనగర్, భగేట్, ఘోసి, గడరియ, నిఖర్, పాల్, బఘేలో,అహిర్, యాదవ్, గావలి, భరుద్.
12. మహారాష్ట్ర :	ధనగర్, కుటేకర్, హత్కర్, మరాఠా గావలి.
13. ఒరిస్సా :	ఒరవాన్, ఒరావున్, సైలె, కుర్ఖ.
14. పంజాబ్ :	పాల్, రాజపాల్, మర్వాత్త, గడరియ.
15. రాజస్థాన్ :	పాల్, గడరియ ,రేవడి, బంజారా, భేద్వర్, గంగాజలీ , భగత్.
16. ఉత్తర్ ప్రదేశ్:	పాల్, పాల్క్షత్రియ, బఘేట్,బాఘేల, ధనగర్, నిఖర్, గడరియ.
17. పశిమ బెంగాల్ :	గడేరి, పాల్, హల్దార్, రఖల్.
18. ఉత్తరాంచల్ :	గద్ది, పాల్.
19. తమిళనాడు :	కురుంబ, కురుంబార్, కురుమాన్.
20. ఢిల్లీ:	పాల్, నిఖర్, బఘెల్. గడరియ.
21. సిక్కిం :	లంచెప్ప, లంచుంగ్పస్.



మతము, దేవుడు, సభ్యత, సంస్కృతి!

కురుమ, కురుబ, కురువ, కురుంబార్, కురుమాన్ తదితర గొర్రెల కాపర్లంతా శైవులు. పరమ శివుడి సంతానం కాబట్టి వీరంతా శైవ మతస్తులు. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలను పోషించే వారంతా శైవులు. నిజానికి తమను తాము వైష్ణవులుగా చెప్పుకుంటున్న యాదవులు కూడా ఒకప్పుడు శైవులే ఐతే శ్రీకృష్ణుడిని విష్ణు అవతారంగా మార్చివేసినప్పటి నుండి గొల్లలు, యాదవులు తమను తాము వైష్ణవులుగా పిలుచుకుంటున్నారు. వేదాలు, పురాణాలు, ఇతర ఐతిహాసిక గ్రంథాలు శ్రీకృష్ణుడు పశు పాలకుడని ఘంటాపథంగా చెబుతున్నాయి.

వేదాలు, పురాణాలు శ్రీకృష్ణుడు పశు పాలకుడని చెబుతుంటే అతను, అతని సంతతి వారు వైష్ణవులు ఎలా అవుతారు? పశు పాలకులు తమను తాము ఏ కులం పేరుతో పిలుచుకున్నా వీరంతా ప్రాథమికంగా శైవులే. వైష్ణవ ప్రభావం మూలంగా కొందరు కురుమ, కురుబ ప్రజలు తిరుమందారులు అంటే మూడు నామాలు పెట్టు కోవటం ద్వారా వైష్ణవులుగా మారిపోయారు. వైష్ణవం ప్రభావానికి లోనుకాకుండా శైవానికి కట్టుబదినవారు విభుతిదారులు. ప్రస్తుతం చాల మంది గొర్రెలకాపర్లు శైవ, వైష్ణవ భేదం చూపించకుండా అందరు దేవుళ్ళను పూజిస్తున్నారు.

శివుడి సంతానం కాబట్టే వీరి ప్రధాన దేవతలు మల్లన్న,బీరప్ప, రేణుకా ఎల్లమ్మ.వీర శైవం వైపు మొగ్గు చూపిన కొందరు కురుమలు బీరప్పను వీరభద్ర స్వామిగా కుడా కొలుస్తారు. కురుమ కులం ప్రజలు ఇప్పుడు బీరప్ప, మల్లన్నతో పాటు శ్రీ కృష్ణుడు, శ్రీ వెంకటేశ్వర స్వామి తదితర ఇతర దేవుళ్ళను కుడా పూజిస్తున్నారు.

కురుమ,కురుబ వర్గం వారు తమ వీరులను దేవుళ్ళుగా పూజించటం ఒక ఆచారం. మైసూరు ప్రాంతం కురుమ,కురుబ ప్రజలు ఒక రాక్షసున్ని వదించటం ద్వారా తమను కష్టాల నుండి కాపాడిన మైలారును దేవుడుగా పూజిస్తారని మైసూరు గిరిజనకులాల గజెట్ తెలుపుతోంది. రాక్షనున్ని వధించటం ద్వారా తమను కాపాడిన మైలారు మరణించిన అనంతరం అతనికి ఒక గుడి కట్టి పూజించటం ప్రారంబించారని ఈ గజెట్

చెబుతోంది. కర్నాటకలోని బళ్లారి జిల్లాలో ఉన్న మైలార్ దేవాలయానికి ఎంతో ప్రఖ్యాతి ఉన్నది. మైలార్ దేవుడికి గౌరవ సూచకంగా ప్రతి సంవత్సరం ఇక్కడ పండుగ నిర్వహిస్తారు. కురుమ,కురుబలుమైలార,వీరభద్ర,బత్యప్ప,ఇరచ్చికప్ప,కళ్ళు కంభడప్ప, బడలప్ప సెట్టిపల్లెప్ప, కురకుంటప్ప, కరకురప్ప, ఉలిగమ్మ, మల్లప్ప, ఆంత్రగట్టమ్మ, కేంచరాయ, మరియమ్మ, సుంకులమ్మ, హెూంబలమ్మ లను కూడా పూజిస్తారు. కురుమ, కురుబలు జమ్మి చెట్టు, అశ్వత్తాం చెట్టును పుజిస్తారు. దసరా పండుగ సందర్భంగా జమ్మి చెట్టును ప్రత్యేకంగా పూజిస్తారు. మైసూరు ప్రాంతానికి చెందిన కురుబలు ఒక ప్రత్యేక పెట్టెను పూజించటం గమనార్హం. జుంజప్ప దేవుడుగా పిలుచుకునే ఈ పెట్టెలో శ్రీ కృష్ణుడు ధరించిన బట్టలు ఉంటాయని వారు నమ్ముతారు. మైసూరు ప్రాంతంలోని కురుబ ప్రజలు దసరా పండుగ సమయంలో తమ కుల దేవతలు, ఇష్ట దేవతను పూజించటం ఆనవాయితి.

తెలంగాణలోని కురుమలు బీరప్ప, మల్లన్న దేవుళ్ళను ప్రధానంగా పూజిస్తారు. కురుమలు పలు గ్రామాల్లో బీరప్ప దేవాలయాలు నిర్మించుకోవటం అందరికి తెలిసిందే. మల్లన్న దేవాలయాల్లో లింగాయత్ బలిజలు పూజారులుగా వ్యవహరించినా బీరప్ప దేవాలయాల్లో మాత్రం కేవలం కురుమ కులానికి చెందిన ఒగ్గు పూజారులు మాత్రమే పూజారులుగా వ్యవహరిస్తారు. పండుగలు, పెళ్ళిళ్ళు ఇతర ఉత్సవాల సమయాల్లో మల్లన్న, బీరప్ప, రేణుకా ఎల్లమ్మ కథలు చెప్పించటం ద్వారా తమ కులం దేవతల జీవిత చరిత్రను పునశ్చరణ చేసుకోవటం ఒక సంప్రదాయం. దేవుడి పూజ సందర్భంగా నిప్పులపై నడవటం, శరభ, శరభా అంటూ గొలుసులు తెంపటం కురుమల ప్రత్యేకత. గొర్రెల పెంపకందారుల ప్రధాన దేవత, ప్రదాత ,మూలపురుషుడైన మల్లన్న, మైలర్ లేదా ఖండోబా జీవిత చరిత్ర తమిళుల ఇష్ట దేవుడైన మురుగన్ లేదా మురుకన్ జీవిత చరిత్ర ఒకే రకంగా ఉంటుంది. మురుగన్, మల్లన్న ఇద్దరు కుడా శివుని సంతానమే. మురుగున్ కు ఇద్దరు భార్యలు ఉన్నట్లే మల్లన్నకు కూడా ఇద్దరు భార్యలు ఉంటారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే వీరిద్దరి భార్యల్లో ఒకరు ఉన్నత కులానికి చెందిన మహిళ అయితే రెండో భార్య అటవి ప్రాంతానికి చెందిన గిరిజన మహిళ. ఇద్దరు కూడా మొదటి భార్యను సంప్రదాయబద్దంగా పెళ్లి చేసుకుంటే రెండో భార్యను ప్రేమించి పెళ్లి చేసుకోవటం గమనార్హం. మురుగన్ కాల క్రమంలో అవిభాజిత ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మల్లన్నగా రూపాంతరం చెందినట్లు భావించవలసి ఉంటుంది. మల్లన్నకు మూల పురుషుడుగా భావించే మురుగన్ లేదా మురుకన్ ఇద్దరు

భార్యల్లో మొదటి భార్య దేవయాని లేదా దేవసేన. ఈమె దేవతలకు రాజైన ఇంద్రుడి కూతురు. మురుగన్ రెండో భార్య వల్లి. ఈమె అటవి ప్రాంతానికి చెందిన కురవ మహిళ. ఇదే విధంగా మల్లన్న మొదటి భార్య దేవగిరి యాదవ రాజు కూతురు, రెండో భార్య గొల్ల కేతమ్మ(ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలో), మహారాష్ట్రలో ధనగర్ వర్గానికి చెందిన బనై , కర్ణాటకలో కురుబ కులానికి చెందిన కురుబాటవ్వ. తెలంగాణా, ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల్లో కురుమ, కురుబ వర్గం వారు చేసే పూజలు తమిళనాడులో మురుగన్ కు చేసే పూజల మాదిరిగానే ఉంటాయి. రెండు రాష్ట్రాల్లో పాటించే దేవుడి పెళ్లి, నిప్పులపై నడవటం,గొలుసులు తెంపటం వంటివి పరిశీలిస్తే ఇద్దరు దేవుళ్ళు ఒకటేననేది స్పష్టమైపోతుంది. మురుగన్ కు మరోపేరు కుమారస్వామి అనేది అందరికి తెలిసిందే. తెలంగాణాలోని కొమురవెల్లి మల్లన్న గుడి చరిత్రను పరిశీలిస్తే కుమారస్వామి, ఆయన ఇష్ట సఖి వల్లి పేరు మీద ఈ గుడి వెలసిందనేది స్పష్టం అవుతుంది. కొమువవెల్లి మల్లన్న పేరును విడదీస్తే కుమార స్వామీ, వల్లి, మల్లన్న పేర్లు వెలుగులోకివస్తాయి. మురుగన్, మల్లన్న ఇద్దరు ఒకటే అనేందుకు ఇంతకంటే వేరే నిదర్శనం అవసరం ఉండదు.

సంగమ సాహిత్యంలో మురుగన్ కు సంబందించిన తొలి ఆనవాళ్ళు కనిపిస్తాయి. పురాతన తమిళ ప్రాంతానికి సంబంధించిన సంగమ సాహిత్యం క్రీస్తు పూర్వం 300 సంవత్సరాల నుండి క్రీస్తు శకం 300 సంవత్సరాల మధ్య కాలంలో రాయబడింది. క్రీస్తు పూర్వమే మురుగన్ చరిత్ర ఉన్నదంటే ఆ కాలంలో కూడా గొర్రెల కాపర్లు ఉన్నట్లే కదా. సంగమ కాలానికి చెందిన కురువ ప్రజలు కొండలు, గుట్టలపై నివసించే వారు. మురుకన్ దేవుడిని పూజించేందుకు ఈ కురువ ప్రజలు గుంపులు, గుంపులుగా నృత్యం చేసే వారని సంగమ సాహిత్యం చెబుతోంది. కురువ ప్రజలు మురుకన్ కు ఒక మేకను బలి ఇచ్చి పూజలు చేసిన అనంతరం రాత్రి పొద్దు పోయేంతవరకు నృత్యం చేసేవారు. కురువలు తమ దేవుడైన మురుకన్ ప్రధాన ఆయుధమైన శూలాన్నిచేతపట్టుకుని నృత్యం చేసేవారు. కురువ బాలికలు చేసే నృత్యాన్ని 'వెరియట్టు' అని పిలిచే వారని సంగమ సాహిత్యానికి చెందిన పుస్తకం ' మురుకర్రుప్పటై' చెబుతోంది. వెంకయ్ చెట్టు కింద కురువలు, వారి బాలికలు ఒకరి చేతులు మరొకరు పట్టుకుని 'వేలన్' నృత్యం చేస్తూ మురుకన్ ను ప్రార్థించే వారు. వేలన్ నృత్యం చేసే ముందు వీరు కల్లు తాగేవారు. మురుకన్ కురువ బాలికలతో అడవిలోని బండ రాళ్ళపై నృత్యం చేసేందుకు ఇష్టపడే వాడని సంగమ సాహిత్యానికి చెందిన'మురుకుమలైపటు' తెలియజేస్తోంది. కురువలు తొంటకపరయ్ అనే డోలును వాయిస్తూ ఈ నృత్యం చేసేవారు.

మురుగన్ జననం



మురుకన్ జననం గురించి సంగమ సాహిత్యంలో కొన్ని ప్రస్తావనలు ఉన్నాయి. 'పరిపటల్'అనే పుస్తకంలో మురుగన్,మురుకన్ లేదా కురుకన్ జననానికి సంబంధించిన వివరాలు ఉన్నాయి. పరమ శివుడు తన భార్య పార్వతితో సంగమిస్తున్న సమయంలో ఇంతిరాన్ అకడికి వస్తాడు, అతని రాక మూలంగా సంభవించిన అలజడి వలన శివుని వీర్యం బైటికి వచ్చి ఆరు భాగాలుగా విడిపోతుంది. ఈ వీర్యం ఆరు భాగాలు ఆరుగురు ఋషుల ఆత్మలోకి చేరి అక్కడి నుండి 'కర్పం' వారి ఆరుగురు భార్యల కడుపుల్లోకి చేరుతుంది. ఆరుగురు ఋషుల భార్యలు హిమాలయాలలోని ఒక సరస్సులో ఉన్న ఆరు కమల పువ్వుల్లో ప్రసవిస్తారు. సంగమ సాహిత్యంలోని మురుకు, పురం, కలిలో కూడా మురుకన్ జననానికి సంబంధించిన కథనం ఉన్నది.

మురుకన్ జన్మించిన రోజే ఇంతిరన్ అతని శత్రువుగా మారి తన వజ్రాయుధంతో అతన్ని చంపేందుకు ప్రయత్నిస్తాడు. అప్పుడు అరుగురు మురుకన్లు ఒక్కరుగా రూపాంతరం చెంది ఆరు తలలు, పన్నెండు చేతులతో అవతరిస్తాడు. దేవతలు ఒక్కొక్కరు తమలోని ఒక్కొక్క భాగాని తీసి ఆయుధాలుగా మార్చి ఇంతిరాన్ తో పోరాడేందుకు మురుకన్ కు అందజేస్తారు. దేవతలు మురుకన్ కు మేక, నెమలి,కోడి, విల్లు, మరన్, కత్తి, ఈటే, కొటారి, మలు,కనలి, పూల దండ, గంటలను అందజేస్తారు. మురుకన్ వీటిని తన ఆరు చేతుల్లో ధరించి హుందాగా వెలిగిపోతుంటాడు.

మురుగన్ వివాహము

మురుగన్ కు ఇద్దరు భార్యలు. దేవతలను కష్టాలపాలు చేసిన కురన్ లేదా చురరన్ మరియు క్రౌంచంలను హతమార్చిన మురుగన్ లేదా మురుకన్ తన శత్రువైన ఇంతిరన్ (బహుశా ఇంద్రుడు కావచ్చు) కూతురు తేవయానై లేదా దేవయానిని పెద్దల నిర్ణయం మేరకు పెళ్లి చేసుకుంటాడు. ఇంతిరన్ యుద్ధంలో ఓడిపోయిన అనంతరం తన కూతురు



తేవయానిని మురుకన్ కు ఇచ్చి పెళ్లి చేసేందుకు అంగీకరిస్తాడు (మురుకు **6.175**, పరిపటల్ **99.58**). మురుగన్ అ తరువాత వరంకున్రం వద్ద వల్లినచియారను ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు (మురుకు పరిపటల్ **8:69, 9:67**). ఈ రెండు కుడా భిన్నమైన పెళ్ళిళ్ళు అనేది సుస్పష్టం. మొదటి వివాహం పెద్దలు నిర్ణయించినదైతే రెండోది ప్రేమ వివాహం. రెండో పెళ్లి పురాతన తమిళ ప్రేమ సంప్రదాయమైన 'కలవు-కర్పు ప్రకారం జరుగుతుంది. మల్లన్న కుడా పెద్దలు నిర్ణయించిన పెళ్ళితో పాటు మరో మహిళను ప్రేమించి పెళ్లి చేసుకోవటం మనకు తెలిసిందే.

మురుగన్ ప్రేమించి పెళ్లి చేసుకున్న వల్లి పూర్వాపరాలు తెలుసుకోవలసిన అవసరం చాలా ఉన్నది. కురువార్ తెగకు చెందిన పర్వత రాజు నంబి రాజన్ కూతురు వల్లి. నంబి రాజు అతని భార్య ఆడ సంతానం కోసం పర్వత దేవుడు మురుగన్ ను కొలుస్తారు. వారి మొర ఆలకించిన మురుగన్ వారికి ఒక ఆడ సంతానాన్ని ప్రసాదిస్తాడు. ఆమెనే వల్లి. పర్వత రాజు కూతురైన వల్లి రాకుమరిగా పెరుగుతుంది. ఆమె వేటకాడైన మురుగన్ ను ప్రేమించి పెళ్లి చేసుకుంటుంది. మురుగన్, వల్లిని మొదట ప్రేమించి ఆ తరువాత పెళ్లి చేసుకున్న ప్రాంతం తమిళనాడులోని వెల్లోర్ జిల్లాలో ఉన్నది. వారు పెళ్లి చేసుకున్న తరువాత తిరుత్తనిలోని ఆరుపడై వీధికి మకాం మారుస్తారు.

మురుకన్ ను పూజించే విధానంలో వచ్చిన మార్పులని పరిశీలిస్తే గిరిజనులకు చెందిన ఈ దేవుడు కాల క్రమంలో ఏ విధంగా ఉన్నత వర్గాల దేవుడుగా మారిపోయాడనేది స్పష్టం అవుతుంది. మురుగన్ ను మొదట కేవలం గిరిజన, బడుగు ప్రజలు మాత్రమే పూజించేవారు. సంగమ సాహిత్యం ప్రకారం ప్రారంభంలో 'వెరియట్టు' పూజ విధానం అమలులో ఉండేది. వెరియట్టు విధానంలో మురుగన్ ను 'వెలాన్'గా పూజించేవారు. వెలాన్ మాంసం భుజించే దేవుడు. బలి ఇచ్చిన మేక రక్తం కలిపిన 'తినై'

అనే వంటకాన్ని మురుగన్‌కు నైవేద్యంగా పెట్టే వారు. మురుగన్‌కు శాశ్వత దేవాలయాలు ఉండేవి కాదు, కొండలు, గుట్టల్లో నివసించే కురవ వర్గం ప్రజలు మాత్రమె వెరియట్టు పూజ చేసేవారు. వెరియట్టు కురవ ప్రజల కురుంబ పూజా విధానం. కురవ బాలికలకు సోకిన 'అనంకు' ను పారదోలేందుకు వెరియాట్టు పూజ చేసేవారు (కున్రు,పలముతిర్కోలై). రెండవ దశలో కురుగన్ కు శాశ్వత దేవాలయాలు ఏర్పడ్డాయి. ఈ విధానాన్ని 'పటైవిటుస్' అని పిలిచేవారు. రెండో దశ పూజా విధానంలో వెరియట్టు, పటైవిటుస్, రెండు అమలులో ఉండేవని సంగమ సాహిత్యానికి చెందిన 'తిరుమురుకర్రుప్పటై' చెబుతోంది. దేవాలయ అర్చన విధానం బ్రాహ్మణుల ప్రభావాన్ని బాగా పెంచటంతో పాటు మురుగన్ ను అన్ని వర్గాల దేవుడుగా మార్చివేసింది. దీనితో అన్ని వర్గాల వారు మురుగన్ ను పూజించటం ప్రారంభమైంది. ఈ మూడో పూజ విధానాన్ని పరిపటై అని పిలిచే వారు. పరిపటై విధానంలో మేకలు, గొర్రెలను బలి ఇచ్చే ఆచారాన్ని తొలగించి 'వెరియట్టు' పూజ విధానం మాట లేకుండా చేశారు. తద్వారా కురవ వర్గం దేవతను బ్రాహ్మణ వర్గం దేవుడుగా మార్చుకున్నారు. మురుగన్ ను సంస్కృతీకరించటం ద్వారా అతనికి కురవ వర్గంతో ఉండిన సంబంధాన్ని నామ రూపాలు లేకుండా చేశారు. తమిళనాడులోని దక్షిణ జిల్లాల్లో గ్రామ దేవతలకు ప్రతి సంవత్సరం నిర్వహించే 'కొటై' ఉత్సవాల్లో వెరియట్టు పూజా విధానం ఆనవాళ్ళు ఇప్పటికీ కనిపిస్తాయి. గ్రామ దేవతకు మేకలు, గొర్రెలను బలి ఇచ్చిన తరువాత వాటి రక్తాన్ని అన్నంలో కలిపి నైవేద్యంగా పెడతారు. వెరియట్టు పూజా విధానంలో సూచించిన విధంగా గ్రామ దేవతల దేవాలయాలను రంగు, రంగుల బట్టలు, తాటి ఆకులతో అలంకరిస్తారు. తమిళనాడులోని దక్షిణ జిల్లాలకు చెందిన గ్రామీన ప్రజలు నేడు కుడా వెరియట్టు పద్దతిలో గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. మురుగన్ ను సంస్కృతీకరించటం ద్వారా వెరియట్టు పూజా విధానాన్ని తొలగించినా తమిళనాడు ప్రజలు నేటికి మురుగన్ తో పాటు వల్లిని తమ ఇష్ట దేవతగా కొలుస్తునే ఉన్నారు.

మల్లన్న కథ

మల్లన్న, మల్లికార్జునుడు, మైలార్ , ఖాండోబా,ఖండేరావు తదితర పేర్లతో ఈ దేవుడిని పిలుస్తారు. మహారాష్ట్రలో ఖాండోబా, ఖండేరావు అని పిలిస్తే ఆంధ్ర తెలంగాణా రాష్ట్రాల్లో ఈ దేవుడిని మల్లన్న, మల్లిఖార్జునుడుగా పూజిస్తారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ దేవుడు మైలార్ అనే పేరుతో పూజలందుకుంటున్నాడు. తమిళనాడులో మురుకన్



అని అంటారు. మల్లన్న దేవుడికి సంబందించిన మొదటి ఆనవాళ్ళు సంగమ సాహిత్యంలో లబించాయి. సంగమ సాహిత్యంలో మురుకన్ గా పేర్కొన్నారు. దక్షిణాదిలోని పలు ప్రాంతాల్లో ఎంతో పురాతన కాలం నుండి మురుకన్‌గా ప్రచారంలో ఉన్న దేవుడికి ప్రతి రూపమే మల్లన్న, ఖండోబా, మల్లికార్జున స్వామిగా చెప్పుకోవచ్చు. దక్కన్లోని పలు ప్రాంతాల్లో మల్లన్న దెవుడిని పుజిస్తారు. మల్లన్న, ఖండోబా దేవుడి ఆవిర్భావం పట్టణ ప్రాంతాల్లో కాకుండా పశువుల కాపర్లు నివసించే పర్వత ప్రాంతాల్లో జరగటం గమనార్హం. వేదాలు ప్రస్తావించే రుద్ర దేవుడి ఆవిర్భావం కుడా పర్వత ప్రాంతాల్లో జరటం చూస్తుంటే ఈ ఇద్దరు దేవుళ్ళు ఒకటేననే అభిప్రాయం కలగక మానదు. నాలుగు లేదా ఐదో శతాబ్దంలో ఆవిర్భవించిన పురాతన తమిళ సంగమ సాహిత్యం ప్రకారం మల్లన్న, మురుకన్ దేవుడిని అటవీ, పర్వత ప్రాంతాల్లో జీవించే ప్రజలు పూజించే వారు. శివ పార్వతుల సంతానమైన స్కందుడు,కార్తికేయునితో సమానమని భావించిన మురుకన్ కూడా పర్వత ప్రాంతాల్లో మాత్రమే కనిపించేవాడు. మురుకన్ మాదిరిగానే ఖండోబా, మల్లికార్జునుడు, మల్లయ్య కూడా అటవీ, పర్వత ప్రాంతాల దేవుడు. తమిళనాడు ప్రజలు ఈ రోజుకు కూడా మురుకన్ ను పర్వత రాజు అని పిలుచుకోవటం అందరికి తెలిసిందే. అటవీ, పర్వత ప్రాంతాల్లో నివసించే పశువుల కాపర్లు, గొర్రెల కాపర్లు, గిరిజనుల దేవుడైన మురుకన్, మల్లన్న ఇప్పుడు కూడా ప్రధానంగా ఈ వర్గాల దేవుడే. గిరిజనులు, పశువుల కాపర్లు, గొర్రెల కాపర్లు తాము ఎల్లప్పుడు సంచరించే పర్వతాలను పూజించే వారు. ఈ పర్వతాల పూజల నుండే మురుకన్, మల్లన్న ఉద్భవించాడు. మల్లయ్య అంటే పర్వతాల అధిపతి అని అర్థం. పశువులు, గొర్రెలను మేపేందుకు,కాసేందుకు గుట్టలు, పర్వతాలు ఎక్కటం అత్యంత సహజం. పర్వతాలపై పశువులు ముఖ్యంగా గొర్రెలు, మేకలను మేపే ప్రక్రియలో మురుక(గ)న్, మల్లయ్య దేవుడి ఆవిర్భావం జరిగి ఉంటుంది.

పశువులను గడ్డి మేసేందుకు వదిలి వేసిన అనంతరం జరిగిన దైవ చింతనలో మురుకన్, మల్లయ, ఖండోబా దేవుడి ప్రతిష్ట జరిగి ఉంటుంది. పర్వతాలపై కొంచెం

ఎత్తులో ఉన్న రాయిని దేవుడిగా భావించి పూజించటం, పశువులను మేపే సమయంలో తమకు ఎలాంటి హాని కలుగ కుండా చూడాలని కోరటం, తాము విడిచి వచ్చిన కుటుంబ సభ్యులు సురక్షితంగా ఉండాలని మొక్కుకునే సంప్రదాయం ఊపిరి పోసుకుని ఉంటుంది. తెలంగాణా, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర,తమిళనాడు లోని పశువుల కాపర్ల ఆచార,వ్యవహారాలను అధ్యయనం చేస్తే మల్లన్న దేవుడి పుట్టు పుర్వోత్తరాలకు సంబందించిన చారిత్రాత్మిక అంశాలు తెలుస్తాయి. చరిత్రకు పూర్వం విషయాలను తెలుసు కునేందుకు ఈ అంశంపై లోతైన అధ్యయనం ,పరిశోధన జరగ వలసి ఉన్నది. గొల్లలు, కురుబ, కురుమ, ధనగర్, కురుంబార్ తదితర కులాలు, వర్గాలకు చెందిన సంప్రదాయ కథలు, ఒగ్గు కథలు, మన పెద్దలు చేప్పే కథల ద్వారా మల్లన్న దేవుడి చరిత్ర తెలుసుకోవచ్చు. హైదరాబాద్ లోని బాగ్ అంబార్ పేటలో ఉన్న మల్లన్న గుడి వద్ద ఒగ్గు కలాకారులు చెప్పిన మల్లన్న, బీరప్ప కథలను విన్న వారు ఇప్పటికి ఇక్కడ ఉన్నారు. అంబర్ పేటలోని ఈ మల్లన్న గుడికి దాదాపు నాలుగు వందల యాభై సంవత్సరాల చరిత్ర ఉన్నది. కొమిరెల్లి మల్లన్న, ఐనవోలు మల్లన దేవాలయాల్లో ఒగ్గు కళాకారుల కథలు వింటే మల్లన్న , బిరప్ప దేవుడి చరిత్ర తెలుస్తుంది.

ఒక కథనం ప్రకారం ఖండోబా, మల్లన్న, మల్లికార్జునుడు వాస్తవానికి ఒక యాదవ రాజు. ఈ యాదవ రాజుకు మురుకన్ దైవత్వాన్ని ఆపాదించి దేవుడుగా పూజించటం ప్రారంభించారనే వాదన ఒకటి ఉన్నది. పన్నెండవ శతాబ్దంలో ఒక జైన ముని రాసిన పుస్తకం ప్రకారం మల్లన్న లేదా మల్లి దేవుడు ఒక చరిత్రామిక పురుషుడు. ఖండోబా గొప్పతనానికి గుర్తింపుగా ప్రజలు లేదా అతని వర్గం వారు అతనికి దైవత్వాన్ని ఆపాదించారని అంటారు. ఖండోబా దైవత్వం ఆపాదించబడిన ఒక యాదవ రాజు అని ప్రొఫెసర్ ఆర్.సి. ధీర్ తన 'ఖండోబా' అనే పుస్తకంలో పేర్కొన్నారు. పన్నెండవ శతాబ్దానికి **(1245)** చెందిన కర్నాటకలోని హుల్లుగ్ర్ శాసనంలో మల్లన్న, మల్లి దేవుడు, ఆయన భార్య పద్మాల దేవికి సంబంధించిన ప్రస్తావన ఉన్నది. కదంబ పాలకుడు మల్లప్ప (మల్లి దేవుడు) రాణి పద్మాల దేవి అని ఈ శాసనం ప్రకటిస్తోంది. దేవగిరి యాదవ రాజు సింఘన ఇచ్చిన హుల్లునగురు ప్రాంతాన్ని కదంబ పాలకుడు మల్లి దేవుడు బ్రహ్మపురి గా అభివృద్ధి చేసినట్లు ఈ శాసనం చెబుతోంది. జైన ముని రాసిన పుస్తకంలోని చారిత్రాత్మిక మల్లన్న లేదా మల్లి దేవుడు **1245** హుల్లుగురు శాసనంలోని మల్లప్ప లేదా మల్లి దేవుడు ఒకరే అయి ఉంటారు. రాజు మల్లన్న యాదవ సామ్రాజ్యానికి చెందిన పద్మాల దేవిని పెళ్లి

చేసుకుంటాడనేది మనందరికీ తెలిసిన విషయమే.

తెలంగాణలో మల్లన్న కథ

తెలంగాణలో ప్రచారంలో ఉన్న మల్లన్న కథలో ఆరు భాగాలు ఉన్నాయి . ఒకటి. నీలిమ దేవి కాండ. రెండు. మల్లన్న కాండ. మూడు వరలక్ష్మి కాండ. నాలుగురత్నంగి కాండ. ఐదు బలిజ మేడాలమ్మ కాండ. ఆరు గొల్లకేతమ్మ కాండ. మల్లన్న దేవుడు నలుగురు స్త్రీలను పెళ్లి చేసుకుంటాడు. బ్రాహ్మణ కులానికి చెందిన రత్నంగి, పద్మాల దేవి, బలిజ కులానికి చెందిన మెడాలమ్మ, గొల్ల కులానికి చెందిన కేతమ్మతో పాటు మల్లన్న కోమటి కులానికి చెందిన జ్యోమంతకమని అనే మహిళను కూడా పెళ్లి చేసున్నాడనే ఒక కథనం ఉన్నా దానికి సంబందించిన వివరాలు లబించటం లేదు.

నీలిమ దేవి కాండ:

మొదటి కాండం నీలిమ దేవి చరిత్ర, సంతానం లేక పోవటం వలన ఆమె పడే బాధ గురించి తెలియజేస్తోంది. నీలిమ దేవి సంతానం కోసం ప్రతి రోజు శంకరుణ్ణి పూజిస్తుంది. శివుడికి ప్రతినిధులైన జంగమయ్య దేవరులను గౌరవంగా చుసుకుంటానని ఆమె ప్రతిరోజు శివుడికి హామీ ఇస్తుంటుంది. జంగమ దేవరాలను ఎటువంటి పరిస్తితిలో కూడా అవమానించనని నీలిమ దేవి ప్రతిజ్ఞ చేస్తుంది. నీలిమ దేవి పూజలతో సంతోషించిన శివుడు ఆమెకు ఆరుగురు మగ సంతానాన్ని ప్రసాదిస్తాడు. నీలిమ దేవి ఆరుగు కొడుకులు పుట్టిన తరువాత శివుడికి ఇచ్చిన హామీలను మరిచిపోతుంది. జంగమ దేవర రూపంలో వచ్చిన శివుడిని అవమానిస్తుంది. ఇచ్చిన హామీలను మరిచినందుకు శివుడు ఆమెను శపిస్తాడు. శివుడి శాపం మూలంగా నీలిమ దేవి సర్వస్వం కోల్పోతుంది. చివరకు కొల్హాపురి పట్టణం కూడా కాలి బూడిదైపోతుంది. మనుషులకు కష్టాలు, బాధల్లో దేవుడు గుర్తుకు రావటం అత్యంత సహజం. అష్ట కష్టాలు పడుతున్న నీలిమ దేవికి కూడా శివుడు గుర్తుకు వస్తాడు. జంగమ దేవరలను గౌరవిస్తాననే హామీని మరిచి అవమానించటం ఆమెకు స్పురణకి వస్తుంది. చేసిన తప్పులను గ్రహించిన నీలిమ దేవి ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా శివుడిని ప్రార్తిస్తుంది, తప్పులను క్షమించాలంటూ కన్నీరు మున్నీరు అవుతుంది. ఇకమీదట ఇలాంటి తప్పు జరగదంటు విలపిస్తుంది. దీనురాలీని క్షమించాలంటూ శివుడిని ప్రాధేయపడుతుంది. భక్తుల చిన్న ప్రార్తనకే కరిగిపోయే కరుణామయుడైన భోలాశంకరుడు కరుణించటంతో నీలిమ దేవికి గత వైభవమంతా తిరిగి సమకూరుతుంది, దీనితో పాటు శివుని

దీవెనతో ఆమె ఎడో కొడుకుగా మల్లన్నకు జన్మ ఇస్తుంది. శివుడి అంశ లేదా శివుడి అవతారంగా మల్లన్న జన్మిస్తాడు.

మల్లన్న కాండ:

రెండవ కాండంలో మల్లన్న అతని బంధువు సంగన్న జీవిత విశేషాలను పొందుపరిచారు. తల్లి,దండ్రుల సలహా మేరకు మల్లన్న మొదట తన ఆరుగురు అన్నల పెళ్ళిళ్ళు వారి మేనమామల కూతుల్లతో చేస్తాడు. ఐతే తాను మాత్రం మేనమామ ఏడో కూతురును పెళ్లి చేసుకునేందుకు నిరాకరిస్తాడు. మల్లన్న కాలి బూడిదై పోయిన కొల్హాపురి పట్టణాన్ని పునర్ నిర్మిస్తాడు. ఆయన తన ఆరుగురు సోదరులకు పెళ్లి చేసిన అనంతరం పరమ శివుడి ఆదేశం మేరకు దేవగిరికి చెందిన పగడికల్ల పద్మాక్షి లేదా పద్మాల దేవిని పెళ్లి చేసుకునేందుకు సిద్దపడతాడు. దేవగిరి పట్టణం రాజు కటాల్ రెడ్డి, రాణి మానస దేవి. మల్లయ్యకు పద్మాల దేవిని ఇచ్చి పెళ్లి చేయాలనే ప్రతిపాదనను కొల్హాపురి రాజు ఆదిరెడ్డి దేవగిరి రాజు కటాల్ రెడ్డి, రాణి మానస దేవికి పంపిస్తారు. మల్లయ్యకు తమ కూతురును ఇచ్చే ప్రసక్తే లేదంటూ మానస దేవి పెళ్లి ప్రతిపాదనను తిరస్కరిస్తుంది. దీనితో మల్లయ్య స్వయంగా దేవగిరి పట్టణానికి వెళ్లి మానస దేవిని కలుసుకుంటాడు. మంకు పట్టు మల్లయ్యను దెబ్బ తీసేందుకు మానసదేవి ఎత్తు వేస్తుంది. తన కూతురును పెళ్లి చేసుకోవాలంటే పెద్ద ఎత్తున బంగారు, వెండి నగలను బహుకరించవలసి ఉంటుందనే షరతు పెడుతుంది. పౌర్ణమిలోగా కోరిన ధనం తెస్తేనే పెళ్లి జరుగుతుందని కుడా ఆమె స్పష్టం చేస్తుంది.

కళింగ పట్టణం రాజైన తన మేనమామ కలగంగ రాజును ధన సహాయం చేయమని మల్లయ్య అడుగుతాడు. తన వద్ద అంత ధనం లేదటూ ఆయన గతంలో పలువురు రాజులు ధనం దాచిపెట్టిన ధనాల కోట గురించి తెలియజేస్తాడు. ధనాల కోటకు ధనమైసమ్మ కాపలా ఉంటుందని కలగంగ రాజు చెబుతాడు. ధనాల కోటకు వెళ్ళిన వారెవ్వరూ ఇంత వరకు తిరిగి రాలేదని అతను మల్లన్నను హెచ్చరిస్తాడు.మల్లన్న ధనాల కోటపై దాడి చేసి కొల్లగొట్టిన ధనంతో తన అత్త,మామ, ముఖ్యంగా అత్త మానస దేవి పెట్టిన అన్ని షరతులను పూర్తి చేసి పద్మాల దేవిని పత్తి కంకణం కట్టి పెళ్లి చేసుకుంటాడు. మరో కథనం ప్రకారం మల్లయ్య బందిపోటు దొంగగా మారి దోచిన డబ్బుతో మానస దేవి షరతులను పూర్తి చేస్తాడనే వాదన ఉన్నది.

వరలక్కి దేవి కాండ:

మల్లన్న కొల్హాపురి పట్టణాన్ని సమర్థవంతంగా పరిపాలిస్తూ పేరు, ప్రఖ్యాతులు గడించటం పెద్ద వదిన వరలక్కి (వరలక్ష్మి)కి ఎంత మాత్రం గిట్టదు. పెద్ద వాడైన తన భర్త రాజై రాజ్య మేలాలి, తాను పట్టపు రాణి పదవి చేపట్టాలన్నది వరలక్కి లేదా ఒనమాలాదేవి అభిమతం . మల్లన్నను ఏ విధంగానైనా అపఖ్యాతిపాలు చేసి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలని ఆమె నిర్ణయించుకుంటుంది. ఈ లక్ష్య సాధన కోసం ఆమె మిగతా ఐదుగురు తోడికోడళ్ళను తన కుట్రలో భాగం చేస్తుంది. వరలక్కి తన కుట్రలో భాగంగా నీలిమ దేవి, పద్మాల దేవి బైటికి వెళ్ళినప్పుడు తన గదిలోకి పాము వచ్చిందనే నెపంతో మల్లన్నను కచేరి (రాజ దర్బార్) నుండి తోడి కోడళ్ళ ద్వారా పిలిపిస్తుంది. మల్లన్న వరలక్కి గదిలో పాము కోసం వెదుకుతున్న సమయంలో మిగతా ఐదుగురు వదినలు కుట్రలో భాగంగా బైట నుండి తలుపు గడియ వేస్తారు. వారు ఆ వెంటనే పొలాల్లో పని చేస్తున్న తమ భర్తల వద్దకు పరుగున వెళ్లి మల్లన్న పెద్దక్క వరలక్కిపై అత్యాచారం చేస్తున్నాడని ఆరోపిస్తారు. ఈ తప్పుడు సమాచారం వినగానే అగ్గిమీద గుగ్గిలమైన ఆరుగురు అన్నలు ఆయుధాలతో ఇంటికి బయలుదేరుతారు. ఇక్కడ గదిలో వరలక్కి మోసం, కుట్రను అర్థం చేసుకున్న మల్లన్న తలుపు పగల కొట్టి అడవిలోకి వెళ్ళిపోతాడు. వరలక్కి మాత్రం తన భర్త, ఐదుగురు మరదులు రాగానే మల్లన్న తనపై అత్యాచారం చేశాడంటూ గొల్లున ఏడుస్తుంది. మల్లన్న తనపై అఘాయిత్యం చేసి పారి పోయాడంటూ ఆమె గదిలో పడి ఉన్న అతని ముత్యాల కండువాను సాక్ష్యంగా చూపిస్తుంది. వరలక్కి దేవి మాటలు నమ్మిన ఆరుగురు సోదరులు మల్లన్నను చంపివేయాలనే నిర్ణయానికి వస్తారు.

మల్లన్న అడవిలో కొంత కాలం గడిపిన అనంతరం తల్లి కోసం మారు వేషంలో కొల్హాపురి పట్టణానికి వస్తాడు. మల్లన్న తన బంధువైన సంగన్న సహాయంతో తల్లి నీలిమ దేవిని రహస్యంగా కలిసి వాస్తవాలు వివరిస్తాడు. మల్లన్న ఆ తరువాత తాను ఎలాంటి తప్పు చేయలేదనేది సోదరులకు నిరూపిస్తాడు. సోదరులతో కుదిరిన ఒప్పందం మేరకు ఆయన కొల్హాపురి రాజ్యాన్ని వారికి అప్పగించి అడవిలోని పొలాల నిర్వహణ బాధ్యతను తాను తీసుకుంటాడు. మల్లన్న ఆరుగురు సోదరులు రాజ్యాధికారం చేపడతారు. తమ భర్తలు రాజ్యమేలటం చూసి వరలక్కి దేవి ఆమె ఐదుగురు మరదండ్లు సంతోషిస్తారు. ఇదిలా ఉంటే మల్లన్న పెళ్లి కోసం తమ వద్ద తీసుకున్న ధనాన్ని తిరిగి చెల్లించాలని వరలక్కి దేవి మిగతా ఐదుగురు మరదళ్ళ తల్లిదండ్రులు కొల్హాపురి రాజుకచేరికి

దూతలను పంపిస్తారు. ఆరుగురు సోదరులు ఈ డబ్బు చెల్లించేందుకు నిరాకరిస్తూ దూతలు తెచ్చిన లేఖను చింపివేస్తారు. దీనికి ఆగ్రహించిన దూతలు ఆరుగురు సోదరులపై దాడి చేస్తారు. తన సోదరులపై దాడి జరుగుతున్న విషయం తెలియగానే మల్లన్న హుటాహుటిన అక్కడకు వచ్చి వారిని కాపాడుతాడు. మల్లన్న చేసిన సహాయంతో వరలక్కి, మిగతా ఐదుగురు వదినల కళ్ళు తెరుచుకుంటాయి. తమను మన్నించి రాజ్యాన్ని చేపట్టాలని ఆరుగురు వదినలు విజ్ఞప్తి చేస్తారు. మల్లన్న మాత్రం వారి విజ్ఞప్తిని తిరస్కరించి అడవిలోని పొలాలను చూసుకునేందుకు వెళ్లిపోతాడు. మల్లన్న అడవిలో బంజరు భూమిని బాగు చేసేందుకు చిన్న,చిన్న చెట్లు, మొక్కలు, పొదలను నరికి వేస్తాడు. పొలంలో ఉన్న చీమలు,పాముల పుట్టలను తవ్వివేస్తాడు.

శివుడు ఒకానొక కాలంలో బంగారు గొర్రెను పార్వతికి బహూకరిస్తాడు. పార్వతికి శివుడు బహుకరించిన గొర్రెలు కాలక్రమంలో ఏడు కోట్లు అవుతాయి. పార్వతి ఈ బంగారు గొర్రెలను ఒక పుట్టలో దాచి దానికి తన ముక్కు పుల్లతో తాళం వేస్తుంది. మల్లన్న చీమలు, పాముల పుట్టలు తవ్వే సమయంలో కనిపించిన పార్వతి ముక్కు పోగును తొలగిస్తాడు. దీనితో బంగారు గొర్రెల ఆచూకి వేలుగులోకి వస్తుంది. మల్లన్న భక్తికి మెచ్చిన పార్వతి గొర్రెలను ఏడు సంవత్సరాల పాటు కాచుకోమని చెబుతుంది. గొర్రెలు కాయటంతో పాటు పుట్ట వద్ద ఉన్న మంట ఆరిపోకుండా చూడాలని ఆదేశిస్తుంది. మల్లన్న ప్రతి రోజు గొర్రెల పాలు పితికి నిప్పు కుంపటిలో వేడి చేసి, ప్రతి రోజు వేడి పాలతో పుట్టకు పూజ చేస్తుంటాడు.

రత్నంగి కాండ:

అడవిలో మల్లన్న పరమ శివుడు ఇచ్చిన గొర్రెలను మేపుకుంటూ బోదన్న లేదా బోయన్నతో కలిసి ఉంటూ ఒంటరి జీవితం గడుపుతుంటాడు. మల్లన్న అడవిలో ప్రతి రోజు పాముల పుట్ట వద్ద ఉన్న నిప్పుతో మేక పాలను కాచుతుంటాడు. ఒక రోజు పుట్ట వద్ద ఉన్న దీపం ఆరిపోవటంతో మల్లన్న నిప్పు కోసం బయలుదేరుతాడు. నిప్పు బ్రహ్మ రాక్షసి వద్ద ఉన్నట్లు తెలియటంతో ఆయన అక్కడికి వెళతాడు. నిప్పు కోసం వెతుకుతున్న సమయంలోబ్రహ్మ రాక్షసి వద్ద రత్నంగి అనే యువతి ఉన్నట్లు తెలుసుకుంటాడు. రత్నంగి బ్రహ్మరాక్షసి వద్ద బందీగా ఉంటుంది. మల్లన్న ఆమెను చూసిన మరుక్షణమే ప్రేమలో పడిపోతాడు. రత్నంగి కూడా మల్లన్నను ప్రేమిస్తుంది. మల్లన్న బంగారు బల్లి రూపంలో బ్రహ్మ రాక్షసి నివాసంలో ఉంటూ ఆమె రహస్యాలు తెలుసుకుంటాడు. మల్లన్న

బ్రహ్మ రాక్షసి ప్రాణ రహస్యం తెలుసుకుంటాడు.రత్నంగిని పెళ్లిచేసుకునేందుకు బ్రహ్మరాక్షసి అడ్డు తొలగించుకోవలని అనుకుంటారు. బ్రహ్మ రాక్షసి ప్రాణం అక్కమ్మ కోటలోని ఒక స్తంబంలో ఉంటుంది. మల్లన్న అక్కమ్మ కోటపై దాడి చేసి స్థంబాన్ని ధ్వంసం చేయటం ద్వారా బ్రహ్మ రాక్షసిని తన అదుపులోకి తెచ్చుకుంటాడు. మల్లన్న బ్రహ్మ రాక్షసి వద్దకు వెళ్లి రత్నంగిని పెళ్లి చేసుకుంటానని చెబుతాడు. ఉన్ని కంకణం కట్టుకునేందుకు అంగీకరిస్తే రత్నంగిని పెళ్లి చేసుకోవచ్చునని రాక్షసి షరతు విధిస్తుంది. మల్లన్న రాక్షసి షరతును ఒప్పుకుని రత్నంగిని కొల్హాపురి పట్నంలో పెళ్లి చేసుకుంటాడు. రత్నంగిని పెళ్లి చేసుకునేందుకు ఉన్ని కంకణాన్ని కట్టుకోవాలనే షరతును బ్రహ్మ రాక్షసి ఎందుకు పెడుతుందనేది పరిశోధించవలసిన అవసరం ఉన్నది.

బలిజ మేడాలమ్మతో పెళ్లి

భ్రమరుడు అనే రాక్షసుడు ఋషులు, మునులను వేధిస్తూ యజ్ఞ యాగాదులకు అడ్డుపడుతుంటాడు. భ్రమరుడు పెట్టే కష్టాలు మితి మీరటంతో ఋషులు, మునులు శివుడి వద్దకు వెళ్లి తమకు రక్షణ కల్పించాలని మొరపెట్టుకుంటారు. భ్రమరుడి నుండి తమకు విముక్తి కల్పించాలని శంకరుణ్ణి కోరుకుంటారు. రక్షణ కల్పిస్తానని ఋషులకు హామీ ఇచ్చిన శివుడు భ్రమరుడిని హతమార్చే బాధ్యతను పార్వతికి అప్పగిస్తాడు. భ్రమరం ఆకారంలో వెళ్లి భ్రమరుడిని హత మార్చాలని శివుడు ఆమెను ఆదేశిస్తాడు. పార్వతి భ్రమరం రూపంలో భ్రమరుడిని వదిస్తుంది. ఇదిలా ఉంటే కంచివేరి అనే పట్టణంలో భూపాల సిద్దమ్మ, వరదరాజులు అనే దంపతులు నివసించేవారు. వారికి సంతానం లేకపోవటంతో వారు సంతాన ప్రాప్తి కోసం తీర్థ యాత్రలకు బయలు దేరుతారు. కోటొక్క తీర్థాలను దర్శించుకుని పరమ శివుడిని పూజించుకుని తిరుగు ప్రయాణం అవుతారు. తిరుగు ప్రయాణంలో బాగా అలిసిపోయిన సిద్దమ్మ, ఆమె భర్త అలసట తీర్చుకునేందుకు ఒక చోట కూర్చుండి పోతారు. అప్పుడు పరమ శివుడు, పార్వతి ప్రత్యక్షమై సిద్దమ్మ, వరదజరాజులుకు సంతానం ప్రసాదిస్తారు. ఏడుగురు కుమారులు, ఒక కుమార్తె పుడుతుందని శివుడు చెబుతాడు. కూతురుకు మేడాలమ్మ అని నామకరణం చేయాలని సూచిస్తాడు. పార్వతి స్వయంగా మెడాలమ్మగా పుడుతున్నందున గారాబంగా పెంచుకోవాలంటాడు. ఇక మీదట మీరు బలిజలుగా చలామణి అవుతారని శివుడు వారితో చెబుతాడు. తాను కూడా మానవావతారం ఎత్తి మేడాలమ్మను పెళ్లి చేసుకుని మీకు అల్లుడిని అవుతానని శివుడు ప్రకటిస్తాడు. శివుడి

వరం మేరకు సిద్దమ్మ, వరద రాజులుకు ఏడుగురు కొడుకులు, ఒక కుమార్తె పుడుతుంది. వారు తమ కూతురుకు మెడాలమ్మ అని నామకరణం చేస్తారు. మేడాలమ్మకు భ్రమరాంబ, మేడాల,మాడాల, మాదఛి, మాలసి, మాలవ్వ, గంగ మాలవ్వ, మహోల్సా (మహారాష్ట్ర) అనే పేర్లు కుడా ఉన్నాయి. ఏడుగురు కొడుకులు, ఒక కూతురు పుట్టిన తరువాత సిద్దమ్మ, వరదరాజులు బాగా మారిపోతారు. తమ ఇంటి దైవమైన శివుడిని పూజించటం మానివేస్తారు. వారి ఏడుగురు కుమారులు గర్వంతో విర్రవీగుతుంటారు. వీరి గర్వాన్ని అనిచెందుకు శంకరుడు శైవ జంగమయ్య రూపంలో వారి ఇంటికి వస్తే ఏడుగురు అన్నదమ్ములు అతన్ని అవమానించి పంపించి వేస్తారు. తన కొడుకు మల్లన్నకు మెడాలమ్మను ఇచ్చి పెళ్లి చేయాలని జగమయ్య ప్రతిపాదిస్తాడు. తాను శివుడి ప్రతి రూపమని చెప్పినా పట్టించుకోకుండా ఏడుగురు సోదరులు అతన్ని ఇంటి నుండి గెంటి వేస్తారు. తమను మించిన వాడీ ప్రపంచంలో లేడంటూ శివున్ని నిందా వచనాలతో అవమానానికి గురి చేస్తారు. సిద్దమ్మ, వరదరాజులు, వారి కుమారులకు బుద్ది చెప్పేందుకు శివుడు తన అంశతో పుట్టిన మల్లన్న దేవుడిని మేడాలమ్మను పెళ్లి చేసుకునేందుకు పంపిస్తాడు. సిద్దమ్మ ఏడుగురు కొడుకులకు గుణ పాఠం నేర్పించాలని మల్లన్నను ఆదేశిస్తాడు. శివపార్వతుల ఆదేశం మేరకు మల్లన్న భూలోకానికి బయలుదేరి మార్గ మధ్యలో మావురాల రేణుక ఎల్లమ్మను కలిసి సిద్దమ్మ మేడాలమ్మ కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుంటాడు. సిద్దమ్మ కూతురు మేడాలమ్మను పెళ్లి చేసుకోవాలని మావురాల రేణుకఎల్లమ్మ అతనికి సూచిస్తుంది. మల్లన్న కంచివేరి పట్నం చేరుకుని సిద్దమ్మ కొడుకుల గర్వాన్ని అణిచివేసేందుకు సిద్దమవుతాడు. సిద్దమ్మ ధనాన్ని దోపిడీ చేయించటం ద్వారా ఆమె ధన గర్వాని అణిచి వేస్తాడు. సిద్దమ్మ కుటుంబానికి తినేందుకు తిండి లేకుండా చేస్తాడు. ఆమె ఏడుగురు కొడుకులకు పని లభించకుండా చేయటం ద్వారా వారు ఎందుకు పనికిరాని వారని నిరూపించి వారి గర్వాన్ని అనుస్తాడు. మల్లన్న వద్ద ఉన్న గొర్రెలు, మేకలను ఏ విధంగానైనా దోచుకోవాలనే దురాశతో ఉన్న ఆ ఏడుగురు ఆయనతో జూదానికి దిగుతారు. జూదంలో ఓడిన ఆ ఏడుగురు తమ సోదరి మేడాలమ్మను మల్లన్నకు ఇచ్చి పెళ్లి చేసేందుకు ఒక షరతుతో ఒప్పుకుంటారు. మక్కాలో ఉన్న పసుపు కొమ్ములను తీసుకురావాలన్నది వారి షరతు.

బండారు కోసం మక్కా ప్రయాణం

మేడాలమ్మ లేదా భ్రమరాంబ ఏడుగురు సోదరులు విధించిన షరతును పూర్తి

చేసేందుకు మల్లన్న బండారు (పసుపు కొమ్ములు) కోసం అరేబియాలోని మక్కాకు వెళతాడు. ఆయన మక్కాలో హసిన్, హుస్సేన్ అనేవారి వద్ద పనిచేస్తూ బండారు రహస్యం కనుగొంటాడు. మల్లన్న అదను చూసి బండారు తీసుకుని బైట పాడతాడు. అయితే హసిన్, హుస్సేన్ జరిగింది తెలుసుకుని ఆయనను తరుముకు వస్తారు. మల్లన్న నల్ల కుక్క రూపంలో వారి నుండి తప్పించుకుని గంగా నదీ తీరానికి చేరుతాడు. గంగాదేవి అక్కడ మల్లన్నను తరుముకు వస్తూన్న హసిన్ , హుస్సేన్‌తో తలపడి తన కుడి చేయిని కోల్పోతుంది. గంగ తన కుడి చేయిని కొల్పొయిన చోట ఒక కర్ర పాతి ఆమె జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం అక్కడ ఉత్సవం నిర్వహించాలని మల్లన్న స్థానికులను ఆదేశిస్తాడు. మల్లన్న మక్కా నుండి పసుపు (బండారు) తెచ్చిన తరువాత మేడాలమ్మను పెళ్లి చేసుకుంటాడు. కొంత కాలం తరువాత మల్లన్న, మేడాలమ్మ మధ్య విభేదాలు పొడసుపుతాయి. తనంతటి అందగత్తె మరొకరు లేరనే గర్వంతో మేడాలమ్మ భర్త మల్లయ్యను తక్కువ కులం వాడివంటు అవమానిస్తుంది. సిద్దమ్మ, వరదరాజులును మోసం చేసి తనను పెళ్లి చేసుకున్నావంటు ఆమె మల్లయ్యను తిట్టి పోస్తుంది. దీనికి ఆగ్రహించిన మల్లయ్య నీకంటే అందగత్తెను పెళ్లి చేసుకుని చూపిస్తానని మేడాలమ్మతో చెప్పి బయలు దేరుతాడు. అక్క మహంకాళి సలహా మేరకు రేపల్లెలో గొల్ల కేతమ్మను పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకుంటాడు. మల్లన కొల్హాపురి రాజ్యాన్ని పరిపాలిస్తున్న సమయంలో అక్కడ ఘోరమైన కరువు నెలకొంటుంది. కరువుతో విల,విలలాడుతున్న ప్రజలను ఆదుకునేందుకు మల్లన్న ధనపురి పట్టణాన్ని కొల్లగొడతాడు. ధనపురి నుండి తెచ్చిన ధనాన్ని ప్రజలకు పంచిపెట్టి వారిని ఆదుకుంటాడు ఆయన మేడాలమ్మ ఏడుగురు సోదరులను కుక్కలుగా మార్చటం ద్వారా శిక్షించటం తెలిసిందే. తెలంగాణా ఒగ్గు పూజారుల కథనం ప్రకారం ఈ ఏడు కుక్కలే ఆ తరువాత ఏడు కోట్ల కుక్కలవుతాయి. ఈ ఏడు కోట్ల కుక్కలు మల్లన్న సైన్యం అవుతాయని ఒగ్గు పూజారులు చెబుతారు. మల్లన్న గొప్పతనాన్ని తెలుసుకున్న బలిజ సోదరులు ఆయన భక్తులుగా మారుతారని, అందుకే మల్లన్న కుక్కలుగా మారిన వారిని తన సైన్యంగా మలుచుకుంటాడని అంటారు. మేడాలమ్మ కుక్కల రూపంలో ఉన్న తన సోదరులకు క్రమం తప్పకుండా ఆహారం పెడుతుంది. కుక్కల రూపంలో ఉన్న బలిజ సోదరులు ఆహారం కోసం ఒకరిపై ఒకరు మొరుగుతూ కొట్లాడుకుంటుంటే మల్లన్న నవ్వటం మేదాలమ్మకు బాధ కలిగిస్తుంది. బాధపడుతున్న మేడాలమ్మను సంతోశపరిచేందుకు మల్లన్న ఏడుగురు సోదరులకు భూమిపై ఒగ్గు పుజారులుగా పుట్టి తన కథ చెప్పుకుంటూ జీవించాలనే వరం ఇస్తాడు. అందుకే కొమురవెల్లి మల్లికార్జున స్వామి

దేవాలయంలో మల్లన్న జాతర, బీరప్ప దేవాలయాలలో బీరప్ప జాతర ముగిసిన అనంతరం ఒగ్గు పూజారులు, ఒగ్గువాళ్ళు కుక్కల మాదిరిగా మొరగటంతో పాటు పాలను కూడా కుక్కల మాదిరిగా తాగుతారని అంటారు. మహారాష్ట్ర, కర్ణాటకలో వాగ్గయ్యలు, వాగయ్యాలు మల్లన్న, మైలార్ దేవుడి జాతర సమయంలో కుక్కల మాదిరిగా వ్యవహరిస్తారని ఏం.ఎల్.కే. మూర్తి 'ఆంధ్ర ప్రదేశ్ లోని కురువ, గొల్లల మతంలో జానపద దేవతలు బీరప్ప, మల్లన్న ఆవిర్భావం'అనే వ్యాసంలో పేర్కొన్నారు.

గొల్ల కేతమ్మతో పెళ్లి.

మల్లన్న అక్క రేణుక సలహా మేరకు రేపల్లెలోని గొల్ల కేతమ్మను పెళ్లి చేసుకోవటం ద్వారా బలిజ మేడాలమ్మకు గుణపాటం నేర్పించాలని బావిస్తాడు. ఈ లక్ష్య సాధన కోసం ఆతను గొల్ల కేతమ్మ తల్లి,దండ్రులు మాధవసాని, మారయ్య వద్దకు వెళతాడు. మల్లయ్య మాధవసాని, మారయ్యను ఒప్పించి గొల్ల కేతమ్మను పెళ్లి చేసుకుంటాడు. మెడాలమ్మ తన తప్పును తెలుసుకుని మల్లయ్య వద్దకు వెళుతుంది,. దీనితో మల్లయ్య కథ సుఖాంతం అవుతుంది. . మల్లన్న మేడాలమ్మను తీసుకుని కొల్హాపూర్ నుండి శ్రీపర్వతం లేదా శ్రీశైల పర్వతానికి వచ్చి అక్కడే స్థిరపడిపోతాడు. మల్లయ్య,పద్మాల దేవికి పుట్టిన వారు పత్తి కంకణం కురుమవారైతే, రత్నంగికి పుట్టిన వారు ఉన్ని కంకణం కురుమలు. మల్లయ్య మొత్తం ఐదుగురిని పెళ్లి చేసుకున్నాడని మౌఖిక కథలు చెబుతున్నాయి. కరీంనగర్ జిల్లాలోని సుల్తానాబాద్ సమీపంలో ఉన్న ఒదెల గ్రామంలోని మల్లన్న దేవాలయంలో మూల విరాట్టు మల్లన్న దేవుడి మొదటి భార్య బలిజ కులానికి చెందిన మదాల దేవి (బలిజ మేడాలమ్మ) ఐతే శ్రీశైలం, వరంగల్, తెలంగాణ రాజధాని హైదరాబాద్ పాత బస్తి లోని చెన్నరాయని గుట్ట (చంద్రయాన్ గుట్ట) లో ఉన్న మల్లన్న దేవాలయాల్లో మల్లన్న దేవుడి మొదటి భార్య బ్రమరాంబ (పార్వతి). భ్రమరాంబ లింగాయత్ వ్యాపారి కూతురు. తెలంగాణలోని అన్ని మల్లన్న దేవాలయాల్లో మల్లన్న దేవుడి రెండో భార్య గొల్ల కేతమ్మ. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలలోని ఖండోబా దేవాలయాల్లో ఖండోబా, మల్లన్న మొదటిభార్య లింగాయత్ వర్గానికి చెందిన మహాల్సా. రెండో భార్య మాత్రం ధనగర్, కురుబ కులానికి చెందినబనై, కురుబట్టవ్వ కావటం గమనార్హం. శ్రీ శైలంలో మల్లన్న దేవుడికి ప్రియమైన భార్య చెంచు స్త్రీ. మహారాష్ట్రలో ఖండోబాకు అత్యంత ప్రియమైన భార్య ధనగర్ కులానికి చెందిన బనై.

కొమురవెల్లి మల్లన్న

తెలంగాణాలోని సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామంలో ఉన్న మల్లన్న గుడి స్థల పురాణం ప్రాకారం అది కుమారస్వామి, అతనికి అత్యంత ప్రియమైన వల్లి (తమిళనాడు కురువార్ మహిళ) దేవాలయం. వాస్తవానికి దీనిపేరు కుమారవల్లి అయితే వాడకంలో కొమురవెల్లి గా మారింది. కుమారస్వామి, మురుకన్, మురుగన్ కార్తికేయ, స్కంద తదితర పేర్లన్నీ ఒకే దేవుడివనేది విధితమే. మల్లికార్జునస్వామీ దాదాపు ఐదు వందల సంవత్సరాలకు పూర్వం ఒక గొర్రెల కాపరికి కలలో కనిపించి తాను ఇంద్రకీలాద్రి కొండపై ఉన్న పుట్ట మట్టిలో వెలిసినట్లు చెబుతారు. అందుకే మల్లికార్జున స్వామి విగ్రహం ఇక్కడ పుట్ట మట్టితో చేయబడింది. కురుమ కులానికి చెందిన వారిక్కడ మల్లన్న చరిత్రను ఒగ్గు కథ రూపంలో చెబుతారు. వారే చిన్నపట్నం, పెద్ద పట్నం వేయటం ద్వారా మల్లన్న పూజలు నిర్వహిస్తారు. కొమురవెల్లి మల్లన్న దేవాలయంలో రెండు రకాల పూజారులు, రెండు రకాల పూజ విధానం అమలులో ఉన్నది. మేడాలమ్మ వర్గానికి చెందిన బలిజలు వీర శైవ పద్దతిలో మల్లన్నకు పూజలు చేస్తే కురుమ కులానికి చెందిన ఒగ్గు పూజారులు చిన్న పట్నం, పెద్ద పట్నం తదితర పేర్లతో తమదైన శైలిలో తమ కులం ప్రదాతను కొలుస్తారు. గొల్ల కేతమ్మ గొల్ల కురుమల ఆడపడుచు. గొల్ల కేతమ్మ, మేడాలమ్మ లేదా బ్రమరాంబికలతో వెలిసిన మల్లికార్జున స్వామిని పూజించేందుకు భక్తులు సుదూర ప్రాంతాలనుండి ఇక్కడికి వస్తుంటారు. మహారాష్ట్ర నుండి వచ్చే భక్తులు కొమురవెల్లి మల్లన్నను ఖండోబా దేవుడుగా పూజిస్తారు.

మహారాష్ట్రలో మల్లన్న

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మల్లన్నగా పిలవబడే దేవుడిని మహారాష్ట్ర ప్రజలు ఖండోబాగా కోలుచుకుంటారు. ఖండోబాను మైలార్, మార్తాండ మైలార్, మల్హారి, మైరాల్, ఎల్కోట్, ఖాలదేవ్ అని కుడా పిలుచుకుంటారు. మహారాష్ట్రలోని ధనగర్ (గొర్రెల కాపర్లు) ప్రజల ప్రధాన దేవుడైన ఖండోబా చాలా మంది బ్రాహ్మణులకు కూడా ఇంటి దైవము, కుల దైవం. మరాఠి క్యాలెండర్ లోని మార్గశిరి నెలలోని శుక్ల పక్షం ఆరవ రోజు ఖండోబా పూజ నిర్వహించటం పరిపాటి. ఖండోబా రుద్రావతరంలో వచ్చిన శివుడు అనే భావన కూడా ఉన్నది. దక్షిణాదిలో పుట్టిన ఈ దేవుడి చరిత్ర మంచివారిని రక్షించేందుకు ఇద్దరు రాక్షసులను హతమార్చటం, పలువురు మహిళలను పెళ్లి చేసుకోవటం తదితర

సంఘటనలతో పలు మలుపులు తిరుగుతుంది. దేశస్థ బ్రాహ్మణులు రచించన మల్హారి మహత్యం ఖండోబాను సంస్కృతీకరించేందుకు జరిగిన ప్రయత్నింగా చెప్పుకోవచ్చు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసిన ఖండోబా, మల్లన్న తదితర పేర్లతో పిలవబడే ఈ దేవుడు ఇనాటికి కూడా పశువుల కాపర్లైన ధనగర్లు, కురుమలు, గొల్లలు, బలిజలు, చెంచుల దేవుడుగా ఉండిపోయారు. సమాజంలోని పలు వర్గాల ప్రజలు ఖండోబా, మల్లన్నను పూజిస్తున్నా ఆయన ప్రధానంగా పశువుల, ముఖ్యంగా గొర్రెల కాపర్ల దేవుడు.

శివుడు మణి, మల్ల అనే ఇద్దరు రాక్షసులను హతమార్చటం ద్వారా ప్రజలను కాపాడేందుకు ఖండోబా రూపంలో అవతరించాడన్నది మహారాష్ట్ర ప్రజల విశ్వాసం. మణి, మల్ల అనే ఇద్దరు రాక్షసులు ఘోర తపస్సు చేసి బ్రహ్మ నుండి పలు వరాలు పొందుతారు. వారు ఈ వరాల బలంతో ప్రజలు, ముఖ్యంగా ఋషులు, సన్యాసులు, దేవతలను హింసించటం ప్రారంభిస్తారు. మణి, మల్ల తమ అరాచకాలతో భూమితో పాటు స్వర్గంలో కుడా అశాంతిని సృష్టిస్తారు. మణి,మల్ల రాక్షసులు ఋషులు నివసించే మనిచుర్ణ పర్వతాన్ని స్వాధీనం చేసుకుని తమ హింసాత్మక కార్యక్రమాలను కొనసాగిస్తుంటారు. మణి,మల్ల రాక్షసుల నుండి తమను కాపాడాలని ఋషులు శివుడికి మొర పెట్టుకుంటారు. ఋషులతో పాటు ప్రజలను కాపాడేందుకు శివుడు తన జటాజూటం వెంట్రుకలతో పలువురు యోధులను సృష్టించటంతో పాటు తానే స్వయంగా భైరవుడు, ఖండోబా అవతారం ఎత్తుతాడు. పార్వతి మహాల్సా రూపం తీసుకుంటుంది. భైరవుడు కార్తిక మాసం అమావాస్య రోజు ఇరువురు రాక్షసులపై యుద్ధం ప్రకటిస్తాడు. భైరవుడు ఆరు రోజుల యుద్ధానంతరం మణి, మల్ల లను హతమారుస్తాడు. ఆరు రోజుల పాటు భైరవుడితో హోరాహోరి యుద్ధం చేసిన మణి, మల్ల రాక్షసులు చివరకు ఓటమి పాలై అతని కాళ్ళపై పడిపోతారు. తనలో విలీనం చేసుకోవాలని వారు భైరవుడిని కోరుతారు.

ఖండోబా భార్యలు

ఖండోబా మొదటి భార్య పేరు మహాల్సా . ఆమె పాల్ అనే పట్టణంలో కిరాణా దుకాణం నడిపించే తులసిరాం కూతురు. ఖండోబా ఆమెను పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. ఖండోబా ను పెళ్లి చేసుకునేందుకు మహాల్సా కొన్ని షరతులు విధిస్తుంది చింత చెట్టు ఆకులతో ఒక విస్తరాకును తయారు చేయాలి. నిప్పుల్లో కాల్చని కుండలో నీరు తీసుకు రావటంతో పాటు పాచికల ఆట ఆడి గెలిస్తేనే పెళ్లి

చేసుకుంటానని మహాల్సా చెబుతుంది. ఐదుగురు వ్యక్తుల పర్యవేక్షణలో పాచికల ఆట నిర్వహించాలన్నది ఆమె మరో షరతు. పాచికల మొదటి ఆటలో మహాల్సా ఓడిపోతుంది. ఖండోబా వేసిన పాచికలు చెల్లవంటు మహాల్సా తన ఓటమిని తిరస్కరిస్తుంది. రెండో సారి మహాల్సా పాచికలు వేస్తుది. ఈ సారి ఖండోబా ఓడిపోతారు. ఓటమి పాలైన ఖండోబా నిప్పుల్లో కాల్చని కుండలో నీరు తెచ్చేందుకు దూదని అనే నదికి వెళతాడు. నీటి కోసం పచ్చి కుండను నదిలో ముంచగానే అది కరిగిపోతుంది. ఖండోబా నది నుండి నేరుగా చింత చెట్టు వద్దకు వచ్చి చింతాకులతో విస్తరాకు తయారు చేసేందుకు ప్రయత్నించి విఫలం అవుతాడు. మరో కథనం ప్రకారం ఖండోబా, మహాల్సా పెళ్లి చేసుకున్న తరువాత కొంత కాలానికి ఒక రోజు పాచికల ఆట ఆడుతారు. ఈ ఆటలో ఖండోబా తన దండం, బండారు సంచి మినహా సర్వదాస్తిని మహల్సాకు ఓడిపోతాడు. ఈ వైఫల్యం అతనికి కోపం తెప్పిస్తుంది. మహల్సాకు బుద్ధి చెప్పేందుకు వేరొకరిని పెళ్లి చేసుకోవాలని ఆలోచిస్తాడు. ఈ ఆలోచన రాగానే ఖండోబా అక్కడి నుండి వెళ్లి పోయేందుకు గుర్రం కోసం వెతుకుతాడు. గుర్రపుశాలల్లో ఒక్క గుర్రం కూడా కనిపించదు. అప్పుడతనికి కొండ గుహలో ఉన్న గుర్రం జ్ఞాపకం వస్తుంది. ఖండోబా వెంటనే అక్కడికి వెళ్లి బండారును చల్లటం ద్వారా గుహకు అడ్డంగా ఉన్న శిలను తొలగించి గుర్రాన్ని తీసుకుంటాడు. గుర్రం ఎక్కి వెళుతున్న ఖందోబాను మహాల్సా చూస్తుంది. ఖందోబా ను ఆపేందుకు ఆమె తీవ్రంగా ప్రయత్నించి విఫలమవుతుంది. మీరు ఎక్కడికి వెలుతున్నారన్న మహాల్సా ప్రశ్నకు ఖండోబా బదులిస్తూ పెళ్లి చేసుకునేందుకు వెలుతున్నానంటూ ముందుకు సాగిపోతాడు. హేగ్గాడే ప్రాధాన్ అతన్ని అనుసరిస్తాడు.

ఖండోబా రెండవ భార్య పేరు బానుభాయి యాము, ఖ్యాము అనే ఇద్దరు సోదరులు ఉంటారు. పన్నెండు గ్రామాల నాయకుడైన యాము జీవనాధరం వేలాది గొర్రెలు, మేకలతతో పాటు కొన్ని గుర్రాలు. యాముకు సంతానం ఉండదు. ఒక కొడుకు ఉంటె బాగుంటుందనే ఆలోచనతో యాము సృష్టికర్త బ్రహ్మ అనుగ్రహం కోసం పన్నెండు సంవత్సరాల పాటు ఘోరమైన తపస్సు చేస్తాడు. యాము తపస్సుకు మెచ్చిన బ్రహ్మ అతనికి ఒక కుమార్తెను ప్రసాదిస్తాడు. కొడుకును కోరుకుంటే కూతుర్ని ఎందుకు ఇచ్చారని యామి అడిగితే నీ నోదుట కూతురే రాసిపెట్టి ఉన్నదని బ్రహ్మ ప్రత్యుత్తరం ఇస్తాడు. దేవేంద్రుడైన ఇంద్రుని సభలో ఉండే దేవకన్య రంభ యాముకు కూతురుగా పుడుతుంది. యాము కూతురుకు బానుభాయి అని నామకరణం చేస్తాడు. బానుభాయి

పెరిగి పెద్దదైన తరువాత తండ్రి గొర్రెలు, మేకలను లక్షల సంఖ్యలకు పెంచుతుంది. ఆమె కుడా పన్నెండు గ్రామాలకు యువ రాణి అవుతుంది.మరో కథనం ప్రకారం శివుడు ఖండోబాగా పుడతాడు కాబట్టి పార్వతి మహాల్సాగా పుడితే గంగ బాను భాయి అవతారం ఎత్తుతుంది. బాను భాయి పుట్టుక, పెళ్లి అంశంపై జెజూరి మహత్యం, మార్తాండ విజయం అనే మరాఠీ పుస్తకాలలో భిన్న, భిన్న కథనాలు ఉన్నాయి. ఈ రెండు కథనాల ప్రకారం మార్తాండ భైరవుడికి బాను భాయి మూడో భార్య. మార్తాండ విజయం ప్రకారం అత్యంత సౌందర్యవతి అయిన జయ అనే యువతి పార్వతికి ఇష్ట సఖి. పశువులకు పతి అయిన శివుడిని పెళ్లి చేసుకోవాలనే కోరికను జయ పార్వతికి వెల్లడిస్తుంది. దీనికి పార్వతి బదులిస్తూ శివుడు భూమిపై ఖండోబాగా జన్మించినప్పుడు నీవు బాణాసూరుడి కూతురుగా పుట్టి నీ కోరిక తీర్చుకోవాలని చెబుతుంది. బాణాసూరుడి కూతురు కాబాట్టి ఆమెకు బాను భాయి లేదా బనై అనే పేరు వచ్చిందని మార్తాండ విజయం చెబుతోంది. బాణాసురుడి కూతురుగా పుట్టిన బానా పరమ శివుడిని మాత్రమె పెళ్లి చేసుకుంటానని చిన్నప్పుడే ప్రకటిస్తుంది. బాణాసూరుడు తన కూతురు మంకు పట్టు గురించి నారదుడితో సంప్రదిస్తాడు. నారదుడు ఆమెకు మల్హారి మంత్రం బోధించి ఘోరమైన తపస్సు చేస్తే తప్ప శివుడి అనుగ్రహం లభించదని చెబుతాడు. బానుభాయి కికారణ్యంలోకి వెళ్లి ఘోరమైన తపస్సు చేస్తుంది. పార్వతి తన ఇష్ట సఖి జయకు ఇచ్చిన వరాన్ని దృష్టిలో పెట్టుకున్న శివుడు మార్తాండ భైరవుడి రూపంలో తపస్సు చేస్తున్న బానాను పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. బామాభాయి తపస్సు చేస్తున్న అడవిలో శివుడి భక్తుడైన గొర్రెల కాపరి అజామేల్ ఉంటాడు. అజామేల్ స్థానిక ధనగర్ల నాయకుడు. మార్తాండ భైరవుడి రూపంలో ఉన్న శివుడు అజామేల్ ను తోడూ తీసుకుని తపస్సు చేస్తున్న బాణా వద్దకు వెళతాడు. మీ తపస్సు ఫలించింది, మీరు కోరుకుంటున్న పరమ శివుడు మీ ఎదుట నిలబడ్డాడని అజామేల్ ఆమెతో చెబుతాడు. మార్తాండ భైరవుడి రూపంలో ఉన్న శివుడిని చూసిన బాణా భక్తి, ఆనందంతో పరవశించి పోతుంది. అజామేల్ పదహారు రోజుల తరువాత నలదుర్గ్‌లో మార్తాండ భైరవుడు, బాణా పెళ్లి ఘనంగా నిర్వహిస్తాడు. మార్తాండ విజయం ప్రకారం బామాభాయి అజామేల్ దత్త కూతురు.

జెజూరి మహత్యంలో బనై లేదా బానుభాయిని జయ అని సంభోదించటంతో పాటు ఆమె పుట్టుకకు సంభందించిన కథను మరో రకంగా తెలిపారు. పరమ శివుడు రాక్షసులతో పోరాడుతున్న సమయంలో అతని జటాఝూటంలో ఉన్న గంగ జారి కిందపడి రాయిగా మారుతుంది. శివుడి చేతిలో మరణించి రాళ్ళుగా మారిన రాక్షసుల

మధ్యలో పడిన గంగ కూడా రాయిగా మారిపోతుంది. శివుడు, విష్ణు, బ్రహ్మ ఆమెను అక్కడి నుండి రక్షించి తెచ్చేందుకు గంగను మూడు నెలల పసిపిల్లగా మారుస్తారు. మూడు నెలల పసి పాపగా ఉన్న గంగను వారు ఒక పెట్టెలో పెట్టి తొమ్మిది రత్నాలతో చేసిన నగను దానిపై బిగిస్తారు. ఈ పెట్టెను చందంపూర్ లోని దట్టమైన అడవిలో పెట్టి రావాలని బాణాసురుడిని ముగ్గురు దేవతలు ఆదేశిస్తారు. బాణాసురుడు ఇలా పెట్టి పోయిన పెట్టెను గొర్రెల కాపరులైన ధనగర్లు చూసి అందులో ఉన్న గంగను పెంచుకుంటారు. బాణాసురుడు పెట్టిపోయిన గంగ కాబట్టి ఆమెకు బానగంగా అనే పేరు వస్తుందని జెజూరి మహత్యం చెబుతోంది. పరమ శివుడి భక్తుడైన గొర్రెల కాపరి పసి పాపను పెంచుకుంటాడు. గంగకు పదహారేళ్ళ వయస్సు వచ్చిన తరువాత ఒక రోజు తన తండ్రితో కలిసి కర్హా నదిలో స్నానం చేసి జెజూరి లోని ఖండోబా దేవాలయానికి వెళుతుంది. ఆమె అప్పటి నుండి ఖండోబా ప్రేమలో పడిపోతుంది.

స్థానికంగా ప్రచారంలో ఉన్న ఒక జానపద కథ ప్రకారం బనై దేవతలకు రాజైన ఇంద్రుడి ఏడుగురు సంతానంలో ఒకరు. ఇంద్రుడు ఒక రోజు బనైను ఇంద్రలోకం నుండి బహిష్కరిస్తాడు. ఇంద్రుడు బహిష్కృత బనైను పసి పాపగా మార్చి ఒక పెట్టెలో పెట్టి చందంపూర్ అడవిలో వదిలి వెళతాడు. ఇంద్రుడు ఇలా వదిలి పెట్టి పోయిన పెట్టెలోని బాలికను ధనగర్లు పెంచుకుంటారు. ఈ బాలిక పెరిగి పెద్దైన తువాత ఖండోబాను పెళ్లి చేసుకుంటుంది. ఖండోబా పన్నెండు సంవత్సరాలు అడవిలో గడిపిన తరువాతనే బనై అతన్ని పెళ్లి చేసుకుంటుందని స్తానిక జానపద కథ చెబుతోంది. మహారాష్ట్రలో బాగా ప్రచారంలో ఉన్న కథ ప్రకారం ఖ్యాము అనే ధనిక గొర్రెల కాపరి (ధనగర్) సంతానం కోసం పన్నెండు సంవత్సరాల పాటు అడవిలో ఇంద్రుడి కోసం తపస్సు చేస్తాడు. ఇంద్రుడు చివరకు కరుణించి అప్సరస రంభను ఒక పువ్వుల గుత్తి రూపంలో పంపిస్తాడు. ఖ్యాము ఈ పువ్వుల గుత్తిని సముద్రం మధ్యలో నుండి తీసి విప్పి చూడగా అందులో ఒక పసిపాప ఉంటుంది. ఖ్యాము ఇంట్లో పెరిగిన ఈ పసిపాపనే బనై. బనై పెరిగి పెద్దదై పన్నెండు ధనగర్ గ్రామాలకు నాయకురాలు అవుతుంది. ఆమె తొమ్మిది లక్షల గొర్రెలు, మేకలకు అధిపతి. బనై సంతానోత్పత్తి, హరితం, సంగీతానికి ప్రతీక. బనై చంద్రుడి అందానికి ప్రతి రూపమనే అభిప్రాయం కుడా ఉన్నది. 'బనై లలాటము (నుదురు) పౌర్ణిమ వేలుతురుగా వెలిగి పోతోంది, మొలుస్తున చుక్కల వెలుతురును వెలసిపోయేలా చేస్తోంది'. 'చంద్ర వంక లాంటి అందగత్తె, మలహరి దేవుడిని పిచ్చి వాడిని చేస్తోంది' అని మహారాష్ట్రకు చెందిన ఒక ఒగ్గు కథ చెబుతోంది. ఖండోబా

ఆమెను పెళ్లి చేసుకుని ఇంటికి తెచ్చి మొదటి భార్యకు పరిచయం చేసినప్పుడు బనై పౌర్ణిమ నాటి చంద్రుని వెలుతురు మాదిరిగా అంతటా పరుచుకున్నది, ఆమెను చుసిన మహాల్సా గుండెల్లో బాకు దిగినట్లు అయ్యింది' అని ఒక వాగయ్య (ఒగ్గు కళాకారుడు) కీర్తించటం ఆమె ఎంత అందగత్తె అనేది స్పష్టం చేస్తోంది. శివుడి రెండవ భార్య గంగ అవతారమైన బనై పశువుల కాపర్ల దేవత. వేటకు వచ్చిన ఖండోబా దాహంతో నీటి కోసం వెతుకుతూ గొర్రెల కాపర్ల బస్తీకి వచ్చినప్పుడు బనై ని చూస్తాడు.

వాగయ్యలు చెప్పే మరో కథనం ప్రకారం పుష్పవంతి కూతురు బనై. నారదుడు ఆమెకు బండారు ఇస్తాడు. బాన్ గంగ గా పిలిచే బనైను పుష్పవంతి ఒక పెట్టెలో పెట్టి గంగా నదిలో వదిలి వేస్తుంది. ఇలా వదిలి వేసిన పెట్టె మత్స్యకారులకు లబిస్తుంది. మత్స్యకారులు దానిని తెరిచేందుకు ప్రయత్నించి విఫలమైన అనంతం మల్లీ నదిలోకి వదిలి వేస్తారు. పన్నెండు కులాలకు చెందిన పిల్లలు కర్ర ఆట ఆడుతుంటారు. వారు నదిలో పడిన కర్రను తెచ్చుకునేందుకు వెళ్ళినప్పుడు నీటిపై తేలుతున్న పెట్టె కనిపిస్తుంది. పిల్లలు దానిని బైటికి తీస్తారు. పెట్టేలోనుండి ధావనం సువాసన రావటంతో వారు కుడా దానిని తిరిగి నదిలోకి నెట్టి వేస్తారు. నదికి తన మందను తెచ్చిన ఒక గొర్రెల కాపరి దృష్టి తేలుతున్న పెట్టెపై పడుతుంది. ఆతను పెట్టెను నదినుండి బైటికి లాగి తనకు ఇష్టమైన గొర్రె మెడకు గంటగా కడతాడు. ఒక రోజు గొర్రెలు పొలంలో మేస్తున సమయంలో పిల్లలు గొర్రె మెడలోని పెట్టెను తీసి గడ్డి కుప్పలో పెడతారు. గడ్డి కుప్పలో ఉన్న పెట్టె నుండి వెలుగు దశ దిసల వ్యాపిస్తుంది. పెట్టెలో నుండి వస్తున్న వెలుతురే బనై గా మారుతుంది. పొలంలో పని చేస్తున్న మాలి (ఒక కులం) మహిళలు బనై మెడలో ఒక పూల మాల వేస్తారు. బనై కర్హా నదికి వెళ్లి స్నానం చేసిన అనంతరం పాన్ గంగగా మారిపోతుంది. బనై లేదా బానుభాయికు సంబందించిన అన్ని కథల్లో కుడా ఆమె పుట్టుక నది లేదా సముద్రం నుండి జరిగినట్లు చెప్పటం గమనార్హం.

మరో కథనం ప్రకారం ఖండోబా ధనగర్ (గొర్రెలకాపర్లు) కులానికి చెందిన బానుభాయి లేదా బనైయ్ ను ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. బానుభాయి ని పెళ్లి చేసుకునేందుకు ఖండోబా అష్టకష్టాలు పడతాడు. బానుభాయికి చెందిన తొమ్మిది లక్షల గొర్రెలు, తొమ్మిది లక్షల గొర్రె పిల్లలను మేపుతాడు. గొర్రెల పెండ ఎత్తివేయటంతో పాటు గొర్రెలు పడుకునేకొట్టం ప్రాంతాన్ని కడిగి పరిశుభ్రం చేస్తాడు. ఐనా ఖండొబాను పెళ్లి చేసుకునేందుకు బానుభాయి ససేమిరా ఒప్పుకోదు. అందుకే ఖండోబా పసుపు బండారును మంత్రించి చల్లటం ద్వారా బను బాయి కి చెందిన

తొమ్మిది లక్షల గొర్రెలు చనిపోయేలా చేస్తాడు. బానుభాయి పెళ్ళికి ఒప్పుకున్న తరువాతనే ఖండోబా ఆ గొర్రెలను బతికిస్తాడు. ఖండోబా బానుభాయిని గొర్రెల కొట్టంలో గొర్రెల మధ్య పెళ్లి చేసుకుంటాడు. మహారాష్ట్రలో ప్రచారంలో ఉన్న కథనం ప్రకారం ఖండోబా దాదాపు పన్నెండు సంవత్సరాల పాటు బానుభాయి లేదా బనైయ్ తో గడిపిన అనంతరం జెజూరికి వెళతాడు. బానుభాయి ని పెళ్లి చేసుకుని వచ్చిన ఖండోబా పై మొదటి భార్య మహాల్సా మండి పడుతుంది. బానుభాయిని జెజూరి కొండపైన ఉన్న కోటలోకి అనుమతించేందుకు ఆమె నిరాకరిస్తుంది. బానుభాయి జెజూరి కొండ కింద ఉండాల్సిందేనని షరతు పెడుతుంది. దీనితో ఖండోబా రెండో భార్య బానుభాయిని జెజూరి కొండ కింది భాగంలో ప్రతిష్టాపించారు. ఖండోబా జెజూరి దేవస్థానం పూణేకు సమీపంలో ఉన్నది. మహాల్సా లింగాయత్ వర్గానికి చెందిన మహిళ కాగా బనైయ్ గొర్రెల కాపర్లైన ధనగర్ కులానికి చెందిన యువతి. మహాల్సా మొదట బనైయ్ తో గొడవ పడుతుంది. ఐతే కాల క్రమంలో ఆమె మారటంతో పాటు బనైయ్ తో కలిసి ఖండోబాతో సహజీవనం చేస్తుంది. మణి,మల్లతో జరిగిన యుద్ధంలో మహాల్సా తో పాటు బనైయ్ కూడా ఖండోబాకు సహాయం అందజేస్తుందని మహారాష్ట్ర ఒగ్గు కళాకారుల కథలు సూచిస్తున్నాయి. మహాల్సా, బనై మధ్య నెలకొన్న గొడవలతో విసిగి పోయిన ఖండోబా రాంభాయిని పెళ్లి చేసుకున్నాడనే మరో కథనం కూడా ఉన్నది. తమ గొడవల మూలంగా ఖండోబా దూరమవుతున్నాడనేది గ్రహించిన మహాల్సా, బనైయ్ ఒకటవుతారని ఒగ్గు కళాకారుల కథలు సూచిస్తున్నాయి.

మహారాష్ట్రలో ప్రాచుర్యంలో ఉన్న కథల ప్రకారం ఖండోబా ఐదుగురిని పెళ్లి



చేసుకుంటాడు. ఐతే మహాల్సా మరియు బనైయ్ కు మాత్రమె పూర్తి ప్రాధాన్యత. మహారాష్ట్రలో ఖండోబా కథను పాటలుగా పాడి వినిపించే కథకులను వాఘ్యాలు అని అంటారు. వాఘ్యాలకు పాటలో తోడ్పడే వారిని మురళీలు అని పిలుస్తారు.. వాఘ్యాలు ఖండోబా కథను జాగరణలు చేసే సమయంలో లేదా పెళ్లిల్లు, జన్మ దినోస్తావాలు, పండుగల సమయలో పాడుతారు. వాఘ్యాలు చెప్పే కథల ప్రకారం శివుడు ఖండోబా రూపంలో భూమిపై జన్మించి జెజూరి కోట కేంద్రంగా పరిపాలన కొనసాగిస్తాడు. అతని మంత్రి పేరు హేగ్గాడే ప్రధాన్. ఖండోబా తన ప్రజలకు విరివిగా దాన ధర్మాలు చేసేవాడని మలహరి మహత్యం చెబుతోంది.

ఖండోబా మొదట మహిల్సాను సంప్రదాయ పద్దతుల ప్రకారం పెళ్లి చేసుకుంటే బనైయ్ ని ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. వాఘ్యాల కథల ప్రకారం ఆమె పార్వతికి ప్రతిరూపం లేదా పార్వతి భూలోకంలో మహాల్సా గా పుడుతుంది. రెండో భార్య బనైయ్ ధనగర్ (గొర్రెల కాపర్లు) కులానికి చెందిన యువతి. బనై గంగకు ప్రతిరూపం. గంగ బనైయ్ గా పుట్టి ఖండోబాను పెళ్లి చేసుకుంటుంది. అందగాత్తైన బనై ప్రకృతికి ప్రతి రూపం. మహాల్సా నాగరికత, పట్టణ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తే బనై అందం, అడవి, ప్రకృతికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఖండోబా మూడో భార్య పేరు రాంభాయి సింపిన్. మహాల్సా, బనైయ్ కొట్లాటలతో విసిగి పోయిన ఖండోబా బట్టలు కుట్టే దర్జీ కులానికి చెందిన రాంభాయిని పెళ్లి చేసుకుంటాడు. ఆమె మంచి అందగత్తె కావటంతో పాటు అద్భుతమైన నర్తకి. ఖండోబా రాజ మందిరంలో నృత్యం చేస్తుంటుంది. ఖండోబాను ఇంద్రునితో పోలిస్తే రాంభాయిని దేవకన్య రంభతో పోలుస్తారు. ఖండోబా నాలుగో భార్య ఫూలై మాలిన్. ఈమె ఉద్యానవనాలను పర్యవేక్షించే కులానికి చెందిన మహిళ. రాంభాయ్ ఒక మురళి. ఖండోబా దర్బారులో నృత్యం చేస్తూ ఆయనకు సేవలందిస్తుంటుంది. ఖండోబా వేటకు వెళ్ళినపుడు ఫూలై మాలిన్ ను దవనా మాల్ వద్ద కలుస్తాడు. ఖండోబా ఐదో భార్య పేరు చందాయి భాగ్వానిన్. ఈమె ఒక ముస్లిం మహిళ లేదా నూనే తయారుచేస్తే చేసే తేలి కులానికి చెందిన మహిళ. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో ప్రాచుర్యంలో ఉన్న కథల్లో మల్లయ్య మొదట పద్మాల దేవిని సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకుంటే రత్నంగిని ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. ఆ తరువాత బలిజ మెడాలమ్మను పెళ్లి చేసుకుని ఆమె గర్వాన్ని అనిచేందుకు గొల్ల కేతమ్మను మనువాడుతాడు. తెలుగు, మరాఠి కథల్లో కూడా బలిజ యువతిని పెళ్లి చేసుకున్నట్లు ఉన్నది. ఐతే మరాఠి కథలో గొర్రెల కాపర్లు ధనగర్ వర్గానికి చెందిన

యువతి భానుబాయిని పెళ్లి చేసుకున్నట్లు ఉంటే తెలుగు కథలో గొల్ల యువతి కేతమ్మనుపెళ్లిచేసుకున్నట్లుఉన్నది.   స్థానికపరిస్థితులకుఅనుగుణంగాకథలో మార్పులు, చేర్పులు చేయటం వలన ఇలా జరిగి ఉంటుందని భావించాలి.

దేవతలు రెండు పెళ్లిల్లు చేసుకోవటం అనేది భారతీయ సంప్రదాయంలో అనాది కాలం నుండి వస్తున్న ఆచారం. ఖండోబా, మైలార్ లేదా మల్లయ్యకు మూల పురుషుడైన మురుగన్ కూడా రెండు పెళ్లిల్లు చేసుకుంటాడు. ఆయన మొదట దేవసేనను పెళ్లి చేసుకుంటాడు. ఆ తరువాత కురువ యువతి వల్లిని ప్రేమించి పెళ్లి చేసుకోవటం గమనార్హం. చాలా మంది దేవుళ్ళు, రాజుల మొదటి పెళ్లి సంప్రదాయ పద్దతుల ప్రకారం తమ వర్గం, కులం లేదా రాజ కుటుంబాలకు చెందిన యువతిని పెళ్లి చేసుకుంటే రెండో పెళ్లి మాత్రం ఇతర వర్గాలకు చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకోవటం జరిగింది. తిరుమలలో కొలువు తీరి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి కుడా ఇద్దరిని పెళ్లి చేసుకుంటాడు. ఆయన అడవిలో వేటాడే సమయంలో పద్మావతిని చూసి ప్రేమించి పెళ్లి చేసుకోవటం గమనార్హం. ఖండోబా కూడా వేటకు వెళ్ళినప్పుడు ధనగర్ కులానికి చెందిన బనై ప్రేమలో పడిపోతాడు. చాలా మంది దేవుళ్ళ రెండో భార్యలు అడవుల్లో నివసించే గిరిజన వర్గానికి చందిన వారు, మత్స్యకారులు, గొర్రెలు, ఆవుల పెంపకందారుల మహిళలు కావటం గమనార్హం. బెస్త కులానికి చెందినా సత్యవతికి మహా భారతంలో ఉన్న ప్రాధాన్యత ఎలాంటిదో అందరికి తెలిసిందే.

ఖండోబా వేట

ఖండోబా సోమవారం, అమావాస్య కలిసి వచ్చే రోజు వేటకు వెళతాడు. ఈ వేట రెండు అంశాలను సూచిస్తుంది. ఒకటి ఖండోబా రాచరికం, రెండోది ఖందోబా లేదా పశువుల కాపర్ల జానపద,ఆటవిక జీవితం, పూర్వ చరిత్ర. మహారాష్ట్రలోని ఖండోబా భక్తులకు అమావాస్య, సోమ వారం కలిసి వచ్చే రోజు అత్యంత ప్రవిత్రము ,ప్రముఖము, ప్రధానమైనది. సోమవారం, అమావాస్య రోజు ఖండోబాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజా కార్య క్రమాలకు మహారాష్ట్రతో పాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన ధనగర్, కురుబ, బ్రాహ్మణ ఇతర వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. జెజూరిలోని ఖండోబా దేవస్తానంలో సోమవారం అమావాస్య పండుగను అత్యంగా ఘనంగా నిర్వహిస్తారు. సోమవారం అమావాస్య సంధర్బంగా ఖండోబా తన మంది, మార్బలంతో అడవిలో వేటకు వెళ్ళటం ఈ పండుగ ప్రధాన ఆకర్షణ. వేటకు వెళ్ళటం

అంటే జంతువులను వేటాడడమా లేకా మల్లాసుర, మణికాసురుల వంటి రాక్షసులు లేదా శత్రువుల పై యుద్దానికి వెళ్ళటమా అనేది స్పష్టంగా లేదు. కాండోబా తన మంది మార్భలంతో వేటకు వెళ్లి అది ముగిసిన అనంతరం కర్హా నదిలో స్నానం చేయటంతో ఈ పండుగ ముగుస్తుంది. జయాద్రి మహత్మ్య, మార్తాండ విజయ, శ్రీక్షేత్ర జెజూరి మహత్మ్య అనే పుస్తకాలు సోమవతి (సోమవారం) అమావాస్య పండుగ ప్రాచస్త్యం, ప్రాధాన్యత, ప్రాముఖ్యత గురించి పెద్ద ఎత్తున వివరించాయి. సోమవతి అమావాస్య అంటే సోమవారం వచ్చే అమావాస్య నాడు జరిగే పండుగను జయాద్రి మహత్మ్య ఏకంగా మహాభారతంతో ముడిపెట్టింది. ఈ మహత్మ్య ప్రకారం పాండవులు తమ అరణ్య వాసం సందర్భంగా జెజూరికి వచ్చినప్పుడు ధర్మరాజుకు శివుడు లేదా వైశంపాయన మహామునికి మధ్య జేజురి మహత్యం గురించి చర్చ జరుగుతుంది. ధర్మరాజు జేజూరి ఆరాధకుల గురించి అడిగిన పలు ప్రశ్నలకు శివుడు లేదా వైశంపాయనుడు సమాధానాలు ఇస్తాడు. సోమవారం అమావాస్య, పూర్ణిమ,పుస, మాఘ, చైత్ర సందర్భంగా చేసే పండుగల ప్రాముఖ్యత, కర్హా నది పుట్టుక తదితర అంశాల గురించి ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు శివుడు లేదా వ్యశంపాయనుడు సమాధానాలు ఇచ్చినట్లు ఈ మహత్యం చెబుతోంది. శివుడు సోమవారం అమావాస్య సందర్భంగా చేసే ఉత్సవాల గురించి ప్రధానంగా వివరిస్తాడు. సోమవారం అమావాస్య ప్రాధాన్య, ప్రచాస్త్యం తెలిజేస్తాడు. పాండవులు జెజూరిలో యజ్ఞం చేయాలనుకుంటారు. యజ్ఞం సందర్భంగా బ్రాహ్మణులూ, ఇతరులు స్నానం చేసేందుకు అవసరమైన జల సదుపాయం అక్కడ కనిపించదు. భీముడు తపస్సు చేసుకుంటున్న బ్రహ్మ దేవుడి కమండలాన్ని దొర్లించటం ద్వారా అందులోని జలాలను ఒలికిపోయేలా చేస్తాడు. బ్రహ్మ కమండలం నుండి వొలికిన నీరే కర్హ నది. ఫాల్గుణ మాసంలో సోమవారం అమావాస్య రోజు బ్రహ్మ దేవుడి కమండలం నుండి ఒలికిన జలమే కర్హా నదిగా అవతరించిందని జయాద్రి మహత్మ్య చెబుతోంది. గంగా నదిగా పిలువబడే కర్హా నదిని చూసిన మార్తాండ భైరవుడు అందులో పవిత్ర స్నానమాచరిస్తాడు. బ్రహ్మ దేవుడు, నారదుడు కర్హా నదిలో స్నానమాచరించిన ప్రాంతాన్ని 'ఘోడే ఉద్దాన్' అని పిలుస్తారని జయాద్రి మహత్మ్య చెబుతోంది

మార్తాండ విజయం కూడా ఇలాంటి కథనే చెబుతోంది. భీముడు యజ్ఞానికి అవసరమైన జలం కోసమే ఖండోబాతో కలిసి తన కమండలాన్ని పడవేసేందుకు బ్రహ్మ దేవుడు అంగీకరిస్తాడు. అందుకే బ్రహ్మ తన కమండలాన్ని పడవేసిన భీమున్ని క్షమిస్తాడు. ఖండోబా గుర్రంపై అక్కడికి వచ్చి స్నానం చేసి వెళ్ళిన తరువాత ఇతర దేవతలు కూడా ఆ

గొర్రెల కాపరులు కురుమ, కురుబ, కురుంబార్, కురువ ప్రజల కుల దైవం బీరప్ప పదవ శతాబ్దానికి చెందిన చారిత్రాత్మిక పురుషుడు. తెలంగాణ, మహారాష్ట, కర్ణాటక రాష్ట్రాలలో ఒగ్గుకళాకారులు, మహారాష్ట్రలో 'ఆవి' అనే పేరుగల కథకులు, కర్ణాటకలో సిద్దప్ప మేతి, తదితరులు కన్నడ భాషలో చెప్పిన మల్లన్న, బీరప్ప కథలు బహుళ ప్రచారంలో ఉన్నాయి.

ప్రాంతానికి వచ్చి కర్హా నదిలో స్నానం చేసి తమను తాము శుద్ధి చేసుకుంటారనేది ప్రజలనమ్మకం. దేవతలంతా ఖండోబా పై పసుపు చల్లి ఆనందిస్తారు. నారదుడు స్నానం చేసిన ప్రాంతాన్నే ఘోడే ఉద్దాన్ అని పిలుస్తారని మార్తాండ విజయం చెబుతోంది. పాండవులు చేసిన యజ్ఞామే తరువాత ఖండోబా వేట పండుగగా మారిందని చెబుతారు. ఖండోబా కర్హా నదిలో స్నానం చేయటం ద్వారా వేట ముగించిన అనంతరం నదికి అవతలి వైపు ఉన్న భులేశ్వర్ లోని పురాతన యాదవ దేవాలయానికి వెళతాడు. ప్రస్తుతం జేజురిలో జరిగే వేట పండుగసందర్బంగా ఖండోబా యాత్ర కర్హా నదిని దాటి దాలవడి గ్రామం లోని బాబీర్ దేవుడి దర్శనం చేసుకుంటుంది. బాబిర్ దేవుడు రూపాంతరం చెందిన ఖండోబా అని అంటారు. బాబిర్ దేవుడు గుర్రంపై తన భార్యతో ఉన్నట్లు ఇక్కడి విగ్రహాన్ని చెక్కారు. గుర్రంపై కనిపించేది ఖండోబా , అతని భార్య మహాల్సా లేదా బనై అన్నది స్థానికుల కథనం. జానపదులు తమ వీరులను దేవతలుగా కొలచటం పరిపాటి. ఖండోబా కుడా అలాంటి కోవకు చెందిన రాజు కావచ్చు. తమ బందువులు, సన్నిహితులు, స్నేహితుల కోసం వీరత్వం చూపించిన వారు నాయకులూ, పాలకులుగా జానపద సాహిత్యంలో కనిపించటం అందరికి తెలిసిందే. హొయసల, దేవగిరి యాదవ్ రాజులు ఈ కోవకు చెందిన వారే. పులిని చంపిన వారు హొయసల రాజులుగా మారితే గ్రామానికి చెందిన ఆవులు, గొర్రెలు, మేకల తదితర పశువులను కాపాడిన వారు దేవగిరి యాదవ రాజులయ్యారు. అజంతా గుహలలో ఉన్న ఒక శాసనం ప్రకారం ఖండేశ్వర (ఖడ్గానికి స్వామీ) అనే రాజు మల్లయేస అనే రాక్షసుడిని హతమార్చాడు. అందుకే ఖండేశ్వరుడు మల్లయేస-ఖార్తాండగా మారాడని అంటారు. మల్లయేసను హతమార్చాడు కాబట్టే అతను మల్లయేస-ఖార్తాండగా మారాడు.

బీరప్ప కథ



గొర్రెల కాపరులైన కురుమ, కురుబ, కురుంబార్, కురువ ప్రజల కుల దైవం బీరప్ప ఒక చారిత్రాత్మిక పురుషుడు. బీరప్ప పదవ శతాబ్దానికి చెందిన చారిత్రిక పురుషుడై ఉంటాడని కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. తెలంగాణ, మహారాష్ట, కర్ణాటక రాష్ట్రాలలో ఒగ్గుకళాకారులు, మహారాష్ట్రలో 'ఆవి' అనే పేరుగల కథకులు, కర్ణాటకలోసిద్దప్ప మేతి, తదితరులు కన్నడ భాషలో చెప్పిన మల్లన్న, బీరప్ప కథలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. బీరప్ప జీవిత చరిత్రకు సంబందించిన లిఖిత పూర్వక కథలు, కథనాలు ఏవీ లేవు. వేదాలు, పురాణాలు, ఇతర ప్రామాణిక గ్రంథాల్లో కూడా బీరప్పకు సంబంధించిన ఎలాంటి ప్రస్తావన లేదనే చెప్పాలి. బీరప్ప జీవితం, ఉనికికి ఒగ్గు, ఒవి కళాకారులు చెప్పే కథలే ప్రధాన ఆధారం. ఒగ్గు, ఒవి కళాకారుల కథల ద్వారానే బీరప్ప జీవితానికి సంబందించిన కొన్ని వివరాలు, ఒక తరం నుండి రెండో తరానికి అందుతున్నాయి. నోటిమాట(కథలు) సంప్రదాయం (ఓరల్ ట్రెడీషన్) ద్వారానే బీరప్ప కథ సజీవంగా ఉండటంతో పాటు ముందుకు సాగుతోంది. బీరప్ప జీవిత చరిత్ర గతంలోనే పుస్తక రూపం ఎందుకు ధరించలేదు? అనే ప్రశ్నకు జవాబు చెప్పటం కష్టం. బీరప్ప కథ తెలంగాణాలో ఒక విధంగా ఉంటే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మరో విధంగా ఉన్నది. బీరప్ప చరిత్రకు సంబందించిన ప్రధానాంశం మూడు ప్రాంతాల కథల్లో ఒకేరకంగా ఉన్నా స్థానిక పరిస్థితుల మూలంగా కథల్లోకొన్ని మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నట్లు కనిపిస్తోంది. బీరప్ప భార్య పేరు మూడు ప్రాంతాల్లో మూడు రకాలుగా ఉండటం, ఉచ్చరించటం గమనార్హం. బీరప్ప భార్యను తెలంగాణలో 'కడగొట్టు కామరతి' అని పిలిస్తే కర్ణాటకలో 'కన్నికామవ్వ', మహారాష్ట్రలో కామేన్ లేదా కామధేను అని పిలవటం గమనార్హం. కడగొట్టు కామరతి అంటే ఆఖరు సంతానం అని అర్థం.

బీరప్ప భార్యపేరు లక్ష్మి అని కొందరు పండితులు అభిప్రాయపడుతున్నారు.

బీరప్ప జననంపై భిన్న కథనాలు ఉన్నాయి. తెలంగాణాలో ప్రచారంలో ఉన్న ఒగ్గు కథల ప్రకారం సూరమ్మ దంపతులకు శివుడి అనుగ్రహంతో బీరప్ప జన్మిస్తాడు. మహారాష్ట్రలో బహుళ ప్రచారంలో ఉన్న 'ఓవి' (మన ఒగ్గు కథలాంటిది) కథల ప్రకారం కన్య అయిన సూరవంతి ఘోరమైన తపస్సు చేసి సూర్యుడు, శివుడి అనుగ్రహంతో సజ్జోగర్భం ద్వారా బీరప్పకు జన్మనిస్తుంది. సూరవంతి పెళ్లి చేసుకోకుండానే సంతానం కోసం పన్నెండు సంవత్సరాలపాటు ఘోర తపస్సు చేసి సూర్యుడి అనుగ్రహంతో బీరప్పకు జన్మనిస్తుంది. ఇదిలా ఉంటే వీరభద్రుడే బీరప్పగా జన్మించాడని హాలుమాత చరిత్ర చెబుతోంది. వీరభద్రుడు భూలోకంలో వీరేశ్వర్ లేదా వీరలింగ (బీరప్ప, బీరలింగేశ్వరుడు)గా జన్మించాడనీ, ఇతడే చివరకు ధన్గర్, కురుబ, కురువ, కురుమ, కురుంబార్ తదితర గొర్రెల కాపర్ల కులం ఆదిదేవుడుగా మారాడని హాలుమాత చరిత్రపై లోతుగా అధ్యయనం చేసిన జర్మనీ దేశానికి చెందిన ప్రముఖ ఇండోలోగిస్ట్ గుంతేర్ సొంతమేర్ అభిప్రాయపడ్డారని రామచంద్ర చింతామణి ధీరే తన 'ఒక జానపద దేవుడి పెరుగుదల, పండర్పూర్ విఠల దేవుడు' అనే పుస్తకంలో తెలిపారు. ఈ కథనం ప్రకారం బ్రహ్మ ద్వారా వరాలు పొందిన హిరణ్యాకశిపుడు మూడు లోకాలను జయించి ఋషులను చిత్రహింసలకు గురిచేస్తుంటాడు. హిరణ్యాకశిపుడి బాధలు భరించలేక ఋషులందరు విష్ణు దేవుడి వద్దకు వెళ్లి తమను, తమ యజ్ఞాలను రక్షించాలంటూ మొర పెట్టుకుంటారు. విష్ణువు నరసింహాఅవతారం ఎత్తి హిరణ్యాకశిపుడిని హతమారుస్తాడనేది అందరికి తెలిసిన కథే. ఐతే హిరణ్యాకశిపుడిని సంహరించేందుకు నరసింహాస్వామి ఉగ్ర రూపాన్ని ప్రజలతో పాటు దేవతలు కూడా భరించలేకపోతారు. నరసింహ తన అవతారాన్ని చాలించేలా చూడాలని ఋషులు బ్రహ్మను కోరుతారు. భ్రహ్మ, ఇతర దేవతలంతా వెళ్లి తమకు దారి చూపించాలని శంకరుడిని వేడుకుంటారు. నరసింహుడిని శాంత పరచటం, అది సాధ్యం కాని పక్షంలో అతన్ని సంహరించటం ద్వారా పరిస్థితిని చక్క బరిచే బాధ్యతను ఆయన వీరభద్రుడికి అప్పగిస్తాడు. శివుడు విరభద్రుడి వెంట శివ గణాలను కూడా పంపిస్తాడు. నరసింహసామిని శాంతపరిచేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావటంతో వీరభద్రుడు, శివ గణాలు అతన్ని సంహరిస్తారు. వీరభద్రుడు తెచ్చిన నరసింహస్వామి తలను శివుడు తన మెడలో ధరిస్తాడు. ఈ పరిణామం విష్ణువుకు ఆగ్రహం తెప్పిస్తుంది. తన అవతారమైన నంసింహస్వామిని హతమార్చిన వీరభద్రుడిని సంహరించాలని ఆయన నిర్ణయించుకుంటాడు.

ఇదిలా ఉంటే వీరభద్రుడు ఒకరోజు కైలసానికి వెళ్లి శివ, పార్వతులను కలిసి భూమిపై జన్మించాలన్న తన కోరికను వెల్లడిస్తాడు. ఆదిదంపతులు అతని కోరికను మన్నించటంతో వీరభద్రుడు బ్రహ్మ, సరస్వతి సంతానంగా భూలోకంలో జన్మిస్తాడు. నరసింహుడిని సంహరించినందుకు ఆగ్రహంతో ఉన్న విష్ణుమూర్తి ఒక వృద్ధ బ్రాహ్మణుడి వేషంలో సరస్వతి వద్దకు వెళ్లి దుర్గుణాలున్న వీరభద్రుడి ముఖం చూడటం మంచిది కాదని హితవు చెబుతాడు. బ్రాహ్మణుడి రూపంలో వచ్చిన విష్ణుమూర్తి చెప్పిన దానితో భయపడిపోయిన సరస్వతి జన్మనిచ్చిన వెంటనే పిల్లవాడిని అడవిలోని స్మశానంలో వదిలిపెడుతుంది. స్మశానంలో గుక్కపెట్టి ఏడుస్తున్న పిల్లవాడికి పక్షులు, జంతువులు నీరు, నీడతో ఉపశమనం కలిగిస్తాయి. పంచభూతాలైన భూమి, ఆకాశం, అగ్ని, జల, వాయువు, చంద్రుడు తదితర దేవతలు సైతం పిల్లవాడిపట్ల దయచూపిస్తారు. అడవిలోని స్మశానానికి వచ్చిన మాయమ్మ అనే మహిళ పిల్లవాడిని సంరక్షించి అతనికి వీరలింగ అని నామరణం చేస్తుంది. కాశ్యప గోత్రానికి చెందిన కోనాసురుడు అనే రాక్షసుడు ఏడువందల మంది కురుబలను వేధిస్తుంటాడు. వారంతా వీరలింగ వద్దకు వెళ్లి కొనాసురుడి నుండి తమను రక్షించాలని కోరుతారు. ఏడువందల మంది కురుబల విన్నపం మేరకు వీరలింగ కొన్నూర్ వద్ద కోనాసురుడిని సంహరిస్తాడు. కురుబలు అప్పటి నుండి వీరలింగను తమ ఆదిదేవుడు,కుల దేవుడుగా పూజించటం ప్రారంభించారన్నది ఈ కథనం.

తెలంగాణాలో బీరప్ప కథ:

నమ్మి నాగుల కొండను పాలించే శివాళ్ళ దొంతిరాజు, అతని భార్యఅమరగన్నె (అమర కన్య అంటే ఇంద్రుడి కూతురు). వీరి సంతానం నారదుడు (నరభూపతి), సూరమ్మ. చాలా కాలం వరకు సంతానం కలుగక పోవటంతో అమరగన్నె శివున్ని పూజిస్తుంది. పూజలో భాగంగా ఆమె నెత్తిపై నిప్పుల కుండను ఎత్తుకుని శివాలయం చుట్టు ప్రదక్షన చేస్తుంది. కైలాసం వైపు ప్రయాణమైన అమరగన్నె తలపై ఉన్న నిప్పుల కుంపటి సెగ ఊర్ధ్వ లోకాల వరకు పాకుతుంది. ఇది చూసిన శివుడు అమరగన్నెను మధ్యలోనే కలిసి సంతానాన్ని ప్రసాదిస్తాడు. శివుడి అనుగ్రహం వలన అమరగన్నెకు నరభూపతి (నారదుడు), సూరమ్మ కలుగుతారు. శివాళ్ళ దొంతిరాజు, అమరగన్నె తమ మరణానికి ముందు సూరమ్మ బాధ్యతను నారదుడికి అప్పగిస్తారు. సురమ్మకు పెళ్లి సమయలో రాజ్యంలోని కొంత భాగాన్ని ఇవ్వాలని వారు నరభూపతికి సూచిస్తారు.

శివాళ్ళ దొంతిరాజు, అమరగన్నె మరణాంతరం నరభూపతి నమ్మి నాగుల కొండ రాజ్యానికి రాజవుతాడు. నర భూపతి ఒక రోజు పండితుడిని పిలిచి సూరమ్మ జాతకం చూపిస్తాడు. పండితుడు సూరమ్మ జాతకం చూసి ఆమెకు పుట్టే కొడుకుతో మీకు ప్రాణగండం ఉన్నదని చెబుతాడు. దీనికి విరుడుగుగా ఆమెను ఎంత దూరంగా ఉంచితే మంచిదని పండితుడు సలహా ఇస్తాడు. పండితుడి సలహా మేరకు నర భూపతి కారడవిలో ఒక ఒంటి స్తంభం మెడ నిర్మించి సూరమ్మను అందులో బందించి పెడతాడు.

సూరమ్మను అడవిలోని ఒంటి స్తంభం మేడలో బందించిన అనంతరం నర భూపతి పెళ్లి చేసుకుని హాయిగా రాజ్యమేలుతుంటాడు. అక్కడ ఒంటి స్థంభం మేడలో సూరమ్మ పన్నెండు సంవత్సరాల పాటు ఒంటరి జీవితం గడుపుతుంది. ఈ పన్నెండు సంవత్సరాలు ఆమె ప్రతి రోజు శివుడిని పూజిస్తుంది. సూరమ్మ పూజతో సంతోషించిన శివుడు ఆమె కష్టాలు తీర్చాలనే నిర్ణయానికి వచ్చి జంగమ వేషంలో నమ్మి నాగులకొండ రాజ్యానికి వెళ్లి నరభుపతిని కలుస్తాడు. సోదరి సూరమ్మను అలా బదించి పెట్టటం మంచిది కాదని హెచ్చరించి ఆమె ఇలాగే దుక్కిస్తుంటే రాజ్యాన్ని కోల్పోవస్తుందని స్పష్టం చేస్తాడు. సూరమ్మకు పెళ్లి చేయాలని జంగమ వేషంలో ఉన్న శివుడు నర భూపతికి సలహా ఇస్తాడు. జంగమ సన్యాసి హెచ్చరికతో భయపడిన నరభూపతి సూరమ్మకు స్వేచ్ఛకల్పిస్తాడు. ఎందుకూపనికిరాని వ్యక్తితో సూరమ్మకు పెళ్లి చేసి రాజ్యం నుండి పంపించివేయాలని నరభూపతి కుట్ర పన్నుతాడు. రాజ్యంలో భాగం ఇవ్వటం ఇష్టంలేని నరభూపతి దుర్బుద్ధితో చెల్లెలు సూరమ్మను మూతి. ముక్కులేని ఒక ముద్ద లింగం లాంటి వ్యక్తికే ఇచ్చి పెళ్లి చేస్తాడు. ఆ తరువాత ప్రత్యేక రాజ్యం ఏర్పాటు చేస్తానని చెప్పి వారిద్దరిని తీసుకుకొని అడవికి బయలుదేరుతాడు. సూర్యాస్తమయం కాగానే నరభూపతి వారితో అ రాత్రి అడవిలోని ఒక శివాలయంలో బస చేస్తాడు. నర భూపతి అర్ధ రాత్రి తాను పడుకొన్న చోట ఒక పెద్ద మొద్దును పెట్టి వెళ్ళిపోతాడు. తెల్లవారిన తరువాత అన్న నారదుడు కనిపించక పోవటంతో సూరమ్మ ఆందోళన చెందుతుంది. పక్కన ఉన్న మొద్దును చూసి అన్న నారదడు మొద్దుగా మారిపోయాడని భావించి లబోదిబో మంటుంది. అన్న నరభూపతి (నారదుడు) మొద్దుగా మారిపోయాడు, భర్త మూతి, ముక్కు లేని ముద్దలింగం, తన బతుకు ఇలా అయ్యింది ఏమిటి అంటూ సూరమ్మ అడవిలో రోదిస్తుంది. ఆమె రోదనకు శివుడు కరిగిపోతాడు. శివుడు ప్రత్యక్షమై సూరమ్మను ఓదారుస్తాడు. ఒక మంచి రాజ్యాన్ని నిర్మించి ఇస్తానని చెప్పి నరభూపతి రాజ్యమైన నమ్మి నాగులకొండ కు అభిముఖంగా సూర్య నాగుల కొండ లేదా చంద్రగిరి

కొండ పేరుతో ఒక కొత్త నగరాన్ని నిర్మించి ఇస్తాడు. పరమ శివుడు మూతి,ముక్కు లేని ముద్దా లింగానికి బ్రహ్మయ్య అనే పేరు పెట్టి తెలివిని ప్రసాదిస్తాడు. ముత్యాలు, పగడాలు, వజ్రాలు, వైడుర్యాల వర్షం కురిపించి ఆ ధనంతో సూర్య నాగుల కొండను పాలించుకుంటూ సుఖంగా ఉండాలని ఇరువురిని దీవించి వెళ్లిపోతాడు.

తాను అడవిలో వదిలిపెట్టి వచ్చిన సూరమ్మ, బ్రహ్మయ్య పరమ శివుడి అనుగ్రహంతో రాజ్యాని సంపాదించుకుని సుఖంగా ఉన్నారన్న గూడచారుల సమాచారం నారదుడిని ఆందోళనకు గురి చేస్తుంది. నారభూపతి ఆ రోజు నుండి సూర్య నాగుల కొండ లేదా చంద్రగిరి కొండ వ్యవహారాలపై దృష్టి సారిస్తాడు. పెన్నెండు సంవత్సరాలు గడచినా సంతానం కలుగక పోవటంతో సూరమ్మ శివున్ని ప్రార్తిస్తుంది. శివుడి అనుగ్రహంతో సూరమ్మ కాల క్రమంలో గర్భవతి అవుతుంది. ఒక కథనం ప్రకారం శివుడు తన పెద్ద కొడుకైన వీరభద్రుడిని సూరమ్మ కు సంతానంగా పంపిస్తాడు. చెల్లెలు గర్భవతి అయిన సమాచారం అందగానే నారదుడు నీచ బుద్ధితో ఆమెకు హాని కలిగించేందుకు కుట్రలు పన్నటం ప్రారంభిస్తాడు. విషం కలిపిన వంటకాలతో పాటు విషపూరిత దారాలాతో నేసిన బట్టలను సూరమ్మకు బహుకరించి హతమార్చాలని అతను కుట్ర పన్నుతాడు. సూరమ్మ గర్భాన్ని విచ్చిన్న చేయాలనే దుర్బుద్ధితో నరభూపతి విషం కలిపిన వంటకాలు, విషపూరిత బట్టలతో సూర్య నాగుల కొండకు వెళతాడు. నరభూపతి తన సోదరి సూరమ్మకు విష ఆహారం తినిపించేందుకు, విష పూరిత బట్టలు తోడిగించేందుకు చేసే ప్రయత్నాలను గర్భంలో ఉన్న బీరప్ప దేవుడు విఫలం చేస్తాడు. దీనితో నారదుడు ఏం చేయాలో అర్థం కాక ఆందోళన చెందుతాడు. సూరమ్మ జన్మనిచ్చేది మగ బిడ్డకా లేక ఆడ బిడ్డకా అనేది తెలుసుకోవాలన్నది నారదుడి ఆలోచన. బీరప్ప నారదుడి కలలో కనిపించి 'మామా నేను ఆడ బిడ్డను కాదు మగ బిడ్డను, నీ ఏడుగురు కూతుళ్ళకు నేనే భర్తను అని చెబుతాడు. ఇదిలా ఉంటే నరభూపతి తెచ్చిన వంటకాలు తిన్న పశువులన్ని మరణిస్తాయి. సూరమ్మ కొంత కాలానికి పండంటి మగ బిడ్డను కంటుంది. బీరప్ప జన్మించగానే అంతకు ముందు విష ఆహారం తిని మరణించిన అన్ని పశువులు లేచి వస్తాయి.

బీరప్ప పెరిగి పెద్దవాడవుతుంటే నారదుడి గుండెల్లో గుబులు పుట్టుకు వస్తుంటుంది. బీరప్పను ఏ విధంగానైనా చంపాలనే లక్ష్యంతో నారదుడు ఏడుగురు కసాయి వాళ్ళను పంపిస్తాడు. బీరప్ప తన తల్లిదండ్రులు, కులం గండాన పుట్టాడు, అతన్ని చంపకపోతే తల్లిదండ్రులతో పాటు మొత్తం కులమంతా నాశనమవుతుందంటూ నారదుడు

సురమ్మకు వర్తమానం పంపిస్తాడు. కులాన్ని కాపాడుకునేందుకు తానూ పంపిస్తున్న కసాయి వాళ్ళకు బీరప్పను అప్పగించాలని నారదుడు సూచిస్తాడు. అమాయకురాలైన సూరమ్మ అన్న నర భూపతి మాటలను విశ్వసిస్తుంది. కులం ప్రజలను కాపాడుకునేందుకు సూరమ్మ భోరు భోరున విలపిస్తూ పన్నెండు రోజుల పసి పాప అయిన బీరప్పను కసాయి వాళ్ళకు అప్పగిస్తుంది. ఏడుగురు కసాయిలు అభం, శుభం తెలియని బీరప్పను తీసుకుని ఆడవిలోకి ప్రయాణం అవుతారు. దట్టమైన అడవిలో బీరప్పను చంపివేయాలన్నది వారి ఆలోచన. నారదుడు పంపించిన కసాయి వాళ్ళు బీరప్ప తో అడవిలోని ఒక మారు మూల ప్రాంతానికి చేరుకొని అక్కడ ఉన్న కాంచాల మర్రి చెట్టు కింద కూర్చుంటారు. పన్నెండు రోజుల పసికూన బీరప్పను పక్కన పడుకో బెడతారు. ఇంతలో ఒక పాము వచ్చి బీరప్ప ముఖంపై ఎండ పడకుండా పడగ విప్పుతుంది. ఇదిచూసిన కసాయిలు బీరప్ప మహత్తు గ్రహించి అతన్నిఅక్కడే వదిలి వేసి వెళ్ళిపోతారు. ఏడుగురు కసాయిలు మేకను చంపి దాని కళ్ళను నారదుడికి ఇచ్చి ఇవి బీరప్ప కళ్ళు అని నమ్మిస్తారు. బీరప్ప హతమయ్యాడని విశ్వసించిన నారదుడు ఆ రోజు ప్రశాంతంగా నిద్రపోతాడు.

అక్క మహంకాళి పరమ శివుడు, మోహినికి పుట్టిన సంతానమన్నది కురుమ ప్రజల విశ్వాసం. ఉజ్జయిని ప్రాంతానికి చెందిన అక్క మహంకాళి గొడ్డుపోతుల రెడ్డి ఇంట్లో పుట్టి పెరుగుతుంది. అక్క మహంకాళి వచ్చిన తరువాత గొడ్డుపోతులరెడ్డికి మరో కూతురు పుడుతుంది. ఆమె పేరు చంద్రమ్మ. మల్లన్న దేవుడు ఆడపిల్ల కట్నంగా ఇచ్చిన ఏడు గొర్రెలను అక్క మహంకాళి సమర్థంగా పెంచి వాటిని ఒక లక్షా ఇరవై ఇదు వేలకు పెంచుతుంది. అక్క మహంకాళి సోదరి చంద్రమ్మ తో కలిసి గొర్రెలను మేపుకుంటూ అడవికి వస్తుంది. అడవిలో బీరప్ప ఆకలితో కెరు,కేరున ఏడుస్తుంటాడు.అక్క మహంకాళి ఆమె సోదరి తమ గొర్రెలను మేపుకుంటూ అటు వైపు వచ్చి కాంచాల మర్రిచెట్టు వద్ద గుక్క పెట్టి ఏడుస్తున్న బీరప్పను చూస్తారు. అడవిలో లభించిన బీరప్పను పెంచుకోవాలనే కోరిక ఇద్దరికి ఒకేసారి కలుగుతుంది. అయితే బీరప్ప అక్క మహంకాళి ఒడిలోకి దూకిన అనంతరం ఏడుపు మానేస్తాడు. దీనితో బీరప్పను పెంచుకునే అవకాశం అక్క మహంకాళికి దక్కుతుంది. అక్క మహంకాళి బీరప్పను తన స్వంత తమ్ముడిగా పెంచుకుంటుందని ఒగ్గు కథలు చెబుతున్నాయి.

మహంకాళి, బీరప్ప గొర్రెలను మేపుతూ హాయిగా జీవిస్తుంటారు. బీరప్ప పోషణలో గొర్రెలు వేల సంఖ్యలో వృద్ది చెందుతాయి. బీరప్ప కూడా పెరిగి పెద్దవుతాడు. యుక్త

వయస్సు వచ్చిన తరువాత అతడు పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. బీరప్ప తన మనసులోని మాటను అక్క మహంకాళి కి చెబుతాడు. 'నాకు ఒక మేనమామ ఉన్నట్లు తెలిసింది, అతనికి ఏడుగురు కూతుళ్ళు ఉన్నారట, వారిలో ఒకరిని చేసుకుంటాను' అని బీరప్ప అక్క మహంకాళి తో చెబుతాడు. బీరప్ప ప్రతిపాదనను అక్క మహంకాళి నిర్ద్వందందంగా తోసిపుచ్చుతుంది. మీ మేనమామ నరభూపతి మంచివాడు కాదు. అతని కూతురును పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించటం అంటే ప్రాణాపాయం కొనితెచ్చుకోవటమే అని అక్క మహంకాళి హెచ్చరిస్తుంది. మేనమామ నారదుని కూతురు వద్దు, అంతకంటే మంచి సంబంధం తెస్తాను, అందమైన అమ్మాయిని తెచ్చి పెళ్లి చేస్తానని అక్క మహంకాళి హామీ ఇస్తుంది. అయితే బీరప్ప మనసు మాత్రం మేనమామ కుతురుపై కేంద్రీకృతమై ఉంటుంది. ఏ విధంగానైనా మేన మామ కూతురును పెళ్లి చేసుకోవాలని బీరప్ప నిర్ణయించుకుంటాడు. బీరప్ప పట్టుదల గురించి బాగా తెలిసిన అక్క మహంకాళి అతనికి పెళ్లి తిలకం దిద్ది కత్తి చేతికి ఇచ్చి విజయీభవ అంటూ దీవించి పంపిస్తుంది. నర భూపతి మంచివాడు కాదు కాబట్టి తాను అతని ఇంటికి రాలేనని మహంకాళి చెబుతుంది. మేనమామ కూతురును పెళ్లి చేసుకునేందుకు బీరప్ప నాగుల కొండకు బయలు దేరుతాడు. బీరప్ప ప్రయాణానికి గంగా నది అడ్డుపడుతుంది. గంగా నది పొంగి పోరులుతూ అతని ప్రయాణానికి అడ్డుతగులుతుంది. నాగుల కొండకు వెళ్ళటం మంచిది కాదని నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తుంది. నీ తల్లిని చంపేందుకు పలు ప్రయత్నాలు చేసిన నరభూపతి ఇప్పుడు నిన్ను చంపేందుకు ఎంత మాత్రం వెనకాడడని ఆమె హెచ్చరిస్తుంది. బీరప్ప మాత్రం తన మొండి పట్టును వదిలిపెట్టడు. గంగ సలహా మేరకు అక్కడే కొంత సమయం గడిపిన అనంతరం ఎరుకల ఎల్లమ్మ ను కలిసి నరభూపతి కుటుంబం వివరాలు తెలుసుకుంటాడు. జమదగ్నికి పూజలు చేసేందుకు గంగా నది ఒడ్డుకు వచ్చిన రేణుకాఎల్లమ్మ నుండి నరభూపతి, అతని కూతుళ్ళకు సంబంధించిన వివరాలను బీరప్ప తెలుసుకుంటాడు. నరభూపతి వద్దకు వెల్ల వద్దని రేణుకాఎల్లమ్మ కూడా చెప్పినా బీరప్ప వినకుండా నాగుల కొండ పట్టణానికి ప్రయాణం అవుతాడు. నమ్మినాగులకొండ పట్టణానికి కొద్ది దూరంలో ఉన్న కలికిచిందోలి బావిలో జలకాలడుతున్న నరభూపతి ఏడుగురు కుమార్తెలను చూస్తాడు. నరభూపతి ఏడో కూతురు కామరతి అతనికి బాగా నచ్చుతుంది. ఆమెనే పెళ్లి చేసుకోవాలని బీరప్ప నిర్ణయించుకుంటాడు.

బీరప్ప ఎదోఒక రోజు తన ఏడుగురు కుతుళ్ళలో ఒకరిని తప్పకుండా ఎత్తుకుపోయి

రాక్షస వివాహం చేసుకుంటాడని నరభుపతి మొదటి నుండి అనుమానిస్తూ ఆందోళన చెందుతుంటాడు. అందుకే అతడు ముఖ్యంగా తన ఎడవ కూతురు కామరతికి గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తాడు. ఇంటి చుట్టు పెద్ద ఎత్తున సాయుధులను మోహరిస్తాడు. బీరప్ప తన గొర్రెలకు ఏడుగురిని కాపలకు పెట్టి నమ్మినాగులకొండకు వెళ్లి కామరతిని కలుస్తాడు. బీరప్ప తననుతాను పరిచయం చేసుకోగానే కామరతి తన బావను గుర్తిస్తుంది. మీ కోసమే ఎదురుచూస్తున్నానంటూ బీరప్పను పెళ్లి చేసుకునేందుకు తన సంసిద్ధతను ప్రకటిస్తుంది. ఆ తరువాత తాను పెళ్లి కోసం సిద్దం చేసిపెట్టుకున్న బంగారం నగలు, ఇతర ఆభరణాలు, తీసుకుని వస్తానంటూ కామరతి ఇంటికి వెళ్ళిపోతుంది. బీరప్ప కామరతిని కలుసుకున్న విషయం తెలుసుకున్న నరభూపతి ఆమెను ఒంటి స్థంభం మేడలో బందించి పెడతాడు. బీరప్ప ఆమె కోసం ఎదురుచూసి తన రాజ్యానికి తిరిగి వెళ్ళిపోతాడు. రోజులు, వారాలు గడిచినా కామరతి నుండి ఎలాంటి సందేశం రాకపోవటంతో బీరప్ప మారువేషంలో నర భూపతి రాజ్యానికి వెళ్లి పరిస్తితిని పరిశీలిస్తాడు. నరభూపతి కామరతిని ఒంటి స్థంభం మేడలో బంధించి పెట్టటాన్ని గ్రహించి అక్కడికి వెళతాడు. బీరప్ప కాపలాదారులను హతమార్చి కామరతిని తీసుకుని సూర్యనాగులకొండ రాజ్యానానికి వెల్లి పెళ్లికి ఏర్పాట్లు ప్రారంభిస్తాడు. మేనమామ నరభుపతి వచ్చే లోగా కామరతిని పెళ్లి చేసుకోవాలనే తొందరలో ఉన్న బీరప్ప అక్క మహంకాళికి తన పెళ్లి గురించి తెలియజేసి తీసుకువచ్చే భాద్యతను బోయన్నకు అప్పగిస్తాడు. అయితే బీరప్ప పెళ్లి విషయం అక్క మహంకాళి కి తెలియజేసే భాద్యతను బోయన్న విస్మరిస్తాడు. పెద్దల సమక్షంలో బీరప్ప, కామరతి పెళ్లి జరుగుతున్న సమయలో నర భూపతి బీరప్ప గొర్రెల మందపై దాడి చేయిస్తాడు. ఈ విషయం తెలియగానే బీరప్ప తన కత్తిని పెళ్లి పందిర్లో పెట్టి గొర్రెల మందను కాపాడుకునేందుకు అడవిలోకి వెళతాడు. తాను రావటం ఆలస్యమైతే తన కత్తితో కామారతికి పెళ్లి చేయాలని బీరప్ప ఆదేశిస్తాడు. బీరప్ప తన మేనమామ నరభూపతి పంపించిన సైన్యాన్ని ఓడించి గొర్రెల మందను కాపాడుకునేటప్పటికి పెళ్లి ముహూర్తం దాటి పోతుంది. అందుకే అక్కడ పెళ్లి మంటపంలో పెద్దలు బీరప్ప కత్తికి కామారతికి పెళ్లి జరిపించేస్తారు. బీరప్ప యుద్ధం నుండి తిరిగి వచ్చిన అనంతం పెళ్ళివారందరికీ విందు ఇస్తాడు. బీరప్ప పెళ్లి విషయం అక్కమహంకాళికిఆలస్యంగాతెలుస్తుంది.ఆలస్యంగావచ్చినఅక్కమహంకాళి బీరప్పకు నాగవెల్లి చేయిస్తుంది. బీరప్ప సూర్యనాగులకొండ రాజ్యాన్ని శక్తి, యుక్తులతో పాలిస్తూ ప్రజలను తన కన్నబిడ్డలుగా చూసుకుంటాడు. సూర్య నాగులకొండ రాజ్యం ప్రజలు బీరప్ప, కామరతి, అక్కమహంకాళిని దేవతలుగా భావించ పూజించటం

ప్రారంభిస్తారు. కొంత కాలం గడిచిన తరువాత బీరప్ప, కామారతి, అక్క మహంకాళి తమ అవతారాలు చాలించి దేవతలైపోతారన్నది ఒగ్గు కథలు చెబుతున్నాయి.

బీరప్ప కథ కొంత వరకు శ్రీ కృష్ణుడి కథను పోలి ఉంటుంది. బీరప్ప మేన మామ నరభూపతి మహాభాతం, హరి వంశంలోని కంసుడు ఒకరేనని కురుమ ప్రజల విశ్వాసం. ఉత్తర భారతదేశంలోని కంసుడు దక్షిణ భారత దేశంలోని నరభూపతైతే ఇక్కడి బీరప్ప అక్కడి కృష్ణుడు కావాలి. శ్రీకృష్ణుడు కూడా మేనమామ గండాన పుడుతాడు. తన గండాన పుట్టిన శ్రీకృష్ణున్ని హతమార్చేందుకు కంసుడు కూడా పలు ప్రయత్నాలు చేయటం తెలిసిందే. కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని అనంతపూర్ జిల్లాకు చెందిన కొందరు కురుబలు ఒక పెట్టెను పూజిస్తారు. ఆ పెట్టెలో కృష్ణుడు వాడిన బట్టలు ఉంటాయన్నది వారి నమ్మకం. శివుడి తొలి చమట బిందువు నుండి ఉద్భవించిన బీరప్పను కురుకుంటప్ప స్వామి, అంతరంగప్ప, ఇటికలపల్లయ్య, గొల్లపల్లయ్య, కనగనిపల్లె పెద్దయ్య అని కూడా పిలుస్తారు. కురుమ, కురుబ ప్రజలు బీరప్పతో పాటు ఆయన భార్య కడగొట్టు కామరతిని పూజిస్తారు. అనంతపురం జిల్లాలోని కురుకుంటప్ప స్వామి దేవాలయం గర్భ గుడిలోని విగ్రహాలు బత్తిన చెక్క (బిల్వ చెట్టు)తో చేయటం గమనార్హం. ఈదేవాలయంలోబీరప్పసోదరిఅంకమల్లమ్మ,రామయ్య,పెద్దయ్య,దళవాయి, సీనయ్య గుర్రాలపై సవారీ చేస్తున్న విగ్రహాలున్నాయి. కొండమిండరాయుడు మాత్రం ఏనుగుపై సవారీ చేస్తున్న విగ్రహం ఉన్నది. వీరందరి చేతుల్లో ఖడ్గాలు ఉండటం గమనార్హం. కర్నూలులోని బీరప్ప దేవాలయంలో బీరప్పది రాతి విగ్రహం. గుర్రంపై సవారీ చేస్తున్న బీరప్ప స్వామి చేతిలోని ఖడ్గం ఆయన క్షత్రియత్వానికి అద్దం పడుతోంది. బీరప్ప స్వామి పాదాల వద్ద ఉన్న భైరవుడు విశ్వాసానికి ప్రతీక.

బీరప్ప దేవుడు కర్ణాటక ప్రాంతానికి చెందిన వాడనేందుకు చాలా దాఖలలాలు ఉన్నాయి. బీరప్ప మాతృమూర్తి సూరమ్మ దేవి పరిపాలించిన సూర్యానాగుల కొండ ఆనవాళ్ళు ఎక్కడా కనిపించటం లేదు. ఐతే బీరప్పను పెంచి పోషించిన అక్క మహంకాళి ఉజ్జయినిని పాలించేదని ఒగ్గు కథలు చెబుతున్నాయి. ప్రస్తుతం మధ్యప్రదేశ్ లో ఉన్న ఉజ్జయిని అక్క మహంకాళి పాలించిన ఉజ్జయిని ఒక్కటేనా అనేది చెప్పటం చాలా కష్టం.

అక్క మహంకాళి లేదా మాయవ్వ

బీరప్ప దేవుడిని చిన్నప్పటి నుండి పెంచి పోషించే అక్క మహంకాళి లేదా మాయవ్వ లేదా మహాకుభాయి ఎవరు? ఆమె పూర్వ పరాలు ఏమిటి? అక్క మహంకాళి లేదా మాయవ్వ,ఆమెఆరుగురుసోదరీమణులుపౌరాణికనేపథ్యంఏమైనాఉన్నదా?



నరభూపతి లేదా నారదుడు తన సోదరి సూరమ్మ లేదా సూర్యవంతిని తప్పుడు మాటలతో నమ్మించి ఆమె కుమారుడు బీరప్పను కసాయి వాళ్లకు అప్పగించటం తెలిసిందే. నరభూపతి ఆదేశం మేరకు కసాయివాళ్ళు బీరప్పను అడవిలోకి తెచ్చి చంపేందుకు ప్రయత్నించి విఫలమై తిరుగు ప్రయాణం అవుతారు. మాయవ్వ లేదా అక్క మహంకాళి అడవిలో లభించిన బీరప్పను బాల్యం నుండి పెంచి పోషిస్తుంది. బీరప్ప జీవితంలో అత్యంత కీలకపాత్ర నిర్వహించిన మాయవ్వ లేదా అక్క మహంకాళి ఎవ్వరు? దైవ సంభూతుడైన బాలుడిని ఒక మహిళ పెంచి పోషించేందుకు సంబందించిన దాఖలాలు క్రీస్తు పూర్వం మూడో శతాబ్దం నుండి లభిసున్నాయి. దీనికి ముందు హరి వంశంలో శ్రీ కృష్ణుడు బాల్యంలో మేన మామ కంసుడికి దూరంగా గోకులంలో యశోద వద్ద పెరగం మనకు తెలిసిందే. మహారాష్ట్రలోని నెవాసా, బహల్ ప్రాంతంలో క్రీస్తు పూర్వం ఒకటవ శతాబ్దం నాటి తల్లి, పిల్లల ఎర్రరంగు మట్టిబొమ్మలు లభించాయి. కొల్హాపూర్, నాసిక్, నెవాసా, తెర్, కర్హాడ్ ప్రాంతంలోని సున్నపు రాతి పొరల్లో మూడో శతాబ్దం, రెండో శతాబ్దం నుండి క్రీస్తు శకం రెండో శతాబ్దం నాటి 'కూర్చొని ఉన్న మహిళలు, చిన్న పిల్లల'ఎర్ర మట్టిబొమ్మలు లభించాయి. శాతవాహనుల కాలం నాటి ఈ మట్టి బొమ్మలు హాలుడు రచించిన ఘటసప్తసతిలో ప్రస్తావించిన గ్రామ దేవతలు కావచ్చు. ఈ బొమ్మల్లో కొన్ని పిల్లలకు పాలిస్తున్నట్లుంటే, మరికొన్ని తల్లి బొమ్మలు పిల్లలతో ఆడుకుంటున్నట్లు ఉన్నాయి. మాయవ్వ ఆమె ఆరుగురు సోదరీమణులు అడవిలో వేటకు వెళ్ళినప్పుడు చెట్టుపై గుక్క పెట్టి ఏడుస్తున్న

బీరప్పను చూస్తారు. బీరప్పను మాయవ్వ తన సోదరుడిగా పెంచుకుంటుంది. బీరప్పను పెంచి పోషించెందుకే పరమ శివుడు పార్వతిని మాయవ్వగా పుట్టించాడనే ఒక కథనం ప్రచారంలో ఉన్నది. శివుడి ఆజ్ఞ మేరకే ఆమె బీరప్పను అన్ని కష్టాల నుండి కాపాడుతుంది. మాయవ్వ వద్ద తొమ్మిది లక్షల గొర్రెలు, తొమ్మిది లక్షల గొర్రె పిల్లలు ఉంటాయి. బీరప్ప ఈ పన్నెండు లక్షల గొర్రెలు, గొర్రె పిల్లలను షోలాపూర్ అడవిలో మేపుతున్నప్పుడు గేదెల రాజు రెడ్రేశ్వర్ వాటి నుండి ఒక్కొక్కటి అపహరిస్తుంటాడు. ఇది గ్రహించిన మాయవ్వ అక్కడికి వచ్చి రెడ్రేశ్వర్ ను సంహరిస్తుంది. మాయవ్వ చేతిలో హతమైన రెడ్రేశ్వర్ కోరిక మేరకే ఆమె పూజారులు మాఘ మాసంలో అతని బట్టలు ధరించి ఆమెకు పూజలు చేస్తారు.

మహారాష్ట్రలోని చించిలి ప్రాంతానికి చెందిన కురుబ, ధనగర్ వర్గం ప్రజలు బీరప్పతో పాటు మాయవ్వను కుడా పూజిస్తారు. సతారా, సాంగ్లి జిల్లాలో పలు ధనగర్ కుటుంబాల వారికి మాయవ్వ ఇంటి దేవత. ఆరేవాడి ప్రాంతంలో బీరప్ప ప్రధాన దేవత అయినప్పటికీ మాయవ్వను కుడా పూజించే సంప్రదాయం ఆచరణలో ఉన్నది. వాస్తవానికి ఆరేవాడి ప్రాంతం ప్రజలు బీరప్ప కంటే ముందు మాయవ్వను పూజించేవారు. చైత్ర మాసంలో ఇక్కడ బీరప్ప జాతర జరుగుతుంది. ఈ ప్రాంతంలో మాయవ్వ పేరుతో కూడా ఒక జాతర జరుగుతుంది. ఐతే ఇది బీరప్ప జాతర స్థాయిలో జరుగాకున్నా కొద్దిగా తక్కువ స్థాయిలో మాయవ్వ జాతర కూడా నిర్వహిస్తారు. చారిత్రిక అవశేషాలు పరిశీలిస్తే ఆరేవాడిలో బీరప్ప కంటే ముందు వెలసిన దేవత మాయవ్వ అనేది మనకు స్పష్టం అవుతుంది. బీరప్పను పెంచి, పోషించేందుకు మాయవ్వను పరమ శివుడు తన భస్మం, పార్వతి కుంకుమను కలిపి సృష్టించారనే మరో కథ కుడా మహారాష్ట్రలో ప్రచారంలో ఉన్నది.

మహారాష్ట్రలోని ధనగర్లు, కర్నాటకలోని కురుబలు బీరప్పతో పాటు మహంకాళి, మాయవ్వలేదామాయక్కనుపూజిస్తారు.మహారాష్ట్ర,కర్ణాటకలోనికొన్నిధనగర్, కురుబ కుటుంబాలకు మాయవ్వ ఇంటి దైవం, ఆరాధ్య దైవం. మహా రాష్ట్రలోని మహస్వాడ్ ప్రాంతంలోని ధనగర్ లు పాటించే మాయవ్వ-మ్హాకుబై సంప్రదాయం అత్యంత పురాతనమైంది. బీరప్ప కంటే ముందు నుండే మాయవ్వ కథ ప్రచారంలో ఉన్నది. అంటే బీరప్ప ప్రాధాన్యం సంపాదించక ముందే మాయవ్వ సంప్రదాయం ఆచరణలో ఉండేది. మహారాష్ట్రలోని ఆరేవాడి ప్రాంతంలో ఈ రోజుకు కూడా మాయవ్వ పేరుతో ఒక ప్రత్యేక జాతర నిర్వహిస్తారు. మాయవ్వ సోదరి మ్హైసాబాయి (బర్రెల, గేదెల

దేవత) మరో పేరు మాయారాణి, జాఖై, జోఖై, ఏకవ్వ. ధనగర్ పురాణం ప్రకారం మాయవ్వ రెండో సోదరి ఏకవ్వ.

కర్ణాటక రాష్ట్రానికి చెందిన కురుబ కులం ప్రజలలోని ఒక వర్గానికి చెందిన హాలు మాత కురుబ పురాణం కుడా తెలంగాణాలోని బీరప్ప కథ మాదిరిగానే ఉంటుంది . అయితే కొన్ని పేర్లు, కొన్ని అంశాలలో తేడా మూలంగా కొంత భిన్నంగా ఉంటుంది. కన్నడ భాషలో హాలు అంటే పాలు అని అర్థం, హాలుమత కురుబ పురాణం ప్రకారం శైవ గురువు ఆదిరేనుకాచార్యకు శివుడు ఇచ్చిన కామధేనువు పాల నుండి కురుబ కులం పుట్టింది. హాలుమతకురుబ పురాణంలో కూడా రెండు విభాగాలు ఉన్నాయి. వ్యవసాయంతో పాటు గొర్రెలను మేపేవారు హత్తి (పత్తి) కంకణ కురుబలు కాగా కేవలం గొర్రెల పెంపకం ద్వారా జీవనాన్ని సాగించే వారు ఉన్ని కంకణదారులు. ఉన్ని కంకణ కురుబలను హండే కురుబలు అని కుడా పిలుస్తారు. పెళ్ళిళ్ళు, ఇతర ముఖ్యమైన పండుగలు, పబ్బాల సమయంలో చేతికి ధరించేది కంకణం. కురుబ కులానికి చెందిన సిద్దప్ప మేతి పాడిన హాలుమత కురుబ పురాణాన్ని గుల్బర్గ విశ్వవిద్యాలయానికి చెందన ప్రొఫెసర్ వీరన్న దండె గ్రంధస్తం చేశారు.

పరమ శివుడి తొలి చెమట నుండి ఉద్భవించిన బీరప్ప హాలుమతకురుబ పురాణం నాయకుడు. హాలుమాత కురుబపురానంలోని పద్నాలుగు అధ్యాయాలు కురుబ, కురుమ కులం ప్రజల పుట్టు, పూర్వోత్తరాలను వివరించింది. ఈ పురాణం ప్రకారం ముడుగొండ, ముద్దవ్వలు కురుబ వర్గం మూల పురుషులు. ముడుగొండ, ముద్దవ్వల సంతతికి చెందిన బాల బరం, సూరమ్మ దేవి దంపతుల కొడుకు బీరప్ప . ఈ పురాణం ప్రకారం బీరప్ప తండ్రి పేరు బాలబరం. తెలంగాణా, కర్ణాటకలో ప్రచారంలో ఉన్న కథల ప్రకారం బీరప్ప తల్లి పేరు సూరమ్మ అయితే తండ్రి పేరు వేరుగా ఉన్నది. బాలబరం, సూరమ్మ దేవి శివుడి కరుణా, కటాక్షం కోసం చేసిన ఘోర తపస్సు మూలంగా బీరప్ప జన్మిస్తాడు. సూరమ్మదేవి సోదరుడయిన కలినారాయణ వారి ఆస్తిపాస్తులను హరించివేయాలనే దుష్ట సంకల్పంతో ఉంటాడు. అందుకే కలినారాయణ మేనల్లుడు బీరప్ప జాతకం చూసి ఇతను బతికి ఉంటే తల్లి, దండ్రులతో పాటు మొత్తం కురుబ కులానికి అరిష్టం వారిల్లుతుందనే కట్టు కథ అల్లుతాడు. తల్లి,దండ్రులు, కులం ప్రజలు బతికి బట్ట కట్టాలంటే బీరప్పను కీకారణ్యంలో వదిలి వేయవలసి ఉంటిందని సూరమ్మ ను కలినారాయణ నమ్మిస్తాడు. ఘోర తపస్సు చేసిన అంతరం శివుడి అనుగ్రహంతో పుట్టిన ఏకైక కొడుకు బీరప్పను వదులుకోవటం సూరమ్మ దేవికి నచ్చదు. మీ క్షేమం,

కులం క్షేమం కోసం కొడుకును త్యాగం చేయాలంటూ కలినారాయణ వత్తిడి తీసుకు రావటంతో బాలబరం, సూరమ్మ దేవి ఎట్టకేలకు బీరప్పను అడవిలో వదిలివేసేందుకు అంగీకరిస్తారు. బీరప్పను అడవిలో వదిలి వచ్చిన వెంటనే అతన్ని ఒక వేటకాని చేత చంపించేందుకు కలినారాయణ పథకం వేస్తాడు. అడవిలో వేటకాడు తనను అమాయకంగా చూస్తున్న పసిబాలుడు బీరప్పను చంపలేకపోతాడు. వేటకాడు బీరప్పను అక్కడే వదిలివేసి కలినారాయణ వద్దకు వచ్చి బాలుడిని చంపినట్లు అబద్ధం చెప్పి రక్తంతో తడిసిన అతని బట్టలను చూపిస్తాడు. వేటకాడు నిజంగానే బీరప్పను చంపేశాడని కలినారాయణ అనుకుంటాడు.

శివుడు, పార్వతి ఆదేశం మేరకు అడవిలో పడి ఉన్న పసి బాలుడు బీరప్పకు చీమలు, పాములు అండగా నిలుస్తాయి. బీరప్ప ఆకలితో ఏడుస్తుంటే అడవిలో గొర్రెలు, మేకలను మేపుకుంటున్న ఇద్దరు మహిళలు అక్కవ్వ, మాయవ్వ బాలుడి ఏడ్పు విని అక్కడికి పరుగెత్తుకుని వస్తారు. మోదట అక్కవ్వ బీరప్పను ఎత్తుకునేందుకు ముందుకు వెళితే చీమలు, పాములు అడ్డుకుంటాయి. అప్పుడు మాయవ్వ బీరప్పను ఎత్తుకునేందుకు ముందుకు వస్తుంది. మాయవ్వ ముందుకు రాగానే చీమలు, పాములు తప్పుకుంటాయి. బీరప్పను ఎవరు పెంచుకోవాలనే అంశంపై ఇద్దరికి గొడవ వస్తుంది. చివరకు వారు బీరప్ప పట్ల ప్రేమతో ఎవరి స్తనాలలో పాలు ఉబికి వస్తాయో వారు పెంచుకోవాలనే అంగీకారానికి వస్తారు. ఇద్దరు బీరప్ప చుట్టు ప్రదక్షిణాలు చేయగా మాయవ్వ స్తనాల్లో పాలు ఉబికి వస్తాయి దీనితో ఆమె బీరప్పను పెంచుకోవాలనే నిర్ణయానికి వస్తారు. మాయవ్వ బీరప్పను తన స్వంత సోదరుడిగా పెంచుతుంది. బీరప్ప అల్లరోడు, ఆతను అక్కడి పిల్లలందరిని ఆటపట్టిస్తుంటాడు. దీనితో విసిగిపోయిన చందనగిరి లేదా దేవగిరి ప్రజలు మయవ్వకు అతనిపై పిర్యాదు చేస్తారు. దేవగిరి పిల్లలందరు అతన్ని ఆనాద, దిక్కులేనివాడు అని వెక్కిరిస్తారు. పిల్లల వెక్కిరింపు నిజమా అని బీరప్ప అడగటంతో మాయవ్వ అతను అడవిలో లబించటం గురించి వివరిస్తుంది. మాయవ్వ ఆ తరువాత కొంత కాలానికి బీరప్ప పెళ్లి చేయాలనుకుని తనకు నచ్చిన ఒక యువతి పేరు ప్రతిపాదిస్తుంది. బీరప్ప ఈ ప్రతిపాదనను తిరస్కరించి తన మేనమామ కూతురును మాత్రమె పెళ్లి చేసుకుంటానని స్పష్టం చేస్తాడు. మేనమామ కూతురు మినహా మిగతా మహిళలంతా తనకు సోదరీమణులు అవుతారాని బీరప్ప ప్రకటిస్తాడు.

బీరప్ప ఒక రోజు యాదృచ్చికంగా కలినారాయణను కలుస్తాడు. కలినారాయణ తన మేన మామ అనేది దివ్య దృష్టితో తెలుసుకున్న బీరప్ప నిజ స్వరూపం చూపించి అతని

కూతురు కన్నికామవ్వ తో పెళ్లి చేయమంటాడు. బీరప్పకు తన కూతురును ఇచ్చి పెళ్లి చేయటం ఇష్టం లేని కలినారాయణ అతనికి పలు పరీక్షలు పెడతాడు. కలినారాయణ పెట్టిన ప్రతి పరీక్షలో బీరప్ప విజయం సాదించి కన్నికామవ్వను పెళ్లి చేసుకుంటాడు. బీరప్ప,కన్నికామవ్వను పెళ్లి చేసుకున్న తరువాత కొంత కాలం పాటు సుఖంగా జీవిస్తాడు. ఈ మధ్య కాలంలో బీరప్ప కొంకణ్, కర్నాటకలోని బయలుసీమ ప్రాంతంలో ప్రజలను కష్టపెడుతున్న పలువురు అసురులను హతమారుస్తాడు. కొంత కాలం తరువాత బీరప్ప శివుడి ద్వారా జ్ఞాన సముపార్జన కోసం ఘోరమైన తపస్సు చేస్తాడు. పరమ శివుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకోవాలని సూచించగా తన ఆత్మజ్ఞానాన్ని పంచేందుకు సమర్థుడైన శిష్యుడిని ప్రసాదించాలని బీరప్ప కోరుతాడు. గురు గోరఖ్ నాథ్ శిష్యుడైన ఆవులు కాచే మాలింగ రాయ నీకు సరైన శిష్యుడని శివుడు సూచిస్తాడు. బీరప్ప పలు పరీక్షలు జరిపిన తరువాత మాలింగ రాయను తన శిష్యుడుగా స్వీకరిస్తాడు. నాథ్ సంప్రదాయాన్ని ప్రారంభించిన గురు గోరఖ్ నాథ్ ఆఫ్ఘానిస్తాన్ నుండి అస్సాం వరకు, నేపాల్ నుండి శ్రీలంక వరకు పర్యటించి నాథ్ సంప్రదాయాన్ని వ్యాపింపచేస్తాడు. గురు గోరఖ్ నాథ్ హట యోగను ప్రాచుర్యంలోకి తెచ్చిన మహానుభావుడు. తాంత్రిక్ బౌద్ధంలోని ఎనభై నాలుగు మంది మహా సిద్దులలో గురు గోరఖ్ నాథ్ ఒకరు.

ప్రొఫెసర్ ఎం.ఎల్.కె.మూర్తి, ప్రొఫెసర్ గున్థర్ డి. సొంథిమేర్ కర్ణాటకలోని కురుబ వర్గం ప్రజలపై పరిశోధన జరిపిన అనంతరం రాసిన వ్యాసం ప్రకారం:

ఆదిరెడ్డి, ఆదేమ్మల ఏడో సంతానం బీరప్ప, బీరప్ప మొదటి పేరు ఎలనాగిరెడ్డి,(ఆదిరెడ్డి, ఎలానగిరెడ్డి పేర్లలోని రెడ్డి పదం ప్రస్తుతం చెలమణిలో ఉన్న రెడ్డి కులం కాదు. వాస్తవానికి రెడ్డి అనేది ఒక కులాన్ని సూచించే పదం కాదు. గ్రామ పెద్దను, గ్రామానికి నాయకత్వం వహించే వ్యక్తికీ ఇచ్చే హెూదా పేరు "రెడ్డి") పరమ శివుడి వర పుత్రుడైన ఎలనాగిరెడ్డి కి అతీంద్రీయ శక్తులు ఉంటాయి. అతని అరచేతిలో వైకుంఠ రేఖ ఉంటుంది, అతని వీపుపై వింజామరి ఉంటే బొడ్డులో అమృత రేఖ, తలపై నాగుపాము కిరీటము ఉంటాయి. బీరప్ప ఏడూ గ్రామాలకు పాలకుడుగా పని చేసేవాడు. అతీంద్రీయ శక్తులు ఉన్న ఎలనాగిరెడ్డి అంటే అతని సోదరులకు ఎంత మాత్రం గిట్టేది కాదు. అందుకే వారు అతన్ని హతమార్చేందుకు కుట్ర పన్నుతారు. శ్రీశైలం ప్రాంతంలోని బలపాలపల్లె కు ఉత్తరాన ఉన్న వంద ఎకరాల భూమిని స్వంత ఎద్దులతో దున్నుకోవాలని ఆరుగురు అన్నలు అతన్ని శాసిస్తారు. ఎలనాగిరెడ్డి దున్న వలసిన భూమిలో 'మునిమోదకమాను' అనే చెట్టు ఉంటుంది. ఈ మునిమోదకమాను చెట్టు కింద 'మునిమోదకమాను పుట్ట'

ఉంటుంది. పరమ శివుడు ఈ మునిమోదకమాను చెట్టు ప్రాంతాన్ని రక్షించేందుకు ఒక బ్రహ్మ రాక్షసిని చెట్టు పుట్టలో ఏర్పాటు చేసాడన్నది స్థానికుల విశ్వాసం. ఎలనాగిరెడ్డి బలపాలపల్లె ప్రాంతంలోని వంద ఎకరాల భూమిని వ్యవసాయ యోగ్యం చేసే పనిలో భాగంగా మునిమోదకమాను పుట్టను తొలగిస్తాడు, తన పుట్టను తొలగించినందుకు ఆగ్రహం చెందిన బ్రహ్మ రాక్షసి ఎలనాగిరెడ్డిని చంపివేస్తుందని ఆరుగురు సోదరులు అంచనా వేస్తారు. ఆరుగురు అన్నల కుట్ర గురించి ఏ మాత్రం తెలియని ఎలనాగిరెడ్డి భుజంపై గొడ్డలి పెట్టుకుని తనకు కేటాయించిన భూమిని చదను చేసేందుకు వెళతాడు. ఆరుగురు అన్నలు అంచనా వేసిన విధంగానే ఎలనాగిరెడ్డి భూమిని చదను చేసే ప్రక్రియలో భాగంగా మునిమోదకమాను చెట్టును నరికేందుకు ఉద్యుక్తుడవుతాడు. ఎలనాగిరెడ్డి మునిమోదకమాను చెట్టును నరికేందుకు తన గొడ్డలిని ఎత్తగానే బ్రహ్మ రాక్షసి పిల్లలు అతనిపై దాడి చేస్తాయి. ఎలనాగిరెడ్డి వారిని గండ్ర గొడ్డలితో నరికి వేయటంతో బ్రహ్మ రాక్షసి శివుడి వధకు వెళ్లి ఫిర్యాదు చేస్తుంది. ఎలనాగిరెడ్డి తన వరపుత్రుడు కాబట్టి వివాదాస్పద భూమి ఇకమీదట అతనికే చెందుతుందని పరమ శివుడు స్పష్టం చేయటంతో బ్రహ్మ రాక్షసి తోక ముడుస్తుంది.

అంతకు కొంత కాలం ముందు కైలాసం లో పార్వతి తనకు ఒక గొర్రె కావాలని శివుడిని కోరుతుంది. పార్వతి ఆనందం కోసం పరమ శివుడు జంట గొర్రెలను పుట్టిస్తే అవి కాల క్రమంలో ఇబ్బడి,ముబ్బడిగా పెరిగిపోయి కైలసమంతా నిండిపోతాయి. కైలాసాన్ని మురికితో నింపిన గొర్రెలను శివుడు మినిమోదకమాను పొలంలో ఏర్పాటు చేసిన భిలం ద్వారా నాగ లోకంలోకి పంపించి దాని దారిని ఒక పెద్ద బండరాయితో ముసివేస్తాడు. ఎలనాగిరెడ్డి పొలాన్ని చదును చేసే సమయంలో అతని నాగలి తగిలి నాగలోకం దారిని ముసి ఉంచిన బండ రాయి కనిపిస్తుంది. ఎలనాగిరెడ్డి కుతూహలంతో బండ రాయిని తొలగించి చుస్తే అందులో పెద్ద సంఖ్యలో గొర్రెలు కనిపిస్తాయి. ఈ దశలో శంకరుడు అక్కడ ప్రత్యక్షమై గొర్రెలను మేపుకోవాలని బీరప్పతో చెబుతాడు. గొర్రెలతో వెనకకు తిరిగి చూడకుండా పశ్చిమంలో ఉన్న కళ్యాణపట్టణానికి వెళ్ళాలని శివుడు అతన్ని ఆదేశిస్తాడు. వెనకకు తిరిగి చుస్తే గొర్రెలు నాగ లోకం నుండి బైటికి రావటం నిలిచి పోతుందని హేచ్చరిస్తాడు. నాగలోకం నుండి బైటికి వచ్చే గొర్రెల్లో ఒక బంగారు గొర్రె , ఒక బంగారు పొట్టేలు ఉన్నాయి, అవి అన్నింటి కంటే ఆఖరున బైటికి వస్తాయి, నీవు వెనకకు తిరిగి చూస్తే బంగారు గొర్రె, పొట్టేలు లోపలే ఉండిపోతాయని బీరప్పను శివుడు హెచ్చరిస్తాడు. పరమ శివుడి ఆదేశం మేరకు ఎలనాగిరెడ్డి ముందుకు సాగుతూ మధ్యలో

దురదృష్టం కొద్ది వెనకకు చూస్తాడు. దానితో నాగ లోకం నుండి అప్పుడే బైటకి వస్తున్న బంగారు గొర్రె, బంగారు పొట్టేలు లోపలికి వెళ్లిపోతాయి. ఎలనాగిరెడ్డి చేసిన తప్పుకు చింతిస్తూ అక్కడే కూర్చుండి పోగా శివుడు మరోసారి ప్రత్యక్షమై నాగలోకం నుండి బైటికి వచ్చిన గొర్రెలను తీసుకుని కళ్యాణపట్టణానికి వెళ్ళాలని ఆదేశిస్తాడు. ఎలనాగిరెడ్డి గొర్రెల మందతో కళ్యాణపట్టణం పొలిమెరలకు చేరగానే సైనికులు వచ్చి పట్టణంలోకి ప్రవేశించకూడదన్న రాజాజ్ఞను తెలియజేస్తారు. దీనితో ఎలనాగిరెడ్డి దాదాపు పన్నెండు సంవత్సరాల పాటు సమీపంలోని అడవిలో తన గొర్రెలను మేపుకుంటూ సంచార జీవితం గడుపుతాడు.

కళ్యాణపట్టణం ప్రజలంతా శైవులు. నగరంలోని ప్రతి ఒక్కరు లింగాన్ని ధరించటంతో పాటు తాము ఉపయోగించే ప్రతి వస్తువుకు లింగాన్ని కడతారు. పశువులకు సైతం లింగం వేలాడదిస్తాడు. శివుడి వాహనమైన నంది ప్రతి రోజు కైలాసం నుండి కళ్యాణ పట్టణానికి వచ్చి నగర ప్రజల పూజలు అందుకున్న తరువాత తిరిగి కైలసానికి వెళ్ళిపోతూఉంటుంది. కళ్యాణపట్టణానికి చెందిన వారంతా వ్యాపారస్తులు అందుకే వారితో పాటు వారి రాజుకు కుడా గొర్రెలంటే గిట్టదు. అందుకే కళ్యాణ పట్టణం రాజు ఎలనాగిరెడ్డిని పట్టణంలోకి రానివ్వడు. గొర్రెలు కాచే వారంతా అపరిశుభ్రంగా ఉంటారన్నది వారి అభిప్రాయం.

తన వరంతో పుట్టి తన ఆదేశం మేరకు కళ్యాణ పట్టణానికి వచ్చిన ఎలనాగిరెడ్డి పన్నెండు సంవత్సరాల పాటు అడవిలో సంచార జీవితం గడపటం కైలాసం నుండి చూస్తున్న శివుడికి బాధ కలిగిస్తుంది. ఎలనాగిరెడ్డికి కళ్యాణ పట్టణంలో స్థానం కల్పించటం ద్వారా అతను సుఖంగా జీవించేలా చేయాలని శంకరుడు నిర్ణయించుకుంటాడు. ఎలనాగిరెడ్డికి కళ్యాణ పట్టణంలో ప్రవేశం కల్పించేందుకు శంకరుడు ఒక వ్యూహం పన్నుతాడు. శివుడి నిర్ణయం మేరకు ఎలనాగిరెడ్డికి చెందిన ఒక గొర్రెపోతుతో పాటు కళ్యాణ పట్టణంలో పూజలందుకుంటున్న నంది ఒకే రోజు ఏక కాలంలో మరణిస్తాయి. శంకరుడి వాహనమైన శివుడి నంది మరణించటంతో కళ్యాణ పట్టణం రాజు, ప్రజలు దిగ్భ్రాంతికి గురి అవుతారు. పూజలు చేస్తున్న సమయంలో నంది మరణించటంతో వారంతా భయపడిపోతారు. నందిని బతికించుకోవాలనే ఆలోచనతో వారంతా భజనలు చేయటం ప్రారంభిస్తారు.

అడవిలో గొర్రె పోతు మరణించగానే ఎలనాగిరెడ్డి కి శివుడు ప్రత్యక్షమై మృత పొట్టేలు మాంసం, ఉన్నిని కళ్యాణ పట్టణం ప్రజలకు విక్రయించాలని ఆదేశిస్తాడు.

పరమ శివుడి ఆదేశం మేరకు ఎలనాగిరెడ్డి తన ఏడుగురు కొడుకులతో కలిసి మృత పొట్టేలును తీసుకుని కళ్యాణ పట్టణానికి వెళతాడు. అయితే ఈ సారి కుడా కళ్యాణ పట్టణం రాజు వారి ప్రవేశాన్ని నిషేదిస్తాడు. దీనితో కలత చెందిన ఎలనాగిరెడ్డి నగరం పొలిమేరలో మృత పొట్టేలును చితిపై పెట్టి నిప్పంటిస్తాడు. చితి మంటల నుండి లేచిన పొగ కళ్యాణ పట్టణాన్ని కప్పి వేస్తుంది. నగర ప్రజలు నందికి ప్రాణం పోసి బతికించాలని శివుడిని ప్రార్థిస్తున్న సమయలో పొట్టేలు దహన పొగలు కళ్యాణ పట్టణాన్ని కప్పివేయటం నగర ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తుంది. నందిని బతికించుకునేందుకు చేస్తున్న పూజలను అపవిత్రం చేస్తున్న పొట్టేలు దహనాన్ని నిలపకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయంటూ కళ్యాణ పట్టణం ప్రజలు ఎలనాగిరెడ్డిగిని హెచ్చరించటంతో పాటు అతనితో ఘర్షణకు దిగుతారు. ఎలనాగిరెడ్డి కళ్యాణ పట్టణం ప్రజల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఒక సవాల్ విసురుతాడు. 'మీరు నందికి ప్రాణం పోయలేక నేను పొట్టేలును బతికించుకోగలిగితే నేనిచ్చే గొర్రె మాంసం, ఉన్ని కంబల్లను మీరు తీసుకోవాలి' అని ఆయన షరతుతో కూడిన సవాలి విసురుతాడు. కళ్యాణ పట్టణం ప్రజలు నందిని బతికించేందుకు ఎంతో శ్రద్ధతో పూజలు చేస్తారు, సంగీత వాయిద్యాలతో నృత్యం చేస్తూ పూజించినా నందిని బతికించలేక పోతారు. నందిని బతికించుకోవటంలో విఫలమైన కళ్యాణ పట్టణం ప్రజలు పొట్టేలుకు ప్రాణం పోసి చూపించాలని బీరప్పను డిమాండ్ చెస్తారు. ఎలనాగిరెడ్డి అంటించిన మంటలో కాలగా మిగిలిన పొట్టేలు భాగాలను బైటికి తీసి వాటిని ముక్కలుగా నరికేందుకు ఒక చెక్క బల్ల కావాలని అడుగుతాడు. కళ్యాణ పట్టణంలోని ప్రతి వస్తువుకు లింగం కట్టి ఉంటుంది కాబట్టి ఒక్కటి కుడా ఇవ్వలేమని స్పష్టం చేస్తారు. లింగం కట్టిన వస్తువు ఇస్తే అపవిత్రం అవుతుందన్నది వారి అభిప్రాయం. నగరం ముఖ ద్వారం తొలగించి దానికి ఉన్న లింగం తొలగించి తనకు ఇవ్వాలని ఎలనాగిరెడ్డి సూచిస్తాడు. కళ్యాణ పట్టణం ప్రజలు ఏంతో ఆలోచించిన తరువాత చివరకు అంగీకరిస్తారు. ఎలనాగిరెడ్డి తలుపును బల్లగా చేసుకుని పొట్టేలు భాగాలను ముక్కలుగా కొడతాడు. తరువాత వాటిని ఒక పెద్ద కుండలో వేసి వండటం ప్రారంభిస్తాడు. కైలాసం నుండి అన్నీచూస్తున్న పరమ శివుడు ఎలనాగిరెడ్డి విజయం కోసం రేవన సిద్దేశ్వరుడిని అతని వద్దకు పంపిస్తాడు. రేవనసిద్దేశ్వరుడు తన మంది,మార్బలంతో అక్కడికి వెళుతూ కుంకుమ, పసుపు కొనేందుకు కళ్యాణ పట్టణం నగరంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆగుతాడు. అయితే అక్కడి దుకాణాల్లో వ్యాపారస్తులు వజ్రాలు, వైడుర్యాలు అమ్ముతుంటారు తప్ప కుంకుమ, పసుపు విక్రయించరు. తమ వద్ద కుంకుమ, పసుపు లేదని వ్యాపారస్తులు చెబుతారు. మీ వద్ద కుంకుమ, పసుపు ఉన్నాయి చూసుకోండి అని

రేవన సిద్దేశ్వరుడు చెబితే వ్యారస్తులు అయిష్టంగానే సంచుల్లో చుస్తే వజ్రాలు, వైడుర్యాలు ఉండవలసిన చోట కుంకుమ, పసుపు ఉంటాయి. రేవన సిద్దేశ్వరుడి మహిమ గ్రహించిన కళ్యాణ పట్టణం వ్యాపారస్తులు అతనికి క్షమాపణ చెబుతారు. రేవన సిద్దేశ్వరుడు వారి నుండి కొద్దిగా కుంకుమ, పసుపు తీసుకుని వజ్రాలు, వైడుర్యాలు వారికి ఇచ్చివేసి ఎలనాగిరెడ్డి వద్దకు బయలుదేరుతాడు.

రేవణ సిద్దేశ్వరుడు వస్తున్న విషయాన్ని దూరం నుండే చూసిన ఎలనాగిరెడ్డి అతని ఏడుగురు కొడుకులు ఆనందంతో డోలు వాయిస్తూ నృత్యం చేస్తూ పెద్ద ఎత్తున ప్రార్థిస్తారు. రేవణ సిద్దేశ్వరుడు అక్కడికి చేరుకున్న వెంటనే కుండలోని పొట్టేలు ముక్కలపై కుంకుమ, పసుపు చల్లుతాడు. ఎలనాగిరెడ్డి, ఆయన కొడుకుల నృత్యం, ప్రార్థనలకు రేవన సిద్దేశ్వరుడి మహిమ తోడువుతాయి. రేవణ సిద్దేశ్వరుడు కుంకుమ, పసుపు చల్ల గానే కుండలోని మక్కలు ఒకటితో మరొకటి కలిసిపోయి గొర్రె పోతుగా మారిపోతాయి. గొర్రె పోతు కుండ నుండి బైటికి దూకి కళ్యాణ పట్టణంలో ఉన్మాదంతో పరుగులు పెడుతుంది. దారిలో తనకు ఎదురుగా వచ్చిన వారందరిని కొమ్ములతో పొడిచి చంపటంతో పాటు నగరాన్ని ధ్వంసం చేస్తుంది. గొర్రెపోతు సృష్టిస్తున్న బీభస్తానికి కళ్యాణపట్టణం రాజు భయపడి తనను తాను రక్షించుకునేందుకు సూదిగుండు రాయి ఎక్కి కూర్చుంటాడు. కళ్యాణ పట్టణం రాజు వెంట పడిన గొర్రె పోతు సూదిగుండురాయిని తలతో ఢీకొడుతుంది. గొర్రెపోతు దాడికి సూదిగుండురాయి కదలటంతో భయపడిన రాజు గొర్రెపోతును అదుపు చేయాలని ఎలనాగిరెడ్డిని కోరుతాడు. గొర్రె పోతును అదుపు చేస్తే గొర్రె మాంసం, ఉన్ని, గొంగల్లను కొనటంతో పాటు కురుబ సంప్రదాయాన్ని పాటిస్తామని ఎలనాగిరెడ్డికి కళ్యాణపట్టణం రాజు హామీ ఇస్తాడు. అతీంద్రియ శక్తులు ఉన్న గొర్రె పోతును అదుపు చేసే శక్తి ఎలనాగిరెడ్డికి కూడా ఉండదు. అతీంద్రియ శక్తులు ఉన్న రేవణ సిద్దేశ్వరుడు తన బంగారు కర్రతో నేరుగా ఉన్న పొట్టేలు కొమ్ములను వంకర చేస్తాడు. కొమ్ములను వంకరగా చేయటంతో పొట్టేలు మరణిస్తుంది. రేవన సిద్దేశ్వుడు పొట్టేలు కొమ్ములను వంకర చేసినప్పటి నుండి పుట్టుకతోనే పొట్టేల్ల కొమ్ములు వంకరగా ఉండటం ప్రారంభమైందని కురుమ, కురుబ కులం ప్రజలు విశ్వసిస్తారు. ఎలనాగిరెడ్డి గొప్పతనాన్ని గ్రహించిన కళ్యాణపట్టణం ప్రజలు తమ లింగాలను నీటిలో పడవేసి అయన మతం పుచ్చుకుంటారు. దీనికి అంగీకరించని లింగాయతులు శ్రీశైలానికి వలసపోతారు.

పరమ శివుడి అనుగ్రహం పొందేందుకు ఎలనాగిరెడ్డి బిరుదులు అంటే సంగీత

వాయిద్యాలతో ప్రార్థన చేయటం ప్రారంభిస్తాడు. కళ్యాణపట్టణం ప్రజలు విసిరిన సవాలును సాదించేందుకు ఎలనాగిరెడ్డి బిరుదులను ఉపయోగిస్తాడు కాబట్టే శివుడు ఎలనాగిరెడ్డిని బీరదేవ అనే బిరుదుతో సత్కరించాడని కొందరు అంటారు. బీరదేవుడి కురుమ, కురుబ తదితరులందరు ముద్దుగా బీరప్ప అని పిలుచుకుంటారు. ఇదిలా ఉంటే ఆంధ్ర ప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాలకు చెందిన కురువలు తమని తాము ఎలనాటి కాపులుగా చెప్పుకుంటారు.

బిరుదులపై వివరణ

బీరదేవ, బీరప్ప, బీరోబా అనే పేరు ఎలా వచ్చిందనే అంశంపై పలు వాదనలు ఉన్నాయి. బీరదేవ అనేది వీరదేవ అనే పదం నుండి పుట్టిందనేది ఒక వాదన. వీరుడు బీరుడుగా మారిందన్నది వీరి వాదన. బీరప్ప వీరభద్రుడు ఒకరే అని భావించే కర్ణాటకలో ఈ వాదన బలంగా ఉన్నది. దక్షిణ మహారాష్ట్రకు చెందిన ధనగర్ (గొర్రెల కాపర్లు) బీర దేవుడిని యాభై రెండు సంగీత వాయిద్యలతో (బిరుదులు) ముడిపెడతారు. ఈ యాభై రెండు సంగీత వాయిద్యాలు ధనగర్ సంస్కృతికి సంబందించిన మాయా వస్తువులన్నది వారి విశ్వాసం. ఈ సంగీత వాయిద్యాలలో డోలు అత్యంత ముఖ్యమైనది. యాభై రెండు దైవాంశ ఆత్మలు బీరోబా అదుపులో ఉంటాయనేది మరో నమ్మకం.

మహారాష్ట్రలో బీరోబా

పూర్వ కాలంలో కాట్యా అనే కుమ్మరి ఉండే వాడు. ఆతను తొమ్మిది వందల వేల కుండలు చేసి మళ్లీ వాటిని పగలగొట్టే వాడు. కాట్యా ఇలా పలుమార్లు చేసిన తరువాత



తన చేతిలోని మట్టితో ఒక బొమ్మను చేస్తాడు. ఈ బొమ్మను తాను జాగ్రత్తగా చుసుకోలేనని భావించిన కాట్యా దానిని ఒక బంగారు పెట్టెలో పెట్టి మూతబిగించి దానికి తాళం వేస్తాడు. కాట్యా ఆ పెట్టెను మానవలోకం లోని మండేస్‌లోకి విసిరి వేస్తాడు. మాన్ నది ప్రవహించే మండేస్ మహారాష్ట్రలోని ఒక ప్రాంతము. బంగారు పెట్టె భూమి వైపు ప్రయాణం చేస్తున్న సమయలో దానికి గొంతు వస్తుంది. బంగారం పెట్టె భూమాతతో మాట్లాడటం ప్రారంభిస్తుంది. ఓ భూమాతా నీవు నా తల్లివి కావాలి, నన్ను కాపాడాలి అంటూ మొర పెట్టుకుంటుంది. అది చైత్ర మాసం ఎండా కాలం, భూమి నెర్రెలు బాసింది. ఆకాశం నుండి పడుతున్న బంగారం పెట్టె ఒక పెద్ద నెర్రెలో పడిపోతుంది. బంగారు పెట్టె పడగానే నెర్రె ముసుకుపోతుంది. ఇదిలా ఉంటే ధర్మ అనే స్థానిక రాజు తన సేవకులు సర్వాన్, నారాయణ్ లను పిలిచి పొలంలోని పెద్ద చెట్లను నరికివేసి దున్నటం ప్రారంభించాలని ఆదేశిస్తాడు. (ఇక్కడ ప్రస్తావనకు వచ్చిన ధర్మ రాజు పేరు తరువాత ధూర్తిరాజుగా మారుతుంది.) ధర్మరాజు ఆదేశించగానే సర్వాన్, నారాయణ్‌లు తమ పనిముట్లు, ఎద్దులను తీసుకుని పొలానికి వెళతారు. సర్వాన్, నారాయణ్ పొలానికి వెళ్లి మొదట వారు నాగలికి పన్నెండు ఎద్దులను కట్టి దున్నేందుకు ముందు గణపతిని ప్రార్థిస్తారు. సర్వాన్, నారాయణ్ లు చర్నకోలతో ఒక దెబ్బ కొట్టగానే పన్నెండు ఎద్దులు ఒకేసారి నాగలిని లాగటం ప్రారంభిస్తాయి. ఎద్దులు కొంత దూరం వెళ్ళగానే నాగలి ములుకు భూమీలోని బంగారు పెట్టెకు తగులుతుంది. నాగలి ములుకు భూమిలోని బంగారు పెట్టెకు తగలగానే ఎద్దుల కాడి విరిగి పడుతుంది. కాడి విరిగిపోగానే పన్నెండు ఎద్దులు పన్నెండు దిక్కులకు పరుగలు తీస్తాయి. నాగలి భూమిలో ఇరుక్కుపోయి కాడే విరిగి ఎద్దులు పారిపోవటంతో భయానికి గురైన సర్వాన్, నారాయణ్ లు రాజు దగ్గరికి పరుగులు తీస్తారు. రాజు దర్బార్ లోకి పరుగు,పరుగున వచ్చిన సర్వాన్, నారాయణ్ లు ఆయాసంతో రొప్పుతూ "ఓ ధూర్తిరాజా నాగలి భూమిలో ఇరుక్కుపోయింది, కాడి విరిగిపోవటంతో ఎద్దులు చెల్లాచెదురైపోయాయని" చెబుతారు. పన్నెండు ఎద్దులు లాగుతుంటే నాగలి ఎందుకు ఇరుక్కు పోయింది, కాడి ఎందుకు విరిగిపోయింది, ఎద్దులు ఎందుకు లాగలేకపోయాయి, అవి ఎందుకు చెల్లాచెదురై పోయాయి అనేది మాకు అర్థం కాలేదు, మీరే వచ్చి చూడాలి అని రొప్పుతూ చెబుతారు. ధూర్తిరాజు ఇది విన్న తరువాత నాగలి ఇరుక్కున్న చోట మట్టిని తవ్వి చూడాలని అని ఆదేశిస్తాడు. రాజు ఆదేశం మేరకు సర్వాన్ , నారాయణ్‌లు పార, గంపతో పొలానికి వెళతారు. వారు మొదట భూమిలో ఇరుక్కున్న నాగలిని పక్కకు తొలగించి తవ్వటం ప్రారంభిస్తారు. నాగలి ఇరుక్కున్న చోట కొంత లోతులోకి తవ్వగానే అక్కడ వారికి ఒక బంగారు పెట్టె

కనిపిస్తుంది. పెట్టెను చూడగానే 'ఇది మన రాజుగారి పూర్వికులు పాతి పెట్టిన నిధి అయి ఉంటుంది, ఇందులో బంగారం, వెండి, నగలు, నాణాలు ఉండవచ్చు, దీనిని రాజుగారికి ఇవ్వటం మంచిదని వారు భావిస్తారు. సర్వాన్, నారాయణ్‌లు పెట్టెను తెచ్చి ధుర్తి లేదా ధర్మ రాజుకు అందజేస్తారు. మీ పూర్వికులు పాతిపెట్టిన నిధి ఇది, పెట్టె తాళాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోండి, లేకపోతే మా పై నింద పడుతుందని రాజుతో చెబుతారు. ధర్మ రాజు తన ముందు పెట్టిన బంగారంపెట్టెను తెరిచి చూసేందుకు ప్రయత్నిస్తాడు. పెట్టెను తెరిచేందుకు రాజు చేసిన ప్రయత్నం ఫలించదు. దీనితో పెట్టెను బలవంతంగా తెరిచేందుకు ప్రయత్నిస్తారు. ఎవరు ఎంత ప్రయత్నించినా బంగారు పెట్టె తెరుచుకోదు. దీనితో పెట్టెను తెరువగలిగేవారు ఎవరైనా ఉన్నారా అంటూ ధర్మ రాజు భూమీ మీదున్న తొమ్మిది ఖండాలతో పాటు పడవ ఖండమైన కాశీకి కూడా ఒక సందేశం పంపిస్తాడు. ధర్మ రాజు సందేశం చూసిన వెంటనే ప్రపంచం నలుమూలల నుండి కంసాలురు ఆయన నగరానికి వస్తారు. వారంతా బంగారు పెట్టెను తెరిచేందుకు ప్రయత్నించి విఫలమైన తరువాత రాజుతో ' ఏమి పెట్టె ఇది, తాళం తెరుచుకోదు, పెట్టె తెరుచుకోదు, ఏమిటీ వస్తువు ? అంటూ ప్రశ్నలు కురిపిస్తారు. కంసాలులుబంగారుపెట్టెనుతెరిచేందుకుపలుమార్లుప్రయత్నించివిఫలమైఇక చేయగలిగింది ఏమి లేక కూర్చుండి పోతారు. వారంతా పెట్టెను తెరిచే ప్రయత్నంలో అలిసిపోయి ' ఓ పరమేశ్వరుడా ఈ పెట్టెను ఎలా తయారు చేశారు? ఎవరు తయారు చేశారు? ధర్మ రాజు దేశానికి ఎందుకు వచ్చింది ? అంటూ ప్రశ్నించుకుంటారు. ఈ పెట్టెను తెరిచేందుకు తొమ్మిది ఖండాల నుండి ఇక్కడికి వచ్చాము, దీనిని తెరిచేందుకు ఎంతో ప్రయత్నించాము కాని తెరవలేకపోయాము' అంటూ పరమేశ్వరుడికి తమ బాధను చెప్పుకుంటారు. ఓ శంకరుడా మానవులు నివసించే భూమికి పంపించిన ఈ పెట్టెలో ఏమున్నది ? అని అడుగుతారు. బంగారు పెట్టె ఎందుకు తెరుచుకోవటం లేదు అనే అంశంపై వారంతా చర్చించుకుంటారు. కంసాలురందర్లో పెద్దవాడైన తాటోబా పుట్టు గుడ్డి, పుట్టుకతో అవిటివాడు. అతనికి ఒక చేయి లేదు. తాటోబా బంగారు పెట్టె వద్దకు వెళ్లి దానిని పగలగొట్టేందుకు ఒక సుత్తి పైకి ఎత్తగానే అది మాట్లాడటం ప్రారంభిస్తుంది. ' ఓ కంసాలి తాటోబా సుత్తితో మెల్లిగా కొట్టు ' అని బంగారు పెట్టె అతనితో చెబుతుంది. తాటోబా ఒక చిన్న ఉలి తీసుకుని దానితో పెట్టెను కొట్టటం ప్రారంభిస్తాడు. అప్పుడు బంగారు పెట్టెలోని గొంతు మరో సారి మాట్లాడుతుంది. 'పెట్టెను తెరిచేందుకు ప్రయత్నిస్తున్న నీవు ఈ రోజు చాలా జాగ్రత్తగా ఆలోచించాలి, జాగ్రత్తగా ఆలోచించి పెట్టెను తెరవాలి' అని చెబుతుంది. ' నీవు సుత్తిని చాలా జాగ్రత్తగా

ఉపయోగించాలి లేకపోతే నాకు దెబ్బ తగలవచ్చు ' అని ఆ గొంతు తాటోబాను హెచ్చరిస్తుంది. తటోబా బంగారం పెట్టెపై ఉలి పెట్టి సుత్తితో మెల్లగా కొట్టటం ప్రారంభిస్తాడు. అప్పుడు పెట్టెలోని గొంతు మరోసారి మాట్లాడుతూ 'నీవు బాగా ఆలోచించిన తరువాతనే పెట్టెను తెరవాలి' అని చెబుతుంది. కంసాలి తన సుత్తితో ఒక చిన్న దెబ్బ కొట్టగానే తాళం ఊడిపడుతుంది. ధూర్తి రాజు సభలో ఉన్న ప్రజలందరి సమక్షంలో పెట్టెను తెరుస్తాడు. పెట్టెలో బంగారు కురులతో ధగధగ మెరిసిపోతున్న బాలికను చూసి అందరు ఆశర్యపోతారు. ధూర్తిరాజును చూసి అ బాలిక చిరునవ్వులు చిందిస్తుంది, కాళ్ళు, చేతులు ఊపుకుంటూ ఆడుతుంది. బంగారువన్నెతో ఉన్న ఆ బాలికను ధూర్తి రాజు, ఆయన భార్య పెంచుకోవాలని నిర్ణయించుకుంటారు. శివుడికి తాము పన్నెండు సంవత్సరాల నుండి చేస్తున్న పూజకు ప్రతిఫలంగా ఈ బాలికను ఇచ్చాడని రాజు భార్య ప్రకటిస్తుంది. ధూర్తిరాజు ఆమె అభిప్రాయంతో ఏకీభవిస్తూ బాలికకు గంగా సూరవంతి అనే పేరు పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచుకుంటారు.

కాల క్రమంలో గంగా సూరవంతికి యుక్త వయస్సు రాగానే ఆమెకు పెళ్లి చేయాలని ధూర్తిరాజు, రాణి నిర్ణయించుకుంటారు. ఈ విషయం తెలియగానే గంగా సూరవంతి జుట్టు పీక్కుంటూ ఏడవటం ప్రారంభిస్తుంది. ఆమె ఆ తరువాత తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పెళ్లి చేసుకోవటం తనకు ఇష్టం లేదని చెబుతుంది. ఆకాశంలో సూర్యుడు, చంద్రుడు ఉన్నంత కాలం తాను పెళ్లి చేసుకోనని ప్రకటిస్తుంది. మనుషులు జీవించే ఈ భూమిపై పెళ్లి చేసుకోవటం తనకు ఇష్టం లేదని తల్లిదండ్రులకు స్పష్టం చేస్తుంది. పెళ్లి చేసేందుకు ప్రయత్నిస్తే మిమ్మల్ని శత్రువులుగా భావిస్తానని గంగా సూరవంతి హెచ్చరిస్తుంది. మీరు నా తండ్రి కాదు శత్రువు అని గంగా సూరవంతి అంటుంది. దీనితో ఆగ్రహం చెందిన ధూర్తిరాజు ఆమెను అడవికి పంపి చంపించివేయాలని అనుకుంటాడు. ఈ పిల్ల ఇప్పుడే ఇలా మాట్లాడుతోంది పూర్తిగా పెద్దైన తరువాత రాజ్యాన్ని నాశనం చేసి తానూ జులాయిగా మారిపోతుందని ధూర్తి రాజు ఆందోళన చెందుతాడు. ఆ వెంటనే సేవకులను పిలిచి దట్టమైన అడవిలో ఏడు అంతస్తుల ఒంటి స్తంభంమేడ నిర్మించాలని ఆదేశిస్తాడు. ఏడు అంతస్తుల ఒంటి స్తంభం మేడ సిద్ధం కాగానే గంగా సూరావంతిని అందులో బందిస్తాడు. సూరవంతికి సేవ చేసేందుకు ఇద్దరు సేవికలను నియమిస్తాడు. ఇదంతా మరమేశ్వరుడి లీల అని అనుకుంటూ గంగా సూరవంతి ఏడంతస్తుల ఒంటి స్తంభం మేడలో జీవితం ప్రారంభిస్తుంది. ఏడంతస్తుల మేడలో ఒంటరి జీవితం గడుపుతున్న గంగా సూరవంతి ఒక రోజు తన మేడకు కొద్ది దూరంలో ఒక ఆవుల మంద

ఉండటం గమనిస్తుంది. ఆవులు ప్రతి రోజు ఉదయం మేత కోసం అడవి లోపలి వెళ్లి సాయంత్రం అదే చోటికి తిరిగి వస్తుంటాయి . ఆవులు పడుకునే చోటు అపరిశుభ్రంగా ఉంటుంది. గంగా సూరవంతి ఆవులు అడవిలోకి వెళ్ళిపోగానే అక్కడికి వచ్చి దానిని పరిశుభ్రం చేసి వెళుతుంటుంది. సూరవంతి ఇలా దాదాపుగా పన్నెండు సంవత్సరాలు ఆవులకు సేవ చేస్తుంది. గంగా సూరవంతి చేసిన సేవకు సంతోషించిన ఒక ఆవు ఆమె ఎప్పుడు పిలిస్తే అప్పుడు వచ్చి సహాయం చేస్తానని హామీ ఇస్తుంది.

గంగా సూరవంతి ఒక రోజు అడవిలో తిరుగుతుంటే గంధపు చెట్టుపై ఒక డేగ గూడునుచూస్తుంది.డేగగూడులోఉన్నగుడ్లనుతినేందుకుఒకత్రాచుపాము కాచుకుని కూర్చుంటుంది. త్రాచుపాము తమను తినేందుకు దగ్గరకు రాగానే గుడ్డులోని పక్షి పిల్లలు ఏడవటం ప్రారంభిస్తాయి. గంగా సూరవంతి గంధపు చెట్టును ఎక్కి ఒక మనిషంత ఉన్న త్రాచు పామును తన కత్తితో నరికివేసి డేగ గుడ్లను కాపాడుతుంది. తమ పిల్లలను కాపాడినందుకు వాటి తల్లి, దండ్రులు గంగా సూరావంతి పిలిచినప్పుడు వచ్చి సహాయం చేస్తామని హామీ ఇస్తాయి.

గంగా సూరవంతి తపస్సు

గంగా సూరవంతి ఏడంతస్తుల మేడపై భాగంలో సూర్యుని కరుణా కటాక్షం కోసం కఠిన తపస్సు మొదలు పెడుతుంది. ఆమె మొదట ఒక బంగారు ఇటుకను చేసి దాని పైభాగంలో ఒక ఇనుప మేకు కొడుతుంది. బంగారు ఇటుక పై కొట్టిన మేకుపై తన కాలి బొటన వేలుపై నిలబడి తపస్సు ప్రారంభిస్తుంది. గంగా సూరవంతి ఇనుప మేకుపై నిలబడి పన్నెండు సంవత్సరాలు ఘోరమైన తపస్సు చేస్తుంది. ఆమె ఘోర తపస్సు చేసిన పన్నెండు సంవత్సరాలు ఇనుప గుగ్గిళ్ళు, గాలి తిని బతుకుతుంది. గంగాసూరవంతి ఘోర తపస్సు ప్రభావం మూలంగా ఇంద్ర లోకం, శివుడి కైలాసం కదిలిపోతాయి. పరమ శివుడు జంగమ రూపంలో అడవిలోని ఏడు అంతస్తుల మేడ వద్దకు వచ్చి శంఖం ఊదుతాడు. గంగా సూరవంతి పై నుంచి జంగమ వేషంలో వచ్చిన శంకరుడిని చూసి తపస్సు చేస్తున్న నేను కిందికి వచ్చి మీకు బిక్ష పెట్టలేనని చెబుతుంది. దీనికి శంకరుడు బదులిస్తూ 'నన్ను గుర్తుపట్టలేదా, నేను శంకరుడిని అని చెబుతాడు. మీరు శంకర భగవానులైతే సాక్ష్యం చూపించాలి, మహాత్ కార్యం చేయాలని గంగా సూరవంతి అంటుంది. మిమ్మల్ని గుర్తించేందుకు ఆనవాళ్ళు చూపించాలని ఆమే అంటుంది. మీరు శంకర భగవానులని ఎలా నమ్మాలని గంగా సురవంతి అడుగుతుంది. అప్పుడు శివుడు

తన సంచిలో నుండి భస్మం తీసి ఏడంతస్తుల మేడపై చల్లగానే దాని తలుపులన్నీ దభాలున తెరుచుకుంటాయి. శివుడు భవనంలోకి వెళతాడు. నీవు పన్నెండు సంవత్సారాల పాటు ఘోరమైన తపస్సు చేసావు, దీనిని ఇక చాలించు. నీ తపస్సుకు మెచ్చాను, నీ కోరిక ఏమిటో చెప్పాలని పరమ శివుడు గంగా సూరావంతితో అంటాడు. కోరిన వరం ఇస్తానని శివుడు ఆమెకు హామీ ఇస్తాడు. అడిగింది ఇస్తానంటేనే అడుగుతాను, అడిగింది ఇవ్వనప్పుడు ఎందుకు అడగాలి అని సూరవంతి అంటుంది. మీరు అడిగింది ఇస్తాను అడగండి అని శివుడు బదులిస్తాడు. ఇస్తానని చెప్పటం చాల సులభం కాని ఇవ్వటం చాలా కష్టం, కాబట్టి ముందే ఆలోచించుకోండి అని సూరవంతి మరోసారి అంటుంది. ఎంత కష్టమైనది అడిగినా ఇస్తాను అడగండి అని శివుడు భరోసా ఇస్తాడు. భర్త లేకుండా కొడుకుని ఇవ్వండి అని గంగా సూరవంతి శివున్ని కోరుతుంది. వర్షం లేకుండా పద్దెనిమిది రకాల గింజలు పుట్టించండి, చెట్టుకు పువ్వులు లేకుండా ఫలాలు కాయించండి, భర్త లేకుండా నాకు సంతానం ఇవ్వండి అని గంగా సూరవంతి శివుడిని కోరుతుంది. సూరవంతి కోరికతో శంకరుడు ఆలోచనలో పడిపోతాడు. భర్త లేకుండా సంతానం ఇవ్వటం ఏమిటని తనలో తానూ అనుకుంటూ సూరమ్మతో మాత్రం తనకు నాలుగు రోజుల సమయం కావాలని అడుగుతాడు. నీకు ఇచ్చిన వరాన్ని తప్పకుండా అమలు చేస్తాను, అయితే నాకు నాలుగు రోజుల సమయం ఇవ్వాలని శివుడు ఆమెను అడిగిన అనంతరం కైలసానికి తిరిగి వస్తాడు. కైలాసంలో శంకరుడు గంగా సూరవంతి కోరిక గురించి పార్వతికి చెబుతాడు. సూరవంతి కోరిక తీర్చటం మనకు కష్టం కాదని పార్వతి చెబుతుంది. శివుడు నాలుగు రోజుల తరువాత సూరవంతి వద్దకు వచ్చి ఎద్దులతో సమాగమించని కన్నెఆవు పాలతో చేసిన నెయ్యి తీసుకురావాలి, ఏడు ఉప్పు నీటి సముద్రాలు, ఏడు మంచినీటి సముద్రాల అవతల దేవతల పత్తి ఉన్నది. ఆ దేవతల పత్తిని తీసుకురావాలి, అలా తెచ్చిన పత్తిని ఆవు నెయ్యిలో ముంచి ఐదువత్తుల దీపాన్ని తయారు చేయాలి, అలా చేసిన దీపంతో సూర్యనారాయణుడికి ఆరతి పట్టాలి అని శివుడు చెబుతాడు. మీరు సూర్యనారాయణుడికి ఆరతి పట్టే సమయంలో ఆయన ఆరతి పళ్ళెంలో వేసే వస్తువు ఆధారంగా మీకు కొడుకు పుడతాడు అని శివుడు చెబుతాడు. శివుడు పెట్టిన షరతులతో గంగా సూరవంతి ఆందోళనలో పడిపోతుంది. కన్యఆవు నుండి నెయ్యి ఎలా వస్తుంది, ఎవరు సప్త సముద్రాలు దాటి వెళ్లి దేవతల పత్తి తీసుకురాగులుగుతారు? అనే ఆలోచనలో ఆమె పడిపోతుంది. గంగా సూరవంతి ఆ తరువాత ఆవులు పడుకునే చోటికి వెళుతుంది. అక్కడ వొట్టిపోయిన ఆవును కలిసి నీకు ప్రాణ దానం చేసినందుకు బదులుగా నాకిప్పుడు నీవు సహాయం చేయాలని కోరుతుంది.

నేను ఓ వొట్టిపోయిన అవును పాలు ఎలా ఇవ్వగలను అని ఆవు ప్రశ్నిస్తుంది. కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం చేస్తానని చెప్పావు కాబట్టి పాలు ఇవ్వవలసిందేనని సూరవంతి స్పష్టం చేస్తుంది. దీనితో ఆవు శంకరుడిని వేడుకుంటుంది. వొట్టిపోయిన ఆవు శివుడి కరుణ మూలంగా గంగా సూరవంతికి పాలు ఇవ్వగలుగుతుంది. గంగా సూరవంతి ఆ పాలను సూర్య భగవానుడి వేడితో మరిగించి సాయంత్రం గాలితో తోడు పెడుతుంది. మరునాడు ఉదయం సూర్యోదయం అవుతున్న సమయంలో తన చేతిని కవ్వంగా చేసుకుని పెరుగును చిలుకుతుంది. పెరుగు నుండి వచ్చిన వెన్నను వేడి చేసి నెయ్యి తయారు చేస్తుంది. సూరవంతి ఆ తరువాత ఒంటి స్తంభం మేడ పైఅంతస్తులోకి వెళ్లి గతంలో తన మూలంగా బతికి బైట పడిన డేగ పిల్లలను పిలుస్తుంది. అవి రాగానే సప్తసముద్రాల అవతల ఉన్న దేవతా పత్తిని తీసుకురావాలని కోరుతుంది. రెండు డేగ పిల్లలు సూరవంతి కోరిక మేరకు సప్తసముద్రాలు దాటి వెళ్లి దేవతల పత్తిని తీసుకుని బయలుదేరి దారి మధ్యలో గోదుమ కంకులను కూడా పట్టుకు వస్తాయి. డేగ పిల్లలు తెచ్చిన దేవతల పత్తితో దీపం వత్తులు చేసిన తరువాత గోధుమ కంకులను రెండు చేతులతో పిండి చేసేందుకు ప్రయత్నించగానే అందులో నుండి ముత్యాలు, పగడాలు రాలుతాయి. సూరవంతి ముత్యాలు, పగడాలను కుడా పిండికొట్టి ఆ పిండితో ఏడు దీపాలను తయారు చేస్తుంది. పరమ శివుడు సూచించిన విధంగా ఏడు దీపాల్లో నెయ్యి పోసి దేవతల పత్తితో వత్తులు చేసి అందులో పెడుతుంది. ఏడు దీపాలను పళ్ళెంలో పెట్టి వెలిగిస్తుంది. గంగా సూరవంతి ఆ శుభోదయాన అరుణ కాంతులతో ఉదయిస్తున్న సూర్య భగవానుడికి ఏడు దీపాలతో ఆరతి పడుతుంది. 'ఓ సూర్య భగవానుడా , ఓ భోలా శంకరుడా , నా కోరిక తీర్చండి, నాకు సంతానం ఇవ్వండి' అంటూ ప్రార్థిస్తుంది. గంగా సూరవంతి ఆరతి పడుతూ పూజిస్తున్న సమయంలో శంకరుడు ఒక లింగాన్ని ఆమె ఆరతి పళ్ళెంలోకి జారవిడుస్తాడు. ఆరతి పళ్ళెంలోకి వచ్చిన చిన్న శివ లింగం సూర్యుని వేలుతురుతో కలిసి జలంగా మారిపోతుంది. గంగా సూరవంతి కొంత సేపు ఆలోచించిన అనంతరం పల్లెంలోని నీటిని తాగటంతో ఆమె గర్భం ధరించి తదనంతరం బీరప్పకు జన్మ ఇస్తుంది. బీరప్ప శివుడి తొలి చెమట నుండి పుడతాడని మొదట్లో పేర్కొన్నాము. అలాంటప్పుడు ఇక్కడ సూర్య భగవానుడిని పూజించటం ద్వారా బీరప్ప పుట్టినట్లు ఎలా చెబుతాము. వేదాల ప్రకారం శివుడి అనేక రూపాల్లో అగ్ని ఒకటి. అగ్ని శివుడు ఒక్కటే కాబట్టి మహారాష్ట్రలోని ధనగర్ పురాణం ప్రకారం సూరవంతి సూర్యుడిని పూజించటం వలన బీరప్ప జన్మిస్తాడని వివరించబడింది.

ఏడంతస్తుల మేడలో ఉన్న తన కూతురు సూర్యవంతి గర్భం దాల్చినట్లు సేవకుల ద్వారా తెలుసుకున్న ధూర్థరాజు కుటుంబం ప్రతిష్టను ఎలా కాపాడుకోవాలనే ఆలోచనలో పడిపోతాడు. కూతురు గర్భాన్ని విచ్ఛిన్నం చేయటం ద్వారా కుటుంబం పరువు, ప్రతిష్టను కాపాడుకోవాలనే నిర్ణయానికి వచ్చి తన భార్యను ఈ పనికి పురమాయిస్తాడు. సూరవంతి గర్భాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ఆమె తల్లి విఫల యత్నం చేస్తుంది. సల, సల మరుగుతున్న వేడి నీటిని సూరవంతి పై పోయటం ద్వారా చంపేందుకు ఆమె ప్రయత్నిస్తుంది అయితే సల,సల మరుగుతున్న నీరు పోసినా సూరవంతికీ ఎలాంటి హాని కలగదు. దీనితో సూరవంతి తల్లి హుటాహుటిన రాజభవనానికి వచ్చి ధూర్తిరాజుకు పరిస్తితిని వివరిస్తుంది. సూరవంతిని ఎలాగైనా చంపేయాలనుకున్న ధూర్తిరాజు సలసల మరుగుతున్న నూనేలో ఉన్న నాణెం తీయాలని కూతురును ఆదేశిస్తాడు. నీవు పవిత్రురాలివి అయితే ఎడమ కాలు బొటన వేలుతో నాణెం తీయాలని సవాల్ చేస్తాడు. సూరవంతి శివుడిపై భారం వేసి ఎడమ కాలు బొటన వేలుతో మరుగుతున్న నూనే నుండి నాణెం బైటికి తీసి తన పవిత్రతను చాటుకుంటుంది. ధూర్థిరాజు మాత్రం నగ్నంగా నూనే నుండి నాణెం తీయాలంటాడు. గంగా సూరవంతి మరుగుతున్న నునేలోకి దూకి ఒక చేతిలో బట్టలు మరో చేతిలో నాణెం చూపించిన తరువాత మల్లి బట్టలు వేసుకుని బైటికి వస్తుంది. గంగా సూరవంతి తండ్రి ఆదేశం మేరకు కొలిమి నుండి అప్పుడే బైటికీ తీసిన ఇనుప అయుదాలను ముద్దు పెట్టుకుని తన పవిత్రతను మరోసారి చాటుకుంటుంది. ఇంత చేసినా సంతృప్తి చెందని ధూర్థిరాజు ఆమెను అగ్నికి ఆహూతి కావాలని ఆదేశిస్తాడు. గంగా సూరవంతి మంటలో అడుగు పెట్టగానే మంటలు ఆరిపోతాయి. సూరవంతి బూడిదను నొదుట బొట్టుగా పెట్టుకుని వచ్చి ధూర్థిరాజు ముందు నిలబడుతుంది. సూరవంతిని చంపేందుకు చేసిన ప్రతి ప్రయత్నం విఫలం కావటంతో ధూర్థి రాజు ఈ సారి ఆమెను అడవికి తీసుకుపోయి తానె స్వయంగా చంపాలనుకుంటాడు. ధూర్థి రాజు అడవిలో గంగా సూరవంతిని చంపే సమయలో ఒక జ్యోతిష్యుడు అక్కడ ప్రత్యక్షమై దేవతలు రక్షిస్తున్నందున ఆమెను చంపటం సాధ్యం కాదని వెల్లడిస్తాడు. దీనితో ధూర్థిరాజు సూరవంతి ని హతమార్చే బాధ్యతను తన మంత్రికి అప్పగిస్తాడు. ధూర్థిరాజు మంత్రి గంగా సూరవంతి ని అడవికి తీసుకువెళ్ళి అక్కడ చంపేందుకు ప్రయత్నిస్తాడు. సూరవంతి ఎదురు తిరిగి నీవు నన్ను పొడిచి చంపినా ఆ రక్తంలోనే కొడుకుకు జన్మనిస్తాను, వాడు పెరిగి పెద్ద వాడై నీ పై పగ సాదిస్తాడు, నిన్ను హతమారుస్తాడు అని బెదిరిస్తుంది. ఈ బెదిరింపుకు భయపడిన మంత్రి ఆమెను అక్కడే వదిలివేసి పారిపోతాడు. సూరవంతిని మంత్రి

చంపలేకపోయాడనేది తెలుసుకున్న ధూర్థిరాజు ఈ కార్యాన్ని ఇద్దరు రాక్షసులు, ఆలసి, కలసీ కి అప్పగిస్తాడు. వారు ఏడంతస్తుల మేడలో నివసిస్తున్న గంగా సూరవంతి వద్దకు వెళ్లి ప్రసూతిలో సహాయం చేసేందుకు మీ తండ్రి పంపించాడని అబద్దం చెప్పి అక్కడ చేరిపోతారు. సూరవంతి ప్రసవించగానే పురిటిలోనే పిల్లాడిని సగం, సగం తినివేయాలని ఇద్దరు రాక్షసులు నిర్ణయించుకుంటారు. సూరవంతి గర్భంలో ఉన్న బీరప్ప ఇది గ్రహిస్తాడు. సూరవంతి ప్రసవ సమయంలో బీరప్ప సహజ పద్దతిలో బైటికి కాకుండా తన తల్లి కడుపు ఎడమ భాగాన్ని చీల్చుకుని బైటికి వస్తాడు. సూరవంతి కడుపు ఎడమ భాగం నుండి మొదట బీరప్ప రెండు కాళ్ళు బైటికి వస్తాయి. ఇద్దరు రాక్షసులు ఆలసి, కలసీ బీరప్ప కాళ్ళు తినేందుకు ప్రయత్నించగానే అయన రెండు కాళ్ళతో బలంగా తన్ని వారి పళ్ళు రాలగొడతాడు. దీనికి భయపడిన ఆలసి, కలసీ అక్కడి నుండి పారిపోయి ధూర్థికాజు వద్దకు వచ్చి అన్ని విషయాలు చెబుతారు. దీనితో మరింత ఆగ్రహించిన ఆయన బీరప్పను చంపేందుకు పన్నెండు మంది మత్స్యకారులను పురమాయిస్తాడు. బీరప్పను చంపి బాలుడి కళ్ళు తీసుకు రావాలని ఆదేశిస్తాడు. పన్నెండు మంది మత్స్యకారులు అడవిలోని ఏడంతస్తుల మేడకు వెళ్లి గంగా సూరవంతి నుండి బీరప్పను బలవంతంగా తీసుకుని అడవిలోకి వెళతారు. అడవిలో మత్స్యకారుల మనసుమారుతుంది. వారు బీరప్పను చంపకుండా ఆడవిలోనే వదిలి వేసి జింక కళ్ళను ధూర్థిరాజుకు ఇచ్చి బీరప్పను చంపి అతని కళ్ళు తెచ్చినట్లు అబద్దం చెబుతారు.

అక్క మాయవ్వ లేదా మహంకాళి, ఆమె ఆరుగురు సోదరీమణులు అడవిలో బీరప్పను చూసి పెంచుకుంటారు. అక్క మహంకాళి బీరప్పను పెంచుతుంది. మాయవ్వ లేదా అక్క మహంకాళి అ తరువాత బీరప్పను తీసుకుని బాలుభాయివాడ (బస్తి లేదా పేట)కు వెళుతుంది. బీరదేవుడు ఇక్కడే పెరిగి పెద్దవాడు అవుతాడు. బీరప్ప రజ్వాడా లో చేసిన అల్లరి పనులు శ్రీ కృష్ణుడు బాల్యంలో చేసిన అల్లరి పనుల మాదిరిగా ఉండటం గమనార్హం. రజ్వాడా మహిళలు కూడా బాలుఅక్క వద్దకు వెళ్లి బీరదేవుడి అల్లరి గురించి ఫిర్యాదు చేస్తారు. వాడ మహిళలు చేసిన ఫిర్యాదులన్ని నిజం కాదని నిరూపించిన అనంతరం బీరప్ప తల్లి ఆదేశం మేరకు ఆవులు కాయటం ప్రారంభిస్తాడు. ధూర్థిరాజు పొలాల్లో ఆవులను మేపుతాడు. తన పొలంలో బీరప్ప ఆవులను మేపటం తెలుసుకున్న ధూర్థిరాజు ఆందోళన చెందుతాడు. బీరప్ప పొలం నుండి నేరుగా రాజభవనం వద్దకు వచ్చి బైటికి రావాలంటూ రాజును సవాల్ చేస్తాడు. ధూర్థిరాజు బైటికి రాకపోవటంతో బీరప్ప ఆవులను తీసుకుని తన వాడకు వెళ్ళిపోతాడు. ధూర్థిరాజు అ తరువాత బీరప్ప పై బాలు అక్కకు ఫిర్యాదు చేస్తాడు. దీనితో పెళ్లి చేయటం ద్వారా

బీరప్పను అదుపులో పెట్టాలని ఆమె అనుకుంటుంది. బీరప్ప పెళ్లి ప్రతిపాదన గురించి తెలియగానే అక్క మహంకాళి ఆయన వద్దకు వస్తుంది. తానూ కోరుకునే విధంగా ఉండే కన్యనే పెళ్లి చేసుకుంటానని బీరప్ప చెబుతాడు. పెళ్లి చేసుకునేందుకు బీరప్ప కొన్ని షరతులు పెడతాడు. కన్య పేరు కామెన్ లేదా కామధేను ఉండాలన్నది బీరప్ప పెట్టిన షరతుల్లో ఒకటి. అక్క మహంకాళి ఈ లక్షణాలు ఉన్న కన్యను వెతికేందుకు దూతలను నాలుగు దిశలకు పంపిస్తుంది. వారు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో చూసి అలాంటి కన్య లేదని అక్క మహంకాళి కి చెబుతారు. అప్పుడు మాయవ్వ తుల్జపుర్ లోని సోదరి అంబికాదేవికి బీరప్ప ద్వారా ఒక సందేశం పంపిస్తుంది. బీరప్ప కోరుకుంటున్న లక్షణాలు ఉన్న యువతి ఎవరైనా ఉంటే అతనికి చూపించాలన్నది అ సందేశం. కసిలింగ బీరప్ప బీజాపూర్ లో తుల్జాపూర్ లోని తన సోదరి అంబికాదేవిని కలిసి ఆమె సలహా మేరకు లింబుడే పట్టణం రాజు ముంజాల్ సేన్ వద్దకు బయలుదేరుతాడు. ముంజాల్ సేన్ కూతురు కామధేను నీవు కోరుకుంటున్న యువతి అని తుల్జాపూర్ అంబికాదేవి అతనితో చెబుతుంది. కసిలింగ బీరప కాళ్ళపై తెల్లటి మచ్చలు ఉన్న నల్ల గుర్రంపై ముంజాల్ సేన్ రాజు వద్దకు బయలుదేరుతాడు. బీరప్ప లింబుడే పట్టణంలో తోట మనిషి ఫులాబాయి సహాయంతో కామధేను వద్దకు చేరుకుంటాడు. బీరప్ప ఆడ వేషం వేసుకుని ఫులాభాయి అక్క కూతురునంటూ కామదేనును కలిసి వస్తాడు. ఆ తరువాత ఫూలా భాయి నుండి వీడ్కోలు తీసుకుని గాజులమ్మే వాడి అవతారంలో మల్లి కామధేను లేదా కామ్సేన్ వద్దకు వెళతాడు. గాజులు కొనేందుకు వచ్చిన కామదేనుకు పెళ్లి ప్రతిపాదన చేస్తాడు. తన తండ్రి ముంజాల్ సేన్ గృహంలో పెట్టిన పెద్ద గుండు రాయిని కదిలించే వాడిని పెళ్లి చేసుకుంటానని కామధేను చెబుతుంది, దానితో బీరప్ప అక్కడికి వెళ్లి మంత్రించిన పసుపును గుండురాయి పై చల్లి దానిని తన ఎడమ కాలు బొటన వేలుతో కదిలించగానే అది ఆకాశంలోకి ఎగిరిపోతుంది. ఇది చూసిన ముంజాల సేన్ రాజు అక్కడికి వచ్చి తన కూతురును బీరప్ప గెలుచుకున్నట్లు ప్రకటిస్తాడు. కామదేనును పెళ్లి చేసుకోవాలంటే ఆకాశంలోకి ఎగిరిపోయిన పెద్ద గుండురాయిని యథాస్థానంలో పెట్టవలసి ఉంటుందని ఆయన షరతు పెడతాడు. ముంజాల సేన్ రాజు పెళ్లి రోజు, పెళ్లి సమయం నిర్ధారించిన తరువాతనే బీరప్ప ఆకాశంలోకి ఎగిరిపోయిన పెద్ద గుండురాయిని యథాస్థానంలోకి తెస్తాడు. బీరప్ప అక్కడి నుండి అక్క మహంకాళి వద్దకు వెల్లి పెళ్లి విషయం తెలియజేస్తాడు. అక్క మహంకాళి తో పాటు మిగతా ఆరుగురు అక్కలను తీసుకుని ముంజాల్ సేన్ రాజు వద్దకు ప్రయాణం అవుతాడు. ముంజాల్ సేన్ రాజు బీరప్ప ,కామధేను పెళ్లి ఘనంగా నిర్వాహిస్తాడు, అయితే కామధేను

పెళ్లి ముగిసిన మరు క్షణం పెళ్లి మంటపంలోనే కన్ను మూస్తుంది. బీర దేవుడు పెళ్లి జరగగానే వైధవ్యం పొందటం అక్క మహంకాళి తట్టుకోలేకపోతుంది. ఎందుకిలా జరిగిందని ఆలోచించి పెళ్ళికి సూరవంతి ని పిలవకపోవటం వల్లనే ఇలా జరిగిఉంటుందని భావించి వెంటనే ఒక లేఖను గరుడ పక్షి ద్వారా ఆమె వద్దకు పంపిస్తుంది. ఇంద్ర లోకంలో ఉన్న సూరవంతి లేఖ చూడగానే భగ్గు మంటుంది. ఆమె మరు క్షణం ముంజాల సేనుడి నగరానికి వచ్చి తన ఎడమ చేయి చిటికెన వేలు కోసి ఒక చుక్క రక్తాన్ని కామదేను నోటిలో వేస్తుంది. రక్తం చుక్క నోటిలో పడగానే కామధేను నిద్ర నుండి లేచినట్లు లేచి కూర్చుంటుంది. తదనంతరం సూరవంతి మిగతా పెళ్లి కార్యక్రమం పూర్తి చేయిస్తుంది.

మహారాష్ట్ర ధనగర్లు: మహారాష్ట్రలో గొర్రెల కాపర్లను ధనగర్ అని పిలుస్తారు. ధనగర్ అంటే దేనువుల సంపదను కలిగి ఉండేవాడు లేదా పర్వత ప్రాంతాల్లో నివసించే వాడు అని అర్థం. ఐతే ఈనిర్వచనాన్ని చాల మంది తిరస్కరించారు. సంస్కృతంలో ధంగ్ అంటే కొండ అని అర్థం. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలను మేపటం, ఉన్ని గొంగళ్ళు నేయటం వీరి ప్రధాన వృత్తి. వీరిలో కొందరు మాంసం విక్రేతలుగా పని చేస్తే మరికొందరు వ్యవసాయాన్ని తమ వృత్తిగా ఎంచుకున్నవారు కుడా ఉన్నారు. ధనగర్లు మూడు రకాలు, ఖుటేకర్,హాట్కర్, గావ్లి. హాట్కర్ ధనగర్లను బర్గి ధనగర్ అని కుడా పిలుస్తారు. మహారాష్ట్ర లో పెద్ద సంఖ్యలో ఉన్న ధనగర్ కులం ప్రజలు ఇతర రాష్ట్రాలలోని గొర్రెల పెంపకందారుల మాదిరిగానే విద్య, వాణిజ్యం, ఆర్థిక, రాజకీయ, వ్యాపారం రంగాలలో బాగా వెనకబడి ఉన్నారు. విద్యాగంధం లేకపోవటం వలన ధనగర్ కులం ప్రజలు రాజకీయాలలో రాణించలేకపోతున్నారు. రాజకీయాలలో లేకపోవటం వలన రాజ్యాధికారం లభించక ఎలాంటి అభివృద్ది సాధించాలేకపోతున్నారు. మహారాష్ట్ర జనాభా దాదాపు పదకొండు కోట్లు కాగా ఇందులో ధనగర్లజనాభా దాదాపు ఒక కోటి. రాష్ట్ర జనాభాలో పది శాతం ఉన్నప్పటికి రాజ్యాధికారంలో వీరి భాగస్వామ్యం అంతంత మాత్రమే. ధనగర్లు ఖండోబా, బీరలింగేశ్వర(బీరోబా), మహాస్కోబా, ధూలోబా, విఠోబా, తులై (తుల్జా భవాని), పాడుబాయి తదితర కుల దేవతలను పుజిస్తారు. తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ లో మాదిరిగానే మహారాష్ట్రలో కుడా ధనగర్లు తమ నివాస ప్రాంత్రాల్లోనే తమ కుల దేవతల దేవాలయాలు నిర్మించుకుని ప్రతినిత్యం పూజలు చేస్తుంటారు. ధనగర్లలో మొదట్లో పన్నెండు రకాల తెగలు ఉండేవి. ఒకే కుటుంబానికి చెందిన ఈ పన్నెండు మంది సోదరులు తమ మధ్య పని విభజన చేసుకోవటం వలన ఈ తెగలు ఏర్పడ్డాయనేది ఒక వాదన. ఇలా ఏర్పడిన పన్నెండు తెగల నుండే పలు ఉప

కులాలు, ఒక ఉప-ఉప కులం ఏర్పడిందని చరిత్రకారులు చెబుతున్నారు. హాట్కకర్ (గొర్రెలకాపర్లు), అహిర్ (ఆవుల కాపర్లు), ఖుటేకర్ (ఉన్ని కంబళ్ళు నేచేవారు) అనేవి ప్రధాన ఉప కులాలు. ఖటిక్ అనేది ఉప కులం. పశ్చిమ మహారాష్ట్ర, కొంకణి ప్రాంతాలకు చెందిన ధనగర్లను మరాఠా అని కుడా పిలుస్తారు. ఐతే అందరు మరాఠాలు ధనగర్ లు కారు. తమ కులంలో దాదాపు ఎనభై ఉప కులాలు ఉన్నాయి, అవి అహిర్, గావ్లి, మ్హాస్కర్, గుర్జర్, యదు, యాదవ, హత్కర్, బర్గి, బారాహట్టి, బార్హట్టా, బరగాహి, బరహోఘర్, బండే, జెండే,భిల్లరి, కిల్లరి,మేట్కరి, దంగే, బకర్వాల్, భార్వాడ్, బఘెల్, పాల్, గడరి, గడరియ, గద్ది, కురుబ, కురుంబార్, కురుమ, కనోరే, కోనార్, గొల్ల, నిఖర్, ఖుటేకర్, దేవాంగ, ఇడయిగ, నీఖర్, క్షిత్రి, ఖత్రి, ఖుటేకర్, సెంగర్, సంగర్, శెగర్, లడ్ మెండె, లాడ్సే, జెడ్, జడి, జాడె, హుల్వాన్, కొంకణి, మహురే, తెలంగే, తెల్లరి వార్వాడే, వారడి, బరడే, ఖటిక్, ఒరాన్, తల్వార్, బంజర్, వంజర, కంబర్,శిరోత్య, ఉటేకర్, గడ్గే, ఇడియాన్ అని ధనగర్ నాయకులూ చెబుతున్నారు. మహారాష్ట్రకు చెందిన హొల్కర్లు మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ కేంద్రంగా హొల్కర్ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయటం వలన మహారాష్ట్రతో పాటు మధ్య ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలకు ధనగర్లు వ్యాపించారు.

మధ్య ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ లో ధనగర్ లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇదిలా ఉంటే ధనగర్లలో చంద్ర వంశం వారితో పాటు సూర్య వంశం, అగ్ని వంశం, యదు వంశం వారు కూడా ఉన్నారు. ఇది ఎలా జరిగింది అనేది చెప్పటం కష్టం. హాట్కర్ లేదా బర్గి ధనగర్లు ఉత్తరాది నుండి వచ్చి మహారాష్ట్రలో స్థిరపడ్డారనే వాదన ఉన్నది. బర్గి ధనగర్లు బైటకి వెళ్ళే సమయంలో తమ వెంట ఒక బరిసె, పెద్ద గొంగళి తీసుకుపోతారు. బర్గి అంటే బరిసె అని అర్థం. అందుకే వారిని బర్గి ధనగర్లు అని పిలుస్తారు. హట్టి లేదా పట్టి అంటే గొర్రెలను నిలిపే ప్రదేశం అనే అర్థం వస్తుంది. ధనగర్లు అత్యంత శ్రద్ధ,భక్తి ప్రపత్తులతో పూజించే బీర దేవుడి ప్రధాన దేవాలయం పూనా సమీపంలో కృష్ణా నది ఒడ్డున 'కురిబెట్ట' (గొర్రె గుట్ట) పై ఉన్నదనీ, ఇదే విధంగా బీర దేవుడిని పెంచి పోషించిన మాయవ్వ దేవాలయం చించోలిలో కృష్ణా నది ఒడ్డున ఉన్నట్లు ఫ్రాన్సిస్ బుక్నాన్ తన 'మద్రాస్ నుండి కర్ణాటక వరకు యాత్ర' పుస్తకంలో తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ధనగర్లు ప్రతి పది సంవత్సరాలకు ఒక సారి తప్పకుండా కురిబెట్ట, చించోలికి వెళ్లి తమ ఇష్టదైవాలకు పూజలు చేస్తారని బుక్నాన్ పేర్కొన్నారు. బీరదేవుడు, మాయవ్వను ఫల, పుష్పాలతో మాత్రమే పుజిస్తారు. ఇరువురు దేవతలకు జంతువులను బలి ఇచ్చే సంప్రదాయం ఇక్కడ లేదు. ఈ రెండు దేవాలయాలలో కురుబలే పూజారులుగా వ్యవహరిస్తారు, పూజారి పదవులు వంశపారంపర్యం, కురుబ పూజారులు పెళ్ళిళ్ళు చేసుకోవచ్చు.

బీరోబా, విఠలేశ్వరుడు



పాండురంగ విఠలేశ్వరుడు,

మహారాష్ట్ర ప్రజల ఇష్ట దైవమైన పాండురంగ విఠలేశ్వరుడు, బీరప్ప జంట దేవుళ్ళు అనే వాదన మహారాష్ట్రలో బలంగా ఉన్నది. పండర్పూర్ లోని విఠలేశ్వరుడు వాస్తవానికి కర్నాటకకు చెందిన గొర్రెలు,పశువుల కాపర్ల దేవుడు అని రామచంద్ర చింతామణి ధేరె తమ 'జానపద దేవుడి పెరుగుదల, పండర్ పూర్ విఠలేశ్వరుడు' అనే పుస్తకంలో వాదించారు. బీరప్ప మహారాష్ట్రలోని పట్టన్ కడోలి నగరానికి వచ్చే ముందు వారణ నది ఒడ్డున ఉన్న పాము పుట్టలో పాము అవతారంలో దాదాపు పన్నెండు సంవత్సరాల పాటు తపస్సు చేశారు, బీరప్ప తపస్సు చేసినంత కాలంవిఠలేశ్వరుడు ప్రతిరోజూ పాము పుట్టలో పాలుపోయటం ద్వారా ఆయన ఆకలి తీర్చాడు, దీనితో పాటు బీరప్ప గొర్రెలను మేపటం ద్వారా అతనికి సేవ చేసినట్లు మరాఠీ ఒగ్గు కథలు చెబుతున్నాయి. బీరప్ప తపస్సు ముగిసిన అనంతరం పాము పుట్ట నుండి బైటికి వచ్చి పన్నెండు సంవత్సరాల నుండి తనకు సేవ చేస్తున్న విఠల్ లేదా విఠోబాను కౌగలించుకుని తన సోదరుడిగా చేసుకున్నాడని మరాఠీ ఒగ్గు కథలు ప్రకటించాయి. అప్పటి నుండి బీరప్ప-విఠల్ జంట దేవుళ్ళుగా మారా రన్నది మహారాష్ట్ర ఒగ్గు కథల సారాంశం విఠలేశ్వరుడు-బీరప్ప-తిరుమల శ్రీవేంకటేశ్వరుడు- ముగ్గురు దేవుళ్ళు ఒకటే అన్నది రామచంద్ర చింతామణి దేరే వాదన. మహారాష్ట్రలో పేష్వాలు రాజ్యమేలే సమయంలో విఠలేశ్వర-బీరప్ప దేవుడిని మహా విష్ణు అవతారమైన శ్రీకృష్ణుడిగా మార్చివేశారని ఆయన చెప్పారు. పండర్ పూర్ లోని విఠలేశ్వరుడి విగ్రహం, తిరుమలలోని శ్రీవెంకటేశ్వర స్వామి విగ్రహం రెండు ఒకే రకంగా ఉంటాయని ఆయన చెప్పారు. విఠలేశ్వరుడు శ్రీ మహావిష్ణు అవతారమని నిరూపించెందుకే పాండురంగ మహత్యం తదితర స్థల పురాణాలను సృష్టించారని ధేరె తన పుస్తకంలో వాదించారు. విఠలేశ్వరుడు శ్రీ మహావిష్ణు అవతారమైన శ్రీకృష్ణుడు అని

వాదించే వారు దీనిని నిరూపించేందుకు అవసరమైన సాక్ష్యాలను చూపించేలేకపోతున్నారని ఆయన తెలిపారు. పండర్ పూర్ లోని విఠలేశ్వరుడి విగ్రహం శ్రీమహావిష్ణు 24 అవతార నామాలలో ఏ అవతారం, ఏ నామంతో కూడా సరిపోవటం లేదు. విఠలేశ్వరుడు అనేది శ్రీమహావిష్ణు మరో పేరు అని ఏ పురాణం, ఏ హిందూ మత గ్రంథం చెప్పటం లేదు. పన్నెండవ శతాబ్దంలో తిరుమలేశ్వరుడు వైష్ణవ దేవుడని ప్రకటించినప్పటి నుండి ఈ శైవ క్షేత్రం వైష్ణవ క్షేత్రంగా మారిపోయిందన్నది ఆయన అభిప్రాయం.

తెలంగాణాలో కురుమలు

తెలంగాణలోని కురుమ కులం ప్రజల ప్రధాన వృత్తి గొర్రెలు, మేకల పెంపకం, ఉన్ని గొంగళ్లను నేయటం లేదా తయారు చేయటం అని సయ్యద్ సిరాజ్ ఉల్ హస్సన్ తన 'నిజాం దేశంలో కులాలు, తెగలు ' అనే పుస్తకంలో పేర్కొన్నారు. తెలంగాణాలోని కురుమలు కర్నాటకలోని కురుబ, తమిళనడులోని కురుంబ ప్రజలు ఒకటేనని ఆయన స్పష్టం చేశారు. మొదట్లో చెప్పుకున్నట్లు కురి అంటే గొర్రె అని అర్థమని హస్సన్ రాశారు. మల్లన్న సంతానమైన కురుమ కులంలో కూడా ఉన్ని, పత్తి ఉగడ్ అనే మూడు ఉపకులాలు ఉన్నాయని హస్సన్ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఈ మూడింటిలో 'ఉగడ్' వర్గం తక్కువ స్థాయి వారు, అందుకే వారు మిగతా రెండు ఉప కులాల వారి వద్ద బిక్ష తీసుకోవటం ద్వారా తమ పొట్ట పోసుకుంటారు. వీరు కొన్ని సందర్భాలలో పూజారులుగా కూడా వ్యవహరిస్తారని హస్సన్ తెలిపారు. కురుమ కులంలో నాలుగు విభాగాలున్నాయి. పత్తి కంకణం, ఉన్ని కంకణం కురుమలు, లింగాయత్ కురుమ లేదా కురుబ, బీర్లోల్లు ,బీరేశ్వర్లు. బీరేశ్వార్లను ఒగ్గోల్లు అని కూడా పిలుస్తారు. ఒగ్గోల్లు లేదా బీరేశ్వర్లు కురుమ కులం పూజారులుగా వ్యవహరించటం అందరికి తెలిసిందే. ప్రస్తుతం కురుమ లేదా కురుబ కులం ప్రజలు ఉప కులాల గురించి పెద్దగా పట్టించుకోకుండా అందరు ఇచ్చి పుచ్చుకుంటున్నారు. అయితే లింగాయత్ కురుబలు మాత్రం తమను తాము లింగాయత్ కులంగా చెప్పుకుంటారు. వారు ఇతర కురుమ, కురుబ కులం వారితో ఇచ్చి పుచ్చుకోవటం చేయరు. కర్నాటకలోని రెండవ అతి పెద్ద కులమైన లింగాయత్ కులంలో దాదాపుగా సగం మంది కురుబ కులం వారే అనీ వాదించే వారు ఉన్నారు. వీర శైవాన్ని స్థాపించిన బసవన్న ప్రోత్సాహంతో వీరు లింగాయతులుగా మారిపోయారు.

పెళ్ళి ప్రక్రియలో విశేషాలు

కురుమల పెళ్లిల్లు ఒగ్గు పూజారుల పర్యవేక్షనలో తమదైన సాంప్రదాయం ప్రకారం జరుగుతాయి. కులం మూల పురుషుడైన మల్లన్న పెళ్లి లేదా కుల గురువైన బీరప్ప పెళ్ళితో వివాహ కార్యక్రమం ప్రారంభం అవుతుంది. కొన్ని కుగ్రామాలలో బాలికలను మల్లన్న, బీరప్ప దేవుళ్ళకు పెళ్ళిళ్ళు చేసే దుష్ట సంప్రదాయం కొనసాగుతోంది. దేవతలకు పెళ్లి చేసిన యువతులను బసవి అని పిలుస్తారు. కురుమల్లో బహుభార్యత్వం ఉన్నా ఇది కొందరికే పరిమితం. బహుభార్యత్వం ఒక ఆచారం, సంప్రదాయంగా మారలేదు.

ఉన్ని కురుమలు, పత్తి కురుమల్లో పెళ్లి నిర్వహణా ప్రక్రియ అంతా ఒకే విధంగా ఉన్నా ఒక్క కంకణం విషయంలో తేడా వస్తుంది. ఉన్ని కంకణందారులు వధూ,వరులకు ఉన్ని దారంతో చేసిన కంకణం కడితే పత్తి కంకనందారులు వధూ,వరులకు పత్తి కంకణం కడతారు. పుస్తె లేదా మంగళ సూత్రం కట్టే ప్రక్రియ ముగిసిన తరువాత ఒగ్గు పూజారులు నాగవెల్లి కార్యక్రమం జరుపుతారు. ఒగ్గు పూజారులు 'సూర్య నారాయణా, సూర్య నారాయణా' అంటూ సూర్యుడిని పూజించే పాటలు పాడుతారు. కొత్త దంపతులతో సూర్యుడికి నమస్కారం చేయించిన తరువాత మల్లన్న పెళ్లి పాటలు పాడుతారు. ఒగ్గు పూజారులు అనంతరం జోల పాటలు, మంగళ ఆరతుల పాటలు పాడి కట్నాలు ఇవ్వలనుకునే వాళ్ళు ఇవ్వవచ్చునని ప్రకటన చేస్తారు. సమయంలో కుడా ప్రముఖ పాత్ర నిర్వహిస్తారు. మల్లన్న బోనాలు, బీరప్ప బోనాలు, ఎల్లమ్మ బోనాలు, మహంకాళి బోనాలు అనే నాలుగైదు రకాల బోనాలను కురుమలు నిర్వహిస్తారు. బోనాల ఊరేగింపులో డోలు వాయిద్యం తప్పనిసరి. దేవతలకు నైవేధ్యం సమర్పించటమే బోనం.

ఒగ్గు పూజారులు, ఒగ్గు కథ

వాగయ్యాలు, గోరయ్యలు, కంచివీరులు

1. ఇంటి వద్ద పాటించే ఆచారాలు.

2. మల్లన్న దేవాలయంలో పాటించే ఆచారాలు.

ఒగ్గు కథలు ఒగ్గు పూజారులు, గోరయ్యాలు, కంచి వీరులు కురుమల సంస్కృతి, సభ్యతలకు ప్రతిబింబాలు. కురుమ, కురుబ, కురుంబార్ తదితర గొర్రెల కాపర్ల కుల

దేవతలు, కుల చరిత్ర, సభ్యత, సంస్కృతులను వందలు, వేల సంవత్సరాల నుండి కాపాడటంతో పాటు భావి తరాలకు అందజేస్తున్న ఘనులు ఒగ్గు పూజారులు, ఒగ్గు కథలు చెప్పే ఒగ్గు కళాకారులు, గొరవయ్యలు. కురుమ, కురుబ, కురుంబార్లకు లిఖిత చరిత్ర లేకపోవటం వలన ఈ వర్గాల వారికి వారి చరిత్ర, సభ్యత, సంస్కృతులను ఒగ్గు పూజారులు తమ ఒగ్గు కథల ద్వారా తెలియజేస్తున్నారు. గొరవయ్యలు గొర్రెల కాపర్ల భక్తి ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న గొప్ప జానపద కళాకారులు. గొర్రెల కాపర్ల మూల పురుషుడైన మల్లన్న, కుల గురువైన బీరప్పతో పాటు సంరక్షక దేవత రేణుకా ఎల్లమ్మ, మహంకాళి, నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ, మాందాత



తదితర కుల దేవతల కథలను వివరించే కురుమ కుల పురాణాలే ఒగ్గు కథలు. పురాతన కాలంలో బ్రాహ్మణులు వేదాలను కంఠస్తం చేసే ప్రక్రియ ద్వారా వాటిని ముందు తరాలకు అందజేసినట్లు ఒగ్గు పూజారులు బీరప్ప, మల్లన కథలను కంఠస్తం చేయటం ద్వారా వాటిని నిక్షిప్తం చేయటం, కథలుగా చెప్పటం ద్వారా కురుమల గత చరిత్ర, పూర్వ పరాలను భావితరాలకు అందజేస్తున్నారు. మల్లన్న, బీరప్ప, రేణుకా ఎల్లమ్మ, తగితర దేవతల జీవిత చరిత్రలను భావితరాలకు అందజేస్తున్న మౌకిక వ్యవస్థ ఒగ్గు కథా విధానం. కురుమలు, గొల్లల ఆదిపురుషుడు మల్లన్న, కురుమల కుల దైవం బీరప్ప అతని సోదరి అక్క మహంకాళి గురించి తెలియజేసేవే ఒగ్గు కథలు. ఒగ్గు కథలు కురుమ, కురుబ, గొల్లల అలిఖిత పురాణాలు, సాంప్రదాయిక కథలు. ఇవి పశువుల కాపర్ల తొలి చరిత్ర , సంప్రదాయాలు,, సామజిక స్థితిగతులకు అద్దం పడుతున్నాయి. ఒగ్గు కథలు కురుమలు, గొల్లలను వారి పూర్వీకులతో కలిపే అత్యంత ముఖ్యమైన అనుసంధానబాధ్యతను నిర్వహిస్తున్నాయి. ఒగ్గు అంటే డమరుకం, మల్లన్న, బీరప్ప కథ చెప్పేందుకు ఒగ్గును ఉపయోగించటం వలన దీనికి ఒగ్గు కథ అనే పేరు వచ్చింది.

మల్లన్న, బీరప్ప, అక్క మహంకాళి తదితర కథలు చెప్పే ఈ ఒగ్గు కళాకారులు కురుమ, గొల్లల పూజారులుగా కూడా వ్యవహరిస్తారు. మల్లన్న, బీరప్ప కథలు చెప్పటంతో పాటు వీరు మల్లన్న పెళ్లి, బీరప్ప పెళ్లి నిర్వహిస్తారు. కురుమ, గొల్లల పెళ్ళిల్లలో కుడా వీరు ప్రధాన పాత్ర నిర్వహిస్తారు.

ఒగ్గు కళాకారులు, వారి సంగీత వాయిద్యాలైన డోలు, కొమ్ము గురించి, మల్లన్న, బీరప్ప, ఎల్లమ్మ, పోతరాజు కు సంబంధించిన కథల రూప కల్పన ఎప్పుడు, ఎలా జరిగిందనే ప్రశ్నలకు సరైన సమాధానాలు లేవు. బీరప్ప,మల్లన్న తదితర కథలు నోటి మాట గా ఒక తరం నుండి మాతో తరానికి వస్తున్నాయి తప్ప ఈ కథలకు సంబందించిన లిఖిత ఆధారాలు లేవు. ఒగ్గు కథ, ఒగ్గు కళాకాలురు, ఒగ్గు కథ చెప్పే విధానం, కథ చెప్పేందుకు ఉపయోగించే డోలు ఇతర సంగీత వాయిద్యాలు అన్ని కుడా కురుమల స్వంతం. ఒగ్గు కథ కురుమల సృష్టి. ఒగ్గు కథ అనేది కురుమలు, కురుబల జీవన విధానంలో అంతర్భాగం. పట్టణం ప్రాంతాల్లో ఒగ్గు కథ ప్రాధాన్యత, ప్రచుర్యం కొంత తగ్గు ముఖం పట్టినా గ్రామ ప్రాంతాల్లో నేటికి కూడా ఒగ్గు కథ తన ప్రాధాన్యతను కోల్పోలేదు. పాట, మాట, నృత్యం ఆధారంగా ఒగ్గు కథా విధానం కొనసాగుతుంది. ఒగ్గు అంటే జగ్గు, పరమ శివుడి చేతిలో ఉండే డమరుకం. ఒగ్గుకు మరో అర్థం (శివుడికి) తమను తాము సమర్పించుకోవటం.ఇప్పుడు ఒగ్గు కళాకారులు ఒగ్గు పట్టుకోకుండానే కథలు చెబుతున్నారు. కురుమల్లో ఒగ్గోల్లు లేదా ఒగ్గు పూజారులకు ఒక ప్రత్యేకత ఉన్నది. మల్లన్న బాపన (బ్రాహ్మణ) రాత్నంగికి పుట్టిన వారే ఒగ్గు పూజారులు అయ్యారనే వాదన ఒకటి ఉన్నది. రత్నంగికి మల్లన్న ద్వారా పుట్టిన వీరు తమను తాము ఉన్నతులుగా భావిస్తారనీ, అందుకే వారు ఒగ్గు పూజారులుగా మారారనే మరో వాదన కూడా ఉన్నది. మల్లన్న దేవుడు బ్రమరాంభను పెళ్లి చేసుకునే సమయంలో తనతో గొడవపడిన ఆమె ఏడుగురు సోదరులను కుక్కలుగుగా మారిపోవాలంటూ శపిస్తాడు, ఈ పరిణామ పట్ల ఆందోలన చెందిన భ్రమరాంభ తన సోదరులపై దయ చూపాలని మల్లన్నను వేడుకుంటుంది. దీనితో మల్లన్న తన ఏడుగురు బావ మరదులను ఒగ్గు కళాకారులుగా మార్చివేశాడనే మరో కథనం కూడా ఉండటం గునార్హం. ఒగ్గు కథను నలుగురు, ఆరుగురు లేదా ఏడుగురు ఒగ్గు కళాకారులు చెబుతారు. ఒగ్గు కథ చెప్పే ప్రధాన కథకుడు తెల్లని దోతి ధరించి నడుముకు దట్టి కట్టుకుంటాడు. ఒగ్గు కథ చెప్పే ప్రధాన కథకుడు మహిళ పాత్రకు సంబంధించిన కథ చెప్పే సమయంలో స్త్రీ వేషం ధరిస్తాడు. పాత్రకు అనుగుణంగా దుస్తులు, వేషం మారటం, వచనంతో పాటు పాటలు పాడటం,

అవసరమున్న చోట ముఖాభినయం,నృత్యం చేయటం ద్వారా ఒగ్గుకథను నాటకీకరణం చేయటం వలన దీనికి తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు దేశ జానపద సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం లభించింది. చేతి వ్రేళ్లకు ఉంగరాలు, మణికట్టుపై రంగు,రంగుల దారాల కట్టు, దానితో పాటు లావైన వెండి కడియాలు, మేడలో మరో పెద్ద వెండి కడియం, పగడాలు,ఇతర విలువైన రాళ్ళతో చేసిన దండలు, చెవులకు పోగులు, కాళ్ళకు గజ్జెలు, మెడలో గవ్వల దండతో ఒగ్గు కథలోని ప్రాధాన కథకుడు అందరిని ఆకట్టుకుంటాడు మెడలోని గవ్వల దండలో ఏడు గవ్వలు ఉండటం మల్లన్న శాపం వాదన కూడా ఉన్నది. భ్రమరాంబ ఏడుగురు అన్నలకు ప్రాధాన్యత కల్పించేందుకే ఈ ఏర్పాటు చేసారని అంటారు. ప్రధాన కథకుడితో పాటు ఒక సహాయ గాయకుడు ఉంటాడు. డోలు వాయించే కళాకారుడు, తాళం వేసే కళాకారుడు కూడా కథలో గొంతు కలుపుతాడు. రెండు కాళ్ళకు గజ్జెలు కట్టుకుని కథ చెప్పే ప్రధాన కథకుడు పాత్ర అవసరం మేరకు రక,రాకాల వేషాలు వేసుకుంటాడు.

ఒగ్గు కళాకారులుగా తయారయ్యేందుకు సంప్రదాయం ప్రకారం ప్రత్యేక శిక్షణ తీసుకోవలసి ఉంటుంది. ఒగ్గు కళాకారులయ్యేందుకు మొదట మల్లన్న దీక్ష చెప్పట్టవలసి ఉంటుంది. ఒగ్గు కళాకారులు శ్రీశైలం లేదా ఏదైనా శివాలయంలో మల్లన్న దీక్ష చెపట్టి శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి చేస్తేనే ఒగ్గు కథలు చెప్పే అర్హత సంపాదిస్తారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రంల్లో ముఖ్యంగా తెలంగాణాలో కురుమ, కురుబలు అధిక సంఖ్యలో ఉండటం తెలిసిందే. తెలంగాణాలో గతంలో మల్లన్న లేదా బీరప్ప కథను ఇరవై ఒక్క రోజుల పాటు చెప్పే వారు. ఇప్పుడు ఓపిక, శ్రద్ధ తగ్గటంతో ఉరుకులు,పరుగుల జీవితంలో సమయాభావం ఏర్పడటం వలన మల్లన్న, బీరప్ప ఒగ్గు కథలను బాగా కుదించిఒక్క రాత్రిలోనే పూర్తి చేస్తున్నారు. ఒగ్గు పూజారులు రెండు రకాలు, మొదటి రకం ఒగ్గు పుజాలురు కేవలం మల్లన్న, బీరప్ప దేవాలయాలలో మాత్రేమే ఒగ్గు కథలు చెబుతారు, పట్నాలు, వేస్తారు, పూజలు చేస్తారు, మొక్కులు తీస్తారు. రెండో రకం ఒగ్గు పూజారులు గ్రామ, గ్రామానికి వెళ్లి ఒగ్గు కథలు చెబుతారు, పూజలు, పట్నాలు వేస్తారు,మొక్కులు తీస్తారు, దేవుడి పెళ్లి, మైల పోలు, కురుమల పెళ్ళిళ్ళు చేస్తారు. కట్నాల వివరాలు ప్రకటిస్తారు, పాలు పట్టు, మల్లన్న బోనాలు, బీరప్ప బోనాల పండుగలు కూడా నిర్వహిస్తారు. వీరు ఐనవోలు, కొమరెల్లి, శ్రీశైలం, ఓడెల తదితర శైవ క్షేత్రాలలో మల్లన్న పండుగ నిర్వహిస్తారు.



డోలు-తాళం- కంజిర

ఒగ్గు కథ, పూజలు, మల్లన్న, బీరప్ప, ఎల్లమ్మ దేవతల పెళ్ళిళ్ళు, పూజా కార్యక్రమాల నిర్వహణలో ఉపయోదించే డోలు (కర్ణాటకలో దీనిని డొల్లు అని పిలుస్తారు) కురుమల స్వంతం. ఒగ్గు కథ మాదిరిగానే డోలు కుడా కురుమల సృష్టి. డోలు, తాళం, కంజిర ఇతర సంగీత వాయిద్యాలు కురుమ స్వంతంగా తయారు చేసుకున్నవే. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో కురుమ, కురుబ, ధనగర్, కురుంబార్, కురుమాన్ కులం వారు ఉపయోగించే డోలు అత్యంత పురాతనమైంది. ఒగ్గు కథతో పాటు డోలు, ఇతర సంగీత వాయిద్యాలు పుట్టి ఉంటాయి. గొర్రె లేదా మేక చర్మం, మామిడి చెట్టు కలపతో తయారయ్యే డోలును శివుడు సృష్టించినట్లు చరిత్ర చెబుతోంది. శివుడు, పార్వతి ఒకసారి కాలక్షేపం కోసం ఒక ఆటకు దిగుతారు. ఆటలో ఓడిపోయినా వారు కైలాసాన్ని వదిలి వేసి భూలోకంలో కొంత కాలం పాటు ఎవరికి తెలియకుండా అజ్ఞాతంగా జీవించవలసి ఉంటుంది. ఆటలో శివుడు ఓడిపోతాడు. దీనితో ఆయన భూలోకానికి వచ్చి ఒక గుహలో శిలా రూపంలో అజ్ఞాతంగా జీవిస్తుంటాడు. కైలాసంలో పార్వతి కొంత కాలంగడచిన అనంతరం విశ్వ పాలనతో విసిగిపోయి శివుడిని వెతకవలసిందిగా వాయువును కోరుతుంది. శివుడిని వెతకటంలో వాయువు విఫలం కాగా నారదుడు గుహలో శిలా రూపంలో ఉన్న శివుడిని కనుగొంటాడు. నారదుడు మాయామూర్తిని సంహరించి కైలాసం వెళ్ళాలంటూ శివుడి పై వత్తిడి తెస్తాడు. మాయామూర్తి మృత దేహాన్ని వదిలి పెట్టి కైలసానికి వెళ్ళిపోవటం శివుడికి నచ్చదు. అందుకే శివుడు మాయామూర్తి చర్మంతో డోలు తయారు చేసి కైలాసానికి తన వెంట

తీసుకుపోతాడు. ఈ కారణం చేతనే శైవులకు డోలు అత్యంత ప్రీతి పాత్రం, అత్యంత ముఖ్యం.

గొంగళ్ళ తయారి

కురుమ కులంలో ఒకప్పుడు గొంగళ్ళ తయారి ఒక కుటీర పరిశ్రమగా కొనసాగేదనేది అందరికి తెలిసిందే. దేశంలో ముఖ్యంగా దక్షిణ భారత దేశంలోని అవిభాజిత ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని గొర్రెల కాపర్లు అంటే కురుమ, కురుబ, కురువ, కురుంబార్ వర్గం ప్రజలు పెద్ద ఎత్తున గొంగళ్ళ నేత పని చేసేవారు. ముతక గొంగళ్ళు, నాణ్యమైన గొంగళ్ళను తయారు చేశేవారు. గొర్రెలను నీళ్ళతో పరిశుభ్రంగా కడిగిన అనంతరం వాటి నుండి ఉన్నిని కత్తిరించేవారు. నల్లని ఉన్నినంతా ఒక వైపు, రంగుల ఉన్నినంతా మరో వైపు విడదీసిన అనంతరం గొంగళ్ళ నేత కార్యక్రమం జరిగేది. కురుమ మహిళలు ఉన్ని సేకరణ, పరిశుభ్ర పరచి దారంగా వడకటం తదితర బాధ్యతలు నిర్వహిస్తే మగవారు ఉన్ని దారంతో గొంగల్లను నేసే వారు. ఉన్ని దారానికి చింతపండు రసం పుయటం ద్వారా ముతక గొంగళ్ళను నేసేవారు. ఎంపిక చేసిన నాణ్యమైన ఉన్ని దారానికి చింతపండు రసం పూయకుండా సున్నితమైన గొంగళ్ళను తయారు చేసేవారు. ఉన్ని దారానికి చింతపండు రసం పూయకుండా నేసె గొంగళ్ళను సన్నని కర్రతో మెత్తగా బాధటం ద్వారా సున్నితమైన ఉన్నిని తయారు చేసి దానితో నాణ్యమైన గొంగళ్ళ తయారి జరిగేది. గొంగళ్ళకు దేశంలోని పలు ప్రాంతాలలో మంచి డిమాండ్ ఉండేది. కురుమాలతో పటు ఇతర కులాల వారు కూడా గొంగళ్ళను ఉపయోగించేవారు. ఐతే కాల క్రమంలో గొంగళ్ళ నేత మరుగున పడిపోయింది. కర్ణాటక రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో నేటికీ కొందరు గొంగళ్ళ నేతను కొనసాగిస్తున్నారు. మైసూరు ప్రాంతంలోని కురుబల్లో సున్నత లేదా వస అనే వర్గం కురుబలు కేవలం తెల్ల రంగు గొంగళ్ళను మాత్రమె నేస్తారనే థర్స్టన్ తన 'దక్షిణ భారత దేశంలోని కులాలు, వర్గాలు' అనే పుస్తకంలో పేర్కొన్నారు. సున్నత వర్గం కురుబ మహిళలు తయారుచేసే ఈ తెల్ల గొంగళ్ళు ఎంతో నాణ్యమైనవని ఆయన తెలిపారు.

జమ్మి, అశ్వత్త చెట్లు

తమిళనాడు కురుంబార్ ప్రజలు జమ్మి చెట్టు, అశ్వత్త చెట్లను పుజిస్తారు. విజయదశమి రోజు జమ్మికి వెళ్ళటం అందరికి తెలిసిందే. జమ్మికి వెళ్ళటం అంటే

జమ్మి చెట్టుకు పూజ చేసి, జమ్మి ఆకులను బంగారంగా భావిస్తూ బంధువులు, తెలిసిన వారికి జమ్మి ఆకులు ఇచ్చి గౌరవం, మర్యాద, ప్రేమాభిమానలకి ప్రతీకగా కౌగిలించుకోవటం పరిపాటి. ఆ తరువాత పాల పిట్టను చూడటం హిందువుల సంప్రదాయం. పాండవులు అజ్ఞాత వాసం ప్రారంభించే ముందు తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై దాచి వేయటం జగత్ విదితమే. కౌరవులతో యుద్ధం ప్రారంభించే ముందు వారు జమ్మి వృక్షాన్ని పుజిస్తారు. శ్రీరామచంద్రుడు రావణుడితో యుద్ధం ప్రారంభించే ముందు జమ్మి వృక్షాన్ని పూజిస్తారు. అందుకే హిందువులు విజయదశమి రోజు జమ్మి చెట్టును పుజిస్తారు. అనాది నుండి ఇదొక సంప్రదాయంగా సొంసాగుతోంది. ఐతే తమిళనాడుకు చెందిన కురుంబార్ ప్రజలు జమ్మి, అశ్వత్త చెట్లను ప్రత్యేకంగా పూజిస్తారు. కేవలం విజయదశమి మాత్రమె పూజించటం అనేది జరుగదు. కురుంబార్ ప్రజలకు జమ్మి,ఆశ్వత్త చెట్లను పూజించటం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ సంప్రదాయం వెనక ఉన్న చరిత్ర ఏమిటి? కారణం ఏమిటి? అనేది వారికి తెలియదు.

పాండవ దేవాలయాలు

తమిళనాడులోని ఉత్తర ఆర్కాట్ తదితర జిల్లాల్లో పాండవ దేవాలయాలు ఉన్నాయి. నాలుగు రాతి స్తంభాలపై పెద్ద రాతి పలక ఉండే ఈ పాండవుల దేవాలయాలు కురుంబార్ పెద్దలు లేదా కుల కోసం వీర మరణం చెందే వారికోసం జరిగే నిర్మాణాలను పోలి ఉంటాయి. కురుమలు తమ కుల పెద్దను గౌడ్ అని, ఆయన భార్యను గౌదసాని అని పిలుస్తారనేది మనందరికీ తెలిసిందే. తమిళనాడులోని కురుంబార్ లు కూడా ఇదే పద్దతిని పాటిస్తారు. ఐతే అక్కడ మరణించిన కుల పెద్ద లేదా కులం కోసం ప్రత్యర్దులతో పోరాడి వీర మరణం చెందే వారి కోసం ఒక రాతి కట్టడాన్ని నిర్మించటం సంప్రదాయం. నాలుగు పెద్ద రాతి స్తంబాలను నిలబెట్టి వాటిపై ఒక పెద్ద బండ రాయిని పెడతారు. దీని కింద మరణించిన కుల పెద్ద లేదా కుల ప్రయోజనాల కోసం పోరాడి వీర మరణం పొందిన వ్యక్తిని ఖననం చేసి ప్రతి సంవత్సరం పెద్దల పండుగ సందర్భంగా ఇక్కడ పూజలు నిర్వహించి తర్పణాలు వదులుతారు. మరణించిన కుల పెద్ద లేదా కుల ప్రయోజనం కోసం వీర మరణం పొందిన వ్యక్తి కోసం నిర్మించే రాతి నిర్మాణాలకు పాండవ దేవాలయాలకు ఉన్న సంబంధం ఏమిటనే అంశంపై పరిశోదనలు జరుగుతున్నాయి. ఉత్తర ఆర్కాట్ జిల్లాతో పాటు తమిళనాడులోని పలు జిల్లాల్లో కురుంబార్ వర్గం ప్రజలు నివసించే ప్రాంతాల్లో పాండవుల దేవాలయాలు అధిక సంఖ్యలో

ఉండటం గమనార్హం.

గోరయ్యలు

గోరయ్యలు కురుమ, కురుబ తదితర గొర్రెల కాపర్ల భక్తి ఉద్యమానికి ప్రతిబింబాలు. జీవితాంతం మల్లన్న, మైలార దేవుడి భక్తులుగా ఉంటూ శైవాన్ని ప్రచారం చేస్తామనే దీక్ష తీసుకునే కురుమ, కురుబలే గోరయ్యలు, గోరమ్మలు. గోరయ్యలు తెలుపు, లేదా పసుపు పచ్చ పంచ, తెల్లటి పొడువాటి జుబ్బా ధరిస్తారు. జుబ్బాపై పొడువైన ఉన్నికోటు లాంటిది కూడా ధరిస్తారు. మేడలో రుమాలు, నుదుటిపై విభూతి తో మూడు అడ్డ నామాలు, కళ్ళ చుట్టూ తెలుపు, కుంకుమ రంగు, తలపై ఎలుగుబంటి చర్మంతో చేసిన టోపీ, నడుముకు జింక చర్మంతో చేసిన బెల్టు ధరించటం ద్వారా ఒక ప్రత్యేక రూపాన్ని కలిగి ఉంటారు. దీనితో పాటు ఒక చేతిలో దమురుకం, రెండో చేతిలో మురళితో మల్లన్న దేవుడి భక్తి పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. "ఎలుకోటి, ఎలుకోటి" (ఏడు కోట్లు, ఏడుకోట్లు) మంది మల్లన్న సైనికులము అంటూ నినాదాలు చేస్తూ నృత్యం చేయటం గోరయ్యల ఆచారం. మైలార దేవుడు మల్లాసురుడు, అతని సోదరుడిపై యుద్దానికి వెళ్ళే దృశ్యాన్ని ప్రదర్శించే గోరయ్యలు విల్లంబులు కుడా ధరిస్తారు. "గోరవార కునీత అనేది గోరయ్యల యుద్ద నృత్యం. చిన్న పిల్లల్లో ఉండే భయాన్ని పారదోలేందుకు వారిని గోరయ్యలు ముందు నిలబెట్టటం అనేది కర్ణాటకలో ఒక సంప్రదాయం.

కురుమ, కురుబ కులానికి చెందిన మగ పిల్లలకు మైలార లింగ సమక్షంలో "గోరయ్య" దీక్ష ఇస్తారు. గోరయ్యల అధినాయకుడు మగ పిల్లలకు మైలార లింగ విగ్రహం ముందు గోరయ్య దీక్ష ఇచ్చిన అంతరం ఆయన వారిని దీవించటం ద్వారా తన పరిధిలోకి తీసుకుంటాడు. గోరయ్యగా దీక్ష తీసుకునే మగ పిల్లలు తమ గురువు వద్దనే ఉండవలసి వస్తుంది. దీక్ష తీసుకునే వారికి ఒక గొంగడి, ఒక గంట, ఒక దమురుకం, ఒక మురళి, ఎలుగుబంటి చర్మంతో చేసిన ఒక టోపీ, %ళి%పొడవాటి ఒక ప్రత్యేక డ్రెస్ ఇస్తారు. గొరవయ్యలు ఒక ఎరుపు రంగు అంగి ధరించటంతో పాటు గవ్వలతో చేసిన దండలు దరించ వలసి ఉంటుంది. గొరవ నృత్యం శైవ మతపరమైన నృత్యం. పది లేదా పన్నెండు మంది గోరయ్యలు పండుగలు, జాతరల సమయంలో ఈ నృత్యం చేస్తారు. ప్రత్యేకఆహ్వానంమేరకుదీనినిఇళ్ళలోకుడానిర్వహిస్తారు.గోరవయ్యలుడోలు, డమరుకం వాయిస్తూ మురళీ గానంతో ఈ నృత్యాన్ని గుంపుగా చేస్తారు. మల్లన్న పెళ్లి, బీరప్ప పెళ్లి, గృహ ప్రవేశం జరిపే సమయంలో కుడా గోరయ్యలు లేదా ఒగ్గు కళాకారులు

ఈ నృత్యం చేస్తారు. గృహ ప్రవేశ కార్యక్రమంలో గౌరవయ్యలు మొదట ఒక గొంగడిని గది మధ్యలో పరిచి దానిపై ఒక పాల గిన్నెను పెడతారు. పాల గిన్నెతో పాటు అరటి తదితర పళ్ళు పెడతారు. గౌరవయ్యలు పాలు, పళ్ళను పూజించిన అనంతరం గౌరవ నృత్యం ప్రారంభిస్తారు. డోలు డిల్లెం, బల్లెం ధ్వనికి అనుగుణంగా కాలు కదుపుతూ గౌరవయ్యలు నృత్యం చేస్తారు. గౌరవయ్యలు మల్లన్న, బీరప్ప దేవుళ్ళ పాటలు పాడుతూ నృత్యంలో లీనమవుతారు. గౌరవయ్యలు గొంగడిపై గుండ్రంగా తిరుగుతూ నృత్యం చెస్తూ మధ్యలో పాల గిన్నె చుట్టూ బొక్క బోర్ల పడుకుని గిన్నెను చేతితో తాకకుండా పాలను ఆరగిస్తారు. పూర్వ కాలంలో ఒక కుటుంబంలోని పెద్ద కొడుకు లేదా చిన్న కొడుకు పద్నాలుగు లేదా పదిహేనవ ఏట గోరయ్య దీక్ష తీసుకునే వారు. గోరయ్య దీక్ష తీసుకోవటం ఇటీవలి కాలంలో బాగా తగ్గిపోయింది. కర్నూలు జిల్లాలోని ఆలూరు సమీపంలో ఉన్న గట్టు మల్లయ్య కొండ, అనంతపురం జిల్లాలోని కట్నే కాలువ వద్ద ఉన్న మల్లన్న దేవాలయాలలో గోరయ్యల దీక్షా కార్యక్రమాలు జరుగుతాయి. నవరాత్రి సమయంలో గౌరవయ్యలు, గోరమ్మలు తొమ్మిది రోజుల పాటు నికచ్చిగా ఉపవాస దీక్షను పాటిస్తూ ఇరవై నాలుగు గంటల పాటు మైలార దేవుడి పూజా కార్యక్రమాల్లో నిమగ్నం కావలసి ఉంటుంది.

మల్లన్న లేదా మైలార దేవుడిని పూజించే కార్యక్రమంలో కురుమ, కురుబ మహిలలు కూడా పెద్ద ఎత్తున పాల్గొనేవారు. పద్నాల్గవ శతాబ్దంలో ఓరుగల్లు (వరంగల్)లోని మైలార దేవుడి గుడిలో కురుమ, కురుబ గోరమ్మలు "గౌరిగే పడచుల నృత్యం" చేసేవారు. వల్లభాచార్యుడు రాసిన "క్రీడాభిరామం" వీధి నాటకంలో ఈ విషయం స్పష్టంగా ఉన్నది. క్రీడాభిరామంలో మైలార భక్తుల ప్రస్తావన ఉన్నది. కర్నాటకలోని బనవాసి రాజధానిగా క్రీస్తు శకం **345** నుండి **525** వరకు పాలించిన కదంబ రాజుల కాలంలో శైవం, వీర శైవం ప్రధాన మతాలుగా ఒక వెలుగు వెలిగాయి. కదంబ సామ్రాజ్యంలో పెద్ద సంఖ్యలో గౌరవలు ఉండే వారని ఆ రాజులు జారీ చేసిన తలగొండ తదితర శాసనాలు చెబుతున్నాయి. గోరయ్యలతో పాటు కాపాలికులు, పాశుపతులు, కాల ముఖులు తదితర శైవ సాంప్రదాయాల వారు ఉన్నట్లు ఈ శాసనం చెబుతోంది. కిన్నెర గౌరవలు మైలార దేవుడి ఆలయంలో కిన్నెర అనే వాయిద్యాన్ని మోగించేవారు. తమ దేహాలను చర్మంతో చేసిన పట్టాలతో రక్తం కారేలా కొట్టుకుంటూ మైలరుడి పట్ల తమ భక్తిని చాటుకునే వారే కమచ వీరులు. కరనిక గౌరవలను సజీవ మైలారులుగా భావిస్తారు. సంచియవారు ఎల్లప్పుడు తమ వెంట ఒక సంచిలో బండారును పెట్టుకుంటారు. రథ

సారథి గుర్రాన్ని దౌడు తియించేందుకు కొట్టే విధంగా చాతియవారు తమను తాము కొట్టుకుంటారు. మల్లన్న జాతరల సమయంలో ఇనుప గోలుసులను తెంచే హక్కు కేవలం సరపల్లి గోరయ్యలకు మాత్రమే ఉంటుంది. నిప్పుల గుండం పై నుండి నడిచిన అనంతరం గోరయ్యలు పూనకంతో ఇనుప గొలుసులను తెంచటం కురుమ, కురుబల సంప్రదాయం. పవడ గోరయ్యలు తమ బుగ్గలకు చిన్న, చిన్న త్రిశూలలను గుచ్చు కుంటారు. పహారీ గొరయ్యలు తమ వెంట ఉండే పెద్ద ఇనుప గంటలను మొగించటం ద్వారా పూజా రార్యక్రమాలకు సంబందించిన సమాచారాన్ని శివ భక్తులకు తెలియజేస్తారు. నాయి అనే గొరయ్యలు మల్లికార్జున స్వామి కుక్కల మాదిరిగా వ్యవహరిస్తారు. ఇదే విధంగా మద్దెల, దోని, కొయికలు, కరడి గొరయ్యలు కూడా ఉంటారు. వేంగి రాజు యుద్దమల్ల బెజవాడలో కుమార స్వామి కోసం ఒక దేవాలయాన్ని నిర్మించటంతో పాటు కుమారస్వామి ఉత్సవాలు నిర్వహించే గోరగల కోసం ఒక మఠాన్నికూడా ఏర్పాటు చేసినట్లు బెజవాడ స్తంభ శాసనం చెబుతోంది. కర్ణాటకలోని బళ్ళారి జిల్లా హడగాలి తాలూకాలోని మైలార గ్రామంలోని మైలార లింగేశ్వర దేవాలయంలో సంవత్సరానికి ఒకసారి జరిగే మైలార జాతరలో స్థానిక గోరయ్య పది అటుగుల ఎత్తైన విల్లుపై నిలబడి భవిష్యవాణి చెప్పే ఆనవాయితీ ఇప్పటికి కొనసాగుతోంది. బ్రహ్మ దేవుడు ఇచ్చిన వరాల ఆధారంగా అహంకారంతో ప్రజలను వేధించటంతో పాటు యజ్ఞ, యాగాదులకు అడ్డు తగులుతున్న మల్లాసురుడు, అతని సోదరుడు మనికాసురున్ని హతమార్చేందుకు శివుడు మైలరుడి అవతారం ఎత్తినట్లు ప్రతీతి. మైలార దేవుడు ఏడు కోట్ల మంది గొరవ సైనికులతో వెళ్లి మల్లాసురుడి, మనికాసురున్ని హతమార్చినట్లు పురాణ కథ చెబుతోంది. మైలార దేవుడు మల్లాసురుడు, మనికాసురున్ని యుద్దంలో ఓడించిన అనంతరం వారి పేగులను తలపాగ మాదిరిగా చుట్టుకున్నాడని, వారి పళ్ళను గవ్వల హారంగా, నోటిని డమురుకం, పుర్రెను భోజనం గిన్నె, చర్మాన్ని పొడువాటి కోటుగా చేసుకున్నట్లు ప్రముఖ జర్మన్ మానవ శాస్త్రవేత్త గుంతేర్ సొంతమిర్ తన "దేవుళ్ళు,హీరోలు, వారి కథకులు" అనే పుస్తకంలో తెలిపారు. మైలారుడు ఇరువురు రాక్షసుల దేహాల్లోని కొవ్వును నునే, పేగులను వత్తులుగా చేసి దీపం వెలిగించినట్లు ఆయన తన పుస్తకంలో పేర్కొన్నారు.

కర్ణాటక నుండి వలస వచ్చిన వారా?

తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో నివసిస్తున్న కురుమ కులం ప్రజలు కొన్ని

వందల సంవత్సరాల క్రితం కర్ణాటక నుండి వలస వచ్చి ఉంటారు. తెలంగాణా ముఖ్యంగా హైదరాబాద్ లోని కురుమ ప్రజలు నలభై, యాభై సంవత్సర క్రితం తెలుగు భాషలో పలు కన్నడ పదాలను ఉపయోగించే వారు. కాల క్రమంలో అవి మారిపోయాయి. రెడీమేడ్ బట్టల సంప్రదాయం ప్రారంభానికి ముందు చాల మంది దర్జీ వద్ద కొత్త బట్టలు కుట్టించుకొవటం పరిపాటి. బట్టలు కుట్టించుకునేందుకు మన కొలత ఇవ్వవలసి ఉంటుంది. మాములుగా ఐతే దీనిని కొలత ఇవ్వటం అంటాము. ఐతే కన్నడలో దీనిని ఆల్తి ఇవ్వటం అంటారు. నా చిన్నప్పుడు మా అమ్మ కొత్త బట్టలు కుట్టించుకునేందుకు దర్జీ వద్దకు వెళ్లి 'ఆల్తి' ఇచ్చి రా అని చెప్పేది. హైదరాబాద్ లోని కురుమలు తర,తరాల నుండి ఇక్కడే ఉండి ఉంటె 'ఆల్తి' అనే కన్నడ పదం ఎందుకు వాడేవారు. మా అమ్మ మేక పోతును ఎప్పుడు కూడా పోతూ, పొటేలు అని పిలిచేది కాదు, ఆమె పొటేలు ను 'తగరు' అని అనేది. ఇదిలా ఉంటే నా చిన్నతనంలో కురుమల ఇళ్ళల్లో ఏదైనా పండుగ, లేదా పెళ్లి కార్యక్రమం జరిగితే మగవాళ్ళందరు కూడా తలపై మరాట్వాడా ప్రజలు పెట్టుకునే మరాఠీటోపీ ధరించే వారు. ఈ లెక్కన తెలంగాణా ముఖ్యంగా హైదరాబాద్ లోని కురుమలు కర్ణాటక నుండి మహారాష్ట్ర మీదుగా ఇక్కడికి వలస వచ్చి స్థిరపడి ఉంటారు.

తమిళనాడులో కురుంబ , కురుమాన్

తమిళనాడులో గొర్రెలకాపర్లను కురుంబ,కురుంబార్, కురుమాన్ అని పిలుస్తారు. **1891** మద్రాస్ జనాభా లెక్కల నివేదిక ప్రకారం కురుంబ ప్రజలు పల్లవులకు ఆధునిక ప్రతినిధులని చరిత్రకారులు భావిస్తున్నారు. పల్లవులు దాదాపు ఆరేడు వందల సంవత్సరాల పాటు ఆంధ్ర దేశంలోని పలు ప్రాంతాలతో పాటు తమిళనాడు, కేరళలోని పలు ప్రాంతాలను పాలించారు. పల్లవ లేదా కురుంబ సామ్రాజ్యం ఆదొండ చోళుడి దండ యాత్రతో ముగిసినట్లు చరిత్ర చెబుతోంది. ఆదొండ చోళుడు జరిపిన దాడిలో ఓటమి పాలైన కురుంబలు ప్రాణ భయంతో చెల్లాచెదరై అడవులపాలైపోయారు. ఓటమి మూలంగా రెండుగా చీలిపోయిన కురుంబలలోని ఒక వర్గం పర్వత ప్రాంతాలైన పశ్చిమ కనుమలలోని నిలగిరి,మలబార్ లోని వయనాడ్, మైసూర్ లోని కూర్గ్ ప్రాంతానికి పారిపోతే రెండో వర్గం మైదాన ప్రాంతాలకు వెళ్లి గొర్రెల కాపర్లుగా స్థిరపడిపోయారాని చరిత్రకారులు అంటున్నారు. తమిళనాడులోని కురుంబ కులంలో **23** ఉప కులాలు ఉన్నాయని మకేంజీ పత్రాలలో పేర్కొన్నారు. అంత్రోపోలోజిస్ట్ సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ థర్ స్టన్ ప్రకారం తమిళనాడు కురుంబ వర్గం వారు నాలుగు రకాలు. బెట్ట

కురుంబార్, ముళ్ళు కురుంబార్, ఉరలీ కురుంబార్, థానే కురుంబార్. డబ్ల్యూ. ఫ్రాన్సిస్ (ఐ.సి.ఎస్) మాత్రం కురుంబలను మూడు రకాలుగా విభజించారు. పీఠ భూమి ప్రాంతంలో నివసించే కురుంబలు, నెల్లియాలం ప్రాంతంలో నివసించే ఉరు కురుంబ వయనాడ్ ముఖ్యంగా మదుమలై వైపు అత్యధిక సంఖ్యలో నివసించే జెన్ కురుంబ లేదా షోల నాయకులు. తమిళ నాడు ప్రభుత్వం నీలగిరి ప్రాంతంలో నివసించే కురుంబ వర్గం ప్రజలను గిరిజనులుగా ప్రకటించింది. నిలగిరి కొండల్లో నివసించే వారు తమను తాము కురుంబార్ అని పిలుచుకుంటారు. తమను కురుంబ అని పిలవటం వారికి నచ్చదని డాక్టర్ కే.ఎస్.ల్. సింగ్ పేర్కొన్నారు. తమిళనాడులోని కురుంబలలో జేను కురుంబ, బెట్టు కురుంబ, ఆనే కురుంబ, కురి కురుంబ, వేద కురుంబ, ముళ్ళు కురుంబ, కల్ల కురుంబ,పాల్ లేదా హాల్ కురుంబ, వొక్కలిగ్ కురుంబ, హండికురుంబ, హండె కురుంబ, కంబలి కురుంబ, ఇడైయాస్ కురుంబ, కురుంబగొల్ల, సామంతకురుంబ, కోతికురుంబ, సున్నాంబుకురుంబ తదితర ఉపకులాలు ఉనాయి. కురుంబలను కొన్ని చోట్ల కురుంబాన్, కురుమాన్ అని కుడా పిలుస్తారని గుస్తవ్ ఒప్పెర్ట్ తెలిపారు. కల్లకురుంబలే తరువాతి కాలంలో 'కల్లాస్' అనే ప్రత్యేక కులంగా ఏర్పడిందని ఒప్పెర్ట్ అభిప్రాయపడ్డారు. పుదుకోట్టాయి రాజులు కల్లాస్ కులానికి చెందిన వారనేది అందరికి తెలిసిందే. కురుంబ ప్రజల్లో ఐదు ప్రత్యేక విభాగాలు ఉన్నాయని డాక్టర్ జే.పార్థసారథి తెలిపారు. అవి ఆలు లేదా పాలు కురుంబ, బెట్ట కురుంబ, జేను లేదా తీన్ కురుంబ, ముళ్ళు కురుంబ, ఉరలికురుంబ. కర్నాటక ప్రాంతం కురుబల్లో కుడా ఇలాంటి విభజన కొద్దిమార్పులతోఉండటంగమనార్హం.తమిళనాడుకుచెందినకురుంబార్వర్గం ప్రజలు పల్లవ రాజ వంశం వారని ప్రొఫెసర్ సక్తివేల్ అభిప్రాయపడ్డారు. పల్లవ సామ్రాజ్యం దక్షిణాపథమంతా వ్యాపించి ఉండేది, అయితే పల్లవ సామ్రాజ్యం పతనానంతరం వీరంతా అడవులకు పారిపోయారని సక్తివేల్ వాదించారు. ఒకప్పుడు దక్షిణాదిని పాలించిన కురుంబ లేదా పల్లవుల ఆధునిక ప్రతినిధులే ప్రస్తుత కురుంబలు అని **1891** మద్రాస్ జనాభా లెక్కల సేకరణ నివేదిక చెబుతోంది. చోళ రాజు ఆదొండ చోళ ఏడు లేదా ఎనిమిదవ శతాబ్దంలో కురుంబ సామ్రాజ్యాన్ని సమూలంగా పెకిలించి వేశారు. దీని పర్యవసానమే కురుంబ వర్గం వారంతా నిలగిరి, వాయినాడ్ అడవుల పాలయ్యారు.

దేశంలోని ఇతర గొర్రెల కాపర్ల మాదిరిగానే తమిళనాడు కురుంబ వర్గం ప్రజలు కూడా గొర్రెలు, మేకలను మేపటంతో పాటు ఉన్ని కంబళ్ళు నేస్తారు. నిలగిరి అడవుల్లో నివసించే వారిని ముళ్ళు కురుంబ అని పిలుస్తారు. తమిళ నాడులో కురుంబ ఒక్కలిగలు

కూడా ఉండటం గమనార్హం. వ్యవసాయం చేసే కురుంబ ప్రజలను కురుంబ ఒక్కలిగ అని పిలుస్తారని నిలగిరి జనాభా నివేదిక చెబుతోంది. కేవలం గొర్రెల పెంపకం పని చేసే కురుంబ ప్రజలను కురుంబ ఇడైయాస్ , కురుంబ గొల్లలని పిలుస్తారు. వీరిని కూరి కురుంబ అని కూడా పిలుస్తారు. పాల్ లేదా హాల్ కురుంబ వర్గం వారికి పాలు విక్రయించటం జీవనోపాది. కంబలి కురుంబ లు కంబళ్ళు నేస్తారు. ఆనే కురుంబ లు ఏనుగులను పోషిస్తారు. ఏనుగులను మచ్చిక చేసుకోవటంలో ఆనే కురుంబలు సిద్ధహస్తులు. కల్లకురుంబలు దారి దోపిడిలు చేసి బతికేవారు. ఒకప్పుడు సైనికులుగా పని చేసిన కల్ల కురుంబలు రాజ్యాలు పతనమైన తరువాత సైనిక పని లేకపోవటం మూలంగా దొంగలుగా మారారు, అందుకే వీరిని కల్ల, కళ్ళన్ అని పిలిచేవారని ఒప్పర్ట్ తెలిపారు. తమిళ భాషలో కళ్ళన్ అంటే దొంగ అని అర్థం. పుదుకోట్టాయ్ తెలుగు రాజులు కల్లన్ కురుంబలని గుస్టావ్ ఒప్పర్ట్ అభిప్రాపడ్డారు. పుదుకోట్టాయ్ రాజులు ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షిక పూజా కార్యక్రమంలో కురుంబ గురువులకు పెద్ద పీఠవేస్తారాని ఒప్పర్ట్ తెలిపారు. వాస్తవానికి కల్ల కురుంబలు తొండమండలంలోని తిరుపతి ప్రాంతానికి చెందిన వారు. కరువు మూలంగా వారు తమిళ ప్రాంతానికి వలస వెళ్లి అక్కడ కాల కాలక్రమంలో తంజావూరు ప్రాంతంలో రాజ్యం ఏర్పాటు చేసుకున్నారని ఒప్పర్ట్ తన భారత దేశం మూల నివాసులు అనే పుస్తకంలో తెలిపారు. కల్ల వర్గం ప్రజలు కురుంబలేనని 'మెకంజీ పత్రాలు'కూడా సూచిస్తున్నాయి. కురుంబలది హవ్యాక గోత్రం, రేణుక లేదా రేవన సూత్రం అని గుస్టావ్ ఒపెర్ట్ చెప్పారు. ఒక పురాతన కథనం ప్రకారం భ్రంగి అనే ఋషి ఇచ్చిన శాపం మేరకు శివుని ప్రమద గణాలు గొర్రెలుగా మారాయనీ, రేనుకారాధ్య లేదా రేవన సిద్ధ శాప విముక్తి చేయించారని ఒప్పెర్ట్ తన 'భారత దేశం మూల నివాసులు ' అనే పుస్తకంలో తెలిపారు. కొందరు కురుంబలు తమ దేవుడిని 'కురిబెట్టరాయ' అంటే గొర్రెలరాజు అని కూడా పిలుస్తారు. ఒక్కలిగ లేదా వొక్కలిగ కురుంబలు వ్యవసాయం చేయటం మూలంగా వారికి ఈ పేరు వచ్చింది. దాదాపు వంద సంవత్సరాల క్రితం నీలగిరి అడవులలో నివసించే వొక్కలిగ కురుంబలు, ఒక్కలిగ వర్గం ప్రజలు ఒకే గురువు పరిధిలోకి వచ్చేవారు. వీరి గురువు బారా మహల్ లోని కంగుండిలో నివసించే వాడు. నిలగిరి ప్రాంతంలోని కురుంబల దేవాలయాలను కురుంబ కోవిల్ అని పిలుస్తారు. మధ్యలో పెద్ద రాయి, దాని చుట్టు వర్తులాకారంలో మరికొన్ని చిన్నరాళ్ళను పేర్చటం ద్వారా నిర్మించే వీటిని కన్నడంలో 'హిరియ దేవా' పెద్ద దేవుడు అని పిలుస్తారు. ఇదే విధంగా మలబారు ప్రాంతంలోని కురుంబలు 'మలయదేవుడిని' కొలుస్తారు. మలబార్ లో కురుంబనాడు అనే ఒక సబ్ డివిజన్ ఇప్పటికి ఉండటం ఒకప్పడి కురుంబ

ప్రజల ప్రాధాన్యతకు అద్దం పడుతుంది. నిలగిరి పీఠ భూమి ప్రాంతంలో నివసించే కురుంబలు కన్నడ,తమిళ్ మరియు బడగ భాషల మిశ్రమంతో ఏర్పడిన భాషను మాట్లాడతారు. మైదాన ప్రాంతంలో నివసించే కురుంబలు కన్నడ భాష మాట్లాడుతారు.

కురుంబ ప్రజలు ముఖ్యంగా నిలగిరి పర్వత ప్రాంతాలలో నివసించే కురుంబ ప్రజలు ప్రతి గ్రామానికి ఇద్దరు 'గ్రామ పెద్ద'లను ఎన్నుకుంటారు. మొదటి గ్రామ పెద్దను 'మనియగర'అని, రెండో గ్రామ పెద్దను తలెవర్ అని పిలుస్తారు. గ్రామ పెద్దలకు ఇద్దరు సహాయకులను కూడా నియమిస్తారు. మొదటి సహాయకుడిని 'బండారి' , రెండోసహాయకుడినికురుదలేఅనిఅంటారు.ప్రతికురుంబగ్రామానికిఇద్దరు
పూజారులు ఉంటారు. మొదటి పూజారిని 'మన్నుగారా' అని పిలిస్తే రెండో పూజారిని 'కానీ-కురుమ' అని పిలుస్తారు. కానీ-కురుమ బడగ కులానికి కుడా అనుబంద పూజారిగా పని చేస్తాడు. ఇందుకు గాను కానీ-కురుమ వస్తు రూపంలో కొంత మూల్యం తీసుకుంటాడు. కురుంబ ప్రజలు తమ గురువును 'కనిగర' అని అంటారు. కురుంబలకు 'దెవ్వగర' అనే భూత వైద్యుడు ఉంటాడు. భూత సంబంధమైన సమస్యల పరిష్కారం కోసం కురుంబలు 'ఒడిగర' లేదా 'ఒడియా' అనే మాంత్రికుడిని కూడా నియమించుకుంటారు. ఈ ఒడిగర మాంత్రికుడు మంత్రాలు లేదా మూలికల ద్వారా శత్రువులను అనారోగ్యానికి గురి చేస్తారు లేదా చంపగలుగుతారన్నది కురుంబల విశ్వాసం. వైద్య సంబంధమైన పనుల కోసం నియమించుకునే వ్యక్తిని 'మద్దుగర' అని పిలుస్తారు. కురుంబలు అనారోగ్యానికి గురైనప్పుడు వారిని ఆరోగ్యవంతులను చేయవలసిన బాద్యత ఈ మద్దుగరపై ఉంటుంది. కురుంబల గ్రామంలో పూజారి, భూత వైద్యుడు, మద్దుగర తప్పకుండా ఉండవలసిందే. కురుంబలు వీరితో పాటు ఇంద్రజాలం, మ్యాజిక్ కోసం ఒకరిని నియమించుకుంటారు. అతన్ని 'పిల్లిగర' అని అంటారు. పిల్లిగర అవసరమైతే జంతువుగా మారగలుగుతాడన్నది కురుంబల విశ్వాసం. కురుంబల గ్రామాలను మొట్ట, కొంబై లేదా హుడిస్ అని పిలుస్తారు. కురుంబలు మంత్ర, తంత్ర విద్యల్లో సిద్ధహస్తులని నిలగిరి ప్రాంతంలోని ఇతర వర్గాల ప్రజలందరు నమ్ముతారు. నిలగిరి కురుంబల్లో తొమ్మిది రకాల పెళ్లిల్లు ఉండటం గమనార్హం. తాత్కాలిక పెళ్లి, బలవంతంగా జరిగే పెళ్లి, సామర్థ్యాన్ని ప్రదర్శించటం ద్వారా జరిగే పెళ్లి, పెళ్లి కూతురు గుణ, గణాలను చూసి చేసుకునే పెళ్లి, పెళ్లి కూతురును కొనుగోలు చేయటం ద్వారా జరిగే పెళ్లి, ప్రేమ పెళ్ళిళ్ళు, చొరబాటు పెళ్లి, ఒక మహిళను పలువురు సోదరులు పెళ్లి చేసుకోవటం, యువతి, యువకులు తమలపాకులు ఇచ్చి, పుచ్చు కోవటం ద్వారా తమ ఇష్టాన్ని ప్రకటించటం వలన జరిగే పెళ్లి. కురుంబలు తమ

పూర్వికులను కురుపదె తాయి అని పిలుస్తారు. ఆత్మలను విశ్వసించే కురుంబలు 'మునిరవల' అనే ఆత్మ అత్యంత భయంకరమైనదని నమ్ముతారు. అందుకే ఈ ఆత్మకు ప్రతి సంవత్సరం ఒక దున్న పోతును బాలి ఇస్తారు. 'మునిస్పుర' అనే ఆత్మ తమను ఎల్లప్పుడు కాపాడుతూ ఉంటుందన్నది కురుంబల విశ్వాసం. కునిస్పుర ఆత్మకు వీరు ప్రతి సంవత్సరం ఒక గొర్రె లేదా మేకను బలి ఇస్తారు. కురుంబలు బరుమ దేవా అంటే బ్రహ్మ దేవుడు, యమ ధర్మ రాజును పుజిస్తారు. కురుంబ యువకులు శివుడిని పుజిస్తారు.

కురుమాన్

కురుమాన్ కులం వారు నిలగిరి, వైనాడ్ ప్రాంతంలో అధికంగా ఉన్నారు. మలబార్ లోని నీలంబుర్, అత్తపాడి పర్వత ప్రాంతాల్లో కొద్దిగా ఉన్నారు. కట్టెలు కొట్టడం, అడవి ఉత్పత్తుల సేకరణ జీవనోపాదిగా ఉన్న వీరు కురుమబాన్, కురుంబార్లేనని అని చరిత్రకారులు చెబుతున్నారు. పశ్చిమ కనుమల్లోని లోతట్టు ప్రాంతాల్లో నివసించటం వల్లనే వీరు కురుంబాన్ లకు దూరమయ్యారని భావిస్తున్నారు. కురుమాన్లు కురుంబ రాజవంశానికి చెందిన వారనీ, మలబార్ లోని కురుంబనాడ్ సబ్ డివిజన్ ఇందుకు నిదర్శనమని చరిత్రకారులు భావిస్తున్నారు. కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాలలోని నీలగిరి చుట్టుపక్కల అడవుల్లో వీరు నివసిస్తున్నారు. కురుమాన్ కులం వారు గొర్రెలు మేపరు, వీరు ప్రధానంగా తేనె సేకరించటం, బుట్టలు అల్లటం వంటి పనులు చేస్తారు. పట్టాణాలలో నివసించే కురుబ వర్గం పాటించే అన్ని పద్దతులు, సాంప్రదాయాలను వీరు కూడా పాటిస్తారు. భాష,మతం, నృత్యం, పండుగలు అన్ని ఒక్కటే. శిలాకారం లోని శివ లింగాన్ని పూజించటం వీరి ఆచారం. కురుమాన్ కాడు కురుబలు మైలారలింగ, బీరలింగేశ్వర, ఖండోబా, మహాదేశ్వర, నంజుండేశ్వర, మల్లప్ప, మల్లేశ్వర, మల్లికార్జున, జుంజప్పలను పూజిస్తారు. కాడు కురుబ వర్గం దేవాలయాల్లో వారే పూజారులుగా వ్యవహరించటం గమనార్హం. కాడు కురుబలు కర్నాటకకు చెందిన హొయసల సామ్రాజ్యం, విజయనగర సామ్రాజ్యం,తమిళనాడుకు చెందిన పల్లవ సామ్రాజ్యంలో సైనికులుగా తమ సత్తాను చాటుకున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. కబిని నది, నగర్హోల్ నది, నూగు నదికి ఇరువైపుల వీరి నివాస ప్రాంతం. నిలగిరి కురుంబల దేవుడి పేరు కురుబెట్టరాయ, గురునాథ. కురుబెట్టరాయ అంటే గొర్రెలు ఉన్న గుట్టకు రాజు అని అర్థం. అదే విధంగా గురునాథ అంటే కురునాథ అంటే కురు, కురుంబల దేవుడు అని అర్థం. గొర్రెల గుట్ట (కురిబెట్టరాయ) పై ఉన్న దేవుడి పేరు 'బీర' అని డాక్టర్ ఎఫ్. బుకనాన్

పేర్కొనటం తెలిసిందే.

ఆదొండ చోళుడు కురుంబ సామ్రాజ్యాన్ని పతన చేసిన అనంతరం ఆ ప్రాంతానికి ఉన్న కురుంబనాడు అనే పేరును తొలగించి దానికి తొండమండలం అని నామకరణం చేశారు. తొండమండలంలో కురుంబ, కురుమాన్ వర్గం వారి ప్రాధాన్యతను తగ్గించేందుకు ఆదొండచోళుడు ఆ ప్రాంతంలో ఇతర కులాల వారిని ముఖ్యంగా వెల్లలార్, కనక కులం ప్రజలకు స్థిరనివాసం కల్పించారు. వెల్లలార్ తో పాటు మరికొన్ని కులాలకు చెందిన ప్రజలకు కురుంబనాడులో స్థిర నివాసం ఏర్పాటు చేయటంతో పాటు వ్యవసాయం చేసుకునేందుకు పెద్ద ఎత్తున భూములను ఉచితంగా కేటాయించినట్లు చరిత్ర చెబుతోంది.

ఉత్తరాదిలోని కుర్మి, కుంబి, కున్బి

బిహార్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో కుర్మి, కున్బి, కుంబి కులం ప్రజలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. బీహార్, ఉత్తర ప్రదేశ్ లో ఉన్న కుర్మి వర్గం ప్రజలు భూస్వాములు, వ్యవసాయదారులు, మహారాష్ట్రలో ఉన్న కున్బి, కుంబి వర్గం ప్రజలు వ్యసాయదారులు, సైనికులు. కుర్మి కుంబి, కున్బి పదం పుట్టుక పై రక, రకాల వాదనలు ఉన్నాయి. కూర్మి, కుంబి, కున్బి అనేది సంస్కృతంలోని 'క్రస్' పదం నుండి పుట్టిందని రెవరెండ్ డాక్టర్ జాన్ విల్సన్ ప్రతిపాదించారు. సంస్కృతంలో క్రస్ అంటే దున్నటం అని అర్థం. సంస్కృతంలో 'క్రస్మి'అంటే దున్నేవాడు అని అర్థం. ఐతే రెవరెండ్ జాన్ విల్సన్ చేసిన ఈ ప్రతిపాదనతో గుస్టావ్ ఒప్పర్ట్ ఏకీభవించలేదు. తనకు తెలిసినంత వరకు సంస్కృతంలో 'క్రస్మి' అనే పదమే లేదని గుస్తవ్ ఒప్పెర్ట్ వాదించారు. జాన్ విల్సన్ చేసిన ఈ శబ్ద ఉత్పత్తి తప్పని ఒప్పెర్ట్ అభిప్రాయపడ్డారు. ఒప్పెర్ట్ ప్రకారం కూర్మి, కున్బి, కుంబి అనే పదాలు 'కురుమి', 'కురుంబి' అనే పదాలను కుదించటం వలన ఏర్పడ్డాయి.'కుర్మ' అనే పదము 'కురుమ'లేదా 'కురుంబ'నుండి వచ్చాయని ఆయన చెప్పారు. 'ర' అక్షరము 'ద'గా మారటం వలన 'కురుంబ' కుదుంబ' గా మారుతుందని ఆయన తెలిపారు. తంజావురు ప్రాంతంలోని వ్యవసాయదారులు తమను తాము 'కుదుంబన్' లుగా పిలుచుకుంటారు. 'కుడుంబన్' మరియు 'కుడుంబి' రెండు ఒకటేనని ఒప్పెర్ట్ అభిప్రాయపడ్డారు. 'కురుంబి' అనే పదం నుండే మరాఠి భాషలోని 'కుంబి లేదా కున్బి' పేర్లు పుట్టాయి. 'కుంబి' అనే పదము కాల క్రమంలో 'కున్బి'దీని నుండి 'కునబి, కునుబి' పేర్లు వచ్చాయని ఒప్పెర్ట్ తెలిపారు. పాత మరాఠీ భాషలో 'కుడుంబి' అనే పదము

ఇప్పటికి కొనసాగటం కున్బి, కుంబి పదాలకు 'కుదుంబ, కురుంబ' పదాలతో ఉన్న సంబంధాన్ని సూచిస్తున్నాయని ఒప్పెర్ట్ వాదించారు. కుర్మి, కున్బి, కుంబి కులం ప్రజలు 'శూద్రుల' పరిధిలోకి వస్తారు. ఐతే కొందరు కుర్మిలు ఇప్పుడు తమను తాము క్షత్రియులుగా చెప్పుకుంటున్నారు. మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన శివాజీ తో పాటు సతారా, తంజావూరు, సింధియా రాజ వంశాలు కున్బి కులానికి చెందినవి. శివాజీ మహారాజ్ తల్లి జిజా భాయి గొర్రెల కాపరులైన ధనగర్ కులానికి చెందిన వనిత అనేది అందరికి తెలిసిందే.

కదంబ కురుంబ ఒకరేనా

కదంబ రాజ వంశం క్రీస్తు శకం **345** నుండి **525** వరకు ఉత్తర కర్ణాటక, కొంకణ్ ప్రాంతాన్ని 'బనవాసి' నగరం రాజధానిగా పరిపాలించింది. మయూర వర్మ లేదా మయూరశర్మ **345**లో కదంబ రాజ్యాన్ని స్థాపించారు. మయూర వర్మ కంచిని రాజధానిగా చేసుకుని పరిపాలన కొనసాగిస్తున్న పల్లవులను ఓడించి కదంబ రాజ్యాన్ని స్థాపించినట్లు చరిత్ర చెబుతోంది. కుక్కుస్తవర్మ కాలంలో కదంబ రాజ్యం అత్యున్నత శిఖరాలను అధిరోహించింది. కదంబలు ఎవరు? వీరి పుర్వాపరాలు ఏమిటి? అనే అంశంపై రక,రకాల కథనాలు చలామణిలో ఉన్నాయి. త్రిపుర రాక్షసుడిని ఓడించిన తరువాత పరమ శివుడి నోదుటి నుండి కదంబ చెట్టు మధ్యలో రాలిన చెమట బొట్టు నుండి ఉద్భవించిన మూడు కళ్ళు, నాలుగు చేతులున్న త్రిలోచన లేదా త్రినేత్ర కదంబ **(**మయూర వర్మ తండ్రి**)** కదంబ రాజ్యాన్ని స్థాపించారనేది మొదటి కథనం. రెండో కథనం ప్రాకారం మయూర వర్మ కదంబ చెట్టు కింద శివుడు, భూదేవి లేదా పార్వతికి పుట్టిన సంతానము. మయూర వర్మ ఉత్తరాదికి చెందిన నాగ రాజులు, నంద రాజులకు చెందిన వాడని మూడో కథనం చెబుతోంది. ఐతే **1989** లో లభించిన ఒక శాసనం ప్రకారం కదంబ స్థాపకుడైన కదంబ రుద్ర అడవిలో కదంబ వృక్షం కింద జన్మించాడు. కదంబ వృక్షం కింద జన్మించిన రుద్ర వర్మ దేహంపై నెమలి పించాల వంటి ప్రతి బింబాలు ఉండటం వలన అతన్ని మయూర వర్మన్ అని పిలిచారని శిలా శాసనం ద్వారా తెలుస్తోంది. మరో కథనం ప్రకారం యల్గి ప్రాంతానికి చెందిన ఒక బ్రాహ్మణుడు రాజు కావాలనే కోరికతో మధుకేశ్వరుడి దీవెనల కోసం తపస్సు చేస్తాడు. మధుకేశ్వరుడు అతని తపస్సును మెచ్చి మరు జన్మలో నెమలిగా పుట్టినప్పుడు నెమలి తలను తిన్న వాడు రాజు అవుతాడు,చాతిని తిన్నవారు మంత్రులు అవుతారు, ఇతర భాగాలను తిన్నవాడు

కోశాధికారి అవుతాడని చెబుతాడు. మధుకేశ్వరుడి వరంతో సంతృప్తి చెందిన బ్రాహ్మణుడు కాశికి వెళ్లి ఆత్మ హత్య చేసుకుని మరు జన్మలో నెమలిగా పుడతాడు. నెమలిగా పుట్టిన బ్రాహ్మణుడు అడవిలో సంచరిస్తూ తన తలను తినేవాడు రాజు అవుతాడంటు గట్టిగా అరుస్తుంటాడు. కదంబ చెట్టు కింద సేద తీరుతున్న దొంగలు ఇది విని ఆ నెమలిని చంపుతారు. నెమలిని పుష్పవతి అనే మహిళకు ఇచ్చి తాము నదికలో స్నానం చేసి వచ్చేలోగా వండి పెట్టాలని చెప్పి వెళతారు. దొంగలు స్నానం చేసేందుకు నదికి వెళ్ళిన తరువాత పుష్పవతి కొడుకు ఆకలితో ఇంటికి వచ్చి తినేందుకు తనకేదైనా పెట్టాలని కోరుతాడు. అపటికే నెమలి వంట పూర్తి చేసిన పుష్పవతి తల భాగాన్ని కొడుకుకు వడ్డిస్తుంది. నదిలో స్నానం చేసి వచ్చిన దొంగలు నెమలి మాంసంతో భోజనం చేసి వెళ్ళిపోతారు. వారికి కొంత కాలం తరువాత బ్రాహ్మణుడు చెప్పిన విషయం జ్ఞాపకం వస్తుంది. నెమలి తల తిన్న తమలో ఒకరు రాజు కావాలి కదా, ఎందుకు కాలేదనే అనుమానం కలుగుతుంది. వారు పుష్పవతి వద్దకు వచ్చి నెమలి తలను తమలో ఎవరికి వడ్డించారని అడుగుతారు. దొంగలను చూసి భయపడిన పుష్పవతి నెమలి తలను తన కుడుకుకు వడ్డించిన విషయం వెల్లడిస్తుంది. దీనితో తల రాతను ఎవ్వరు మార్చలేరని అనుకుంటూ వారు అక్కడి నుండి వెళ్ళిపోతారు. మరో వైపు జయంతిపుర రాజు ఆనకాపురందర వంశోద్ధారకుడు లేకుండానే మరణిస్తాడు. జయంతి పురం సంప్రదాయం మేరకు మంత్రులు పరిస్తితిని సమీక్షించిన అనంతరం కొత్త రాజును ఎన్నుకునేందుకు పట్టపుటేనుగు తొండానికి పుష్ప మాల ఇచ్చి నగరంలోనికి పంపిస్తారు. పట్టపుటేనుగు నగరం పొలిమేరలో పుష్పవతి కుమారుడి మేడలో పుష్ప మాలను వేస్తుంది. మంత్రులు ఆ యువకుడిని తెచ్చి పట్టాభిషేకం చేసి మయురవర్మ అని నామకరణం చేస్తారు. సంస్కృతంలో నెమలిని మయురం అని అంటారు పైన చర్చించిన అన్ని కథల్లో కదంబ వృక్షం ఉండటం గననార్హం. కదంబలు కూడా కురుంబ వర్గానికి చెందిన వారేననీ, కురుంబ పేరును కొద్దిగా మార్చుకుని కదంబలయ్యారన్నది గుస్టావ్ ఒప్పెర్ట్ వాదన.

ఇదిలా ఉంటే మయూర వర్మ పట్టాభిషేకాన్ని ఆరు తలల స్కందుడు చేయించాడనే మరో కథనం కూడా ప్రచారంలో ఉన్నది. తలగుండ శాసనం సూచిస్తున్నట్లు కదంబలు బ్రాహ్మణులా?శూద్రులా? లేక గిరిజనులా? అనేది నిర్ధారణ కావలసి ఉన్నది. గుస్తవ్ ఒప్పెర్ట్ మాత్రం తన ‘ భారత దేశం మూల నివాసులు’ అనే పుస్తకంలో పై వాదనలన్నింటిని పుక్కిట పురాణాలుగా కొట్టి వేస్తూ ‘కదంబ’ అనే పదం కూడా ‘కురుంబ’ అనే పదం నుండి పుట్టిందని వాదించారు. తమిళ భాషలో కురుంబ అన్నా

కదంబ అన్నా ఒక్కటేననేది మరిచిపోరాదన్నది అతని వాదన. కురుబ లేదా కురుంబ వర్గానికి చెందిన హరిహర, బుక్క రాయలు స్థాపించిన విజయనగర సామ్రాజ్యానికి కదంబ సామ్రాజ్యంతో సన్నిహిత సంబంధాలు ఉండటం తెలిసిందే. విజయనగర సామ్రాజ్యాధీషులు కురుమ కులానికి చెందినవారు. విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన హరిహర, బుక్క కురుంబలైతే కదంబలు కుడా కురుంబలే కదా అన్నది ఒప్పెర్ట్ వాదన. విజయనగర రాజుల మాదిరిగానే కదంబ రాజులు కూడా తమను తాము యాదవులుగా ప్రకటించుకోవటం గమనార్హమని ఆయన తెలిపారు. కురుంబ నుండి కదంబగా మారిన ఈ రాజులు తమ వాదనను బలపరచుకోవటంతో పాటు కదంబ పదానికి ప్రాధాన్యత, ప్రాచస్త్యాన్ని ఆపాదించేందుకు కదంబ వృక్షం కథను సృష్టించి ఉంటారని కొందరు చరిత్రకారులు వాదించారు.

దేవరగుడ్డలో దసరా పండుగ

కర్ణాటక రాష్ట్రంలోని దేవరగుడ్డ లో నిర్వహించే దసరా ఉత్సవాలు కురుబ, కురుమ కులం ప్రజల చరిత్ర, సంస్కృతీ, జీవన విధానానికి అద్దం పడతాయి. దసరా ఉత్సవాల సందర్భంగా దేవరగుడ్డలో జరిగే పదకొండు రోజుల ఖండోబా వేట ఉత్సవాలు కురుమ, కురుబల గత చరిత్రకు ఆనవాళ్ళుగా నిలిచాయి. దేవరగుడ్డ గ్రామలోని దాదాపు అరవై కురుబ కుటుంబాల వారు తమలోని ఒక వయో వృద్దుడిని దసరా ఉత్సవాల నిర్వాహకుడుగా ఎన్నుకుంటారు. ఆతను పదకొండు రోజుల పాటు కొండపై ఉన్న ఖండోబా దేవాలయంలో ఉపవాస దీక్షలో ఉంటాడు. అతనే ఖండోబాకు చెందిన పదిహేను అడుగుల విల్లును ఎక్కి భావిష్యత్తు ఎలా ఉండబోతోందనే జోస్యం చెబుతాడు. కురుబ, కురుమ వర్గం ప్రజలు తమ చరిత్రను మరిచిపోకుండా చూసేందుకు ఈ దసరా ఉత్సవాలను క్రమం తప్పకుండా జరుపుకుంటారు. తద్వారా వారు తమ చరిత్ర, సంస్కృతిని కాపాడుకోవటంతోపాటు భావితరాలకు అందజేస్తున్నారు. ధార్వాడ్-హుబ్లి-హరిహర్ మధ్య రనేబెన్నూర్ కు సమీపంలోని ఒక గుట్టపై దేవరగుడ్డ గ్రామం ఉన్నది. దేవరగుడ్డలో అశ్వినీ నెలలోని తొమ్మిది, పదవ తేదిలలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. దసరా పండుగ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే పూజా కార్యక్రమాలు ముగిసిన వెంటనే దేవరగుడ్డ దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తొమ్మిది రోజుల పాటు దేవుళ్ళను పూజించిన ఘటాలను (కుండలను) తొమ్మిది లేదా పదవ రోజు నాడు నదిలో నిమజ్జనం చేస్తారు. కొండ మీది

దేవాలయంలోని దేవుడు తొమ్మిదవ రోజు లేదా దసరాకు ఒక రోజు ముందు రెండు మైళ్ళ దూరంలోని మర్రి చెట్ల తోటలో ఉన్న చిన్న దేవాలయానికి వెళతాడు. నల్ల మర్రి చెట్ల తోటలో ఉన్నాడు కాబట్టి మైలర్ దేవుడిని కర్ణాటకలో కర్యాలదమారయ్య (నల్ల మర్రి చెట్టు దేవుడు) అని కుడా పిలుస్తారు. శివుడు ఇదే రోజు చుట్టుప్రక్కల ప్రాంతంలో ప్రజలను పట్టి పీడిస్తున్న మల్ల అనే ధైత్యున్ని సంహరించి మల్లారి (మల్ల శత్రువు)గా మారాడని స్థానికల విశ్వాసం. మల్లారి తన వేట కుక్కలతో వేటకు వెళ్ళే వాడనీ, మల్లరిని కొండపైన దేవాలయంలో ప్రతిష్టాపించిన అనంతరం ఈ వేట కుక్కలు మనుషులుగా మారి 'వాగయ్యల' పేరుతొ అతనికి సేవ చేస్తున్నారన్నది స్థానికల నమ్మకం.

మైలార్ లేదా మల్లన్న దేవుడు దసరా పండుగ తొమ్మిదవ రోజు తన మంది మార్బలంతో వేటకు వెళతాడు. మైలార్ దేవుడు తొమ్మిదవ రోజు వెళ్ళేది వెటకా లేక శత్రువుల పై యుద్దానికా ? పూర్వ కాలంలో రాజులు దసరా పండుగను ఘనంగా జరుపుకున్న తరువాత శత్రు రాజ్యాలపైకి యుద్దానికి బయలుదేరే వారనేది అందరికి తెలిసిందే. దసరా పండుగను ఘనంగా జరుపుకోకుండా యుద్దానికి బయలుదేరితే అపజయం కలుగుతుందని రాజులు గట్టిగా విశ్వసించే వారు.

తెలంగాణా, ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ప్రజలు, ముఖ్యంగా గొల్ల కురుమ, కురుబ, కురుంబార్, యాదవ, బలిజ తదితర కులాల ప్రజల ఆరాధ్య దైవమైన మల్లన్న, మల్లికార్జున స్వామి, ఖండోబా, మార్తాండ భైరవుడు, మలహరి దేవుడి పూర్వ, పరాలను పరిశీలిస్తే అత్యంత పురాతన సభ్యత, సంస్కృతికి సంబంధిన ఆనవాళ్ళు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. వేద కాలం, వేదకాలానికి ముందున్న కాలానికి చెందిన వ్రాత్యుల తాలూకు సభ్యత, సంస్కృతీ ఆనవాళ్ళు కనిపిస్తాయని జర్మనీ దేశానికి చెందిన ప్రముఖ ఇండాలజిస్ట్ గుంతెర్ సొంతిమేర్ చెప్పటం గమనార్హం. ఏకవ్రాత్యుడుగా పిలవబడే పరమ శివుడు లేదా రుద్రుడు వ్రాత్యుల దైవం. కర్నాటకలోని దేవరగుడ్డ లో జరుపుకునే దసరా పండుగకు అతి ప్రాచీన కాలం నాటి మహావ్రత పండుగతో సంబంధం ఉన్నట్లు కనిపిస్తోందని ఆస్కో పర్పోలా అనే చరిత్రకారుడు తెలిపాడు.

ఖండోబా వేటకు వెళుతున్నప్పుడు ఆయన వెంట మొదటి భార్య మలవ్వ, ఒక మంత్రి ఉంటాడు. ప్రజలు కూడా దివిటిలు పట్టుకుని పెద్ద ఎత్తున ఆయన వెంట వేటకు వెళతారు. ఖండోబా విల్లు పొడువు పదిహేను అడుగులు, మలవ్వ విల్లు దానికంటే కొంత చిన్నది. ఖండోబా పదిహేను అడుగుల విల్లుతోనే దైత్యుడైన మనికా సురా , మల్లా

సురను హతమారుస్తాడు. వేట బృందం కొండ పైన ఉన్న గుడి నుండి కొంత దూరంలో ఉన్న తోట వరకు వెళుతూ చీకటి పడిన తరువాత మధ్యలో ఒక చోట ఆగుతుంది. అప్పుడు వాగయ్యలు తోటలో ఉపవాసం చేస్తున్న పండుగ పెద్దను అక్కడికి తీసుకువస్తారు. పండుగ పెద్ద అక్కడ ఖాళీగా ఉన్న స్థలంలో పెట్టిన ఖండోబా విల్లును పట్టుకుని బలిష్టుడైన వ్యక్తి భుజాలపై నిలుచుంటాడు. ఖండోబా దేవుడు ఆవహించిన అతడు ఆవేశంతో ఊగిపోతూ భవిష్యత్తులో జరుగబోయే సంఘటనలు, పంటల పరిస్థితి, రాజ్యం పరిస్థితి ఎలా ఉంటుంది, తదితర అంశాలపై జోస్యం చెబుతాడు. మరుసటి రోజు అంటే దసరా పండుగ నాడు ఖండోబా వేట ముగించుకుని కొండ మీద ఉన్న తన దేవాలయానికి తిరిగి వస్తాడు. ఖండోబా విగ్రహాన్ని ఉంచిన పల్లకీని ప్రధాన దేవాలయానికి వాయువ్యంలో ఒక పక్కగా పెట్టి అక్కడ హుక్కాను ఏర్పాటు చేస్తారు. శివుడి మాదిరిగా ఖండోబా దేవుడు కుడా హుక్కా తాగుతాడనే విశ్వాసంతో భక్తులు ఇలా చేస్తారు. తండోప తండాలుగా వచ్చే భక్తులు ఖందోబాకు మొక్కులు చెల్లించుకోవటంతో పాటు అక్కడే ఉన్న వాగయ్యల జోలెలో తమకు తోచింది తృణమో, ఫణమో సమర్పించుకుంటారు. దేవాలయంలోని ఉత్తర భాగంలో రెండు అతిపెద్ద సైజు చెప్పులు పెట్టి ఉంటాయి. అవి ఖండోబా, అతని భార్య అడవిలో వేటకు వెళ్ళినప్పుడు తమ పాదాలను రక్షించుకునేందుకు వేసుకునే చెప్పులన్నది భక్తుల విశ్వాసం. పదకొండు రోజుల దసరా ఉత్సవాలకు నాయకత్వం వహించే కుల పెద్ద దేవాలయంలోని దక్షిణ భాగంలో దక్షిణం వైపు తలుపుకు అభిముఖంగా కూర్చొని భక్తులను దీవిస్తాడు. వాగయ్యలు దేవాలయం ముందు ఖండోబా ఘనకార్యాలను స్మరించుకుంటూ ఆనందంతో చిందులు వేస్తుంటారు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి పరిస్థితి గంభీరంగా మారుతుంది. అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్న ప్రజలు చుట్టుపక్కల తమకు అనువైన చోట కూర్చుంటారు. ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రముఖులు ఒక వైపు కూర్చుంటారు. వీరందరి మధ్య ఒక చోట పలు నల్ల గొంగళ్ళు పరుస్తారు. కంచవీరులుగా పిలువబడే కురుబలు లేదా మాదిగ వర్గం వారు తమను తాము ఇనుపఊచలతో పొడుచుకోవటం వంటి వీర కృత్యాలను ప్రదర్శిస్తారు. నాలుకపై కర్పూరం వెలిగించి భగ, భగ మండుతున్న దానిని మింగి వేయటం వంటివి చేస్తారు. డోలు వాయిద్యాల మధ్య వీరు ప్రదర్శించే వీర కృత్యాలు చూసేవారికి గగుర్పాటు కలిగిస్తాయి. వీరు తమను తాము ఆనందంగా హింసించుకుంటూ ఖండోబాకు హారతి ఇస్తారు. వీరు తమను తాము హింసించుకోవటం ద్వారా ఖండోబా పట్ల తమకు ఉన్న భక్తి, ప్రపత్తులను చాటుకుంటారు. అధిక భక్తిని

చాటుకోవాలంటే అధికంగా హింసించుకోవటమే. భుజాలకు సూదులు గుచ్చుకుని వాటిపై చిన్న దీపాలు పెట్టి వాటిలో వత్తులు పెట్టి, నునే పోసి వెలిగించి ఖండోబాకు హారతి ఇవ్వటం ద్వారా తమ అద్భుత భక్తిని చాటుకుంటూ 'ఏల్కోటి మల్లారి మార్తాండ " (ఏడూ కోట్ల మంది మల్లారి అతిథులు) అంటూ ఆవేశంతో ఖండోబా ను స్మరించుకోవటం వీరికే సాధ్యం. అగ్ని గుండాలను దాటటం, ఆవేశంతో గొలుసులు తెంచటంతో దేవరగుడ్డ దసరాఉత్సవాలనుముగిస్తారు.దేవరగుడ్డలోనిఅరవైకురుబకుటుంబాలనుండి
పదకొండు కుటుంబాలకు చెందిన పదకొండు మందిని ఇనుప గొలుసులు తెంచేందుకు ఎంపిక చేస్తారు. ఈ పదకొండు మంది పదకొండు గొలుసులు తెంచుతారు. హైదరాబాదులోని బాగ్ అంబర్ పేటలో ఉన్న దాదాపు ఐదు వందల సంవత్సరాల పురాతన మల్లన్న దేవాలయంలో ఇరవై సంవత్సరాల క్రితం వరకు అగ్ని గుండాలు దాటటం, ఇనుప గొలుసులు తెంచటం జరిగేది. ప్రతి సంవత్సరం జరిపే దేవుడి (మల్లన్న)పెళ్లి సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించే వారు. మల్లన్న గుడి వారసులు తమ ఇళ్ళలో మల్లన్న పెళ్లి జరిపినప్పుడు మల్లన్న దేవుడికి పూజ చేసిన అనంతరం అగ్ని గుండాలు దాటటం, గొలుసులు తెంచే కార్యక్రమం జరిగేది. మల్లన్న పెళ్లి కార్యక్రమం సందర్భంగా పోతరాజు వేషం వేసే వ్యక్తి ఆవేశంలో మేక లేదా గొర్రె మెడ కొరికి వేయటం జరిగేది. దేవరగుడ్డలో గొలుసులు తెంపే కార్యక్రమం ముసిసిన తరువాత గోరమ్మలు లేదా వరమ్మలు బైట పల్లకిలో ఉన్న దేవుడిని దేవాలయంలోకి తీసుకుపోవటంతో దేవరగుడ్డ దసరా కార్యక్రమం ముగుస్తుంది.

విజయవాడలోని యుద్దమల్ల శాసనం



బెజవాడ, ప్రస్తుతవిజయవాడ లోని మల్లేశ్వర దేవాలయంలోని ఒక ॅశాసనంలో కురుమ, కురుబ కులం పుజారులైన గోరయ్యలు, గోరగయ్యలకు సంబంధించిన ప్రస్తావన ఉన్నది. యుద్దమల్ల అనే రాజు బెజవాడను పాలిస్తున్న సమయంలో ఈ శాసనాన్ని మల్లేశ్వర దేవాలయంలో పొందుపరిచినట్లు చరిత్ర కారులు భావిస్తున్నారు. ఈ శాసనంలో గోరగయ్యల ప్రస్తావన ఉన్నది. శైవులు మాత్రమే మల్లేశ్వర దేవాలయంలోకి ప్రవేశించేందుకు అనుమతించటంతో పాటు వారికి ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేసినట్లు ఈ శాసనం చెబుతోంది.

చంద్రవంశ క్షత్రియులు

మన పురాణాల ప్రకారం పూర్వం భారత దేశంలో ప్రధానంగా రెండు రాజ వంశాలు,

1. సూర్య వంశం,
2. చంద్ర వంశం

అనేవి ఉండేవనేది అందరికి తెలిసిందే. శ్రీ రాముడు సూర్య వంశానికి చెందితే భరతులు అంటే కౌరవులు, పాండవులు చంద్ర వంశం రాజులు. పశు పాలకులైన కురుమ కురుబ, గొల్ల, యాదవ తదితర కులాల వారంతా చంద్ర వంశం క్షత్రియులు. అత్రి మహాముని కుమారుడు చంద్రుడు. చంద్రుని కుమారుడైన బుదుడు వైవస్వత మనువు కూతురు ఇలను పెళ్లి చేసుకుంటాడు. వీరి కుమారుడు పురూరవుడు ప్రతిష్ఠానపురం రాజు. కురుక్షేత్రంలో జరిగిన మహాభారత యుద్ధంతో చంద్రవంశం చిన్నాభిన్నమైపోయింది. శ్రీకృష్ణుడి ద్వారకా నగరం సముద్రంలో మునిగిపోవటం వలన మొత్తం యాదవ వంశం దాదాపుగా అంతరించిపోయింది. యాదవులను కాపాడేందుకు ద్వారకకు వెళ్ళిన అర్జునుడు కేవలం శ్రీకృష్ణుడి మనువడు వజ్రనాభుడు, కొందరు మహిళా బంధువులను మాత్రం కాపాడగలుగుతాడు. వజ్రనాభుడు ఆ తరువాత మథుర రాజధానిగా రాజ్యపాలన సాగిస్తాడు. పురూరవుడి మునిమనుమడు యయాతి, అ తరువాత అతని ఐదుగురు కుమారులు 'కురు' వంశం లేదా చంద్ర వంశాన్ని నిలబెడతారు. యయాతి ఐదుగురు కుమారులు యదు, తుర్వషు, ద్రుహ్యు,అను, పురు పేర్లు వేదాల్లో పలు మార్లు ప్రస్తావనకు రావటం తెలిసిందే. వీరిలో యదు యాదవుల మూల పురుషుడు.

దక్షిణ భారత దేశంలో సామ్రాజ్యాలను నెలకొల్పిన వారిలో ఎక్కువ మంది పశువుల కాపర్లు ముఖ్యంగా గొర్రెల కాపర్లని చరిత్రకారులు చెబుతున్నారు. తమని తాము యదు వంశం యాదవులుగా ప్రకటించుకున్న దక్షినాదిలోని పలు రాజవంశాల వారు వాస్తవానికి బ్రాహ్మణత్వం ఆపాదించుకున్న కురుమలేనని చరిత్రకారుడు మిస్టర్ టేలర్ అభిప్రాయపడ్డారు. బనవాసి ప్రాంతంలో కదంబ పేరుతో రాజ్య మేలిన రెండు రాజ వంశాలు కూడా బ్రాహ్మణత్వం ఆపాదించుకున్న కురుబలేనని ఆయన తెలిపారు. తొండైమండలం యాదవ రాజు 'బిట్టిరస' పశువులను కాచే కుటుంబానికి చెందినవాడు. విజయగర సామ్రాజ్యాన్ని స్థాపించిన సంగమ వంశం 'హరి హర, బుక్క రాయలు'

గొర్రెలు కాచే కురుమ కులానికి చెందిన వారు. దేవగిరి యాదవ సామ్రాజ్యాన్ని స్థాపించిన 'దదియప్పు', హొయసిల సామ్రాజ్యాన్ని నెలకొల్పిన 'బిట్టిగ' వీరందరు కూడా పశువుల కాపర్ల కుటుంబాలకు చెందిన వారే. ఇండోర్ రాజధానిగా రాజ్యమేలిన హోల్కర్లు, ఢిల్లీ సుల్తానులను గజగజ వణికించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ కుడా పశువుల కాపర్ల కుటుంబాలకు చెందినవారే. మైసూరు వడేయార్ రాజులూ యాదవ సంతతి వారే.భారత దేశం మొదటి చక్రవర్తి చంద్రగుప్త మౌర్యుడు గొర్రెల కాపరి. పల్లవులు కూడా పశువుల కాపర్లేనన్నది చరిత్రకారుల అభిప్రాయం. స్వాతంత్రం కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో ధనగర్, కురుబ కులానికి చెందిన మహారాజ్ యశ్వంత్ రావు హోల్కర్ (మధ్యప్రదేశ్), సంగోలి రాయన్న (కర్ణాటక) ప్రముఖ పాత్ర నిర్వహించారు. బ్రిటిష్ పాలకులతో పోరాడేందుకు 1803 లో ధనగర్, కురుబలతో కూడిన సైన్యాన్ని తయారు చేసిన మొదటి స్వాతంత్ర సమరాయోధుడు మహారాజ యశ్వంత్ రావు హోల్కర్. యశ్వంత్ రావు హోల్కర్ సైన్యంతో బెంబేలెత్తిన బ్రిటిష్ పాలకులు ధనగర్, కురుబల వ్యవసాయ భూములను కొనకుండా నిషేధం విధించారని చరిత్ర చెబుతోంది.

కురుమ, కురుబ, కురుంబార్, కురుంబ, ధనగర్, గడరియా, పాల్, భగేల్ తదితర గొర్రెల కాపర్లు చంద్ర వంశ క్షత్రియులు. చంద్రగుప్త మౌర్యుడు చాణుక్యుడి పర్యవేక్షణలో నెలకోల్పిన మౌర్య సామ్రాజ్యం, బిందుసారుడు ఆ తరువాత అశోకుడి నాయకత్వంలో ఎంతటి ఉన్నత శిఖరాలకు చేరుకున్నదనేది అందరికి తెలిసిందే. తమిళనాడులో కలభ్రహ రాజులు, కురుంబ సామ్రాజ్యం, పల్లవ సామ్రాజ్యం, కర్ణాటకలో విజయనగర సామ్రాజ్యం, మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ రాజదానిగా పాలించిన హోల్కర్ తదితర రాజులందరూ అజ పాలకులే. తెలంగాణాలో చెప్పే ఒగ్గు కథల ప్రకారం మల్లన్నది కొల్హాపూర్ రాజ వంశం.ఐతే ఇది ఏ కొల్హాపూర్ అనేది స్పష్టం కావటం లేదు. మల్లన్న కొల్హాపుర్ ను పాలించటం, తమ భర్తలు కూడా రాజ్యమేలాలనే రాజ్య కాంక్షతో వదినలు చేసిన కుట్ర, కుతంత్రం మూలంగా మల్లన్న రాజ్యాన్ని కోల్పోవటం, ఆ తరువాత జరిగిన పరిణామాల్లో మల్లన్న తిరిగి రాజ్యాధికారం చేపట్టటం మనందరికీ తెలిసిందే. కురుబల కుల దైవం, గురువైన బీరప్పది కూడా రాజ వంశమే. బీరప్ప తాత నాగులకొండ రాజు. ఈ నాగులకొండ ఎక్కడ ఉండేదనేది కూడా స్పష్టం కావటం లేదు. బీరప్ప తండ్రి శివాళ్ళ దొంతిరాజు నాగుల కొండ రాజు. శివాళ్ళ దొంతిరాజు కూతురు సూరమ్మ కొడుకు బీరప్ప. సూరమ్మ పరమ శివుడి దీవెనలతో ఒక కొత్త రాజ్యం, సూర్య

నాగులకొండ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని పాలించినట్లు ఒగ్గు కథలు చెబుతున్నాయి. మల్లన్న, బీరప్ప రాజ్యాలు ఏలారు కాబట్టే వారు ఖడ్గదారులయ్యారు. బీరప్ప దేవుడు చేతిలో ఖడ్గం లేకుండా కనిపించడనేది అందరికి తెలిసిందే. కురుబ, కురుమ, కురుంబార్, కురుంబ ప్రజలు కుడా యదు లేదా యాదవులతో అనుబంధం కలవారే. ఈ అనుబంధం ఎలంటిదనేది నిర్ధారించవలసిన అవసరం ఉన్నది. భారత దేశంలోని పలు రాజవంశాలకు మూలం గొర్రెల కాపర్లు లేదా ఆవుల కాపర్లె అనేది పరమ సత్యం. విజయనగరం కేంద్రంగా దాదాపు రెండువందల యాభై సంవత్సరాల పాటు ముస్లిం దండ యాత్రల నుండి హిందువులను కాపాడిన విజయనగర సామ్రాజ్య స్థాపకులు అక్క రాయలు, బుక్క రాయలు కురుమ కులానికి చెందిన వారనేది జగమెరిగిన సత్యం. మధ్య ప్రదేశ్ లోని ఇందోర్ కేంద్రంగా వందలాది సంవస్తరాల పాటు పరిపాలించటంతో పాటు బ్రిటిష్ వలస పాలకులతో మొక్కవోని ధైర్యంతో పోరాడిన హెూల్కర్ల్ రాజులు ధనగర్ గొర్రెల కాపర్లు. దేవగిరి (ప్రస్తుత దౌలతాబాద్) కేంద్రంగా పాలించిన యాదవ రాజుల్లో కురుబలు కుడా ఉండటం చరిత్ర చెబుతున్న సత్యం.

మతపరమైన సంప్రదాయాల అధ్యయనంలో సిద్ధహస్తుడైన చరిత్రకారుడు రామచంద్ర చింతామణి ధీరే ప్రకారం దక్షిణాదిలోని అన్ని రాజ వంశాలు పశువుల కాపర్ల నుండి ఉద్భవించినవే. దక్షిణాది రాష్ట్రాల చరిత్ర చదివితే ఈ విషయం స్పష్టం అవుతుందని ఆయన వాదిస్తున్నారు. తాము చంద్ర వంశానికి చెందిన వారిమని ప్రకటించుకోవటం ద్వారా పలు రాజ వంశాలు తమకు తాము క్షత్రియు స్థాయిని ఆపాదించుకున్నారన్నది ఆయన వాదన. ఈ రాజులు యదు తమ పూర్వీకుడు అని ప్రకటించుకావటంతో పాటు తమను తాము యాదవులుగా చెప్పుకున్నారని రామచంద్ర ధీరే తన పుస్తకంలో రాశారు. దక్షిణాదికి చెందిన పల్లవుల నుండి తిరుపతి యాదవ రాజుల వరకు అందరు కూడా పశువుల కాపర్లు కావటం గమనార్హం. వీరందరు కురుబ సంతతి వారని రామచంద్ర ధీరే వాదించారు.

ఖండోబా లేదా మైలార, మల్లన్న, మల్లయ్య దేవుడు కూడా ఒక చారిత్రాత్మిక పురుషుడు అనే వాదన కుడా ఒకటి ఉన్నది. మహారాష్ట్రలోని దేవగిరి యాదవ రాజు రామచంద్రుడు తనను తానూ మల్లన్న దేవుడి అవతారంగా చెప్పుకోవటంతో పాటు దైవత్వం ఆపాదించుకున్నాడు. ఈ రాజే ఖండోబా, మైలర్ లేదా మల్లన్నగా మారాడన్నది ఒక వాదన. పన్నెండవ శాదాబ్దానికి చెందిన ఒక జైన సన్యాసి రాసిన పుస్తకం ప్రకారం ఖండోబా లేదా మల్లన్న ఒక చారిత్రాత్మిక పురుషుడు. ఆర్.సి.ధీరే తన 'ఖండోబా' అనే

పుస్తకంలో ఈ విషయాన్ని స్పష్టంగా వివరించారు. కర్నాటకలోని హుల్లుగురులో లబించిన రాతి శాసనం ప్రకారం యాదవ రాజు సింఘన కదంబ రాజు మల్లిదేవుడితో ఎంతో స్నేహంగా ఉండే వాడు. కదంబ రాజు మల్లిదేవ లేదా మల్లన్న భార్య పేరు పద్మాల దేవి అని కుడా ఈ శిలా శాసనం చెబుతోంది. యాదవ రాజు సింఘన ఇచ్చిన హుల్లనగురు పట్టణం వద్ద మల్లి దేవుడు ఒక బ్రహ్మపురిని ఏర్పాటు చేసాడని ఈ శాసనం చెబుతోంది. సింఘన మల్లిదేవ, ఇద్దరు మంచి స్నేహితులు అయితే సింఘన ఆదేశం మేరకు అతని సైనికులు మల్లి దేవుడి పై దాడి చేస్తారు. ఈ దాడి మూలంగానే కదంబ చక్రవర్తి మల్లి దేవుడు మహామండలేశ్వర మల్లి దేవుడుగా మారిపోయాడని చరిత్రకారులు అంటున్నారు. మరో వాదన ప్రకారం దేవగిరి యాదవ రాజు రామచంద్ర దేవ్ కాలక్రమంలో ఖందోబాగా రూపాంతరం చెందాడు. ప్రజలు రామచంద్ర దేవ్ ను భగవత్ స్వరూపుడుగా భావించటం ప్రారంబించిన తరువాత అతను ఖండోబా లేదా కాల భైరవుడుగా మారాడనేది వాదన.



చంద్రగుప్త మౌర్యుడు



గొర్రెల కాపరి చంద్రగుప్తుడు అడవిలో గొర్రెలు, మేకలు, ఆవులను మేసేందుకు వదిలిపెట్టిన అనంతరం తన స్నేహితులతో ఆడుకుంటున్న సమయంలో చాణుక్యుడు అతన్ని చూస్తాడు. రాజుగా నటిస్తున్న చంద్రగుప్తుడు ఒక రాయిపై కూర్చొని న్యాయం చెబుతున్నట్లు నటిస్తూ తీర్పు చెప్పే విధానం, ఆత్మ విశ్వాసం, హుందాతనం చాణుక్యుడిని ఆకట్టుకుంటాయి.

చంద్రగుప్త మౌర్యుడు

క్రీస్తు పూర్వం మూడు వందల సంవత్సరంలో భారత దేశంలో మొదటి మహా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన మహారాజు చంద్రగుప్త మౌర్యుడు ఒక గొర్రెల కాపరి. చంద్రగుప్త మౌర్యుడి (321-297) కులము, వంశం తదితర విషయాలపై రక రకాల వాదనలున్నాయి. అతను రాజవంశానికి చెందినవాడని నిరూపించేందుకు కొందరు ప్రయత్నిస్తే మరి కొందరేమో అతను సామాన్య కుటుంబలో పుట్టి మహారాజు స్థాయికి ఎదిగాడని వాదించారు. చంద్రగుప్త మౌర్యుడి పుట్టుక, ఇతర అంశాలపై జైన, బౌద్ధ, హిందూమత పుస్తకాలలో ఎన్ని వాదనలున్నా అతను ఒక గొర్రెలకాపరి అనేది అందరూ అంగీకరించే విషయం.

గొర్రెల కాపరి చంద్ర గుప్తుడు గ్రామ పొలిమేరలలోని అడవిలో గొర్రెలు, మేకలు, ఆవులను మేసేందుకు వదిలిపెట్టిన అనంతరం తన స్నేహితులతో ఆడుకుంటున్న సమయంలో చాణుక్యుడు (కౌటిల్యుడు, విష్ణుగుప్తుడు) అతన్ని చూస్తాడు. రాజుగా నటిస్తున్న చంద్రగుప్తుడు ఒక రాయిపై కూర్చొని న్యాయం చెబుతున్నట్లు నటిస్తూ తీర్పు చెప్పే విధానం, ఆత్మ విశ్వాసం, హుందాతనం చాణుక్యుడిని ఆకట్టుకుంటాయి. తనను అపహాస్యం చేసి అవమానించిన మగధ రాజు ధననందుడిని ఓడించి గర్వమనిచేందుకు పనికి వస్తాడని చంద్రగుప్తుడిని చాణక్యుడు ఎంపిక చేసుకుంటాడు. చంద్రగుప్తుడి తండ్రికి వెయ్యి నాణాలు చెల్లించి అతడిని తన వెంట తీసుకుపోతాడు. ధననందుడు అహంకారంతో చాణుక్యుడిని కురూపి అంటూ అవమానించి రాజ మందిరం నుండి బైటికి గెంటి వేయిస్తాడు. తనను అవమానించిన ధననందుడిని రాజ్య భ్రష్టుడిని చేస్తాను, అంతవరకు జుట్టును ముడి వేయనని చాణుక్యుడు శపథం చేయటం తెలిసిందే. చాణుక్యుడు తన లక్ష్య సాధన కోసం చంద్రగుప్తుడిని ఎంచుకుని తన వెంట తక్షశిల విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లి సైనిక శిక్షణ ఇస్తాడు. సైనిక శిక్షణతో పాటు పరిపాలన, దౌత్యం, ప్రజా సంక్షేమం తదితర రంగాల్లో శిక్షణ ఇప్పించిన అనంతరం చంద్రగుప్త మౌర్యుడికి సైన్యాన్ని సమకూర్చి ధననందుడిపైకి యుద్ధానికి పంపిస్తాడు. ధననందుడితో జరిపిన మొదటి యుద్ధంలో ఓటమిని చవిచూసిన చంద్రగుప్త మౌర్యుడు తన వ్యూహాన్ని మార్చుకుంటాడు. మగధ రాజధాని పాటలీపుత్రపై నేరుగా దాడి చేయకుండా దేశంలోని ఇతర ప్రాంతాలను స్వాధీనం చేసుకుని తన ప్రతినిధులను నియమించుకుంటూ వస్తాడు.

చంద్రగుప్త మౌర్యుడు ఆఖరున పాటలీపుత్రపై దాడిచేసి ధననందుడిని వధించి గురువు చాణక్యుడికి రాజ్యాన్ని బహుకరిస్తాడు. చంద్రగుప్త మౌర్యుడు ఆ తరువాత దక్షినాదిలోని తమిళనాడు,కేరళ, ఒడిశా మినహా దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలను గెలుచుకుని భారత దేశాన్ని ఒకటి చేసిన మొదటి చక్రవర్తిగా అవతరిస్తాడు. చంద్రగుప్త మౌర్యుడు పంజాబ్లో తిష్ట వేసిన గ్రీక్ సేనలను ఓడించటంతో పాటు అలేగ్జాండర్ మరణాంతరం తనం తానూ రాజుగా ప్రకటించుకున్న సేల్యుకస్ కుతురును పెళ్లి చేసుకుంటాడు. చంద్రగుప్త మౌర్యుడు దేశంలో మొదటి అతి పెద్ద సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన అనంతరం తన కొడుకు బింబిసారుడిని రాజుగా నియమించ జైన గురువు బద్రభాహు వెంట కర్ణాటకలోని శ్రావనబెలగోలకు వెళ్లి జైన మునిగా మారిపోతాడు. చంద్రగుప్త మౌర్యుడు చివరకు 'సల్లెఖాన' ఉపవాస దీక్ష ద్వారా ప్రాణ త్యాగం చేస్తాడు. చంద్రగుప్త మౌర్యుడి తరువాత అతని కుమారుడు బిందుసారుడు, బిందుసారుని అనంతరం అతని కుమారుడు అశోకుడు, దశరథ, నంప్రతి,శాలిషుక, దేవవర్మన్,శతధనవన్,బ్రిహద్రత మగధను పాలించారు. అశోకుడి కాలంలో బౌద్ధ మతం ప్రపంచంలో నలు దెసల వ్యాపించటం తెలిసిందే. క్రీస్తు పూర్వం భారత దేశంలోని చిన్న,చిన్న రాజ్యాలనన్నింటిని కలిపి ఒక మహా సామ్రాజ్యాన్ని స్థాపించిన చంద్రగుప్త మౌర్యుడి పుట్టు-పుర్వోత్తరాలకు సంబందించిన పూర్తి వివరాలు అందుబాటులో లేకపోవటం దురదృష్టకరం.

కురుంబ సామ్రాజ్యం

తమిళనాడులో కురుంబలు రెండు లేదా మూడవ శతాబ్దం నుండి ఏడవ శతాబ్దం వరకు రాజ్యమేలారు. ఏడవ శతాబ్దంలో ఆదొండ చోళుడితో జరిగిన యుద్ధంలో ఎదురైన ఓటమితో కురుంబ సామ్రాజ్యం పతనమై పోయింది.. మొదట చిన్నచిన్న ప్రాంతాలకు పరిమితమైన కురుంబ పాలన కామందప్రభు నాయకత్వంలో ఒక రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడంలో విజయాన్ని సాధించాడు. తమిళనాడు ప్రాంతంలో కురుంబ దేశం అనేది ఒకటి ఉండేదనేది **1150** సంవత్సరంలో వేసిన రాతిశాసనం స్పష్టం చేస్తోంది. వ్యాపారస్తుల కూటమికి సంబందించిన ఈ రాతి శాసనంలో దాదాపు పదిహేను దేశాలలో వ్యాపారస్తులకు సంబందించిన ప్రస్తావన ఉన్నది. పదిహేడు దేశాల్లో కురుంబ దేశం ప్రస్తావన ఉన్నది. చేర, చోళ, పాండ్య, మలయ, మగధ,కౌసల్య, సౌరాష్ట్ర, కాంభోజ, నేపాల

దేశాలతో పాటు కురుంబ దేశంలో వ్యారస్తుల కూటములు ఉండేవని రాతి శాసనం తెలుపుతోంది. కామందకురుంబ ప్రభువుగా పేరుగాంచిన కామందప్రభు పులాల నగరం రాజధానిగా తన పాలన కొనసాగిస్తూ చుట్టుపక్కల ప్రాంతాలనన్నింటిని తన రాజ్యంలో కలుపుకున్నాడు. పులాల నగరం ప్రస్తుత చెన్నై నగరానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు. కామందప్రభు తన దేశాన్ని ఇరవై నాలుగు జిల్లాలుగా విభజించి ప్రతి జిల్లాకు ఒక గవర్నర్ ను అధికారిగా నియమించాడు. పులల్కోట్టై, ఆముర్కోట్టై, కలట్టుర్కోట్ట, పులియుర్కోట్టై, సెమ్బుర్కోట్టై , ఉరుకాట్టుకోట్టై, వెంకోన కొట్టి, ఇక్కటు కొట్టి, పటువుర్ కొట్టి అనేవి కురుంబ రాజ్యంలోని కొన్ని జిల్లాల పేర్లు. కామంద ప్రభువు నాయకతంలోని కురుంబార్ దేశం ప్రజలు ఎక్కువ మంది గొర్రెల పెంపకం, ఉన్ని కంబల్లను నేయటం, సున్నం విక్రయించే పని చేసేవారు. కొందరు వాణిజ్యం చేస్తే మరి కొందరు పశువుల పెంపకం తో జీవించే వారు. కురుంబ ప్రజలు దేశం కొంత అభివృద్ధి చెందిన తరువాత ఓడల ద్వారా విదేశాలకు సరుకులు ఎగుమతి చేసే నౌకా వాణిజ్యం ప్రారంభించారు. వాణిజ్య, వ్యాపారంలో మరింత అభివృద్ధిని సాధించిన కురుంబలు తమ వ్యాపారం కోసం పట్టిపులం, సాల కుప్పం, సాల పాక్కం, మేయ్యుర్, కడలూర్, ఆలంపర్రై, మరక్కానం తదితర ప్రాంతాలలో కోటలతో కూడిన కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. కురుంబలు ఆ తరువాతి కాలంలో శైవులైనప్పటికి మొదట్లో వారు ఎలాంటి మతాన్ని అనుసరించే వారు కాదని గుస్టావ్ ఒపెర్ట్ అభిప్రాయపడ్డారు. కురుంబ రాజులు ఆ తరువాత తమ దేశంలో జైన మతాన్ని ప్రోత్సహించారు. కురుంబ దేశాన్ని ఆక్రమించుకునేందుకు చోళ, పాండ్య రాజులు పలు మార్లు ప్రయత్నించినా విజయం సాధించలేకపోయారు. ప్రాణాలకు తెగించేందుకు ఎంత మాత్రం వెనుకాడని కురుంబ సైనికుల ముందు చోళ, పాండ్య రాజుల సైన్యం నిలువలేకపోయేది. కురుంబ రాజులు యుద్ధాలలో పలు మార్లు చోళ, పాండ్య రాజులను ప్రాణాలతో పట్టుకుని తమ కోట గోడలకు గొలుసులతో వేలాడదీసారట. కురుంబ దేశంలో ఇతర మతాలూ, వర్గాల వారికి చోటుండేది కాదు. పలు విజయాలతో అహంకారం పెంచుకున్న కురుంబ రాజులు ఇతరులపై జైన మతాన్ని బలవనతంగా రుద్దటం ప్రారంభించారు. దీని మూలంగా ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయిన సమయంలో ఆదొండ చోళుడు కురుంబ దేశంపై దాడి చేశాడు. ఐతే కురుంబ సైనికుల ధైర్య, సాహసాల ముందు చోళ సైన్యం నిలువ లేకపాయింది. తన సైన్యంలోని మూడు వంతుల మంది సైనికులు మరణించటంతో ఆదొండ చోళుడు పలాయనం చిత్తగిస్తాడు.

శత్రువులు పారిపోవటంతో కురుంబ సైన్యం సంబరాలు చేసుకోవటం ప్రారంబిస్తారు. తంజావురుకు తిరుగు ప్రయాణం ప్రారంభించిన ఆదొండ చోళుడు వెనక్కి తిరిగి సంబరాలు చేసుకుంటున్న కురుంబలపై అకస్మాత్తుగా దాడి చేసి విజయం సాదిస్తాడు. కురుంబ రాజును చంపటంతో పాటు కురుంబ దేశంలోని అన్ని ప్రాంతాలకు కురుంబ ప్రజలకు ప్రథమ శత్రువులైన వెల్లాల వర్గం వారిని అధికారులుగా నియమించాడు. తద్వారా కురుంబల ఆధిపత్యాన్ని అంతమొందించాడు. ఆదొండ చోళుడు పులాల పట్టణం కోటను ధ్వంసం చేసి ఇత్తడితో చేసిన కోట తలుపులను తంజావూరు దేవాలయంలోనిగర్భగుడిలోపెట్టించినట్లుచరిత్రచెబుతోంది.ఆదండచోళుడు తంజావూరు దేవాలయం గర్భగుడిలోని ఒక స్థంబాన్ని తెచ్చి పులాల కోట వద్ద నిర్మించిన శివాలయంలో ఏర్పాటు చేశాడని చరిత్రకారులు చెబుతున్నారు. కంచి రాజధానిగా పాలన కొనసాగిన కురుంబ సామ్రాజ్యం నామ రూపాలను చెరిపి వేసేందుకు ఆదొండ చోళుడు కురుంబభూమి లేదా కురుంబనాడు పేరును తొండ మండలంగా మార్చినట్లు చరిత్ర చెబుతోంది.. ఇంత కాలం కురుంబ భూమిగా పిలువబడిన దేశం పేరు ఆ తరువాత తొందమండలంగా మార్చివేసినప్పటికీ నీలగిరి పర్వత శ్రేణుల్లో ఇప్పటికి కురుంబ భూమి, కురుంబనాడు పేర్లు పదిలంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే జైన మతం వైపు ఆకర్షితులైన కురుంబలను హిందూ మతం, అందునా శైవం వైపు ఆకర్షితులను చేసేందుకు కురుంబ నాయకుడు పద్మరస సేవలను రేవణసిద్దేశ్వరుడు వినియోగించుకున్నాడనే వాదన ఉన్నది. అరసు అంటే రాజు అని అర్థం, రేవన సిద్దేశ్వరుడు మొదట పద్మరస ను శైవం వైపు ఆకర్షించి అతని ద్వారా కురుంబ లందరినీ శైవులుగా మార్చాడని గుస్తవ్ ఒప్పెర్ట్ తన 'భారత దేశం ములవాసులు' అనే పుస్తకంలో తెలిపారు.

కలభ్రహ రాజులు


క్రీస్తు శకం మూడు వందల నుండి ఆరు వందల సంవత్సరం వరకు అంటే దాదాపు మూడు వందల సంవత్సరాల పాటు తమిళనాడును గజగజ లాడించిన కలభ్రహ పాలకులు కురుమ వర్గం వారే? వెంగడం (ప్రస్తుత తిరుమల, తిరుపతి) పర్వత ప్రాంతంలో నివసించే లేదా అక్కడికి తరచు వచ్చే కురుబలు లేదా కురువ వర్గం ప్రజలు స్థానిక కొండలు, గుట్టల్లో సంచరించే ఎనుగులను పట్టి బందించి మచ్చిక చేసుకునే వారని సంగమ సాహిత్యం సృష్టికర్తల్లో ఒకరైన పొయ్గయ్ ఆళ్వార్ తన భక్తి పాటల్లో

పేర్కొన్నారు. తిరుమల కొండల్లో ఉండే కొండ చిలువలను సైతం కురుబలు సునాయాసంగా పట్టుకునేవారని ఆళ్వార్లు తెలిపారు. మొదటి ఆళ్వార్లు తమ సాహిత్యంలోవాడిన తమిళపదం కురువార్ అనేది కురుబ పదానికి అపభ్రంశమని ప్రొఫెసర్ రాఘవాచార్య అభిప్రాయపడ్డారు. కురుబ, కురువ కులం ప్రజలు వేంగడంతో పాటు కర్నూలు, మైసూరు, సాలెం, కోయంబత్తూర్ , నీలగిరి ప్రాంతాల్లో అధికంగా నివసించే వారని రాఘవాచార్య తెలిపారు. తమిళనాడులోని కురుబలకోట, కురుబలపట్టి, కురుబ నాగులాపురం, కురుంబ పాల్యం, కురుంబపట్టి, కురుంబహళ్లి తదితర ప్రాంతాల పేర్లు ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొనటం గమనార్హం. పల్లవులు ఆక్రమించక ముందు తిరుపతి కొండలతో పాటు దాని చుట్టుపకల ప్రాంతాలు లైంగిక సామర్థ్యం ,దేహ ధారుడ్యం అధికంగా గల కురుబ, కురువ వర్గం ప్రజల ఆధీనంలో ఉండేదని ఆయన తెలిపారు. భాషా పండితుల విశ్లేషణ ప్రకారం కలభ్రహా అనే పదం కురుబ, కురువ పదం నుండి పుట్టుకు వచ్చిందన్నది రాఘవాచార్య వాదన. . కలభ్రాస్, కరభ్రాస్, కురభ్రాస్, కురబాస్, కురబార్స్ (కురవర్స్, కురబాస్) కురువాస్ అని ఆయన విశ్లేసించారు.

కలభ్రహ కుల రాజు అచ్చుతవిక్రాంత కావేరి పట్టణం రాజధానిగా చోళ దేశాన్ని పాలించే వాడని అతని సమకాలీనుడైన ప్రఖ్యాత పాళీ రచయిత బుద్దదత్త పేర్కొన్నారు. అచ్చుత విక్రాంతుడు బౌద్ద మతస్తుడని బుద్ధదత్తుడు తెలిపారు. అచ్చుత అనే రాజు చేర, చోళ, పాండ్య దేశాల రాజులను తన చెరసాలలో బందించి పెట్టినట్లు తమిళ సాహిత్యం చెబుతోంది. బుద్ధదత్తుడు, బుద్ధగోషుడు క్రీస్తుశకం ఐదవ శతాబ్దానికి చెందినవారు కాబట్టి బుద్ధదత్తుడు పేర్కొన్న అచ్చుత విక్రాంతుడు కూడా ఐదవ శతాబ్దానికి చెందిన వాడని భావించవలసి ఉంటుంది. సంగమసాహిత్య యుగం ముగిసిన అనంతరం కలభ్రహుల దాడి మూలంగా చోళ రాజులు కనుమరుగైపోయారు. కలభ్ర రాజులు బౌద్ధ, జైన మతాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. కలభ్రహ రాజులు ఈ క్రమంలో చోళ, పాండ్య, చేర రాజులు బ్రాహ్మణులకు ఇచ్చిన అగ్రహారాలు, భూములను స్వాధీనం చేకున్నట్లు వెల్వకుడి శాసనం చెబుతోంది. ఈ కారణం చేతనే కలభ్రహ రాజుల పతనానంతరం వారి చరిత్ర, సంస్కృతి, పాలనకు సంబందించిన ఆనవాళ్ళను బ్రాహ్మణులు అన్ని పుస్తకాల నుండి తొలగించి ఉంటారని చరిత్రకారులు అనుమానిస్తున్నారు. కలభ్రహ రాజుల మూడువందల సంవత్సరాల చరిత్రను బ్రాహ్మణులు తుడిచి పెట్టటం వల్లనే ఇప్పుడు వారి పాలన, పూర్వ పరాలకు సంబంచిన

వివరాలేవీ లబించటం లేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కలభ్రహ రాజులకు సంబందించిన అతి కొద్ది సమాచారం బౌద్ధ, జైన పుస్తకాల ద్వారా తెలుస్తోంది. పాండ్య రాజు నెడుంచెజియన్ వేయించిన వెల్వికుడి శాసనం బ్రాహ్మణులకు చేసిన భూదానం గురించి, కలభ్రాన్ అనే కాళి రాజు దానిని తిరిగి స్వాధీనం చేసుకోవటానికి సంబంధించిన ప్రస్తావన ఉన్నది. 'పాండ్య రాజు ముదుకుదిమి పెరువలుడి వెల్వకుడి అనే గ్రామాన్ని బ్రహ్మదేయం (బ్రాహ్మణులకు బహుమానం)గా ఇచ్చాడు. వెల్వకుడి బ్రాహ్మణులు ఈ భూదానాన్ని చాలా కాలం అనుభవించారు అయితే కలభ్రాన్ అనే రాజు బ్రహ్మదేయ భూములను(బ్రాహ్మణులకు ఆయా రాజులు ఏర్పాటు చేసిన అగ్రహారాలను సైతం స్వాధీనపరచుకున్నాడు. దీనితో పాటు పలువురు పెద్ద రాజులను ఓడించాడు' అని ఈ శాసనం చెబుతోంది. ఒకప్పుడు కురుంబ భూమిగా ఉండి ఆ తరువాత వెంగడం లేదా తొండైమండలంగా రూపాంతరం చెందిన తిరుపతి, తిరుమల ప్రాంతంలో నివసించే కలభ్రహ వర్గం వారు తమిళనాడుపై దాడి చేసి చేర, చోళ, పాండ్య రాజులను ఓడించి దాదాపు మూడు సంవత్సరాల పాటు పరిపాలించారని చరిత్రకారులు అంటున్నారు. కలభ్రహ రాజులు మూడువందల సంవత్సరాల పాలన ఎలా సాగింది? వారు సాధించిన విజయాలు ఏమిటి? వారి పూర్వ పరాలేమిటి ? ఇలాంటి వివరాలేవీ తమిళ చరిత్ర, సాహిత్యంలో కనిపించవు. కలభ్రహ రాజులు తమ భూములను స్వాధీనంచేసుకుని తమకు అన్యాయం చేసినందుకు ప్రతీకారంగా బ్రాహ్మణులు ఈ రాజులకు సంబంచిన వివరాలన్నింటిని శాసనాలు, పుస్తకాలనుండి తొలగించటంతో పాటు తమ రాతల్లో కలభ్రహలకు సంబందించిన ఎలాంటి ప్రస్తావన లేకుండా చేశారని చరిత్రకారులు అనుమానిస్తున్నారు. ఆరవ శతాబ్దం చివరి భాగం లేదా ఏడవ శతాబ్దం ప్రారంభంలో పాండ్య, చేర, చోళ,రాష్ట్ర కూట రాజులు ఏకమై కలభ్రహలపై దాడి చేసి తుదముట్టించారన్నది చరిత్రకారుల అభిప్రాయం. కలభ్రహ రాజులు వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించక పోవటంతో పాటు బ్రాహ్మణ ఆధిపత్యాన్ని నిర్మూలించారు. తమిళకం అంటే తమిళ, కేరళ రాష్ట్రాలోని అన్ని బ్రహ్మదేయాలు, బ్రాహ్మణులకి ఆయా రాజులు ఇచ్చిన అన్ని అగ్రహారాలు, భూదానాలను రద్దు చేసి అ భూములను స్వాధీనం చేసుకున్నారు. తమ భూములను స్వాధీనం చేసుకోవటంతో పాటు వర్ణాశ్రమ ధర్మాన్ని, ఇతర వర్గాలపై తమ ఆధిపత్యాన్ని తొలగించినందుకే బ్రాహ్మణులకు కలభ్రహ రాజులంటే ఆగ్రహం. కలభ్రహ రాజులు మొదట్లో బౌద్ధ, జైన మతావలంభికులైనా తరువాతి కాలంలో వారు శైవులుగా

మారిపోయారని చరిత్రకారులు వాదిస్తున్నారు. కలభ్రహ రాజుల మూడు వందల సంవత్సరాలపాలననుబ్రాహ్మణచరిత్రకారులుచీకటియుగంగాచిత్రీకరించటం గమనార్హం.



కురుమలు పల్లవులా?

పల్లవులు క్రీస్తు శకం 275 నుండి 897 వరకు ఆంధ్ర ప్రదేశ్ లోని కొంత భాగాన్ని, తమిళనాడులోని కొంత భాగాన్ని పాలించిన రాజులు. తమిళనాడులోని మహాబలిపురం తదితర ప్రపంచ ప్రఖ్యాత సముద్రతీర దేవాలయాలను నిర్మించిన రాజులు పల్లవులే. కొంగు, చోళ, చాళుక్యరాజులు జరిపిన పలు దండయాత్రల మూలంగా పల్లవ రాజ్యం పతనమైంది. ఎనిమిదవ శతాబ్దంలో చోళ రాజు ఆదొండై చోళుడు చేసిన దాడితో పల్లవ సామ్రాజ్యం కుప్పకూలి యుద్దంలో మిగిలిన పల్లవులంతా అడవుల పాలయ్యారు. ఇలా అడవుల పాలైన పల్లవులే కురుంబ, కురుంబార్ అన్నది కొందరు చరిత్రకారుల అభిప్రాయం. యుద్ధానంతరం మిగిలిన కురుంబారులు తమ ప్రాణాలు కాపాడుకునేందుకు నిలగిరి, వైనాడ్ అడవుల్లో తలదాచుకున్నారు. ఈ కురుంబలు ఆనాటి నుండి గొర్రెలు, మేకలు పెంచటంతో పాటు గొర్రెల ఉన్నితో కంబళ్ళు నేచి విక్రయించటం ద్వారా జీవితాలు గడుపుతున్నారు.

పల్లవులు కురుంబ,మరయ,కల్లర్ తదితర దోపిడీ మూకలను సమకూర్చుకుని బలవంతమైన సైన్యాని ఏర్పాటు చేసుకుని క్రీస్తుశకం మూడు వందల ఇరవై ఐదులో తూర్పు తీరంలో కృష్ణ- గోదావరి నదుల ముఖ ద్వారం మధ్యలో అధికారంలోకి వచ్చారని డాక్టర్ రావిలిన్సన్ రాశారు. తమిళ భాషలో 'పల్లవ' అనే పదం దుష్టుడు, వంచకుడు, దొంగ లేదా దోపిదిదారుడితో సమానమని రావిలిన్సన్ అభిప్రాయపడ్డారు. పల్లవులు కంచి లేదా కాంజీవరం కేంద్రంగా తమ పాలన కొనసాగించారు. ప్రాచీన పులిందులే పల్లవులని చెప్పిన ఆర్.స్థయినథీర్ పులిందులు కురుంబ వర్గం ప్రజలు ఒకటేనని అభిప్రాయపడ్డారు. పల్లవుల దేవాలయాల నిర్మాణం, వాస్తు, చాళుక్యుల నిర్మాణం, వాస్తు మాదిరిగా ఉన్నది. పల్లవుల గుహ దేవాలయాలు శాతవాహనులు, చాళుక్యుల వారసత్వమేనని ఆయన భావించారు. మహాబలిపురంలోని మహిషాసురమర్ధని చిత్రాలు కన్నడ మూలాల కురుబలను సూచిస్తోందన్నది అతని వాదన. చాళుక్యులు,పల్లవుల మధ్య ఉన్న ప్రధాన వైరం, పోటి వారి మధ్య ఉన్న సంబంధాన్ని సూచిస్తోంది. కర్ణాటక ప్రాంతానికి చెందిన చుటుశాతకర్ణితో పల్లవుల రాజ్యాధికారం ప్రారంభమైందని శాసనాలు సూచిస్తున్నాయి. పల్లవ సామ్రాజ్యాన్ని స్థాపించిన వారు తొండమండలం నుండి వచ్చిన వారనేది చరిత్రకారులందరు అంగీకరించే విషయం. వెల్వకుడి శాసనం ప్రకారం పల్లవ

రాజు జతిలపరంతాక కావేరి నదికి దక్షిణ ఒడ్డున ఉన్న పెన్నాగడం గ్రామం వద్ద జరిగిన యుద్ధములో కాడవలను, నత్తు కురుంబు వద్ద జరిగిన యుద్ధంలో ఆయవేల్,కురుంబ వర్గం వారిని ఓడించారు. పల్లవులను కాడవలు అని కుడా పిలుస్తారని మనం ఇది వరకే చెప్పుకున్నాము. రాజ్య విస్తరణ కోసం జరిగే యుద్ధాలలో తర, తమ భేదం ఉండదనేది అందరికి తెలిసిందే.

పల్లవ సామ్రాజ్య స్థాపకులు పశుపాలక తెగ వారని ప్రొఫెసర్ కృష్ణ కుమార్ (సహాయ ప్రొఫెసర్ (ఎం. ఎం. కళాశాల, ఫతేహాబాద్, హర్యానా) తెలిపారు. కృష్ణ కుమార్ పల్లవ రాజుల పరిపాలన,పతనం, సంస్కృతీ అధ్యయనం అనే పేరుతో రాసిన వ్యాసంలో ఈ విషయం తెలిపారు. పల్లవులు దాదాపు ఐదు వందల సంవత్సరాల పాటు దక్షిణాదిని పాలించటం తెలిసిందే. పల్లవపురి వద్ద ఉన్న తొండైమండలం ప్రాంతాన్ని పల్లవులు గెలుచుకున్నారని కృష్ణ కుమార్ రాసారు. శాతవాహనుల సామ్రాజ్యంలోని తూర్పు ప్రాంతంలో పల్లవులు తమ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని ఆయన తెలిపారు. శాతవాహనుల వద్ద సామంతులుగా పని చేసిన పల్లవులు శాతవాహన సామ్రాజ్యం పతనం కాగానే తమను తాము స్వతంత్ర రాజులుగా ప్రకటించుకున్నారన్నది కృష్ణ కుమార్ వాదన.

అంత్రోపాలజిస్ట్ (మానవ శాస్త్రవేత్త) డాక్టర్ థర్స్టన్ తమిళనాడులోని వాయనాడ్, నిలిగిరి కొండల్లో నివసించే కురుంబ ప్రజలను బెట్ట కురుంబార్, ముళ్ళు కురుంబార్, ఉరలి కురుంబార్, థానే కురుంబార్ గా విభజించారు.. ఈ కురుంబార్ ప్రజలు పల్లవుల సంతతి వారని డాక్టర్ సక్తివేల్ అభిప్రాయపడ్డారు. దక్షిణ భారత దేశమంతా విస్తరించిన పల్లవ సామ్రాజ్యం పతనమైన తరువాత కురుంబార్ ప్రజలు ప్రత్యర్థి రాజుల పగ సాధింపులకు భయపడి అడవుల్లోకి పారిపోయారు, కాల క్రమంలో వీరు గిరిజనులుగా మారిపోయారని డాక్టర్ సక్తివేల్ అభిప్రాయపడ్డారు. కురుంబ వర్గం ప్రజలు ఆలు/పాలు కురుంబ, బెట్ట కురుంబ, జేను/టీన్ కురుంబ, ముళ్ళు కురుంబ, ఉరలి కురుంబ అనే ఐదు రకాలనేది తన క్షేత్ర పరిశీలనలో తేలిందని డాక్టర్ జే.పార్థసారథి తెలిపారు. ప్రస్తుత కురుంబ వర్గం ప్రజలు ప్రాచీన పల్లవులు, కురుంబ ప్రజల ప్రతినిధులని **1891** సంవత్సరం మద్రాస్ జనాభా లెక్కల నివేదిక చెబుతోంది. చోళ రాజు అదొండై చోళుడు ఏడు లేదా ఎనిమిదవ శతాబ్దంలో కురుంబ సామ్రాజ్యాన్ని కూల్చివేశాడని మనంఇదివరకే చదువుకున్నాము. పూర్వం రాజుల మధ్య యుద్ధం జరిగినప్పుడు ఓటమిపాలైన రాజు తాలూకు వారంతా ప్రాణభయంతో అడవులలోకి

పారిపోయేరనేది అందరికి తెలిసిందే. ఆదొండై చోలుడి దండ యాత్రలో ఓడిపోయిన కురుంబ వర్గం ప్రజలు కొండల్లోకి పారిపోయారన్నది ప్రొఫెసర్ స్టూఅర్ట్ వాదన. ఇలా అడవుల్లోకి పారిపోయిన కురుంబ వర్గం ప్రజలే ప్రస్తుతం నీలగిరి, వాయినాడ్, కుర్గ్, మైసూరు అడవుల్లో నివసించే గిరిజనులని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాచీన పల్లవుల సంతతితికి చెందిన వారే ప్రస్తుత కురుంబ, కురుంబార్, కురుమ, కురుబ కులం ప్రజలని ప్రొఫెసర్ స్టూఅర్ట్ వాదించటం గమనార్హం.

తమిళనాడును రెండవ శతాబ్దం చివర లేదా మూడో శతాబ్దం ప్రారంభం నుండి ఆరు లేదా ఏడవ శతాబ్దం వరకు పాలించిన కురుంబ, కలభ్రహ, పల్లవ రాజులు ఒకరేనా? రెండవ శతాబ్దం నుండి ఏడవ శతాబ్దం వరకు తమిళనాడును ఈ మూడు వర్గాలకు చెందిన రాజులు పాలించినట్లు చరిత్ర చెబుతోంది. ఐతే ఏక కాలంలో మూడు సామ్రాజ్యాలు కొనసాగటం అనేది జరగని పని. కలభ్రహ, కురుంబ, సామ్రాజ్యాలకు సంబంచిన చారిత్రాత్మిక సాక్ష్యాధారాలు ఏవీ పెద్దగా లభించ లేదు. కానీ పల్లవ సామ్రాజ్యానికి సంబంచిన చారిత్రాత్మిక ప్రమాణాలు చాలా లభిస్తున్నాయి. కలభ్రహ రాజుల మాదిరిగానే కురుంబ రాజులు కూడా బ్రాహ్మణ వ్యతిరేకులు, కురుంబ వర్గంలో ఎక్కువ మంది చాలా కాలంపాటు జైన మతాన్ని అనుసరించటంతో పాటు జైన మతం అభివృద్ధికి పాటుపడ్డారు. అందుకే మొదట ఆదొండ చోళుడు కురుంబ సామ్రాజ్యాన్ని ధ్వంసం చేయగా ఆ తరువాత శ్రీకృష్ణ దేవరాయలు కూడా జైనమతాన్ని అవలంబిస్తున్న కురుంబ ప్రజలను తొక్కి వేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చరిత్ర చేబుతోంది. శ్రీకృష్ణ దేవరాయలు కురుమ వర్గానికి చెందినప్పటికి రాజకీయాలు, పరిపాలన అవసరాల కోసం కురుబ లేదా కురుంబ వర్గం ప్రజల పట్ల కఠినంగా వ్యవహరించారని అంటారు. పురాతన కాలంలో తిరుపతి ప్రాంతంలోని కురుబ వర్గం ప్రజలు ఏనుగులను మచ్చిక చేసుకోవటంలో సిద్ధహస్తులనేది ఇదివరకే చదువుకున్నాము. తిరుపతి దాని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కురుబ వర్గం ప్రజలు రెండు లేదా మూడవ శతాబ్దంలో తమిళనాడుపై దాడులు చేసి తమ రాజ్యాని ఏర్పాటు చేసి ఉంటారనే ఒక వాదన ఉన్నది. తమిళనాడును దాదాపు ఐదు వందల సంవత్సరాల పాటు కురుబ లేదా కురుంబలు పాలించారు. వీరి పాలననే మనమిప్పుడు కురుంబ పాలన, కలభ్రహ పాలన అని చెప్పుకుంటున్నామనేది ఈ వాదన. ఈ వాదనలో ఎంత వరకు నిజమున్నదనేది చెప్పటం చాలా కష్టం. ఎందుకంటే కురుంబ రాజులు, కలభ్రహ రాజులకు సంభందించిన స్పష్టమైన చారిత్రాత్మిక సాక్ష్యాధారాలు లభించటం లేదు. బౌద్ధ, జైన పుస్తకాల ద్వారా మాత్రం కొంత సమాచారం లభిస్తోంది. కలభ్రహ రాజులు చేర, చోళ,

పాండ్య రాజులను ఓడించి అధికారంలోకి వచ్చారు. కలభ్ర రాజులు దాదాపు నాలుగు వందల సంవత్సరాల పాటు మొత్తం తమిళనాడు, కేరళను తమ గుప్పిట్లో పెట్టుకున్నట్లు చరిత్ర సూచిస్తోంది. పల్లవ, పాండ్య, చాళుక్య, రాష్ట్రకూటులు మూకుమ్మడిగా దాడి చేసి కలభ్ర రాజులను ఎనిమిదవ శతాబ్దంలో ఓడించారు. అచుతవిక్కంటతో కలభ్ర రాజుల పాలన అంతమైంది. ఆదొండ చోళుడు కురుంబ, కలభ్రహ రాజ్యాన్ని గెలుచుకున్నాడని చరిత్ర చెప్పటం తెలిసిందే.

దేవగిరి యాదవ రాజులు



మహారాష్ట్ర యాదవ సామ్రాజ్యానికి కేంద్రమైన అప్పటి దేవగిరి, ప్రస్తుత దౌలతాబాద్ నగరాన్ని ధనగర్ కులానికి చెందిన ఒక గొర్రెల కాపరి 1203 లో నిర్మించినట్టు చరిత్రలో ఉంది. మొదట కాకతీయులకు, తరువాత నిజాం షాహిలకు చాలా కాలం రాజధానిగా కొనసాగిన గోల్కొండ (గొల్లకొండ)ను కుడా ఒక కురుమ గొర్రెల కాపరి నిర్మించాడు లేదా కనుగొన్నాడనేది అందరికి తెలిసిందే. తనకు లభించిన ధనంతో దేవగిరికోటను నిర్మించిన గొర్రెలకాపరి ఆ తరువాత తన సోదరుడు రాజారాంను రాజుగా ప్రకటించాడనేది స్థానిక కథనం. ఈ ఇద్దరు సోదరులు కర్ణాటక నుండి వచ్చి దేవగిరి రాజ్యాన్ని ఏర్పాటు చేసారనేది మరో వాదన. సి.ఎం.కులకర్ణి, కోలిన్మసిక, శ్రీనివాస్ తదితర పండితుల వాదన ప్రకారం సెవునయాదవులు కర్ణాటక నుండి మహారాష్ట్రకు వచ్చారు. దేవగిరి సెవునయాదవులు దేవగిరి కోట నుండి పరి పాలన ప్రారంభించిన తరువాత తమ శాసనాలను మొదట కన్నడ-సంస్కృత భాషలో ప్రకటించారు అయితే వారు ముస్లింల దండయాత్రలు ప్రారంభమైన తరువాత స్థానిక మరాఠి భాషను వాడుకలోకి తెచ్చారన్నది భాషా పండితుడు కోలిన్మసిక వాదన. ఎక్కువ మంది యాదవ రాజుల పేర్లు, బిరుదులు కన్నడ భాషలో ఉండటం గమనార్హం. దేవగిరి యాదవ రాజులకు "దదియప్ప, బిల్లమ, రజుగి, వడుగి, వసుగి, కలియ బల్లాల, సింఘన, మల్లుగి" తదితర పేర్లు, బిరుదులు ఉన్నాయి. యాదవ రాజుల్లో తొలితరం వాడైన రెండవ సుయెన చంద్రకు 'సేల్లవిడెగ' అనే బిరుదు ఉండినట్లు చరిత్ర చెబుతోంది.



“ దక్షిణ భారతంతో దాదాపు మూడు వందల పది సంవత్సరాల పాటు హిందు మతం, సభ్యత, సంస్కృతిని పరి రక్షించటంతో పాటు దీనిని పెంచి, పోషిస్తూ ముస్లింల దాడులు, దండయాత్రల నుండి హిందువులను రక్షించిన విజయనగరాధీశులు కురుమగొల్లలు. ”

విజయనగర సామ్రాజ్యం

దక్షిణ భారతంతో దాదాపు మూడు వందల పది సంవత్సరాల పాటు హిందు మతం, సభ్యత, సంస్కృతిని పరి రక్షించటంతో పాటు దీనిని పెంచి, పోషిస్తూ ముస్లింల దాడులు, దండయాత్రల నుండి హిందువులను రక్షించిన విజయనగరాధీశులు కురుమగొల్లలు. హరిహర, బుక్క రాయలు స్థాపించిన విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ సామ్రాజ్యమని కుడా పిలుస్తారు. హరిహర, బుక్క రాయలు తమ తండ్రి సంగమ పేరుతో ఈ రాజ్యాన్ని ఏర్పాటు చేశారని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ సుల్తాను మహమ్మద్బిన్ తుగ్లక్ ఆదేశం మేరకు మాలిక్ కఫుర్ దక్షినాదిపై జరిపిన క్రూరమైన దండ యాత్రలో వరంగల్లు ధ్వంసమైన తరువాత హిందువుల పరిరక్షణకు నడుము కట్టి మండలాదీషుల స్థాయి నుండి చక్రవర్తుల స్థాయికి ఎదిగిన కురుమల చరిత్ర ఇది. హరిహర రాయలు, బుక్క రాయలు స్థాపించిన సంగమ రాజ కుటుంబం **1336** నుండి **1485** వరకు అంటే దాదాపు నూటా యాభై సంవత్సరాల పాటు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించింది. సంగమ రాజ కుటుంబాన్నే విజయనగరం మొదటి రాజ కుటుంబమని పిలుస్తారు. **1336** స్థాపించబడిన విజయనగర రాజ్యం **1565** లో జరిగిన తలికోట యుద్ధంతో దాదాపుగా సమాప్తమైపోయింది. తలికోట యుద్ధం తరువాత కూడా విజయనగర రాజ్యం కొంత కాలం ఉన్నప్పటికీ అది ముస్లిం పాలకుల పాదాక్రాంత రాజ్యంగా కొనసాగిందే తప్ప స్వతంత్ర రాజ్యం కాలేకపోయింది.

అటు ఢిల్లీ సుల్తానులను ఇటు అసఫ్ జాహీ నిజాములు, బహమనీ సుల్తానులు,



ఒరిస్సా గజపతులతో పాటు ఇతర చిన్న చిన్న రాజులను గడగడలాడిస్తూ హిందువులకు ఒక సురక్షిత రాజ్యాన్ని ప్రసాదించిన విజయనగర సామ్రాజ్యస్థాపనపై పలు కథనాలు, వాదనలు చెలామణిలో ఉన్నాయి. ఈ వాదనలన్నింటిలో ఓరుగల్లు లేదా ప్రస్తుత వరంగల్లు కు చెందిన కురుమ సోదరులు హరిహర, బుక్క విజయనగరాన్ని స్తాపించారనే వాదననే ఎక్కువ మంది చరిత్రకారులు సమర్ధించారు. విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన హరిహర, బుక్కరాయలు కురుబ కులానికి చెందినవారని కర్నాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ్ జిల్లా తాళికట్టే గ్రామంలోని బీరలింగేశ్వర దేవాలయంలో స్థాపించబడి ఉన్న శాసనం ప్రకటిస్తోంది. విజయనగర స్థాపకులు కురుబ కులం వారని విద్యారణ్య కాల జ్ఞానం, విద్యారణ్య వృత్తాంతం, రాజ కాలనిర్ణయ అనే గ్రంథాలు చెబుతున్నాయి. వడేయారు రాజుల అష్టాన కవి, పది హేడవ శతాబ్దానికి చెందిన తిరుమల రాయ రచించిన చిక్కదేవరాయ వంశావళి అనే పుస్తకం కూడా విజయనగరాదీషులు కురుబ లేదా కురుమ కులం వారని ప్రకటించింది. పది హేడవ శతాబ్దం లోనే రచించబడిన 'కేలదిన్రిప విజయం' అనే గ్రంథం కుడా ఇదే విషమయం చెబుతోంది. విజయనగరం చక్రవర్తి వీర ప్రతాప రామరాజ్యా సదాశివరాయ వెంకటాద్రి రాజ సమక్షంలో వివిధ మఠాల స్వాములు, పెద్దల నేతృత్వంలో జరిగిన హాలుమత సమావేశంలో కురుబలకు గురు పీఠం ఇచ్చినట్లు తురువేకెరే గ్రామంలో లభించిన తామ్ర శాసనం స్పష్టం చేస్తోంది. విజయనగర స్థాపకులు కురుమ లేదా కురుబ కులానికి చెందిన వారనే నిజాన్ని మొదట రాబర్ట్ స్యూయల్ బైట పెట్టారు. సంగముని ఐదుగురు కుమారుల్లో ఇద్దరు కుమారులు, హరిహర, బుక్క రాయలు ఓరుగల్లు కాకతీయ సామ్రాజ్యం కోశాధికారులుగా పని చేసినట్లు చరిత్ర చెబుతోంది. చరిత్రలో మరుగున పడిపోయిన విజయనగర మహా సామ్రాజ్యాన్ని వెలుగులోకి తెచ్చి భారతీయుల కళ్ళు విప్పిన ఘనుడు రాబర్ట్ స్యూయల్. రాబర్ట్ స్యుయల్ (1845-1925) మద్రాస్ ప్రెసిడెన్సీలో సివిల్ సర్వెంట్ గా పని చేసేవారు. ఫ్రెంచి దేశం, ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ లోని ప్రముఖ జాతీయ గ్రంథాలయం (లూవర్) లో ఉన్న సన్నని తోలుతో బౌండ్ చేసిన ఫోలియో వాల్యూంలో పోర్ట్ నెంబర్ అరవై ఐదు అనే పేరుతో కొన్ని రాత ప్రతులున్నాయి. ఈ వ్రాతపతులలోని రెండు పోర్చుగీసు చారిత్రిక కథనాల ఆధారంగా విజయనగర చరిత్రను రాబర్ట్ స్యూయల్ వెలుగులోకి తెచ్చారు. 'విస్మృత సామ్రాజ్యం-విజయనగరం'(ది ఫర్గాటెన్ హిస్టరీ ఆఫ్ విజయనగర్) అనే పేరుతో రాబర్ట్ స్యుయల్ రచించిన గ్రంథం భారత చరిత్రకారుల కళ్ళు తెరిపించింది. ప్యారిస్ లోని బిబ్లియోతిక్ ప్రముఖ జాతీయ గ్రంథాలయంలో పోర్ట్ నెంబర్ అరవై ఐదులో నాలుగు మూల పత్రాల

నకళ్ళు ఉన్నాయి. మొదటి రెండు నకళ్ళు ఫేర్నావో న్యూనిజ్, డామింగో పెయిస్ లు రాసినవి. చివరి రెండు నకళ్ళు చైనా నుండి రాయబడిన ఉత్తరాలు. బహుశా డొనాల్డ్ ఫెర్గుసన్ వీటిని అనువదించి 'ఇండియన్ అంటిక్వటీలో ప్రచురించి ఉండవచ్చునని రాబర్ట్ స్యూయల్ అభిప్రాయపడ్డారు, మొదటి మూల పత్రాల జతను ఎవరో గోవా నుండి ఐరోపాలో ఉండే మరెవరికో పంపించారు. మొదటి మూల పత్రాలకు ఒక ముందు మాట కూడా ఉండటం గమనార్హం. మూల పత్రాల్లో పంపిన్ వారి పేర్లు లేవు కానీ వీటి గ్రహిత మాత్రం 'విస్టన్' లో ఉండే ప్రముఖ చరిత్ర కారుడు 'బారోస్' అని భావించేందుకు ఎన్నో కారణాలు ఉన్నాయని రాబర్ట్ స్యుయేల్ చెప్పారు. ఫేర్నావో న్యునేజ్, డామింగో పెయిస్ అనే పర్యాటకులు రాసిన పత్రాలను అధ్యయనం చేసిన అనంతరం రాబర్ట్ స్యుయేల్ విజయనగర సామ్రాజ్యం పై 'The Forgotten History of Vijayanagara ' అనే పుస్తకాన్ని రచించారు. ఐరోపా పర్యాటకులు డోమింగో పయిస్, ఫెర్నాఓ నునెస్ మరియు నిక్కోలో దకొంటి రచనల్లో విజయనర సామ్రాజ్య వైభవ సజీవ చిత్రం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. విజయనగర స్థాపనపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయని రాబర్ట్ స్యుయేల్ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆయన పేర్కొన్న కథనాలు, చివరకు ఆయన చేసిన నిర్ణయాన్ని యథాతథంగా మీ ముందు పెడుతున్నాను.

మొదటి కథనం:

హరిహర, బుక్క నామధేయులైన ఇద్దరు సోదరులు వరంగల్లు రాజు వద్ద (కోశాధికారులుగా) పనిచేస్తుండేవారు. వరంగల్లు 1323లో మహమ్మదీయుల చేతిలో ధ్వంసమైనప్పుడు హరి హర బుక్క అనే సోదరులు చిన్న అశ్విక దళంతో తప్పించుకొని అనెగొంది పరిసర పర్వత ప్రాంతాలకు వచ్చారు. వీరు మాధవుడు లేదా మాధవాచార్య విద్యారణ్యుడు అనే బ్రాహ్మణుడితో కలిసి అజ్ఞాత వనరుల సహాయంతో ఆ ప్రాంతానికి ప్రభువులు అయ్యారు. ఆ తరువాత విజయనగర పట్టణాన్ని స్థాపించి మెల్ల, మెల్లగా మహా సామ్రాజ్యానికి మహా రాజులయ్యారు.

రెండో కథనం.

మహమ్మదీయులు 1309లో మొదటి సారి ఓరుగల్లును ఆక్రమించుకున్న తరువాత ఓరుగల్లు మహమ్మదీయ రాజ ప్రతినిధి వద్ద ఇద్దరు సోదరులు పని చేసేవారు. 1310లో మాలిక్ కాఫర్ నేతృత్వంలో హొయసల బల్లాళ రాజు పైకి ఇద్దరు సోదరులను యుద్ధానికి

పంపించారు. ఈ యుద్దంలో హొయసల హిందువుల రాజధాని ద్వారసముద్రం పట్టుబడింది కానీ ఈ ఇద్దరు సోదరులు ఉన్న సైనిక విభాగం మాత్రం పరాజయం పాలై అనెగొంది పరిసర ప్రాంతాలలోని పర్వత ప్రాంతానికి పారిపోయింది. ఇక్కడ ఆ ఇద్దరు సోదరులు సన్యాసి జీవితం గడుపుతున్న మాధవాచారి స్వామీని కలుసుకున్నారు. మాధవాచార్యుల సహాయంతో వారు విజయనగర రాజ్యాన్ని, రాజధాని నగరాన్ని స్థాపించారు.

మూడో కథనం.

ఈ కథనం ప్రకారం వరంగల్లుకు చెందిన ఇద్దరు సోదరులు కాకతీయ సామ్రాజ్యం పతనానంతరం ఆనెగొందికి పారిపోయి వచ్చారు. వరంగల్లును స్వాధీనం చేసుకున్న మహమ్మదీయుల వద్ద పని చేయటం ఇష్ట పడని ఈ ఇద్దరు సోదరులు ఆనెగొందిలో తమ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని హిందూ మతాన్ని కాపాడారు.

నాలుగో కథనం.

సన్యాసిఅయినమాధవుడుతనకులభించినఒకగుప్తనిధఆధారంగా విజయనగరాన్ని స్తాపించాడు. మొదట తానే కొంత కాలం పరిపాలించాడు. అతని మరణం తరువాత ఒక కురుబ కుటుంబం మొదటి రాజ వంశాన్ని స్తాపించింది.

కూథో పేర్కొన్న ఐదవ కథ.

“మాధవుడు పర్వతాల్లో సన్యాసి జీవితాన్ని గడుపుతున్నాడు. ఆయనకు ప్రతి రోజు బుక్క అనే ఒక గొర్రెల కాపరి భోజనం తెచ్చేవాడు. ఒక రోజు ఆ బ్రాహ్మణుడు అతనితో నీవు మొత్తం హిందుస్తాన్ కి రాజువు అవుతావు అని అన్నాడు. తక్కిన గొల్లలకు ఈ విషయం తెలిసి అతన్ని గౌరవించి తమకు నాయకుడుగా చేసుకున్నారు. అతను రాజు అనే పేరు సంపాదించుకున్నాడు. పోరుగు వారిని జయించటం ప్రారంభించాడు. అతను చివరకు చక్రవర్తియై బోకారావ్ అని పేరుపెట్టుకున్నాడు. బోకారావ్ మీద డిల్లి రాజు దాడి చేశాడు కానీ ఓడిపోయి తిరిగి వెళ్ళిపోయాడు. బుక్క ఆ తరువాత ఒక నగరాన్ని నిర్మించి ‘విసజనగర్’ అని పేరు పెట్టాడు. దాన్ని మనం తప్పుగా బిస్నగ అంటున్నాము. మొత్తం రాజ్యాన్ని కూడా ఈ పేరుతోనే పిలుస్తున్నాము కానీ స్థానికులు మాత్రం ‘కన్నడ రాజ్యం’

అనే వ్యవహరించుకుంటారు''.

పైన పేర్కొన్న కూతో కథనం అనేక కథల మిశ్రమంగా కనిపిస్తోంది. ఈయన పేర్కొన్న **1220** తేదీ తప్పుగా ఉండటం, కూతో పాక్షికంగా న్యూనిజ్ చరిత్ర కథనం మూలంపైన గానీ, బారోస్ ప్రచురించిన సారాంశంపైన గానీ అధారపడినట్లు కనిపిస్తోంది. తక్కినదిచారిత్రకవాస్తవికతకంటేహిందూకల్పితగాథలమీదఅధారపడినట్లు కనిపిస్తోంది

మరొక కథనం బుక్క, హరిహరులు హొయసల బల్లాళ సామంతులని సూచిస్తోంది.

విజయనగర సామ్రాజ్య స్థాపకులు బనవాసికి చెందిన పురాతన కదంబ రాజ వంశం వారని **1474**లో భారత దేశంలో పర్యటించిన రష్యా యాత్రికుడు నికితిన్ అభిప్రాయపడ్డాడు. "బిదెనార్ లో ఉన్న హిందు సుల్తాను'' గురించి అతను మాట్లాడాడు.

ఈ మహా సామ్రాజ్యం ఆవిర్భావం గురించి ఇన్ని కథలు, పరంపరాగత కథనాలు మనకు లభిస్తున్నాయి. వీటిలో మనం ఏదో ఒకటి ఎంచుకోవచ్చు. ఇతర కథలు మరెన్నో మనకు లభిస్తున్నాయి. హిందూ గాథల సాధారణ గాలివాటాన్ని, కచ్చితమైన చారిత్రక సత్యాన్ని కలగలిపితే బహుశా మనకు అత్యంత యుక్తియుక్తమైన కథనం లభిస్తుంది. ఈ దృష్ట్యా ప్రస్తుతానికి కురుబ కులానికి చెందిన ఇద్దరు సోదరులు, బలమైన మతభావాలు కలిగిన వారు వరంగల్లు రాజు కోశాగారంలో పని చేస్తూ **1323** వరంగల్లు పతనమైన సమయంలో పారిపోయి వచ్చి ఒక చిన్న ప్రభువైన అనెగొంది రాజు కొలువులో చేరారు. ఈ ఇద్దరు సోదరులు, వారి ప్రభువులు కూడా ముస్లింల దోపిడీ దండయాత్రల పట్ల భయంతోనూ, జుగుప్సతోనూ నిండిన హృదయాలతో తమ మతం, తమ దేశం పట్ల తమ బాధ్యతకు అంకితమయ్యారు. ఈ సోదరులు ఆనెగొందిలో మంత్రి, కోశాధ్యక్ష పదవులకు ఎదిగారు. ముస్లిం చరిత్రకారుడు ఇబ్నెబతుతా చెప్పినట్లు అనెగొంది రాజు **1334**లో మహమ్మద్ సోదరుని కుమారుడు బహావుద్దీనుకు ఆశ్రయమిచ్చి ఢిల్లీ సుల్తాను ఆగ్రహానికి గురయ్యాడు. మహమ్మద్ తుగ్లక్ జరిపిన దాడిలో అనెగొంది పతనమైపోయింది. సుల్తాను రాజ్య పాలనకు తన అనుచరుడైన మాలిక్ ను నియమించి డిల్లీకి తిరిగి వెళ్ళాడు. ఆనేగొంది ప్రజలను పాలించడం మాలిక్ కు తలకు మించిన పని అయింది. తుగ్లక్ చివరకు మంత్రి, కోశాధ్యక్షులుగా ఉన్న కురుబ సోదరులను వరుసగా రాజు, మంత్రులుగా నియమించి రాజ్యాన్ని హిందువులకే అప్పగించాడు. ఈ సోదరులే

మొదటి హరిహరరాయలు (హుక్క), మొదటి బుక్క రాయలు(బుక్క)''. అని రాబర్ట్ సువెల్ తన పుస్తకంలో పేర్కొన్నారు.

విద్యారణ్య వృత్తాంత, విద్యారణ్య కాలజ్ఞానం అనే రెండు పుస్తకాలు కూడా విజయనగర సామ్రాజ్యాన్ని హక్కా, బుక్క అనే ఇద్దరు సోదరులు స్థాపించినట్లు చెబుతున్నాయి. ఓరుగల్లు రాజు వద్ద హక్కా, బుక్క అనే ఇద్దరు సోదరులు పనిచేసే వారని ఈ రెండు పుస్తకాలు ప్రకటించాయి. ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దిన్ ఖిల్జి ఆదేశం మేరకు మాలిక్ కఫూర్ జరిపిన దండయాత్రలో ఓరుగల్లు పతనమైన తరువాత ప్రతాపరుద్రుడి వద్ద పని చేసే ఇద్దరు అధికారులు కంపిలి రాజు రామనాథుడి కొలువులో చేరారనీ, ఢిల్లీ సుల్తాను కంపిలిపై దాడి చేసినప్పుడు ఈ ఇద్దరు సోదరులను బందించి ఢిల్లీకి తిసుకుపోయినట్లు విధ్యారణ్య కాలజ్ఞానం చెబుతోంది. ఐతే విద్యారణ్య వృత్తాంతం మాత్రం ఇద్దరు సోదరులు ఓరుగల్లు పతనానంతరం బందీలుగా ఢిల్లీ కి వెళ్ళినట్లు సూచిస్తోంది. విజయనగరాన్ని స్థాపించిన ఇద్దరు సోదరుల్లో రెండవ వాడైన బుక్కరాయలు కనిగిరి ప్రాంతానికి ప్రభువుగా వ్యవహరించే వాడని **1314** సంవత్సరంలో రాసిన ఒక శాసనం చెబుతోంది. అప్పట్లో కనిగిరి ప్రాంతం ప్రతాప రుద్రుడి ఏలుబడిలోని ఓరుగల్లు పరిధిలో ఉండేది, అంటే బుక్క ప్రతాపరుద్రుడి సామంతుడిగా పని చేసేవాడని భావించవలసి ఉంటుంది. కేలంద్రిప విజయం, రామనాథ కథే, న్యూనిజ్ వ్రాతలు కుడా ఈ దిశగానే సూచిస్తున్నాయని ప్రొఫెసోర్ కే.ఏ.నీలకంట శాస్త్రి తన 'ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర' రెండో వాల్యూం'లో తెలిపారు. ఉత్తరాధికి చెందిన ఇద్దరు సోదరులు, హక్కా,బుక్కఓరుగల్లుకువచ్చిస్థానికకురుబలేదాకురుమమహిళలనుపెళ్లి చేసుకుని ఓరుగల్లులో స్థిరపడినట్లు కేలంద్రిప విజయం తెలుపుతోంది. కుమ్మాట రాజధానిగా కంపిలి రాజ్యాన్ని ఏలుతున్న రామనాథుడి వద్ద హరిహర, బుక్క భండారక అధికారులుగా (కోశాధికారులు) పని చేసే వారని కుమార రామనాథ కథే చెబుతోంది. ఢిల్లీ సుల్తాను తాను **1330** లో ఓడించిన రామనాథుడి వద్ద పని చేసిన దేవరావు ను అనెగొంది పాలకుడుగా పంపించారని న్యూనిజ్ పత్రాలు సూచిస్తున్నాయి. మహమ్మద్ బిన్ తుగ్లక్ మొదట ఇరువురు సోదరులకు ముస్లిం మతం ఇప్పించి తగు విధమైన హామీలు తీసుకున్న తరువాతనే అనెగొందిలో విప్లవకారులను ఉసిగోల్పుతున్న హొయసల రాజు మూడవ బల్లాల దేవుడిపై దాడికి పంపించారని నీలకంట శాస్త్రి తెలిపారు. మూడవ బల్లాల దేవుడిని ఓడించి తన ఆధిపత్యాన్ని నెలకొల్పినందుకు సంతోషించిన తుగ్లక్ హరిహర, బుక్కలను అనెగొంది పాలకులుగా నియమించారని

ఆయన తెలిపారు. తుళువ బ్రాహ్మణులకు సంబందించిన ఒక పుస్తకం 'గ్రామ పదిట్టే' (graama paditte) కూడా తెలంగాణా ప్రాంతం నుండి వచ్చి విజయనగరాన్ని స్థాపించిన హరి హర, బుక్క సోదరులు కురుబ కులానికి చెందిన వారని స్పష్టంగా పేర్కొన్నట్లు ఫ్రాన్సిస్ బుక్నాన్ (Francis Buchanan) 1807లో రాసిన 'A Journey from Madras through Mysore, Canara and Malabaar' మూడవ సంపుటిలోని పదిహేనవ చాప్టర్ లో తెలపటం గమనార్హం. హరిహర, బుక్క మొదట ఓరుగల్లు మహారాజు ప్రతాపరుద్ర చక్రవర్తి వద్ద కోశాధికారులుగా పని చేశారని ఫ్రాన్సిస్ బుక్నాన్ సూచించారు. హరిహర, బుక్కరాయలు వంశానికి చెందిన పదమూడు మంది రాజులు మొత్తం 150 సంవత్సరాల పాటు విజయనగరాన్ని పాలించారని 'గ్రామ పదిట్టే' చెబుతోంది.

హరిహర, బుక్క సోదరులు ఓరుగల్లు నుండి ఆనెగొందికి వెళ్ళారనేందుకు పలు సాక్ష్యాలు ఉన్నాయి. ప్రముఖ చరిత్రకారుడు పి. వి. పరబ్రహ్మశాస్త్రి తన "కాకతీయులు" అనే పుస్తకంలో ఈ విషయాన్ని రుజువులతో చూపించారు. "శ్రీ భండారు" అంటే వరంగల్లు సామ్రాజ్యంలో కోశాగారం బాధ్యతలు నిర్వహించే ప్రధాన కోశాధికారిని శ్రీ భండారు అని పిలుస్తారు. మొదటి హరిహర రాయలు వేయించిన "కోడుమూరు" శాసనంలో ఈ మాట ఉన్నదని పరభాహ్మశాస్త్రి తన "కాకతీయులు" అనే పుస్తకంలో తెలిపారు. విద్యారణ్య వృత్తాంతం తదితర పుస్తకాలలోని అంశాలు విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర, బుక్కరాయలు కాకతీయ ప్రతాపరుద్రుని "శ్రీ భండారు" లని చెపుతున్నాయని పరబ్రహ్మ శాస్త్రి అభిప్రాయపడ్డారు. హరిహర, బుక్కరాయలు వరంగల్లు నుండి వచ్చిన తెలుగు వారన్న రాబర్ట్ స్వ్యూయల్ వాదనను శ్రీకృష్ణ స్వామీ అయ్యంగార్, హెచ్.కృష్ణ శాస్త్రి, పి.బి.దేశాయి పండితులు తిరస్కరించారు. హరిహర, బుక్క సోదరులు మూడో బల్లాలుని ఆస్థాన ఉద్యోగులని అందుచేత వారు కన్నడిగులని వారు సిద్దాంతీకరించారు. సంగమునికి ఆరుగురు కుమారులు %--% హరిహర, బుక్క, కంపన, మారప్ప, ముద్దప్ప మూడో బల్లాలుని కొలువులోని వారు. క్రీ, శ. 1327 -28 లో ఢిల్లీ సుల్తాన్ ద్వారసముద్రాన్ని ధ్వంసం చేయగా మూడో బల్లాలుడు తన రాజ్యం ఉత్తర సరిహద్దు రక్షణకు కేంద్రంగా హొసపట్నం (విరుపాక్ష పట్టణం) నిర్మించి ఆ సరిహద్దు భూముల్లో సేనాపతులుగా హరిహర, బుక్క సోదరులను నియమించి తానూ దక్షిణాన ఉన్న తిరువన్నామలై రాజధానిగా చేసుకుని పాలించాడన్నది ఈ పండితుల వాదన. హొసపట్టణమే విజయనగరం అయింది,బల్లాలుడు దూరంగా

ఉన్నందున హరిహరుడు బలపడి అతను మరణించిన అనంతరం స్వతంత్రించాడని వారు చెప్పారు. అయితే కృష్ణ శాస్త్రి, కృష్ణ స్వామి అయ్యంగార్, దేశాయి చేసిన పై వాదనను డాక్టర్ నేలటూరు వెంకటరమణయ్య ఖండిస్తూ హరిహర, బుక్క రాయలు తెలుగు వారేనని నిరూపించేందుకు ప్రయత్నించారు. హరిహర రాయలు మూడవ బల్లాలుని వద్ద పని చెయలేదనీ, తుగ్లక్ ఆదేశం మేరకు హరిహరుడు, బుక్క హెూయసిల రాజ్యంపై దాడి చేశారని ప్రొఫెసర్ సాలిటోర్ తన 'ఫర్దర్ సోర్సెస్ అఫ్ విజయనగర' అనే పుస్తకంలో నిరూపించటం గమనార్హం. ఢిల్లీ సుల్తాను ఆదేశం మేరకు మాలిక్ కఫూర్ వరంగల్లు పై దాడి జరిపి ఆక్రమించుకున్నప్పుడు ప్రతాపరుద్రుని వద్ద కోశాధికారులుగా పని చేసిన హరిహార, బుక్క సోదరులు కంపిల రాజ్యానికి పారిపోయి అతని వద్ద మంత్రి, కోశాధికారిగా చేరారని, సుల్తాను స్వయంగా జరిపిన దాడిలో కంపిల రాజ్యం పతనమై ఇరువురు సోదరులు బందీలుగా ఢిల్లీకి వెళ్ళారు, కంపిల రాజ్యంలో హిందువులు ప్రారంభించిన తిరుగుబాటును అణిచివేసేందుకు ఢిల్లీ నుండి వచ్చిన కురుబ సోదరులు తుగ్లక్ మరణానంతరం స్వతంత్రం ప్రకటించుకున్నారనే కథనాన్ని ఇప్పుడు చరిత్రకారులందరు ఆమోదిస్తున్నారు. తుగ్లక్ బందీలుగా ఢిల్లీకి వెళ్ళిన హరిహర, బుక్క సోదరులు ఇస్లాం మతం పుచ్చుకుని ఉన్నత పదవులకు ఎదిగారు, తుగ్లక్ విశ్వాసపాత్రులుగా మారటం ద్వారానే వారు కంపిలలో నెలకొన్న తిరుగుబాటును అణిచివేసేందుకు వచ్చారు. శృంగేరి మఠాధీషుడు విద్యారణ్య స్వామి సమక్షంలో వారు తిరిగి హిందూ మతంలోకి మారి హిందూమత పరిరక్షణ కోసం పాటుపడ్డారు.

విజయనగర సామ్రాజ్యాన్ని **1336** నుండి **1646** వరకు ఐదు వంశాలు పాలించాయి. కురుమ సోదరులు స్థాపించిన మొదటి సంగమ వంశం **1336** నుండి **1485** వరకు విజయనగరాన్ని పాలించింది. విజయనగరాన్ని స్థాపించిన హరి హర, బుక్కలు సంగముని పుత్రులు. మంగళనిలయానికి చెందిన సంగముడికి హరిహర,బుక్కలతో పాటు కంపన, మారప,ముద్దప కుమారులు ఉండేవారు. సాలువ వంశం **1485** నుండి **1505** వరకు, తులువ వంశం **1542** నుండి **1570** వరకు, శ్రీకృష్ణ దేవరాయలు అల్లుడైన అలియ రామరాజు స్థాపించిన, ఆఖరు వంశం ఆరవీడు రాజులు **1542** నుండి **1646** వరకు విజయనగరాన్ని పాలించారు. విజయనగర రాజుల్లో అత్యంత శక్తిమంతుడు, కీర్తిమంతుడు, ప్రతిభావంతుడు, సమర్థుడైన తుళువ వంశానికి చెందిన శ్రీ కృష్ణ దేవరాయలు **1509** నుండి **1529** వరకు పాలించారు. **1565**లో బహమనీ సుల్తాన్లు, గోల్కొండ నవాబులు, ఇతర ముస్లిం రాజులు మూకుమ్మడిగా జరిపిన తళ్లికోట లేదా

రాక్షస తంగడి యుద్దంలో విజయనగర సామ్రాజ్యం దాదాపుగా కుప్ప కూలింది. ముస్లిం సైన్యాలు పగ, ద్వేషం, కసితో చేసిన దాడిలో విజయనగర సామ్రాజ్యం ముఖ్యంగా రాజధాని హంపి సర్వనాశనమైంది. అలియ రామరాజు సైన్యంలోని దాదాపు రెండు లక్షల మంది ముస్లిం సైనికులు యుద్ధం జరుగుతున్న సమయంలో వెన్నుపోటు పొడవటంతో హిందూరాజ్య పతనం ప్రారంభమైంది. ముస్లిం రాజులు ఇస్లాం పేరుతో విజయనగరం ముస్లిం సైనికులను తమ వైపు తిప్పుకుని అలియ రాజరాజుకు మోసం చేయించినట్లు చరిత్ర చెబుతోంది. అలియ రామారాజు సైన్యంలోని ముస్లిం సైనికులు వెన్నుపోటు పొడవకపోతేఆయననిజాంసైనికులకుచిక్కేవాడుకాదనిచరిత్రచెబుతోంది.
విజయనగరంలోని ముస్లింలు విశ్వాతఘాతుకానికి పాల్పడటంతో దాదాపు మూడు వందల సంవత్సరాల పాటు హిందూ మతాన్ని కంటికి రెప్పలా కాపాడిన విజయనగర సామ్రాజ్యం పతనం కావటం వలన నిజాం, బీదర్, గుల్బర్గా తదితర ముస్లిం పాలకులకు దక్షిణాదిలో ఎదురు లేకుండా పోయింది. తళ్ళికోట యుద్ధం తరువాత కుడా విజయనగర సామ్రాజ్యం కొంత కాలం చంద్రగిరి, తదితర పట్టణాలను రాజధానిగా చేసుకుని కొనసాగినా అది ఆ తరువాత ఎప్పుడు కూడా పూర్వ వైభవాన్ని సాధించుకోలేకపోయింది.

హిందూమత సంరక్షణ కోసం 1336లో ఊపిరి పోసుకున్న విజయనగర సామ్రాజ్యాన్ని హరిహర, బుక్కరాయలకు చెందిన సంగమ రాజ వంశం 1485 వరకు అధికారంలో కొనసాగింది. హరిహర రాయలు, బుక్క రాయలు, రెండవ హరిహర రాయలు, విరుపాక్ష రాయలు, రెండవ బుక్క రాయలు, దేవ రాయలు, రామచంద్ర రాయలు, వీర విజయ బుక్క రాయలు, రెండవ దేవ రాయలు, మల్లికార్జున రాయలు, రెండవ విరూపాక్ష రాయలు, ప్రౌడ రాయలు సంగమ వంశం రాజులు. సాలువ రాజ వంశం 1485 నుండి 1505 వరకు రాజ్యమేలింది. సాలువ నరసింహ దేవరాయలు, తిమ్మభుపాల రాయలు, రెండవ నరసింహ రాయలు ఈ రాజ వంశానికి చెందిన రాజులు. విజయనగరాన్ని తుళువ రాజ వంశం 1491 సంవత్సరం నుండి 1570 వరకు పాలించింది. తుళువ నరసనాయక, వీర నరసింహ రాయలు, వెంకట దేవరాయాలు, సదాశివరాయలు తుళువ వంశం రాజులు. కృష్ణదేవ రాయలు అల్లుడైన అలియ రామ రాయలుతో ఆరవీడు రాజవంశం పాలనకు శ్రీకారం జరిగింది. 1542 నుండి 1646 వరకు అధికారంలో ఉన్న ఈ రాజవంశంలో అలియ రామరాయలు, తిరుమల దేవరాయలు, శ్రీరంగ రాయలు, రెండవ వెంకట రాయలు, రెండవ శ్రీరంగ రాయలు, రామదేవ

రాయలు, మూడవ వెంకట రాయలు, మూడవ శ్రీరంగరాయలు రాజులుగా కొనసాగారు. ఐతే అలియ రామరాయల 23 సంవత్సరాల పాలన అనంతరం 1565లో అహ్మద్ నగర్, బీజాపూర్, బీరార్, గోలుకొండ, బీదర్ ముస్లిం రాజులు ఇస్లాం మతం పరిరక్షణ పేరుతో విజయనగర సామ్రాజ్యంపై తళ్ళికోట వద్ద జరిపిన 'జిహాద్' యుద్దంలో విజయనగర సామ్రాజ్యం పతనమైయింది. ఈ అయిదుగురు ముస్లింరాజుల మధ్య ఎన్నో విభేదాలున్నా, హిందూరాజ్యమైన విజయనగరాన్ని తుదముట్టించేందుకు ఏకంకావడం గమనార్హం. దాదాపు ఆరు నెలలపాటు భయంకరమైన విధ్వంసానికి గురైన విజయనగరంరాజధానిగారాజ్యపాలనచేసేందుకుతిరుమలదేవరాయలుజరిపిన ప్రయత్నం ఎంత మాత్రం సఫలం కాలేదు. ముగ్గురు ముస్లిం పాలకులు సృష్టించిన ఘోరకలితో ధైర్యాన్ని కోల్పోయిన ప్రజలు రాజధానికి తిరిగి వచ్చేందుకు ఇష్టపడలేదు. దీనితో తిరుమల దేవరాయలు మరోచోట రాజధానిని ఏర్పాటు చేసుకోక తప్ప లేదు. ఆరవీడు రాజవంశం రాజులు విజయనగరానికి పూర్వ వైభవాన్ని సాధించేందుకు చేసిన కృషి ఫలించలేదు. అది కాలక్రమేనా క్షీణించి 1646 సంవత్సరంలో మూడవ శ్రీరంగరాయలుతో అస్తమించింది.

అలియ రామరాయలు (అలియ అంటే కన్నడంలో అల్లుడు అని అర్థం) బలోపేతం కావటంతో భయపడిపోయిన ముగ్గురు ముస్లిం రాజులు ఇస్లామిక్ జిహాద్ పేరుతో కుట్రలు, కుతంత్రాలు పన్ని విజయనగర సామ్రాజ్యాన్ని పతనం చేశారు. అలియ రామరాజు వద్ద ఉన్న మొత్తం పది లక్షల సైన్యంలో రెండు లక్షల మంది ముస్లిం సైనికులు ఉండేవారు. ఈ రెండు లక్షల మంది ముస్లిం సైనికులకు ఇద్దరు అధికారులు ఉండేవారు. ముస్లిం సైనికుల పట్ల అలియ రామరాయలుకు అమితమైన ప్రేమాభిమానాలతో పాటు వారి నిబద్ధత పట్ల పూర్తి విశ్వాసం ఉండేది. రాక్షస తంగడి లేదా తళ్లికోట యుద్దంలో దాదాపుగా ఓడిపోయిన ముస్లిం సుల్తాన్లు అలియ రామరాయలును మోసంతో ఓడించారు. గోలకొండ, అహమద్ నగర్ ,బీదర్ సుల్తానులు జిహాద్ పేరుతో అలియరామరాయలు సైన్యంలోని రెండు లక్షల మంది ముస్లిం సైనికులను తమ వైపు తిప్పుకున్నారు. యుద్ధం జరుగుతున్న సమయంలో రెండు లక్షల మంది ముస్లిం సైనికులు అకస్మాత్తుగా ఎదురు తిరిగి విజయనగరం సైనికులపై దాడి చేశారు. తన సైనికులు తనపై తిరగబడటంతో అలియరామరాయలు హతాసుడైపోతాడు. ఈ గందరగోళంలో ఎవరో వేసిన బాణం తగిలి ఆలయరామరాయలు ఎనుగుపైనుండి పడిపోవటం, శత్రు సైనికులు అతన్ని చుట్టుముట్టి ఎత్తుకునిపోయి నిజాం షా ముందు

నిలబెట్టటం జరిగిపోతుంది. నిజాం షా సైనికులు పట్టుకు వచ్చిన 82 సంవత్సరాల అలియరామరాయలు తలను అక్కడికక్కడే నరికివేయటంతో విజయనగర సైన్యం చిందరవందరై పరాజయం పాలయ్యింది.

శివాజీ మహారాజ్



విజయనగర సామ్రాజ్యం పతనానంతరం హిందు మతం, హిందువులను కాపాడేందుకు నడుము బిగించి విజయాలు సాధించిన ఘనత రెండవ రాజు ఛత్రపతి శివాజీ, ఆయన నెలకొల్పిన మరాఠా రాజ్యానికి దక్కుతుంది. శివాజీ మహారాజ్ హిందూ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయటం వెనక ఆయన తల్లి జిజాభాయి అత్యంత కీలక పాత్ర నిర్వహించారు. జిజాభాయి శివాజీకి చిన్నప్పుడు చేసిన రామాయణ, మహా భరతం బోధన, ఇచ్చిన శిక్షణ, నూరిపోసిన దేశ భక్తి, ధైర్య,సాహసాలు, కర్తవ్యనిష్ఠ మూలంగానే అతను అత్యంత దృఢ సంకల్పం, పట్టుదలతో మరాఠా రాజ్యాన్ని ముందుకు నడిపించి ముస్లిం పాలకులతో అనునిత్యం పోరాడాడు. శివాజీని ఎదురులేని రాజుగా తీర్చిదిద్దిన జిజాభాయి ధనగర్ అంటే గొర్రెల కాపర్ల కులానికి చెందిన వనిత. శివాజీ కున్బి లేదా కుంబి కులానికి చెందిన వ్యక్తి. కున్బి లేదా కుంబి కులం కుడా కురుంబ కులం నుండి పుట్టుకు వచ్చిందే. కురుంబ, కుదుంబ నుండి కూర్మి, కున్బి, కుంబి కులాలు ఎలా పుట్టయనేది ఇది వరకే తెలుసుకున్నాము.

హెూల్కర్ సామ్రాజ్యం



ఆహిల్య భాయి హెూల్కర్

మరాఠా రాజు పేష్వా బాలాజీబాజీరావ్ వద్ద సుబేదార్ గా పని చేసిన మల్హార్ రావ్ హెూల్కర్ (1694-1766) ఇండోర్ రాజధానిగా హెూల్కర్ సామ్రాజ్యాన్ని స్తాపిచారు. ధనగర్ (గొర్రెల కాపర్ల) కులానికి చెందిన మల్హార్రావ్ హెూల్కర్ 1720 సంవత్సరంలో పేష్వా బాజీరావు ఆదేశం మేరకు మాల్వా ప్రాంతం పైకి దండెత్తి విజయం సాధించారు. మల్హార్రావ్ హెూల్కర్ దాదాపు పదమూడు సంవత్సరాల పాటు పేష్వా బాజీరావ్ తరపున మాల్వా ప్రాంతాన్ని పాలించారు. పేష్వాబాజీరావ్ 1733 లో మల్హార్ రావు హెూల్కర్ కు ఇండోర్ ప్రాంతంలోని తొమ్మిది పరఘనాలు ఇచ్చి సామంత రాజుగా పరిపాలన కొనసాగించాలని ఆదేశించారు. మల్హార్రావ్ హెూల్కర్ 1747 లోతన పేరుతో మల్హార్ గంజ్ ను ఏర్పాటు చేయటంతో పాటు 1747 లో "రాజ్వడా' రాజ భవనాల నిర్మాణం చేపట్టారు. మల్హార్ రావ్ హెూల్కర్ 1766లో మరణించే నాటికి మొత్తం మాల్వా అతని అదీనంలోకి రావటంతో పాటు మరాఠా సమాఖ్యలోని ఐదు స్వతంత్ర రాజ్యాలలో ఒకటిగా గుర్తింపబడింది. ధనగర్ సైన్యం, ధనగర్ అశ్విక దళాన్ని ఏర్పాటు చేసిన మొదటి వ్యక్తీ మల్హార్ రావ్ హెూల్కర్ అనేది మరిచిపోరాదు. అతోక్ పై మరాఠా పతాకాన్ని ఎగుర వేసిన మొదటి వ్యక్తి యశ్వంత్ రావ్ హెూల్కరే. యశ్వంత్ రావ్ హెూల్కర్ నాయకత్వంలోని ధనగర్ సైన్యం బ్రిటిష్ సైన్యాన్ని ధైర్య, సాహసాలతో గట్టిగా ప్రతిఘటించింది. అయితే దేశంలోని ఇతర రాజులూ, సంస్తానాదీషులు కలిసిరాకపోవటంతో యశ్వంత్ రావ్ హెూల్కర్ చివరకు బ్రిటిష్ పాలకులతో కలిసి పనిచేయక తప్ప లేదు. యశ్వంత్ రావ్ మల్హార్ రావు హెూల్కర్ మరణానంతరం ఒక సంవత్సరానికి అంటే 1767 లో అతని కోడలు అహిల్యా భాయి హెూల్కర్ మాల్వ సామ్రాజ్యం మహారాణి అయ్యారు. ఆహిల్య భాయి 1725 మే 31 తేది మహారాష్ట్ర లోని అహమద్ నగర్ జిల్లాలోని చౌండి గ్రామంలో జన్మించారు. మల్హార్ రావ్ హెూల్కర్

మరణాంతరం ఆయన మనుమడు మాలే రావు హెూల్కర్ 1766 లో రాజుగా నియమితులయ్యారు. అయితే అతను కొన్ని నెలలలోనే మరణించటంతో ఆహిల్య భాయి హెూల్కర్ మాల్వా దేశం బాధ్యతలు చేపట్టారు. ఆహిల్య భాయి హెూల్కర్ మాల్వా రాజ్యం బాధ్యతలు చేపట్టేందుకు పలువురు మరాఠా నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే హెూల్కర్ సైన్యం మద్దతు ఇవ్వటంతో అహల్యాభాయి హెూల్కర్ ఇండోర్ ను పరిపాలించేందుకు పేష్వా బాజీ రావ్ అంగీకరిస్తాడు. దీనితో ఆమె ఇండోర్ రాణి కాగలిగారు. మల్హార్ రావ్ హెూల్కర్ ఏకైక కుమారుడు ఖండే రావ్ హెూల్కర్ 1754 లో కుహ్మేర్ వద్ద భరత్ పూర్ జాట్ మహారాజు సూరజ్ మల్ తో జరిగిన యుద్ధంలో మరణించాడు. అప్పట్లో భర్త మరణిస్తే భార్య సతీ సహగమనం చేయటం ఆచారం ఐతే మల్హార్ రావు హెూల్కర్ మాత్రం అహిల్య భాయి హెూల్కర్ సతీ సహగమనం చేయకుండా ఆపారు. ఆయన అహిల్య భాయిని తన కోడలుగా చేసుకోవటం కూడా నాటకీయంగా జరిగిందని చరిత్ర చెబుతోంది. పేష్వా బాజీ రావు వద్ద మాల్వా ప్రాంతం కమాండర్ గా పనిచేస్తున్నప్పుడు మల్హార్ రావు హెూల్కర్ ఒకసారి పునాకు వెళుతూ అహిల్యభాయి పుట్టిన ఊరైన చౌండిగ్రామలో ఆగుతారు. మల్హార్ రావు హెూల్కర్ చౌండి గ్రామ దేవాలయంలో పూజలు, సేవలు చేస్తున్న అహల్య భాయి దైవ భక్తీ, వ్యక్తిత్వం చూసి ప్రభావితుడవుతాడు. ఆయన అహిల్య భాయిని ఇండోర్ కు తెచ్చి తన కుమారుడు ఖండే రావు హెూల్కర్ తో 1733 లో పెళ్లి చేసాడని చరిత్ర చెబుతోంది. అహిల్య భాయి హెూల్కర్ రాజ్యం పగ్గాలు చేపట్టగానే దేశ రాజధానిని ఇండోర్ నుండి నర్మదా నది ఒడ్డున ఉన్న మహేశ్వర్ కు మార్చింది. అహిల్య భాయి హెూల్కర్‌కు మాలేరావు, ఒక కూతురు ముక్తా బయి . మాలే రావు మానసిక సమస్యల మూలంగా చిన్న తనంలోనే మరణిస్తాడు. అహిల్య భాయి తను కూతురు ముక్తా భాయిని దోపిడీ దొంగలను అణచిన వీరుడు యశ్వంత్ రావు అనే బీద యువకుడికి ఇచ్చి పెళ్లి చేయటం గమనార్హం.

ఆహిల్య భాయి హెూల్కర్ తన ఇరవై ఎనిమిది సంవత్సరాల పాలనలో మాల్వా దేశాన్ని ఎంతో అభివృద్ధి చేసింది. మల్హార్ రావు హెూల్కర్ దత్త కుమారుడు తూకోజి రావు హెూల్కర్ ను సైన్యాధ్యక్షుడుగా నియమించటం ద్వారా ఆమె దేశంతో పాటు తమ కుటుంబంలో శాంతి, భద్రతలను నెలకొల్పుకోగాలిగారు.ఆమె మాల్వాతో పాటు కాశి, మథుర, ద్వారక, గయ, సోమనాథ్, అయోధ్య, హరిద్వార్, మదురై, కంచి, అవంతి, బద్రినారాయణ్, రామేశ్వరం, పూరి తదితర ప్రాంతాల్లో ఎన్నో దేవాలయాలు, నదుల

వొడ్డున ఘాట్లు, బావులు, విశ్రాంతి గృహాలు, సత్రాలు, చౌత్రీలు నిర్మించారు. ఆమె నిర్మించిన వందలాది దేవాలయాలు, ధర్మశాలలు ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. మాల్వా రాజధాని మహేశ్వరిలో నివసించే చేనేత కార్మికుల జీవితాలను బాగు చేసేందుకు ఆహిల్య భాయి హెూల్కర్ చేసిన కృషి జగద్విదితము. ఆహిల్య భాయి హెూల్కర్ చేసిన కృషి మూలంగానే మహేశ్వరి చీరలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయి. ఆహిల్య భాయి హెూల్కర్ మరణానంతరం మల్హార్ రావు హెూల్కర్ దత్త కుమారుడు, అహల్య భాయి హెూల్కర్ సైన్యాదక్షుడు తుకోజి రావ్ హెూల్కర్ కొంత కాలం రాజ్యాన్ని పాలించారు. అతని మరణానంతరం అతని కుమారుడు యశ్వంత్ రావు హెూల్కర్ రాజ్యాధికారం చేపట్టారు. యశ్వంత్ రావు హెూల్కర్ బ్రిటిష్ పాలకులను ఎదురించేందుకు భారత దేశంలోని రాజులందరిని ఒక వేదిక పైకి తెచ్చేందుకు ప్రయత్నించారు. మన రాజుల మధ్య ఐక్యమత్యం కుదరలేదు, ఈ నేపథ్యంలో బ్రిటిష్ పాలకులు ఆయనతో ఒక ఒప్పందం కుదుర్చుకుని అతన్ని స్వతంత్ర రాజుగా గుర్తించారు. బ్రిటిష్ పాలకులు హెూల్కర్ లను మహరాజులుగా గుర్తించటంతో పాటు వారికి పంతొమ్మిది తోపుల సల్యూట్ అనుమతించారు. హెూల్కర్ లు అప్పటి నుండి దేశానికి స్వాతంత్రం వచ్చేంత వరకు స్వతంత్ర రాజులుగా ఇండోర్ లో పరిపాలన కొనసాగించారు. 1950లో ఆఖరు హెూల్కర్ రాజు రెండవ యశ్వంత్ రావు హెూల్కర్ కేంద్ర ప్రభుత్వంతో విలీన ఒప్పందంపై సంతకం చేశారు. దీనితో ఇండోర్ హెూల్కర్ రాజ్యాన్ని మధ్య ప్రదేశ్ లో కలిపివేశారు. ప్రస్తుతం హెూల్కర్ సంతతి వారు ముంబాయి, ఇండోర్, మహేశ్వర్ లో నివసిస్తున్నారు.

కరౌలి దేశం



రాజస్తాన్ లో 1348 నుండి 1949 వరకు కొనసాగిన కరౌలీ దేశం పాలకులు గొర్రెల కాపర్లు. అందుకే ఈ జదౌన్ యదువంశి రాజవంశ పాలకులు తమ ఆయుధ పతాకం (కోట్ ఆఫ్ అర్మ్స్) లో గొర్రె, మేక, ఆవు, పులి బొమ్మలు, నెలవంక చంద్రుడు, ఢంకా చిహ్నం ఏర్పాటు చేసుకున్నారు. మేకలు, బియ్యం

ఈ దేశం ప్రధాన ఎగుమతులు.. మథుర దేశాన్ని రాజా బిజయ్ పాల్ 995 లో స్థాపిస్తే ఇందులో నుండి కరౌలి దేశం 1348 లో ఆవిర్భవించింది. అందుకే మొదట్లో మథుర ఈ దేశం రాజధానిగా ఉండేది. తరువాత కాలంలో ద్వారిక, బయానా, తిమాన్గర్హ, అందేర్ కోట్ల, మండ్రయల్, ఉంట్గిర్ మరియు బహాదర్ పుర ఈ దేశం రాజధానులుగా పని చేశాయి. పద్దెనిమిదవ శతాబ్దంలో మరాఠా పేష్వాల ఆధీనంలో పని చేసిన కరౌలి దేశం ఆ తరువాత బ్రిటిష్ పాలకుల రక్షణలో కొనసాగింది. 1947 లో భారత దేశానికి స్వాతంత్ర వచ్చిన తరువాత కరౌలి దేశం 1949 ఏప్రెల్ 7 తేదినాడు దేశంలో విలీనమై రాజస్థాన్ లో ఒక భాగమైంది. కరౌలి దేశం ఆఖరు పాలకుడు గణేష్ పాల్. రాజస్థాన్ ప్రభుత్వం 1997 మార్చ్ 1 తేదినాడు సవాయి మధోపూర్ లోని ఐదు తాలూకాలతో కలిపి ప్రత్యేక కరౌలి జిల్లాను ఏర్పాటు చేసింది.

బెంగాల్ పాలా రాజ కుటుంబం

అవిభాజిత బెంగాల్ ను క్రీస్తు శకం 750 నుండి దాదాపు నాలుగు వందల సంవత్సరాలు పాలించిన పాలా సామ్రాజ్యం కుడా గొర్రెల కాపర్లదేనని అంటారు. యోదుడైన వప్యత కుమారుడు గోపాలుడు పాలా సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు చరిత్ర చెబుతోంది. చిన్న చేపను పెద్ద చేప తినే మత్స్య న్యాయం నుండి తమను తాము కాపడుకునేందుకు ప్రజలే గోపాలుడిని తమ రాజుగా ఎన్నుకున్నారన్నది చరిత్రకారుల అభిప్రాయం. బీహార్ లోని ప్రపంచ ప్రఖ్యాత నలంద విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన పాలా రాజులు బౌద్ధమతావలంబులు.

ఉత్తరాదిలోని ఆహిర గొర్రెల కాపరులైన బెంగాల్ పాలా రాజులు ఒకరేనని సర్ ఎల్లియట్ అభిప్రాయపడ్డారు. గొర్రెల కాపర్లైన ఈ ఆహిరులు ఒకప్పుడు మొత్తం భారత దేశాన్ని పాలించిన మహారాజులని సర్ ఎల్లియాట్ అభిప్రాయపడ్డారు. పురాణాలలోని అభిరులు ప్రస్తుత ఆహిరులు ఒక్కరే అని ఆయన చెప్పటం గమనార్హం. పురాణాలు పలుమార్లు 'పల్లి' అనే గొర్రెల కాపర్ల జాతి,రాచరికం, రాజుల గురించి ప్రస్తావించాయి. పల్లి అనే ఈ గొర్రెల కాపర్లు ఒకప్పుడు భారత దేశమంతా విస్తరించి రాజ్యపాలన చేశారని పురాణాలు చెబుతున్నాయి.

బళ్ళారి పాలెగాళ్ళు

ప్రస్తుత కర్ణాటకలోని బళ్ళారి ప్రాంతం మొదటి పాలెగాళ్ళు కురుబలు. ఒక చిన్న ప్రాంతానికి సంబందించిన పరిపాలన, సైనిక పరమైన బాధ్యలను నిర్వహించే వారు పాలేగాళ్ళు. కాకతీయ, విజయనగరం, మదురై నాయకుల కాలంలో పాలెగాళ్ళ నియామక వ్యవస్థ అమలులో ఉండేది. కాకతీయ రుద్రమ దేవి ప్రారంభించిన 'నాయకుల' వ్యవస్థ విజయనగరం రాజుల కాలంలో పాలెగాళ్ళ వ్యవస్థగా రూపాంతరం చెందటం గమనార్హం. రాజులు తమ నమ్మకస్తులు, తమ వర్గానికి చెందిన వారిని పాలేగాళ్ళుగా నియమించే వారు. ఈ కోవకు చెందిన వాడే బళ్ళారి పాలెగాడు బలద హనుమప్ప నాయక. పాలెగాళ్ళ వ్యవస్థ పదహారవ శతాబ్దం నుండి పద్దెనిమిదవ శతాబ్దం వరకు కొనసాగినట్లు చరిత్ర చెబుతోంది. హండె కురుబ వర్గానికి చెందిన హనుమప్ప నాయక విజయనగరం పతనాంతరం బీజాపూర్ సుల్తాన్ నాయకత్వాన్ని ఆమోదించి వజీర్ అనే బిరుదుతో బళ్ళారి,అనంతపూర్,కురుగోడ్,బంకాపూర్ ప్రాంతాలపై తన ఆధిపత్యం కొనసాగించారు. బ్రిటిష్ కలెక్టర్ మన్రో పాలెగాళ్ళ వ్యవస్థకు అణచివేత చర్యల ద్వారా ముగింపు పలికాడు. పలువురు పాలెగాళ్ళు తమ ఆదాయాన్ని స్వాదీనం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్న ఈస్ట్ ఇండియా కంపెనీతో పోరాడి అసువులు బాసారు. పాలెగాళ్ళ వ్యవస్థకు **1807** లో తెరపడింది. దాదాపు నూటా నలభై రెండు మంది పాలెగాళ్ళలో ఎక్కువ మంది కురుబ,గొల్ల, బోయ, ఎకిర వర్గానికి చెందిన వారు కాగా ఐదుగురు రెడ్డి వర్గం వారు, ఇద్దరు కమ్మ కులస్తులు ఉండేవారు.

గొల్లకొండ లేదా గోల్కొండ



ఒక గొర్రెల కాపరి మూలంగా దీనికి గొల్ల కొండ అనే పేరు వచ్చింది. కాల క్రమంలో గొల్లకొండగా మారిన దీనిని మొదట్లో మంకల్ అని పిలిచేవారని చరిత్ర చెబుతోంది. క్రీస్తుశకం **1143** లో వరంగల్ మహారాజు ఇక్కడ ఒక మట్టి కోటను నిర్మించాడని అంటారు.

వరంగల్ రాజులూ ఇక్కడ మట్టికోటను కట్టించేందుకు ఒక గొర్రెల కాపటి ప్రధాన కారణం. ఒక గొర్రెలకాపరి మంకల్ గుట్టలపై గొర్రెలను కాచే సమయంలో అక్కడ ఒక దేవతా విగ్రహాన్ని చూస్తాడు. ఈ విషయం కాలక్రమంలో వరంగల్ రాజులకు చేరటంతో గణపతి దేవుడు లేదా మరో కాకతీయ రాజు ఇక్కడి ఒక మట్టి కోటను కట్టించినట్లు ప్రతీతి. మంకల్ చుట్టుప్రక్కల ప్రాంతంలో గొర్రెలకాపర్లు అత్యధికంగా నివసించే వారు. అప్పుడే కాదు ఇప్పుడు కూడా ఈ చుట్టుపక్కల ప్రాంతంలో గొర్రెలకాపర్లు ముఖ్యంగా కురుమ వర్గం ప్రజలు అధికంగా నివాసం ఉంటారు. పద్నాలుగు నుండి పదిహేడవ శతాబ్దం మధ్య కాలంలో బహమనీ సుల్తాన్లు, కుతుబ్ షాహిలు గొల్లకొండ కోటను పటిష్టం చేశారు. కురుమ కులం వారు గొల్లకొండ కేంద్రంగా రాజ్యమేలినట్లు ఎలాంటి సాక్ష్యాలు లేవు, కథనాలు కూడా లేవు. అల్లా ఉద్దీన్ ఖిల్జి ఆదేశం మేరకు మాలిక్ కాఫుర్ జరిపిన దాడిలో వరంగల్ మతనమైన తరువాత్ ముసునూరు కాపయ నాయకుడు గొల్లకొండను బహమనీ సుల్తానలకు ఇచ్చివేశారనే కథనం ఒకటి ఉన్నది.

తిరుమల, తిరుపతి

తిరుమల కొండల్లో కొలువు తీరిన శ్రీవెంకటేశ్వరుడు పశువుల కాపర్ల దేవుడు, అది పశువుల కాపర్ల దేవాలయం. ఈ దేవాలయం మొదట వీరభద్రుడి దేవాలయంగా మారి ఆ తరువాత శ్రీ వెంకటేశ్వరుడి దేవాలయంగా రూపాంతరం చెందింది. వాస్తవానికి ఇది గొర్రెలకాపర్ల కులగురువుబీరప్పదేవాలయంఅనేవాదనఒకటున్నది. ఈ దేవాలయం స్థాపన, అభివృద్ధిలో కురుమ, గొల్ల, యాదవ వర్గం ప్రముఖ పాత్ర నిర్వహించింది. ఏడుకొండలు ఉన్న ప్రాంతాన్ని వేంగడం అంటారనేది అందరికి తెలిసిందే వేంగడం పై ఉన్న బీరేశ్వరుదు వెంగడేశ్వరుడు-వేంకటేశ్వరుడు అయ్యాడు. శ్రీ వేంకటేశ్వరుడు విష్ణు అవతారమా? ఈశ్వరా వతారమా? అనేది అసలు ప్రశ్న. శ్రీ వెంకటేశ్వర స్వామి ఎవరు అనేది అతి పెద్ద వివాదాస్పద అంశం. పన్నెండవ శతాబ్దం



నుండి ఈ వివాదం కొనసాగుతోంది. సామాన్య జనానికి ఈ వివాదం గురించి పెద్దగా తెలియదు.. నేడు కూడా తిరుమలలో మొదట దేవుడి దర్శనం అయ్యేది ఒక గొల్ల వాడికే. స్వామి వారు ఉదయం మేల్కొన్న వెంటనే గోవు దర్శనం చేయించేది ఒక గొల్ల వాడు. ఇక తిరుమలలో ఉన్న గొల్ల మండపం గురించి అందరికి తెలిసిందే. తిరుమలలో పుట్టలో ఉన్న శ్రీవెంకటేశ్వరా స్వామి విగ్రహాన్ని కనుగొన్నది ఒక గొల్ల వాడు.

వాస్తవానికి తిరుమల పన్నెండవ శతాబ్దానికి పూర్వం శివుడి ఆలయమనీ, ముఖ్యంగా కురుమ, కురుబ వర్గం కుల గురువు, కులం దేవుడైన బీరప్ప దేవాలయం అనే ఒక వివాదం ఉన్నది. ఈ వాదన,వివాదం చాలా విస్తృతమైనది కాబట్టి దీని గురించి ఇక్కడ చర్చించటం లేదు. ప్రస్తుతం తిరుమల దేవాలయం అభిరుద్ధిలో కురుమ, కురుబ వర్గం పాత్ర గురించి మాత్రమే చర్చిస్తున్నాము. తిరుమల శైవ దేవాలయం నుండి వైష్ణవ దేవాలయంగా మారటం, గుడిలోని దేవుడు శివుడా లేక విష్ణువా అనే వివాదంలో స్థానిక రాజు యాదవరాయ (కులోత్తుంగచోళ యాదవరాయ) అత్యంత కీలక పాత్ర నిర్వహించటంచరిత్రకారులందరికితెలిసిందే.యదవరాయరాజువైష్ణవాచార్యుడు రామానుజుడి పక్షం వహించకుండా స్థానిక శైవుల పక్షం వహించి ఉంటే తిరుమల శైవ దేవాలయంగానే కొనసాగేది. యాదవరాయుడు శ్రీవైష్ణవుడైన రామానుజాచార్యుల పక్షం వహించాడు కాబట్టే బీరప్ప దేవాలయం కాస్తా వైష్ణవ దేవాలయంగా మారిపోయింది. రామానుజా చార్యులు పశుపాలకుడైన శ్రీ కృష్ణుడు శ్రీ మహా విష్ణు అవతారం అని చెప్పటంతో బీరప్ప దేవాలయం వైష్ణవ క్షేత్రంగా మారిందని కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. శ్రీరామానుజాచార్యులు చేసిన వాదనతో ఏకీభవించిన స్థానిక యాదవ రాజు తిరుమలలోని విగ్రహం శ్రీమహావిష్ణువుదని ప్రకటించారు. ఇదిలా ఉంటే తిరుమల అభివృద్ధికి శ్రీకృష్ణ దేవయరాయలు కృషి చేశారు. ఆయన ఏ స్థాయిలో శ్రీ వెంకటేశ్వర స్వామికి బంగారు ఆభరణాలు బహుకరించారనేది జగద్విధితం. విజయనగర రాజులు దాదాపు మూడు వందల సంవత్సరాల పాటు తిరుమల, తిరుపతి దేవాలయాన్ని పోషించారు.

యాదవరాయలు తిరుపతి, తిరుమల దేవాలయం ఉన్న తొండమండలం పరిపాలకుడు. తొందమండలం రాజులు మొదట చోళ రాజులకు సామంతులుగా పని చేసేవారు. వారు ఆ తరువాత పాండ్య రాజులకు కూడా సామంతులుగా పని చేసిన అనంతరం స్వాతంత్రం ప్రకటించుకుని పాలన కొనసాగించారు. యాదవరాయ కుటుంబం మొదటి నుండి శ్రీ వెంకటేశ్వరా స్వామీ పరమ భక్తులు. ఈ రాజ

కుటుంభానికి చెందిన వీర నరసింఘ దేవ రాయ తిరుమల దేవాలయంలో పూజలు, అర్చనాకు అవసరమైన బియ్యం, కూరగాయలు, నెయ్యి కొనుగోలు చేందుకు ఒక గ్రామాన్ని దానంగా ఇచ్చారు. వీర నరసింఘ దేవ రాయలు భార్య తిరుమల దేవాలయంలో రెండు దీపాలు వెలిగించేందుకు అవసరమైన నిధుల కోసం నాలుగు ఆవులు, రెండు అంభోతులను దానం చేశారు. తిరుకలత్తి దేవ అనే మరో సైనికాధికారి ఆవిలాల అనే గ్రామంలోని కొంత భూమిని దేవాలయానికి దానం చేసినట్లు రికార్డులు సూచిస్తున్నాయి. తిరువెంకటనాథ అనే మరో సైనికాధికారి తిరుమల దేవుడికి అదితిరునాల్ నిర్వాహించేందుకు ఒక గ్రామాన్ని సర్వమాన్యంగా దానం చేసారు. తిరువెంకటనాథుడి మామ మహాప్రధాని సింగయ దండనాయకుడు తిరుమల దేవాలయంలో 'సితకార సంధి' అనే పూజను ప్రారంభించారు. శ్రీ రంగనాథ అనే మరో దండ నాయకుడు తిరుమల కొండపై ఉన్న మలైకునియనైనార్ పెరుమాళ్ మరియు అతని నచిమార్ కోసం పూదోట ఏర్పాటు చేయించినట్లు రికార్డులు సూచిస్తున్నాయి. యాదవరాయ హొూబల వసంత ఉత్సవం సందర్భంగా తిరుమల దేవుడి వరద హస్తానికి బంగారు నగని బహుకరించినట్లు మరో శాసనం చెబుతోంది.

లేపాక్షి దేవాలయము

విజయనగర సామ్రాజ్యం హంపి కేంద్రంగా ఒక వెలుగు వెలుగుతున్న సమయంలో కురుమసామంతరాజులునిర్మించినఅద్భుతదేవాలయంలేపాక్షి.అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన లేపాక్షిదేవాలయం అనంతపురం జిల్లాలోని హిందూపురం నగరానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ దేవాలయంలో వీరభద్రుడు, శివుడు, విష్ణు



ప్రధాన దేవతలు. విజయనగర సామ్రాజ్యం వరిధిలోని పెనుకొండ పాలకుడైన విరూపన్న సోదరులు లేపాక్షి దేవాలయాన్ని నిర్మించారు. వీరభద్ర స్వామి ఆలయంగా పేరుగాంచిన ఈ దేవాలయం వాస్తవానికి బీరప్ప స్వామి దేవాలయమని అంటారు. నందిలక్కిసెట్టి, ముద్దమాంబకు ముగ్గురు కొడుకులు.

విరూపన్న,వీరన్న,హిరియ మల్లప్పన్న. (హిరియ అంటే కన్నడంలో పెద్ద అని అర్థం). వీరన్న పెనుకొండను పాలిస్తే వీరన్న లఖన్ పూర్, హిరియ మల్లప్పన్న బాగురాజు ప్రాంతాన్ని పాలించేవారు. విరూపన్న సోదరులు వీరభద్ర స్వామి దేవాలయాన్ని నిర్మించే నాటికే విఠల,బీరప్పను వీరభద్రుడుగా మార్చటం జరిగిపోయిందని మత చరిత్రకారుడు మాణిక్ ధన్పల్వార్ 1981లో రాసిన ఒక వ్యాసంలో తెలిపారు. ఐతే స్థానిక ప్రజలు నేడు కూడా వీరభద్ర స్వామిని విఠలేశ్వరుడు, విరూపాక్ష విఠల, వీరేశ్వర్ అని పిలుస్తారని మాణిక్ ధన్పల్వార్ తన వ్యాసంలో పేర్కొన్నారు. వీరేశ్వరుడు విరూపన్న కుటుంబం కుల దైవం, అందుకే ముగ్గురు సోదరులకు విరూపన్న, వీరన్న అని పేరు పెడితే మూడో సోదరుడికి మల్లన్న దేవుడి పేరు మల్లప్పన్న అని పెట్టుకున్నారన్నది చరిత్రకారుల అభిప్రాయం. లేపాక్షి వీరభద్రుడిని వీరలింగేశ్వర అని కూడా పిలుస్తారు. ఈ వీరలింగేశ్వరుడి పేరులోని 'వీ'ని 'బీ'గా మారిస్తే బీరలింగేశ్వరుడు అంటే బీరప్ప గా మారుతుంది. బీరప్ప శివుడి అంశగా జన్మించాడనేది అందరికి తెలిసిందే. విరూపన్న సోదరులు కుల దైవమైన బీరప్ప లేదా వీరభద్రస్వామి కోసం ఈ దేవాలయాన్ని నిర్మించి ఇందులో గొర్రెల కాపర్ల పేరును చిర స్థాయిగా నిలిపేందుకు తగు ఏర్పాట్లు చేయటం గమనార్హం. వీరభద్ర స్వామి దేవాలయంలోని రంగ మండపంలో రెండు నిలువు స్తంభాలపై గొర్రెల కాపర్ల విగ్రహాలు చెక్కించారు.

భుజాల చుట్టూ ఒక గొంగడిని కప్పుకున్న గొర్రెల కాపరి ఒక కాలుపై నిలుచుని మరో కాలును వంచినట్లున్న ఈ విగ్రహాలు ఉన్నాయి. గొర్రెలకాపరి రెండు చేతులు ఒక కర్ర పై భాగాన్ని గట్టిగా పట్టుకుంటే అతని గడ్డం కర్ర పైభాగంపై ఆనించినట్లున్నది. గొర్రెల కాపరి విగ్రహాలు విరూపన్న కులాన్ని సూచిస్తున్నాయని చరిత్రకారులు అంటున్నారు. రంగ మంటపంలోని మిగతా అని స్తంభాలపై దేవి, దేవతలు, ఋషుల విగ్రాహలున్నాయి. కేవలం రెండు స్తంభాలపై మాత్రం ఇద్దరు గొర్రెల కాపర్ల విగ్రహాలు చెక్కబడినాయి. ఇదిలా ఉంటే విఠల-బీరప్ప ఎలా వీరభద్ర స్వామిగా మారాడనేందుకు ఈ దేవాలయంలోని గోడలపై ఉన్న 1538 సంవత్సరం లేదా అంతకు ముందు కాలానికి సంభందించిన చెక్కడాలే సాక్ష్యమని రామచంద్ర చింతామణి దేరే చెప్పారు. విజయనగర్ లోని విఠల, విరూపాక్ష దేవాలయాలు, భట్టిప్రోలు, చింతకుంటలోని వీరభద్ర, విఠల,పాండురంగ స్వామి దేవాలయాలు కూడా విఠల-బీరప్ప దేవాలయాలే అని భావించవలసి ఉంటుంది. బద్రాచలంలో సీతమ్మవారికి చింతాకు పచ్చడి చేయించిన భక్త రామదాసు మాదిరిగానే విరుపన్న కూడా విజయనగరం సామ్రాజ్యం కోశాదిగారానికి

పంపించవలసిన కొంత నిధిని ఈ దేవాలయం నిర్మాణంలో ఖర్చు చేశాడని అంటారు. ఈ విషయం తెలిసిన మహారాజు రాజధానికి వెంటనే రావాలని ఆదేశం పంపించగా 'రాజు ఎలాగు తన కళ్ళు పీకిస్తాడని అనుమానించిన విరూపన్న తన కళ్ళను తానే పీకేసుకుని దేవాలయంలో ఒక గోడకు కొట్టాడని ప్రతీది. విరూపన్న తన కళ్ళను విసిరి కొట్టినందు వల్లనే దేవాలయం గోడపై ఈ రెండు ఎర్రటి గుర్తులు ఏర్పడ్డాయని అంటారు. అందుకే ఈ దేవాలయానికి'లేప్ అక్షి ' లేపంతో వేసిన కళ్ళు అని పిలుస్తారని స్థానికులు చెబుతారు.

సంగోలి రాయన్న 1798-1831

బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుండి తన ప్రాంతాన్ని కాపాడుకునేందుకు ఎంతో మంది తమ ప్రాణాలను బలి ఇచ్చారు. స్వాతంత్రం కోసం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులకు మూడు చెరువుల నీళ్ళు తాగించిన వారిలో సంగోలి రాయన్న అగ్రగణ్యుడు. పదిహేడవ శతాబ్దంలోనే స్వాతంత్రం కోసం బ్రిటిష్ పాలకులతో గెరిల్ల




యుద్ధం చేసిన ఘనుడు రాయన్న. కర్నాటకలోని కిత్తూరుకు సంస్తానానికి చెందిన సంగోలె రాయన్న విప్లవ యోద్దుడు అందుకే కర్ణాటక ప్రజలు అతన్ని క్రాంతి వీర సంగోలి రాయన్న అని పిలుచుకుంటారు. కిత్తూర్ కర్ణాటకలోని చిన్న సంస్తానం. దీనికి రాణి చెన్నమ్మ నాయకురాలు. సంగోలి రాయన్న ఈ సంస్తానం సైన్యాధ్యక్షుడు. కురుబ కులానికి చెందిన రాయన్న కర్నాటకలోని గణేష్ వాడి, బైలు హెూంగల జిల్లాలోని సంగోలి అనే గ్రామంలో 1798 ఆగస్టు 15 తేదినాడు జన్మించాడు.ఈస్ట్ఇండియాకంపెనీమన దేశంలోని వివిధ సంస్తానాలు, రాజ్యాలను కబళించేందుకు రక,రకాల ఎత్తుగడలు వేసీది. ఈ ఎత్తుగడల్లో భాగంగానే దత్తత తీసుకునే పిల్లలకు రాజ్యాధికారం లభించదనేది ఒకటి. మన దేశంలోని రాజ్యాలు, సంస్తానాలను అక్రమంగా అపాలించుకునేందుకు ఈస్ట్ ఇండియా కంపెనీ అన్నిరకాల నీచాలకు పాల్పడేది. ఝాన్సి రాణి లక్ష్మి బాయి రాజ్యాన్ని కబళించేందుకు కూడా ఇలాంటి షరతు

విధించటం తెలిసిందే. తన భర్త అకాల మృత్యువుకు లోనుకావటంతో కిత్తూరు చేన్నమ్మ తన బంధువులకు చెందిన ఒక అబ్బాయిని పెంచుకుంటుంది. అతని పేరు శివలింగప్ప. రాణి చెన్నమ్మ తన పెంపుడు కొడుకుకు పట్టాభిషేకం చేయాలనుకోగానే ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు దత్తత పిల్లలకు రాజ్యాధికారం లభించదనే నిబంధనతో కిత్తూరును స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దురాగతాన్ని ఎదురించేందుకు రాణి చెన్నమ్మ యుద్దానికి దిగుతుంది. ఇరుపక్షాల మధ్య జరిగిన యుద్దంలో రాణి చెన్నమ్మ ఓటమి పాలవుతుంది. ఈస్ట్ ఇండియా కంపనీ అధికారులు రాణి చేన్నమ్మను బందించి జైలుకు పంపిస్తారు. ఈస్ట్ ఇండియా కంపెనీ రాణి చేన్నమ్మను బందించగానే సంగోలి రాయన్న చెన్నమ్మ దత్త పుత్రుడు శివలింగప్పను తీసుకొని అడవుల్లోకి వెళ్ళిపోతాడు.

సంగోలి రాయన్న అడవుల్లో ఉంటూ రాణి చేన్నమ్మను విడిపించేందుకు ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యంతో గొరిల్లా యుద్ధం ప్రారంభిస్తాడు. సంగోలి రాయన్న గజవీర అనే సిద్ది యోదుని సహాయంతో బ్రిటిష్ పాలకులకు మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాడు. రాయన్న నాయకత్వంలో కిత్తూరు సైనికులు ఒక వైపు బ్రిటిష్ సైనికులతో పోరాడటంతో పాటు మరో వైపు స్థానిక భూస్వాములతో కూడా పోరాడుతూ స్థానిక రైతుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తారు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీకారులతో చేతులు కలిపి తమ స్వాతంత్ర పోరాటానికి అడ్డు తగులుతున్న స్థానిక భూస్వాములకు రాయన్న గట్టిగా బుద్ది చెబుతాడు.ఆయన స్థానిక రైతులను ఆదుకునేందుకు భూస్వాములను దోచుకుంటాడు. రాయన్నను పట్టుకునేందుకు   తాము చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలం కావటంతో బ్రిటిష్ పాలకులు మోసం, వెన్నుపోటుకు తెర లేపుతారు. రాయన్న సమీప బంధువు లక్ష్మణరాయను ధనంతో తమ వైపు తిప్పుకుంటారు. లక్ష్మణరాయ అందజేసిన సమాచారం ఆధారంగా బ్రిటిష్ పాలకులు సంగోలి రాయన్నను బందించగలుగుతారు. తమకు సింహస్వప్నంగా మారిన సంగోలి రాయన్నను బ్రిటిష్ పాలకులు **1831,** జనవరి **26** తేదినాడు నండగడ్ లో ఒక మర్రి చెట్టుకు వ్రేలాడదీసి ఉరి తీశారు. బ్రిటిష్ పాలకులు సంగోలి రాయన్నను ఉరి తీసినప్పుడు అతని వయస్సు కేవలం 33 సంవత్సరాలు మాత్రమే. మొదట రాణి చెన్నమ్మ విడుదల కోసం ఈస్ట్ ఇండియా కంపెనీతో పోరాడిన రాయన్న ఆ తరువాత కిత్తూరు విముక్తిపై తన దృష్టి సారిస్తాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు **1824**లో ఒకసారి రాయన్నను బందించ గలుగుతారు. అతన్ని తమ దారిలోకి తెచ్చుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తారు. ఈ ప్రయత్నాలలో భాగంగానే

వారు రాయన్నను విడుదల చేస్తారు. ఐతే రాయన్న ఈస్ట్ ఇండియా కంపెనీ చెర నుండి విడుదల కాగానే కిత్తూరు విముక్తి కోసం తన ఉద్యమాన్ని పునః ప్రారంభించటం గమనార్హం. రాయన్న కిత్తూరు విముక్తి కోసం గొరిల్లా దాడుల ప్రక్రియ కొనసాగించడంతో ఈస్ట్ ఇండియా అధికారులు అతన్ని మోసంతో బందించి ఉరి తీస్తుంది. రాయన్న ఉరి కంభం ఎక్కే ముందు చెప్పిన మాటలు ఉత్తర కర్ణాటకలోని గ్రామీణ ప్రాంత ప్రజలు ఇప్పటికి చెప్పుకుంటుంటారు. " నేను ఈ రోజు మరణించవచ్చు, ఐతే నేను త్వరలోనే మళ్లీ జన్మించి కిత్తూరును బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుండి విడిపించేందుకు వారితో పోరాడుతాను'' అంటూ రాయన్న ఉరి కంభం ఎక్కే ముందు చేసిన గర్జన ఈ ప్రాంతంలో ఇప్పటికీ సజీవంగానే ఉన్నదని స్థానిక ప్రజలు చెబుతారు. సంగోలి రాయన్న నేటికి మర్రి చెట్టు రూపంలో ఇంకా బతికే ఉన్నాడు. రాయన్నను ఉరి తీసిన చోటే అతనే స్నేహితులు అప్పుడే ఒక మర్రి మొక్కను పాతారు. ఇప్పుడది పెరిగి పెద్దదై రాయన్నకు ప్రతీకగా నిలిచి పోయింది. స్తానిక ప్రజలు ముఖ్యంగా కురుబ కులం ప్రజలు ఈ మర్రి చ్బెట్టుకు పూజలు చేయటం ద్వారా సంగోలి రాయన్న పట్ల తమ ప్రేమ, భక్తిని చాటుతుంటారు. బెంగుళూరులోని క్రాంతివీర సంగోలిరాయన్న రైల్వే స్టేషన్ ఎదురుగుండా ఏర్పాటు చేసిన ఏడు అడుగుల రాయన్న విగ్రహం నేటి యువతకు ఆదర్శప్రాయం.

దొడ్డి కొమరయ్య



దొడ్డి కొమరయ్య కురుమ కులానికి చెందిన తెలంగాణా స్వతంత్ర సమరయోధుడు, నిజాం ప్రజావ్యతిరేక పాలనతో పాటు దేశ్‌ముఖ్ తదితర దొరల దురాగతాలను ఎదురించిన వీరుడు. దొడ్డి కొమురయ్య ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడివెండి అనే గ్రామానికి చెందిన వాడు. తెలంగాణా రాష్ట్ర సాధన కోసం ప్రారంభమైన ఒక మహోన్నత ఉద్యమానికి దొడ్డి కొమురయ్య ఆద్యుడు కావటం తెలంగాణా ప్రజలు ముఖ్యంగా కురుమ కులం ప్రజలకు

గర్వ కారణం. ఆయన నిజాం, దొరల దాష్టీకానికి బలైపోయిన బడుగు వర్గాల వీరుడు. భూమి కోసం, భుక్తి కోసం , నిజాం దుష్ట పాలన, దొరల దురాగతాల నుండి విముక్తి కోసం తెలంగాణా సాయుధపోరాటం ప్రారంభానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణమని అంటే అతిశయోక్తి కాదు. తెలంగాణా సాయుధ పోరాటాన్ని తలచుకోగానే మొట్ట మొదట స్ఫురణకు వచ్చే ఉద్యమ వీరుడు దొడ్డి కొమురయ్య. నిజాం పాలనలో తెలంగాణాలోని గ్రామాల్లో ఉన్నత వర్గానికి చెందిన జాగీర్దార్లు, దేశ్‌ముఖ్ లు, భూస్వాములు, దేశ్ పాండేలు తదితర దొరల కారణంగా విసిగి వేసారిపోయిన సామాన్య ప్రజానీకానికి ఆంధ్ర మహాసభ వామపక్ష్యాల సంఘం ఒక బలీయమైన కేంద్రంగా ఉండేది. ఇద్దరు కురుమ సోదరులు దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమురయ్య ఈ సంఘం సభ్యులుగా పని చేసేవారు. దొడ్డి కొమురయ్య నిజాం పాలనతో బాటు దేశ్ ముఖ్ ఇస్నూరి రామచంద్రారెడ్డితదితరదొరలదురాగతాలకువ్యతిరేకంగాపోరాటంచేసేవాడు.

జనగామ తాలుగాలోని విసునూరు దేశ్ ముఖ్ రామచంద్రారెడ్డి ఆధీనంలో ఉన్న అరవై గ్రామాల్లో కడివెండి ఒకటి. దేశ్ ముఖ్ రామచంద్రా రెడ్డి తల్లి జానకమం దొరసాని. ఆమె కడివెండి గ్రామంలో నివసించేది. దొరసాని జానకమ్మ స్థానిక ప్రజలను రక,రకాల హింసలు, వేదింపులకు గురిచేస్తూ ఒక రాక్షసిగా వ్యవహరించేది. దొరసాని చేసే దురాగతాలను ఎదిరించిన దొడ్డి మల్లయ్య జానకమ్మకు ప్రధాన శత్రువుగా మారాడు. జానకమ్మ ప్రజలపై చేస్తున్న దాష్టీకాలను దొడ్డి మల్లయ్య ఎప్పటికప్పుడు ఎదురించటంతో వారి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఆంధ్ర మహాసభ అండదండలు లభించటంతో కడివెండి గ్రామ ప్రజలు దొరసానికి పన్నులు చెల్లించటం మానివేయటంతో ఈ గొడవలు మరింత ఉధ్రుతమయ్యాయి. పన్నులు చెల్లించటం మానివేసిన గ్రామ ప్రజలపై దొరసాని ఆగడాలు మరింత పెరిగాయి. జానకమ్మ ముఖ్యంగా దొడ్డి మల్లయ్య కుటుంబంపై కక్ష సాధింపు చర్యలు ప్రారంభించటంలో కడివెండి గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దొడ్డి కొమురయ్య తన సోదరుడైన దొడ్డి మల్లయ్యకు అండగా నిలవటంతో దొరసాని జానకమ్మ మరింత మండిపడ్డారు. దొడ్డి సోదరులను తమ దారి నుండి తొలగించుకునేందుకు వారిని కిరాయి హంతకుల చేత హత్య చేయించాలని దేశ్ ముఖ్ రామచంద్రా రెడ్డి, దొరసాని జానకమ్మ కుట్రపన్నుతారు. దేశ్ముఖ్ రామచంద్రా రెడ్డి ఆయన తల్లి దొరసాని జానకమ్మ దురాగతాలను ఎదురిస్తూ ఊరేగింపుగా వస్తున్న ప్రజలపై దేశ్ ముఖ్ కిరాయి గూండాలు ఎలాంటి ముందు హెచ్చరిక లేకుండా కాల్పులు జరపటంతో ఊరేగింపుకు ముందు నిలుచున్న దొడ్డి మల్లయ్య కాలిలో బుల్లెట్టు దిగి గాయపడితే దొడ్డి కొమురయ్య ఛాతీకి

బుల్లెట్టు దిగటంతో నేలకొరుగుతాడు. **1946** జూలై నాలుగో తేది నాడు జరిగిన ఈ సంఘటనతో అప్పటి వరకు శాంతియుతంగా కొనసాగుతున్న రైతాంగ పోరాటం కాస్తా తెలంగాణా సాయుధ విప్లవోద్యమంగా మారిపోయింది. దేశ్ ముఖ్ రామచంద్రా రెడ్డి, దొరసాని జానకమ్మ కిరాయి గుండాలు జరిపిన కాల్పుల్లో మరణించిన దొడ్డి కొమురయ్య పార్థివ దేహాన్ని నెల్లుట్ల గ్రామంలో ఖననం చేశారు. స్థానిక దొరల దురహంకారం మూలంగా కొమరయ్యను సొంత గ్రామం కడివెండిలో పార్థివ దేహాన్ని ఖననం చేసేందుకు ఆరడుగుల భూమి లభించలేదంటే ఆనాటి పరిస్థితులు ఎంత దారుణంగా ఉండేవో అర్థంచేసుకోవచ్చు.



భక్త కనకదాసు

భక్త కనక దాసు కురుబ కుల మణిదీపం. దాస సంప్రదాయానికి సంబందించిన భక్తి ఉద్యమానికి వన్నె తెచ్చిన భక్తాగ్రేసరుడు. వ్యాసరాయ శిష్యుడిగా పురందరదాస భక్తి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లిన వైష్ణవుడు. హిందూ



మతంలోని కుల విచక్షణపై ఉద్యమించిన గేయ రచయిత, సంగీతకారుడు. హరి దాసుడుగా వైష్ణవానికి మణి దీపంగా మారిన ఘనుడు. కురుబ గౌడ కులానికి చెందిన కనకదాసు (1509-1609) బంకాపురలోని బాడ గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు తిమ్మప్ప నాయక. బీరేగౌడ (బీరప్ప), బీచమ్మ అతని తల్లి, తండ్రులు. బీరేగౌడ బంకాపుర అధిపతి. బీరేగౌడ తన కుమారుడికి శ్రీనివాసాచార్యుడి చేత తర్కము, వ్యాకరణము, మీమాంస తదితర విద్యా బోదన చేయించారు. బీరేగౌడ మరణాంతరం తిమ్మప్ప నాయక చిన్న తనంలోనే తన తండ్రి స్థానంలో బంకాపుర కోట అధిపతిగా మారి ఆ ప్రాంతం పరిపాలనా బాధ్యతలు చేపట్టవలసి వచ్చింది. బంకాపుర పరిపాలకుడుగా చుట్టుపక్కల ఉన్న ఇతర పరిపాలకులతో పలుమారులు యుద్ధం చేశాడు. తిమ్మప్ప నాయక ఇలాంటి ఒక యుద్ధంలో ఓడిపోయి తీవ్ర గాయాలతో బైట పడినప్పుడు అతనిలో సమూలమైన మార్పు

వచ్చింది. పదవులు, ప్రతిష్ట కోసం యుద్దాలు చేస్తూ పలువురి ప్రాణాలు హరించటం పట్ల అతనిలో వ్యతిరేకత మొదలయ్యింది. కలిసి మెలిసి సహజీవనం చేయవలసిన మనుషులు యుద్దాలు చేస్తూ ప్రాణ నష్టం కలిగించుకోవటం ఏమిటనే ప్రశ్నఆయననుభక్తిమార్గంవైపునడిపించింది.పురందరదాసుకుదాదాపుగా సమకాలీకుడైన తిమ్మప్ప నాయక హరిదాసుగా మారిపోయాడు. తిమ్మప్ప నాయకుడి గురువుగారైనా వ్యాసరాజు అతనికి కనకదాసుగా నామకరణం చేశాడు. ఆనాటి నుండి తిమ్మప్ప నాయక కాస్తా కనకదాసుగా మారిపోయి హరినామ స్మరణతో జీవితం కొనసాగించాడు. విష్ణు భగవానుడి భక్తుడైన కనకదాసు కన్నడ భాషలో రచించిన తన గేయాలతో మత, సామాజిక పరమైన మార్పులకు శ్రీకారం చుట్టాడు. కులతత్వంపై యుద్ధం ప్రకటించటం ద్వారా ఆయన మత పరమైన సంస్కరణలకు పునాదులు వేశాడు. కనకదాసు తన గేయాలకు తానే బాణీలు కట్టుకుని గానం చేసేవాడు. ఆయన గేయాలలో భక్తి భావంతో పాటు ఆనాటి సామాజిక సమస్యల ప్రస్తావన, పరిష్కార మార్గాలు కూడా కనిపిస్తాయి.. కనకదాసు తన "రామ ధ్యాన చరిత్ర''లో సంపన్నులు, బీద ప్రజల మధ్య ఉన్న దూరాన్ని అద్దం పట్టినట్లు చూపించారు. అతను రచించిన "నలదమయంతి'' , "నరసింహ స్తవ'' కన్నడ ప్రజలను ఎంతో ఆకర్షించాయి. శ్రీకృష్ణుడి జీవితంతో పాటు అతని మనుమడు అనిరుద్దుడు బానాసురిడి కూతురు ఉషతో జరిపిన ప్రేమాయణాన్ని ఆయన తన మొహనతరంగినిలో మనోహరంగా వివరించాడు. దాసశ్రేష్టుడైన కనకదాసు కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవ చేశారు. అత్యంత సరళమైన కన్నడ భాషలో రచించిన అతని సంకీర్తనలు, "ఉపభోగ''లు ఎంతో ప్రఖ్యాతి గడించాయి. కనకదాసు240కర్ణాకటసంగీతబాణీలుకట్టిపాడారు.ఇందులోకీర్తనులు, ఉపభోగ, పదాలు, తాత్విక పాటలు ఉన్నాయి. నల చరిత్ర, హరిభక్త సార, నృసింహ స్తవ, రామధ్యాన చరిత, మోహన తరంగిణి అనేవి కనకదాసు ప్రధాన రచనలు.

కనకనకిండి

ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఉదిపిలోని శ్రీకృష్ణ దేవాలయానికి కనదాసుకు అవినాభావ సంబంధం ఉన్నది. శ్రీ మహావిష్ణు అవతారమైన శ్రీకృష్ణుడికి నిజమైన భక్తుడంటే యెంత ప్రేమ అనేదానికి ఈ దేవాలయంలోని కనకనకిండి అద్దం పడుతోంది. నిజమైన భక్తుడు తన ఆరాధ్య దైవాన్ని దర్శించుకునేందుకు యెంత



గొప్ప వారైన ఆపలేరనేందుకు ఈ దేవాలయంలోని కనకనకిండి ఒక నిదర్శనం. కనకదాసు శ్రీమన్నారాయనుడి పరమ భక్తుడు. తన దేవుణ్ణి దర్శించుకునేందుకు ఆయన ఒక సారి ఉదిపిలోని శ్రీకృష్ణ దేవాలయానికి తన గురువైన వ్యాసరాయునితో కలిసి వెళతాడు. దేవాలయం యాజమాన్యాన్ని నిర్వహించే ద్వైత వేదాంతులు మాత్రం కనకదాసున్ని   దేవాలయంలోనికిఅనుమతించరు. వ్యాస రాయుడు చ్బెబుతున్న వినిపించుకోకుండా స్థానిక బ్రాహ్మణులు కనకదాసున్ని వెనకకు నెట్టి వేస్తారు. కనకదాసు గుడిలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ అతన్ని పట్టి బందించేందుకు ప్రయత్నిస్తారు. మాధవా చార్యుడు స్థాపించిన ద్వైత వేదాంతాన్ని పాటించే ఉడిపి మఠాధిపతులు కనకదాసున్ని దేవాలయం దరిదాపులకుకూడారానివ్వకుండాకట్టడిచేస్తారు.   శూద్రకులానికిచెందిన కనకదాసుకు శ్రీకృష్ణుడిని దర్శించుకునే హక్కు, అధికారం, అర్హాత లేదని మఠాధిపతులు ప్రకటిస్తారు. తన ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడిని దర్శించుకోకుండా వెళ్ళేది లేదంటూ కనకదాసు ఉడిపి దేవాలయం పశ్చిమ గోడవద్ద నిలబడి శ్రీమన్నారాయనుడి ఆరాధన ప్రారంభిస్తారు. కనకదాసు భక్తి గానానికి సంతోషించిన శ్రీకృష్ణుడు దేవాలయం గోడను చీల్చి దాసశ్రేష్టకు దర్శనం ఇస్తాడు. కనకదాసుణ్ణి దాసశ్రేష్ఠ అని కుడా పిలుస్తారనేది అందరికి తెలిసిందే. కనకదాసు భక్తిని మెచ్చిన శ్రీకృష్ణుడు అతని వైపు తిరిగి నిజ దర్శనం ఇవ్వటం ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. కనకదాసుకు శ్రీకృష్ణుడి దర్శనం కలిగేందుకు గోడలో చీలిక ఏర్పడిన చోటే ఆ

తరువాత ఒక చిన్న కిడికీని ఏర్పాటు చేయటం గమనార్హం. దీనినే కనకనకిండి అని పిలుస్తారు. ఉడిపి దేవాలయానికి వచ్చే భక్తులు మొదట కనకనకిండి ద్వారా శ్రీకృష్ణుడిని దర్శించుకున్న తరువాతనే ప్రధాన ద్వారం గుండా దేవాలయంలోకి ప్రవేశించి దేవుణ్ణి మరోసారి దర్శించుకుంటారు.

బంకాపుర కోట

కర్ణాటక ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర పురావస్తు శాఖ బాడ గ్రామంలో జరిపిన తవ్వకాలలో కనకదాసు తన పూర్వాశ్రమంలో తిమ్మప్ప నాయకుడుగా పాలించిన బంకాపూర కోట , రాజ ప్రసాదం అవశేషాలు బైటపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం వీటిని పునరుద్దరించింది. కర్ణాటక ప్రభుత్వం ప్రతి సంవత్సరం నవంబర్ **15** తేదీ నాడు కనకదాసు జయంతి నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం **1990** సంవత్సరంలో కనకదాసు జ్ఞాపకార్థం "భక్త కనకదాసు" పోస్టల్ స్టంపును విడుదల చేసింది. కర్ణాటక చిత్ర పరిశ్రమ కనకదాసుపై పలు చిత్రాలను నిర్మించింది. ప్రముఖ నటుడు రాజ్ కుమార్ కనకదాసుగా నటించటం గమనార్హం.

కగినెలె కనకగురు పీఠ

కగినెలె కనకగురుపీఠం కురుబ, కురుమ కులం ఆధ్యాత్మిక కేంద్రం. కురుబ కులం సంస్కృతీ, చరిత్ర, సంప్రదాయాలను పరిరక్షించటంతో పాటు భావి





తరాల కోసం పదిలం చేసేందుకు ఏర్పడిన సంస్థ " కగినెలె కనకగురుపీఠ". ఇది కర్నాటకలోని హావేరి జిల్లాలోని కగినేలే గ్రామంలో ఉన్నది. కర్నాటకతో పాటు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలలో నివసించే గొర్రెల కాపర్లు, ఇతర దేశాలలో స్థిర పడిన కురుమ, కురుబ కులం వారు కూడా కనకగురుపీఠం ఆశ్రమాన్ని దర్శించుకునేందుకు వస్తుంటారు. కర్ణాటకలోని నివసించే కురుబ కులం ప్రజలకు కగినేలే కనకగురుపీఠం అన్ని రంగాలలో మార్గదర్శనం చేస్తోంది. బీరేంద్ర కేశవ తారకానంద పురి స్వామి నాయకత్వంలో ప్రారంభమైన ఈ మఠం కురుమ కులం వారి కోసం కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో విద్యాలయాలు, కాలేజిలు, ఇతర విద్యా సంస్థలను నడిపిస్తోంది. బీరేంద్ర కేశవ తారకానంద పురి స్వామి శివ సాజ్యం పొందిన అనంతరం నిరంజనానందపురి స్వామి మఠం బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



ముగింపు

వేలాది సంవత్సరాల చరిత్ర ఉన్నది, ఏడెనిమిది చిన్నా పెద్దా సామ్రాజ్యాలను స్థాపించిన ఘనత ఉన్నది అయినా గొర్రెల కాపర్లు నేడు కూడా ఎందుకింత వెనకబడి ఉన్నారు ? గొర్రెల కాపర్ల పరిస్తితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. కురుమ కులం ప్రజలు ప్రతి రంగంలో వెనుకబడి ఉన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎంతెంతో వెనుకబడి ఉన్నారు. కురుమలకు తమ చరిత్ర గురించి తెలియదు, తెలుసుకోవాలనే తపన లేదు, తెలుసుకునే ప్రయత్నం కూడా చేయటం లేదు. కొన్ని కులాలు పోటా,పోటీగా ఆర్థిక, రాజకీయ రంగాలలో ముందుకు దూసుకుపోతుంటే కురుమలు మాత్రం చలనం లేకుండా ఉండిపోతోన్నారు. ఒకరిద్దరు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగినా వారు మొత్తం కులం అభివృద్ధి గురించి ఆలోచించటం లేదు. చరిత్ర లేని కులాలు స్వంత చరిత్రను సృష్టించుకునేందుకు ప్రయత్నిస్తుంటే ఘనమైన చరిత్ర ఉన్న కురుమలు మాత్రం తమ చరిత్రను విస్మరిస్తున్నారు. దీనితో ఇది మరుగున పడిపోతోంది. కురుమ, కురుబ, కురుంబార్ అనేది కురు వంశానికి సంభందించిన కులమని కొందరు చరిత్రకారులు చెబుతున్నా మనం మేల్కొనటం లేదు. చాలా మంది కురుమ యువతీ, యువకులకు తమ కులం చరిత్ర గురించి ఎలాంటి అవగాహన లేకపోవటం శోచనీయం. కుల చరిత్ర గురించి స్పష్టమైన అవగాహన లేకపోవటం వలన వారు ఆత్మన్యూనతాభావానికి (inferiority complex) లోనవుతున్నారు. గతంలో మనం ఏమిటి? ప్రస్తుతం మన పరిస్తితి ఎలా ఉన్నది? భవిష్యత్తులో మనం ఏమవుతాం? అనేది ప్రతి ఒక్కరు ఆలోచించుకోవలసిన తరుణం ఆసన్నమైంది. మన గతం గురించి తెలుసుకుని వర్తమాన పరిస్తితిని సమీక్షించుకుని ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయవలసిన అవసరం ఎంతో ఉన్నది. బంగారు భవిష్యత్తు కోసం బాటలు వేసుకునేందుకు కృషి చేయడం ఎంతో అవసరం.

కురుమ కుల మూల పురుషులైన మల్లన్న, బీరప్ప, ఇద్దరు కూడా క్షత్రియులే. ఇద్దరు మూల పురుషుల చేతుల్లో కనిపించే కరవాలాలు అనునిత్యం చూసి కూడా మనం రాజ్యాధికార సాధన గురించి ఆలోచించటం లేదు.

మల్లన్న, బీరప్ప ఎప్పటివారు, ఏకాలంలో రాజ్యమేలారు? అనేది ఖచ్చితంగా నిర్ధారించేందుకు కుల సంఘాల తరపున గట్టి ప్రయత్నం జరగాలి. అప్పుడే మన గత

వైభావానికి సంబందించిన కొన్ని నిజాలైనా వెలుగు చూసి మనం ముందుకు సాగేందుకు ఆత్మా విశ్వాసం కల్పించి కలల సాక్షాత్కారానికి కరదీపికలవుతాయి. మనపై మనకు విశ్వాసం కలిగితేనే ముందుకు సాగగలుగుతాము. మల్లన్న, బీరప్ప చరిత్రను పుక్కిట పురాణంగా చెప్పుకునే బదులు సాక్ష్యాధారాలతో చదువుకుంటే మన యువతకు ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.



గతంలో మనం ఏమిటి?

ప్రస్తుతం మన పరిస్తితి ఎలా ఉన్నది?

భవిష్యత్తులో మనం ఏమవుతాం?

అనేది ప్రతి ఒక్కరు ఆలోచించుకోవలసిన తరుణమిది.

మన గతం గురించి తెలుసుకుని వర్తమాన పరిస్తితిని సమీక్షించుకుని ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయవలసిన అవసరం ఎంతో ఉన్నది.

బంగారు భవిష్యత్తు కోసం
బాటలు వేసుకునేందుకు కృషి చేయడం ఎంతో అవసరం.

॥ సర్వేజనా సుఖినో భవంతు ॥

గ్రంథ పట్టిక

- ఒగ్గు కథ ..చుక్క సత్తయ్య తదితరులు.
- డా.హెఫ్.టి.హాల్లికేరిసంపాదకత్వం వహించిన హాలుమత అధ్యయన.
- The Original Inhabitants of Bharata Varsha by Gustav Opart.
- A Journey from Madras through the Countries of Mysore, Canara and Malabar by Francis Buchanan.
- The Rise of A Folk God VITHALA OF PANDHARPUR by Ramachandra
- Chintamani Dhere.
- Kurubara Charitra by Hanumantaiya.
- A forgotten History OF VIJAYANAGARA by Robert Swewell.
- Four Vedas
- The Cult of Vithobha [1960]
- The Social and Political Life in Vijayanagara Empire by Doctor B.A.Saletore
- Kreedabhiramam.
- A Short History of South India by K.A.Neelakanta Sastri.
- A Journey of Malabar Coast by Barbosa Duarte.
- Coins of Southern India by Sir Walter Elliot.
- Further Sources of Vijayanagara History by K.A.Neelakanta sastri.
- Hindu Tribes and Castes by Rev. M.A, Sherring.
- INDIA A Short Cultural History by H.G.Rawlinson.
- The History of Andhra Country by Yashoda Devi.
- Raya Vachakamu Edited by Doctor C.V.Ramachandra Rao.
- Development of Religion in South India by K.A.Neelakanta sastri.
- The Shepherds of India by Dr. S.S.Shashi.
- History of Medieval Deccan Edited by Prof. H.Ke.Sherwani, Dr.P.M.Joshi.
- The Castes and Tribes of H.E.H The Nizam's Dominions by Siraj Ul Hassan.
- Castes of Tribes by Edgar Thurston.
- Shepherd Community in India --- Shodganga.
- On the Characteristics of the Population of Central and Southern India By Walter Elliot.
- Pastoral deities in Western India by G.D.Sontheimer.
- Dasara at Devaragudda: Ritual and Play in the Cult of Mailara / khandoba
- In South Asian Digest of Regional Writings.
- Prehistoric Background to Pastoralism in the Southern Deccan in the Light of Oral Traditions and Cults of some Pastoral Communities by M.L.K.Murthy and G.D.Sontheimer.



తథాగత్ పబ్లికేషన్స్
హైదరాబాద్